# మిసిమి

మాసపత్రిక
**సంపుటి 32** **సంచిక 12**
**డిసెంబర్ - 2021**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
— Since 1946 —

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-
విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి
ఫోన్ : 040 - 27645536. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS
ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**LCCN 91-903060** **ISSN 2454-4329**
E-mail: **misimi90monthly@gmail.com**
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## డిసెంబర్ నెల సూచికలు...


కమ్మతెమ్మెరలు : ... 5

వచన కవితాబ్రహ్మ - కృష్ణమాచార్యులు : ఆచార్య పప్పు వేణుగోపాలరావు... 7

ప్రకృతిహితమ్ - వేదవాఙ్మయమ్ : పూషడపు సుబ్బారావు... 15

పుంస్త్రీ : డా. నల్లపనేని విజయలక్ష్మి... 19

ఇండాలజీ-3, మోనియర్ విల్లియమ్స్ : డా. అవధానం రఘుకుమార్... 23

శాస్త్రవేత్తలు : డా. నాగసూరి వేణుగోపాల్... 27

బొబ్బిలి రాజుల తొలి రాజధాని - రాజాం : గార రంగనాథం... 31

అధ్యాత్మే అసలు సంగతి : వి.యస్.ఆర్. మూర్తి... 37

జానపదం : ఎమ్. కురుమయ్య యాదవ్... 39

కోయ చినుకుముగ్గు : నాగజాను సూరేపల్లి... 42

ఎడిటర్స్ డైరీ: నిశ్శబ్దం : అశ్వినీకుమార్... 45

విలియం హోగార్త్ : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 47

కథాశిల్పం : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల... 50

నోబెల్ తారలు: ఇమ్రె కార్టెస్ : ముక్తవరం పార్థసారథి... 56

ఓ ప్రశ్న : వి. రాజా రామమోహనరావు... 57

జ్ఞాపకాల జడివాన! : పద్మశ్రీ ఎస్.వి. రామారావు... 59

హాసన రాజారావు - ఒక వ్యక్తి చిత్రం : వేలూరి కృష్ణమూర్తి... 67

సహృదయ సంస్కారి - ఆలపాటి రవీంద్రనాథ్ : డా. పాటిబండ్ల దక్షిణామూర్తి... 70

మల్లంపల్లి శరభేశ్వర శర్మ : వాడ్రేవు వీరలక్ష్మీదేవి... 71

ఎయిడెడ్ పోస్టుల విలీనం.. : డా. బోరుగడ్డ సుబ్బయ్య... 77

చదవండి... : ***మిసిమి***... 80




ఎస్.వి. రామారావు



రాజారావు

**అట్టమీది బొమ్మలు**

కన్నెతల్లి

విక్టర్ వెస్నట్సోవ్, సెయింట్ వ్లాదిమిర్ కీవ్, యుక్రెయిన్ రాజధాని



కన్నీటి ముత్యం



బ్రతుకు తత్త్వం (మెహసూర్ షా)



పూలవల్లి



# కమ్మతెమ్మెరలు

"... ***మిసిమి*** కి మీరు చేస్తున్న కృషి అభినందనీయం.. ఇది ఇలానే కొనసాగాలని కోరుకుంటూ.."

*– నరిసెట్టి ఇన్నయ్య, యు.ఎస్.ఏ. (ఇ-మెయిల్)*

"…. ఎటునుంచి చదివినా ***మిసిమి*** అర్ధం మారదు. ఏ మాసములోనైనా ***మిసిమి*** అందం తరగదు. కొన్నాళ్ళుగా నెలకొకసారి వచ్చే ***మిసిమి*** ని ఒకసారి చదవడం అలవాటుగా మారింది. ఆద్యంతం ఉత్సుకతను కలుగచేసిన నవంబరు (2021)



మాసం ***మిసిమి*** ఈసారి రెండోసారి చదివేలా చేసింది. దానికి కారణం ***మిసిమి*** వ్యవస్థాపకుడు ఆలపాటి రవీంద్రనాద్ గారి ఆలోచనా ఆచరణల స్మృతులతో ప్రచురితమవడం మరియు వారి గురించి వ్యాస కర్తలు తెలియచేసిన తీరు. ప్రొ. రావినూతల సత్యనారాయణ గారు, మాజీ మంత్రివర్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గారు మరియు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు వారి జీవిత విశేషాలను, వారి రూప విశేషాలతో కూడిన స్మృతి వ్యాసాలతో పాఠకుల మదిలో ప్రాణవంతుడిని చేశారు. మెరైన్ ఇంజనీరు శ్రీ ప్రసాద్ చెన్నూరి గారి *సూయజ్ కెనాల్* వ్యాసం విజ్ఞాన విశేషం. ఇది చదివిన తరువాత డెల్టా ప్రాంతంలోని బకింగ్‌హాం కెనాల్ ద్వారా కాకినాడ – మదరాసు జలరవాణా ఆనాటి పరిస్థితులు నిర్మాణ వ్యవహారాలు ప్రయాణ అనుభవాలు గురించి ఎవరైనా వ్యాసం రాస్తే బాగుండు అనిపించింది. మెదళ్ళకు హాయిని చక్కని ఆలోచనలను అందిస్తుంది ***మిసిమి*** పఠనం. ప్రారంభం నుండి నేటి వరకు ప్రామాణిక స్థాయి రచనల ఎంపికలో సంపాదకులు చూపిస్తున్న చొరవ గమనార్హం . వ్యాసం చదువుతుంటే విషయం కళ్ళ ముందు కదలాడినట్లు ఆ కాలానికి ప్రయాణించినట్లు వుంటుంది. ఈ విషయంలో వ్యాసకర్తలందరూ అభినందనీయులు. విలువలకు వెలుగులిస్తూ తెలుగు భాషను ప్రకాశింపచేస్తూ మూడు దశాబ్దములుగా సాహిత్య సేవచేస్తూ ప్రత్యేక పాఠక అభిమానులను సంపాదించుకొన్న ***మిసిమి*** యాజమాన్యం వారు మంచి ఆలోచనాపరులు మరియు ఆదర్శప్రాయులు. ***మిసిమి*** పాఠకుణ్ణి అని తెలుగు వచ్చిన వారికి తెలుగును మెచ్చేవారికి ఎవరికైనా గర్వంగా చెప్పవచ్చు. శాస్త్రీయ దృక్పథంతో సామాజిక ప్రయోజనంతో ఎప్పటిలాగానే ***మిసిమి*** తెలుగు అక్షరాలతో చెలిమి చేస్తూ తెలుగు పత్రికలలో మేలిమిగా తన వైభవాన్నికొనసాగించాలని కోరుకుంటున్నాను. కన్నులకు ఇంపైన వర్ణ చిత్రాలు, సంస్కృతి, సంగీతం, సాహిత్యం, జీవన విధాన పరమైన వ్యాసపరంపరలు ***మిసిమి*** కి ప్రత్యేకం…"

*– ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి*

"….*I could not wait for tomorrow to express my overwhelming feeling about this centenary special issue of* ***Misimi*** *Nov, 2021. It's gripping. Ravindranath deserves this commemorative issue much more. I have been* ***Misimi*** *reader for a decade. I look forward for this unique magazine. Thank you; please convey my regards to Bapanna, Aswini and Voleti.….*"

*- Dr. Bhaskara Rao,* New Delhi

"…. ***మిసిమి*** – తన పత్రికకు ఈ పేరు పెట్టటంలోనే తనకు ఎలాంటి రచనలు కావాలో రవీంద్రనాథ్‌గారు చెప్పారు. అందుకు తగినట్లే రచనలు పంపిస్తున్న రచయితలకు, ఏర్చి కూర్చి ప్రచురిస్తున్న అశ్వినీకుమార్‌గారికి ధన్యవాదాలు. రవీంద్రనాథ్ శతజయంతి సంచిక నవంబర్ – 21 చదివాక నా స్పందన ఇది…."

*– అక్కినేని వెంకటరత్నం, గుడివాడ*

"…. ***మిసిమి*** వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఆలపాటి రవీంద్రనాథ్ గారి శతజయంతి పత్రిక వారి ముఖచిత్రంతో నవంబర్ – 21 సంచిక చాలా ఆకర్షణీయంగా ఉంది. మహామహులైన ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు, ఏబీకే ప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, కె. శ్రీనివాస్ (*ఆంధ్రజ్యోతి*), డాక్టర్ వోలేటి పార్వతీశం, ఆచార్య పప్పు వేణుగోపాలరావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ, డా. ఎన్. ఇన్నయ్య, చెరుకువాడ వెంకటరామయ్య, నన్నపనేని దుర్గ, డా. అవధానం రవికుమార్, ఆచార్య బీరం సుందరరావు గార్లలాంటి మేధావులు స్వర్గీయ రవీంద్రనాథ్ గారితో తమకున్న పరిచయాన్ని, స్మృతులను చక్కగా పంచుకోవటం చాలా సంతోషంగా ఉన్నది. ఈ శతజయంతి సంచికలో నా వ్యాసం 'హైదరాబాద్ – కర్ణాటక (కళ్యాణ కర్ణాటక) సీమ, చారిత్రక వైభవం' కూడా ప్రచురించినందుకు ఎడిటర్ గారికి ధన్యవాదాలు. రవీంద్రనాథ్‌గారు ఒక యోగి. రాగద్వేషాలకు అతీతుడు. తను నమ్మింది సాధించాలనే తపనతో

ఆయన సృష్టించిన *మిసిమి* ఎందరో రచయితలను, కళాకారులను తెలుగు పాఠక లోకానికి పరిచయం చేశారు. వారి కుమారుడు బాపన్న తండ్రిగారి ఆశయాలకు అండగా నిలిచి, *మిసిమి* పత్రిక ద్వారా తెలుగు సారస్వత రంగానికి వారు చేస్తున్న కృషి ఎంతో అమోఘమైనది. రవీంద్రనాథ్ గారితో నాకు పరిచయం లేకున్నా ఆ సాహిత్య కృషీవలునికి వారు పాటిస్తున్న సామాజిక విలువలకు, సంప్రదాయవాదాలకు, వారు నమ్మినదానిని ఆచరించటం, వ్యక్తిగత స్వాతంత్రం ఉన్న ఆ మహా మనిషికి ఆత్మీయ అక్షరాంజలులు సమర్పిస్తున్నాను. వారి బాటలోనే *మిసిమి* పత్రికను ముందుకు తీసుకు వెళుతున్న *మిసిమి* పరివారానికి అభినందనలు..."

– *కొసరాజు వెంకటేశ్వరరావు, హైదరాబాద్*

".... 2013లో అనుకుంటాను. తెనాలి గ్రంథాలయ భవనంలో ఆలపాటి రవీంద్రనాథ్‌గారి స్మారకోపన్యాసం చేసే భాగ్యం నాకు దక్కింది. డా. వెలగా వెంకటప్పయ్యగారి ఆధ్వర్యంలో జరిగిన సభ అది. అయినాల మల్లేశ్వరరావుగారు అధ్యక్షులు. రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం పత్రికా రంగానికి వారు చేసిన కృషి, వారి సాహితీ ప్రయత్నం, స్నేహ, సంస్కారాలు వగైరాలను ప్రస్తావిస్తూ, నా ప్రసంగం సాగింది. రవీంద్రనాథ్‌గారి వృత్తి నిబద్ధత చాలా గొప్పది. ఆరునూరయినా రాజీపడని మనస్తత్వం వారిది. ముఖ్యంగా పత్రికా రంగంలో వత్తిడులుంటాయి. స్వార్థప్రయోజనాలు ఉంటాయి. అంతకుమించి ప్రలోభాలుంటాయి. ఆలపాటివారు వీటిని లెక్కచేయకుండా *జ్యోతి, రేరాణి, సినిమా* పత్రికలు నడిపారు. *మిసిమి* కి ఆ పేరు పెట్టటంలోనే రవీంద్రనాథ్‌గారి దార్శనికత ఇప్పటికీ నవనవోన్మేషంగా కొనసాగుతూనే ఉంది. *మిసిమి* ని ఎటునుంచి చదివి ఏ అట్టను చూచినా దాని వన్నె తరగదు. వాసి తగ్గదు. *మిసిమి* ప్రతి పుటలోనూ రవీంద్రనాథ్‌గారి చింతనాత్మక దృష్టి కనిపిస్తుంది. ఆ రోజుల్లో ప్రముఖ రచయితలకు ఫోన్లు చేసి, వారిచేత ప్రత్యేక వ్యాసాలు వ్రాయించి *మిసిమి* లో ప్రచురించేవారు. *మిసిమి* కి రాసేవాళ్లే కాదు పాఠకులు సైతం జీవితకాలం అభిమానులేనంటే అతిశయోక్తి కాదు. కనీసం ప్రకటనలు లేకుండా చందాదారుల సంఖ్య తగుమాత్రంగా ఉండి పత్రికను క్రమం తప్పకుండా తీసుకురావడం *మిసిమి* యాజమాన్యానికే సాధ్యమయింది. రవీంద్రనాథ్‌గారి ఆస్తులకు కాకుండా, వారి ఆశయాలకు, ఆకాంక్షలకు వారసులయిన వారి కుమారులు, కుటుంబ సభ్యులు, కళాజ్యోతి ప్రింటర్స్ యాజమాన్యం సిబ్బందిని మహామనీషి ఆలపాటి రవీంద్రనాథ్‌గారి శతజయంతి సందర్భంగా ఆత్మీయంగా అభినందిస్తూ మాన్యశ్రీ రవీంద్రనాథ్‌గారికి (కీర్తిశేషులు అనడం ఇష్టం లేదు) శతజయంతి నివాళి సమర్పిస్తున్నాను...."

– *డా. బీరం సుందరరావు, చీరాల*

".... *మిసిమి* అక్టోబరు – 21 సంచికలో పప్పు వేణుగోపాలరావు గారి *ఆధ్యాత్మికత అంటే* వ్యాసంలో ఉపనిషత్తులలో ముఖ్యమైనవి 14 అని, అవి ఒక్కొక్క వేదం చివర ఇవి ఉన్నాయి అన్నారు. కాని వేదకాలంలో క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటివని చరిత్రకారులు నిర్ణయించారు. ఉపనిషత్తులు భారతయుద్ధం తరువాతవి. జనమేజయుడు, గార్గి సంవాదం ఒక ఉపనిషత్తులో ప్రధాన అంశం. జనమేజయుడు అర్జునునికి మునిమనుమడు. మార్క్సిస్టు చరిత్రకారుడు ఏటుకూరు బలరామమూర్తి గారు *ఉపనిషత్తు చింతన* అనే తన గ్రంథంలో భారతయుద్ధంలో ఆగ్నేయాస్త్రంలాంటి ఏ అస్త్రాలు వాడినందుకు అవి యధార్థ అస్త్రాలు కావని భావించిన మేధావుల ఆలోచనతోనే ఉపనిషత్తులు వెలువడినవి అన్నారు. అదే సంచికలో నాయుడమ్మగారి జీవిత విశేషాలు చివరి భాగం ప్రచురించారు. కాట్రగడ్డ శేషగిరిరావు గారి రచన పాఠకుల మనసుకు హత్తుకునేలాగా ఉంది. *మిసిమి* ప్రతి సంచిక ఒక ముత్యాలసరమే. ఎడిటర్స్ డైరీ లేని సంచిక వేదికపై అధ్యక్షునికి, ప్రధాన అతిథికి మధ్య ఖాళీ కుర్చీవలే అనిపిస్తుంది..."

– *పి.ఆర్. ప్రకాశరావు, బెంగుళూరు*

".... *మిసిమి లో నాయుడమ్మ గారి జీవిత విశేషాలు* వివరిస్తూ ధారావాహికంగా ప్రచురించిన వ్యాసాలు చాలా బాగున్నాయి. 1985 జూన్ 6వ తేదీ ఆయన హైదరాబాద్ వచ్చారు. ఎ.పి.ఐ.డి.సి. తరపున ఎన్.ఐ.ఎల్.ఇ. లిమిటెడ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు చైర్మన్ పదవి తీసుకోవడానికి ఆ పదవి ఆయనకు చంద్రునికో నూలుపోగులాంటిది. అప్పటికే ఆ కంపెనీలో ఎ.పి.ఐ.డి.సి. తరపున నేను డూటీలో ఉండటం నా అదృష్టంగా తలుస్తాను. ఆయన స్ఫురద్రూపి. ఎంతో హుందాగా మీటింగ్ నిర్వహించారు. మీటింగ్ తర్వాత భోజనం సమయంలో ఆయనతో మాట్లాడటం ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఆయనతో చెప్పాను, సీతాదేవి గారు మా ఊరు (వెల్లటూరు) ఆడపడుచు అని. ఆయన ఎంతో ఆప్యాయత కనపరిచారు. ఆ రోజు చెప్పారు మళ్లీ సాయంత్రం ఢిల్లీ వెళ్లి, అటు తరువాత తను వెళ్ళాల్సిన విదేశీయానం గురించి. 15 రోజుల్లోనే ఆయన మరణ వార్త వినడం ఎంతో దురదృష్టం. దేశానికి ఒక తీరని నష్టం. ఒక తెలుగు వ్యక్తిగా ఆయన సాధించిన విజయాలు సాంకేతిక రంగంలో ముందు తరాలవారికి ఎంతో మార్గదర్శనం...."

– *మోటూరు శివరాంప్రసాద్, హైదరాబాద్*

## వచన కవితాబ్రహ్మ
# కృష్ణమాచార్యులు

*– పప్పు వేణుగోపాలరావు*

పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు తనకు ముందు ఇద్దరే వాగ్గేయకారులను పేర్కొన్నారు, వారి ప్రభావమే వీరి సంకీర్తనలపై కనపడుతుంది. అందులో ఒకరు మహాకవి జయదేవుడు, రెండవవారు తొలి తెలుగు వచన వాగ్గేయకారుడు శ్రీ కృష్ణమాచార్యులు. నిజానికి భక్తిలో, భావనలో, భాషలో, రచనా వైశిష్ట్యంలో తాళ్ళపాకవారు కృష్ణమాచార్యునికి వారసులనిపిస్తుంది.

*ఒక ఉదాహరణ చూడండి :*

**కృష్ణమాచార్యులు వచనం ఇది:**

***దేవా! విష్ణుభక్తి లేని విద్వాంసుకంటె హరికీర్తనము సేయునతడె కులజుండు. శ్వపచుండైన నేమి ఏ వర్ణంబైననేమి? ద్విజునికంటె నతండు కులజుండు. దృష్టింజూడగా విద్వజ్జన దివ్యభూషణము. సింహగిరిం దలంచిన యాతండె కులజుండు.***

**అన్నమయ్య పదం చూడండి :**

***'ఏ కులజుడైన నేమి ఎవ్వడైననేమి***
***ఆకడ నాతడె హరినెరిగినవాడు..'***

ఇలా ఎన్నో కనిపిస్తాయి.

కృష్ణమాచార్యులు లేదా కృష్ణమయ్య వ్రాసినవి 'సింహగిరి నరహరి వచనాలు'. చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనలు వ్రాసాడని ప్రసిద్ధి. ఈయన సుమారు 1230 నుంచి 1320 వరకు జీవించియుండవచ్చు. ఆయన జన్మించినది వికృతినామ సంవత్సరం అని ఆయనే చెప్పుకున్నాడు. 16వ ఏట పరాభవ సంవత్సరం ఆషాఢ శుద్ధ ద్వాదశి నాడు, 1246లో సంకీర్తన రచన ప్రారంభించాడు.

పుట్టుకతో అంధుడై జన్మించిన ఈయన గురించి అతి రమణీయమైన ఒక కథ ప్రచారంలో ఉంది. అందులో చాలావరకు నిజముందని అంతరంగ సాక్ష్యాలు ధృవపరుస్తున్నాయి. ఆయన వచనాలలోను శాసనాలలోను కనిపించే సాక్ష్యాలు ఆధారంగా ఈ ఐతిహ్యానికి రమణీయమైన రూపకల్పన చేసినది నా అగ్రజతుల్యులు శ్రీమాన్ టి.పి. రామచంద్రాచార్యులవారు. నేను ఏవియన్ కళాశాల, విశాఖపట్నం తెలుగు విభాగంలో పనిచేసే రోజులలో మా తెలుగు విభాగానికి అధ్యక్షులు వారు. వారు వ్రాసిన కథ సంక్షిప్తంగా ఇది. కథతో పాటు ఆయన మిగిలిన విశేషాలు చూద్దాం.



కృష్ణమాచార్యులు

సింహాచలానికి దగ్గరలో సంతూరు అని ఒక అగ్రహారం. అక్కడ రుక్మిణీసత్యభామా సమేతుడైన వేణుగోపాలస్వామి వారి ఆలయం ఉంది. ఆ ఆలయానికి ఎన్నో తరాలుగా పూజలు చేస్తూ స్వామివారి కైంకర్యమే జీవితంగా గడుపుతున్న ఒక కుటుంబం. అర్చకులు ఆగమశాస్త్రం, పూజా విధానం, బాగా తెలిసిన శ్రీమాన్ గోవిందాచార్యులవారు. ఆ చుట్టుపట్ల గ్రామాలలో మంచి పేరున్న పండితుడు. స్వామి కైంకర్యంలో రోజూ కళ్ళు చెమర్చి పులకించే మనస్తత్వం ఆయనది. ఆయన ధర్మపత్ని లక్ష్మీదేవి అనుకూలవతి అయిన భార్య. కల్యాణమయిన కొద్దిరోజులకే లక్ష్మీదేవి గర్భవతి అయింది. గోవిందాచార్యులు ఆమెను ప్రసవానికి పుట్టింటికి పంపనన్నాడు. ఆ వేణుగోపాలస్వామి కటాక్ష వీక్షణలుండగా ఇంకో ఊరికి ఎందుకు ఇక్కడే ప్రసవం జనన చేయిస్తానని



సింహాచలం: శ్రీ వరాహ
లక్ష్మీనరసింహస్వామి

బావమరిది శ్రీ రంగాచార్యులను ఒప్పించాడు. నెలలు నిండాయి, కాని గ్రహాల అనుగ్రహం లేని రోజున ఒక దుష్ట నక్షత్రంలో ఆమె మగపిల్లవానిని ప్రసవించింది. తల్లికి మూడు రోజులు ఒంటిమీద తెలివి లేదు. పిల్లడు కెవ్వుమని ఏడ్చాడు కాని గోవిందాచార్యులకు ఈ బిడ్డ పుట్టంధుడు అని అర్థమయింది. వెక్కి వెక్కి ఏడ్చాడు. స్వామీ వేణుగోపాలా! నిన్ను తరతరాలుగా నమ్ముకున్న మా కుటుంబానికి ఏమిటీ పరీక్ష అని ప్రశ్నించాడు. వారికి బంధువైన ఒక జ్యోతిష్కుడు పిల్లవాడి జాతకం చూసి, గోవిందయ్యా ఈ పిల్లవాడు నీ ఇంటికి అరిష్టం, తల్లి కళ్ళు తెరిచేలోపు ఈ బాలుడిని ఎక్కడేనా విడిచిపెట్టి రమ్మన్నాడు. ఆ పైన స్వామి కటాక్షం అన్నాడు.

నలుగురూ కలిసి ఆపిల్లవాడిని ఒక పాడు బావిలో పడేశారు. ఆశ్చర్యం ఏమిటంటే ఆ బావిలో ఉన్న తీగలు కొమ్మల మధ్య పడ్డాడు శిశువు. అదొక ఊయలలా ఉంది. పైన ఒక తేనె తుట్టెలోంచి అప్పుడప్పుడు తేనె బొట్లు బాలుని నోటిపై పడుతున్నాయి. ఒక సర్పం ఎండా వానకి కాపాడడానికా అన్నట్టు ఆ బాలునిపై పడగ విప్పి నిలిచింది. ఈ వింత చూడడానికి పక్కనున్న ఊళ్ల జనం తండోప తండాలుగా వచ్చి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆ నోటా ఈ నోటా పడి ఆ వార్త అక్కడే మఠంలో ఉన్న శ్రీకృష్ణ కువ్వారు స్వామి చెవిన పడింది. ఆయన ఏటికి స్నానానికి వెళ్లి వస్తూ ఆ నూతిలోకి వంగి చూశారు. ఏదో అనుబంధం మనసులో భావతరంగాలు రేపింది. అంతవరకూ ఉన్న సర్పం మటుమాయమయింది. స్వాములవారు స్వయంగా దిగుడుబావి మెట్లు దిగి ఆ పిల్లవాడిని చేతిలోకి తీసుకున్నారు. ఆ పిల్లవానిని తేర్పారా చూసి వీడు సామాన్యుడు కాదు, రొమ్ముపై శ్రీ వత్సాన్ని తలపించే మచ్చ, చేతిలో, పాదాలలో, శంఖ చక్ర గదా పద్మాలవంటి శుభ లాంచనాలు ఉన్నాయి. ఆ పసికందును పెంచాలని అదే పరమేశ్వరుని ఆజ్ఞ అని భావించి తనతో బాటు మఠానికి తీసుకు వెళ్ళారు.

ఇక్కడ ఈలోగా తల్లి లక్ష్మీదేవి మూడవ రోజున కళ్ళు తెరిచింది. అంతా విని గుండెలవిసేలా రోదించింది. పురుషులు తీసుకున్న కర్కశమైన నిర్ణయానికి మాతృత్వం తల ఒగ్గింది. కాలం గడుస్తోంది, స్వామిలవారు ఆ బాలుడిని కాషాయ వస్త్రాలలో పరుండబెట్టే పెంచారు. దివ్య ప్రభంధాను సంధాన ధ్యానమే జోల పాటగా పెరిగాడు ఆ బాలుడు. ఆయన తను వెళ్ళే తీర్థయాత్రలన్నింటికీ బాలుడినీ తీసుకువెళ్ళేవారు. బాలుడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఇప్పుడు పదహారేళ్ళు. అలా కొన్నాళ్ళకు సింహాచలం చేరుకున్నారు కృష్ణకుమార స్వాములు. ఆయన కొండ క్రింద ఒక మఠంలో ఉండి ఏ రోజుకారోజు కొండనెక్కి వరాహనరసింహస్వామిని దర్శించుకునేవారు.

ఈ బాలుని బంధకం వల్ల ఎన్నో సంవత్సరాలయింది సింహాద్రి అప్పన్నని చూసి. కృష్ణకుమార స్వామి మరునాడు ఉదయాన్నే లేచి బాలుడిని కింద మఠంలోనే వదిలేసి ఒక్కరే దర్శనానికి కొండకి బయలుదేరారు. అక్కడ అప్పన్నను దర్శించి తనకు తెలిసిన పండితులను, కళాకారులను, సన్యాసులను పరామర్శించి, అక్కడి స్వామి సేవలన్నిటినీ చూసి, సాంస్కృతిక కార్యక్రమాలు చూసి అలా సమయం తెలియకుండా మూడు రోజులు ఉండిపోయారు. తనతో ఒక కళ్ళులేని బాలుడున్నాడనే గుర్తే లేదు కాబోలు వారికి. అలా అనిపిస్తుందిగాని సర్వం తెలిసిన స్వాములికి మరుపా. ఏదో ఒక అద్భుతం జరగాలి దానికోసమే ఆ ఏమరపాటు, ఆ ఏర్పాటు.

ఇక్కడ ఈ బాలుడు ఎప్పుడూ ఒంటరిగా ఉండలేదు. స్వాములవారి మఠంలో ఎవరో ఒకరు చూసుకునేవారు. ఇప్పుడిక్కడ వారెవరూ లేరు. ఆ కొండకెళ్ళిన స్వామి జాడ తెలీదు. అంతా అయోమయంగా ఉంది బాలునికి. ఇంతలో మూడవనాడు ఉదయం సింహాద్రి అప్పన్న తానే స్వయంగా ఒక బాలుని రూపంలో ఆ బాలుడున్న మఠానికి వచ్చి మీ గురువుగారు ఈ పాలు నీకిమ్మన్నారు అని ఒక గిన్నెడు పాలు ఆ అబ్బాయికి ఇచ్చాడు. ఆత్రంగా అది తీసుకుని ఆహా గురువుగారికి నేను జ్ఞాపకం వచ్చానే అని సంతోషంగా

ఆ పాలు తాగి ఆ చేత్తో కళ్ళు తుడుచుకున్నాడు. ఆశ్చర్యం ఇంకేముంది ఆ అంధునికి చూపు కలిగింది. ఉదయ సూర్యుని లేత కిరణాలు కనులకు సోకి ఎదురుగా చిరునవ్వుతో ఒక మనోహర మూర్తి కనిపించాడు. విషయం అర్థం అయింది. కనులవెంట అశ్రుధారలతో ఆ స్వామి పాదాలు కడిగాడు. ఎంతటి అనుకంపం, ఏమి కృప, ఏమి దయ స్వామీ, ఈ పుట్టు అంధునికి చూపు ప్రసాదించావు అని మోకరిల్లాడు.

సింహగిరి నరహరి ఆ బాలునితో ఇలా అన్నాడు. నువ్వు నా అంశలో జన్మించావు. కారణ జన్ముడివి. చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనల వాక్పూజలతో నన్ను కీర్తించు. అన్నాడు.

స్వామీ లోకం ఎరుగను, చూపులేదు ఇంతవరకు. చదువు సంధ్యలు లేవు, శాస్త్రాలు తెలియవు, నేనేం చెయ్యగలను అన్నాడు బాలుడు. నాయనా నీకు నేను షట్ శాస్త్రాలు, షడ్ దర్శనాలు, సకల విద్యలూ ఉపదేశిస్తాను. సంకీర్తన ప్రారంభించు అని నరహరి మాయమయ్యాడు.

ఇంతలో కొండకి వెళ్ళిన స్వాములు తిరిగివచ్చారు. నాన్నా నిన్నొదిలి మూడు రోజులు వెళ్ళిపోయాను, ఎలా ఉన్నావు తండ్రీ అని అక్కున చేర్చుకోగానే ఆయన పాదాల మీద పడి జరిగినదంతా చెప్పి తన కంటిచూపే సాక్ష్యంగా నివేదించాడు బాలుడు. స్వాములకు నోట మాట రాలేదు, ఆనాడు సంతూరు దిగుడు బావిలో దొరికిన పసికందు ఎక్కడ, ఈ తేజోమూర్తి ఎక్కడ. ఆహా స్వామి లీల అనుకున్నాడు.

మరునాడు బాలుడు స్నాతుడైనంతనే స్వామి కటాక్షించినట్టు సకల విద్యలు నిమేష మాత్రంలో అవగతం అయ్యాయి. మరునాడు దండె, చిటితాళాలతో, ఊర్ధ్వపుండరీకాలతో, కాషాయం ధరించి కృష్ణకుమార స్వామితో పాటు సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నాడు. స్వాములు అక్కడున్న పూజారులతో ఆలయ నిర్వాహకులతో పండితులతో ఈ కుర్రవాడు సాక్షాత్తు సింహగిరి నరహరి కటాక్షంతో నేటినుంచి స్వామిని తన వాక్కుసుమాలతో చాతుర్లక్ష గ్రంథాలతో పూజిస్తాడు, మీ అందరి మంగళా శాసనాలు వీనికిచ్చి దీవించి అనుమతినివ్వండి అని కోరాడు.

బాలుడు సింహాద్రి అప్పన్నకు పెద్దలకు నమస్కరించి గురువుగారికి పాదములంటి మోకరిల్లి.. కనులు మూసుకొని.. గంభీరమైన గాత్రంతో... దేవా! అని గొంతెత్తి ప్రారంభించాడు. ఆ నాదంలో ఏదో అలౌకికమైన మాధుర్యముంది, భక్తి ఉన్నది, శరణాగతి ఉన్నది.. అది ఆ ఆవరణనంతంటినీ భక్తిసాంద్ర తరంగితం చేసింది. అదిగో అదే మొదలు ఆయన సంకీర్తన యజ్ఞానికి.

అన్ని సంకీర్తనలు 'దేవా!.. మా యతివర రామానుజ వరందాతారు.... శ్రీ కృష్ణకువ్వారు స్వామీ! సింహగిరి నరహరీ! నమోనమో దయానిధీ' అనే పద్ధతిలో నడుస్తాయి.

సంకీర్తన పూర్తయ్యేసరికి ఎవరికీ ఈ లోకం మీద మనసు లేదు.. ఇంకా ఆ గాత్ర మాధుర్యంలోనే ఓలలాడాలని అనిపిస్తోంది. ఆ రోజు ప్రారంభమైన సంకీర్తన యజ్ఞం ఆహరహంగా ప్రత్యేకమైన సమయంలో రోజూ దేవాలయంలో నడుస్తూనే ఉంది. చుట్టుప్రక్క ఊళ్లలో ఈ సంగతి తెలిసి, పుట్టంధుడట! అప్పని వరప్రసాదమట, గంభీరమైన సంకీర్తనా ప్రవాహమట, అని చెప్పుకుని తండోపతండాలుగా వస్తున్నారు. ఆ నోటా ఈ నోటా ఈ వార్త సంతూరులో ఉన్న బాలుని తల్లిదండ్రులకు తెలిసింది. ఆ తల్లి మనసు కొడుకుని చూడాలని పాకులాడింది. రెండ్రోజులకు గోవిందాచార్యులు లక్ష్మీదేవి సింహాద్రికి వచ్చారు. ఆ జనసందోహంలో దూరంగా గొంతెత్తి పాడుతున్న కొడుకుని చూసి తల్లి జలప్రవాహమే అయింది. ఆ ఆలయంలో ఉన్నా కొడుకు పొత్తిళ్ళలో ఉన్నట్లే కనిపించాడు మాతృ హృదయానికి. ఏమా వైభవం, ఎంత గౌరవం, తమ పుత్రుడికి అని ఆశర్యపోయారు. సాయంత్రం కృష్ణకువ్వారు స్వామివారిని, పిల్లాడిని చూసి, స్వాములకు నమస్కరించారు. స్వామి పిల్లవాడిని తల్లి దండ్రులకు పరిచయం చేశారు. వారికి ఇంకో కుమారుడు ఉన్నాడు. ఆ ముగ్గురు ఈ వాగ్గేయకారుడిని చూసి పట్టలేని ఆనందాన్ని పొందారు.

కృష్ణ కువ్వారుస్వామి గోవిన్దాచార్యులతో రాత్రి మఠంలో నాయనా నీ కొడుకు అవతారపురుషుడు, వాడిని స్వంతం చేసుకోడానికి ప్రయత్నించకండి. వాడు కారణజన్ముడు. తల్లిదండ్రులుగా మీదొక బాధ్యత ఉంది. ఈ కుర్రవాడికి ఇంతవరకు నామకరణం లేదు, అక్షరాభ్యాసం లేదు, అన్నప్రాశనం లేదు, ఉపనయనం లేదు. రేపు మంచి ముహూర్తం ఉంది. అవన్నీ జరిపి, మీ బాలుడిని సింహాద్రి అప్పన్నకు వప్పచెప్పి, మీరు తిరిగి వెళ్ళండి అని చెప్పారు. అదే మహాభాగ్యం అని వాళ్ళు అంగీకరించి పులకించిన మనసుతో వేదఘోషల మధ్య కార్యక్రమాలన్నీ జరిపించి పిల్లవానికి ఆ పెంచిన స్వామికి కృతజ్ఞతగా కృష్ణమాచార్యులు



సింహాచలం దేవాలయం

అని నామకరణం చేశారు. అంతవరకు అనామకుడైన అనాథుడైన బాలుడే తొలి తెలుగు వాగ్గేయకారుడు కృష్ణమాచార్యులు, కృష్ణమయ్య.

తల్లిదండ్రులు వారి గ్రామానికి తిరిగి వెళ్ళిపోయారు. అంతవరకు తను సాకి అంటిపెట్టుకున్న బాలుడిని వదిలిపెట్టి కృష్ణ కువ్వరుస్వామీ వెళ్ళిపోయారు. మళ్ళీ కృష్ణమయ్య జీవితంలో తిరిగి కనబడలేదు. దైవనిర్ణయంలో ఒక నిమిత్తమాత్రంగా వచ్చిన స్వామి తన పని అయిపోగానే వెళ్ళిపోయారు.

కృష్ణమాచార్యులు స్ఫురద్రూపి, అంతవరకు లోకమే చూడని బాలుడు. సింహాద్రి అప్పన్న ప్రసాదించిన వైదుష్యము, ఆయన తన అంశయే ఈ బాలుడని ప్రకటించడం దీనికి తోడయ్యాయి. రోజూ నిత్య పూజలలో స్వామివారికి కృష్ణమయ్య వచన సంకీర్తనాలాపన భాగం అయ్యింది. అది వినడానికి తండోపతండాలుగా జనం వచ్చేవారు. అది ఏమి గాత్రమాధుర్యమో, స్వర సంచారమో, లయవిన్యాసమోగాని, ఆ వచనాలు అప్పన్నతో బాటు భక్తులను సమ్మోహన పరచేవి.

దేవా అని అందుకుంటాడు.. కృష్ణ కువ్వారు స్వామీ! సింహగిరి నరహరి! నమో నమోదయానిధీ! అని ముగిస్తాడు. ఆయన ఆశువుగా చెప్పే వచనాలలో స్పర్శించని వస్తువు లేదు, తెలియజేయని ఉపనిషద్ రహస్యాలో, దుయ్యబట్టని సాంఘిక దురాచారాలో లేవు. ఎవరికి కావలసింది వారికందించే సంకీర్తనలవి. అందులో పురాణ కథలు వల్లెవేస్తాడు, దైనందిన జీవితాన్నీ చవిచూపిస్తాడు. దేశమంతా ఆయన వరివస్య, ఆయన భక్తి పారవశ్యం, మహిమలు, కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

అదే సమయంలో 1264లో ఉత్కళకు చెందిన రాజులు, గాంగ నరసింహ చక్రవర్తి సింహాచలం దేవాలయానికి ఒక వందమంది నర్తకీమణులను దేవదాసీలుగా అర్పించాడు. ఇక అప్పటి నుంచి ఈయన సంకీర్తన, వారి నృత్యం దేవరవారికి నివేదనం జరిగేది. కృష్ణమయ్య వచన ప్రవాహం వింటున్నంతసేపు దేవదాసీలు దేవాలయంలో స్తంభాలమాటుగా నించొని, ఆయన భక్తికి గాత్రమాధుర్యానికి, ఆయన రూప గుణ యౌవ్వనాలకు పులకించిపోయేవారు. అందులో ఒక ప్రధాన దేవదాసి నృత్యం నివేదనంలో ఈయనకు సరితూగే వైశారద్యం కనబరచేది. ఆమె పేరు జగన్మోహనాంగి. పేరుకు తగినట్లే ఉండేది.

ఒకసారి ఆలయంలో నృత్యస్పర్థలు జరిగాయి. దానికి ప్రధాన పరీక్షకులు కృష్ణమయ్య. ఈయన ఎన్ని గతులు మార్చినా, తాళాలు వేసినా, అన్నిటిలోనూ సమర్థవంతంగా ఆమె నృత్యం చేసి శహభాస్ అనిపించుకుంది.

ఆమె ఏకాంతంలో కృష్ణమయ్యకు ఆయనపై తనకున్న ప్రేమ వివరించింది. ఇది ఏదో జన్మజన్మల అనుబంధం అంది. కృష్ణమయ్య కాదనలేకపోయాడు. ఆనాటి నుంచి వారిద్దరి మధ్య రాకపోకలు, రాసలీలలు తరచుగా జరుగుతూ ఉండేవి. దేవాలయాధికారులు కృష్ణమయ్య వ్యక్తిత్వం ముందు అడ్డు చెప్పలేకపోయారు.

కొందరు ఈయనను వేశ్యాలోలుడన్నారు. మహానుభావుల చరిత్రలు సామాన్యులు ప్రశ్నించకూడదన్నారు కొందరు. ఆలయంలో వచన సంకీర్తనా నివేదనం రోజూలాగానే సాగుతోంది. ఆ నోటా ఈ నోటా ఆ విషయం సంతూరులో ఉన్న తల్లిదండ్రులకు తెలిసింది. అయ్యో మన పిల్లవాడికి పెళ్లి చేస్తేగాని ఈ అపవాదు పోదనుకున్నారు తల్లిదండ్రులు. వెంటనే లక్ష్మీదేవి అన్నగారు కృష్ణమయ్యకు మేనమామ అయిన శ్రీ రంగాచార్యుల కుమార్తె అమర నాంచారునిచ్చి పెండ్లి చేశారు. ఆ వివాహానికి ఒక చరముడి వేషంలో సింహగిరి నరహరీ వచ్చాడట! అంతటి భక్త శిఖామణి కృష్ణమాచార్యులు. అమర నాంచారుకు తన భర్తకు ఇంకొక స్త్రీతో సంబంధం ఉందని తెలుసు. ఆమె చిన్నప్పుడు సంస్కృతం చదువుకుంది. కుమారసంభవంలో కాళిదాసు చెప్పిన ఒక శ్లోకపాదం 'ఏకో హి దోషో గుణ సన్నిపాతే నిమజ్జతీందో క్కిరణే ష్వివాన్కః' ఎన్నో సుగుణాలున్నచోట, చంద్రునిలో మచ్చలా ఒక దోషం ఆ సముదాయంలో కలిసిపోతుందిట.

కృష్ణమయ్య పుట్టినదే సింహగిరి నరహరికి వచన సంకీర్తన నివేదన కోసం. ఆయనే ఆయనకు కట్టడి చేశాడు నాలుగు లక్షలు వ్రాయాలని. అహరహం అదేపనిగా సంకీర్తనలను రచిస్తున్నాడు, స్వామికి అంకితం చేస్తున్నాడు. అందులో ఎన్ని రకాలు, ఎన్ని రసాలు, ఎన్ని పోకడలు, ఎంత వైవిధ్యం, ఎంత వరివస్య.

క్రీ.శ. 1374లో అంటే కృష్ణమయ్య జీవితకాలం తరువాత దాదాపు 50 సంవత్సరాలకు ఆయన సంకీర్తన పరిరక్షణ సానులచే నిర్వహించడానికి జీతభత్యాలను కల్పిస్తున్న ఒక శాసనం కనిపిస్తుంది. కొన్ని వచనాలు పరామర్శిద్దాం. అందులో కొన్ని వ్యక్తిగతం ఉంటాయి, జీవుని వేదన ఉంటుంది. తనను తాను నిందించుకునే సన్నివేశాలూ ఉంటాయి. వైష్ణవంలో ఒక ముఖ్యమైన తత్త్వం 'నైచ్యాను సంధానం'. స్వామీ నేను అల్పుడిని, అపచారాలు చేసేవాడిని, నీవు పర్మాత్ముడివి, అనే నమ్మకమే నైచ్యానుసంధానం.

*కొన్ని వచనాలు:*

"దేవా! మీకు మొఱపెట్టి విన్నపము చేయుచున్నాడను, సంసార మోహ బంధముల దగులువడితిని. కర్మానుకూలంబులం బెనగొంటిని. కాంతలమీది కోరిక కడవదాయెను. కామాంధకారము కన్నులగప్పెను. కర్మవారిధి గడువదయ్యెను. అపర కర్మములకు లోనైతిని, అజ్ఞానజడుండనైతిని, అధమాధముండనైతిని, అందని ఫలములకఱ్ఱులు సాచితిని, దుష్టదురాచారుండనైతిని, మూఢుండనైతిని, చపలుండనతిపాతకుండను"

ఇదే భావం త్యాగయ్య గారి పంచ రత్నాలలో 'దుడుకుగల నన్నేదొరకొడుకు'లో కనిపిస్తుంది. అది చూడండి

*దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా*
*తెలియని నటవిట క్షుద్రులు వనితలు*
*స్వవశమవుటకు వశించి,*
*సంతసిల్లి స్వరలయంబు లెఱుంగకను*
*శిలాత్ములై సుభక్తులకు సమానమను*
*....*
*దృష్టికి సారంబగు లలనా సదనార్భక*
*సేవామిత ధనాదులను,*
*దేవాదిదేవ నెర నమ్మితి గాకను*
*నీ పదాబ్జ భజనంబు మఱచిన*

కృష్ణమయ్యకు మూఢనమ్మకాలంటే పడదు, కుల వ్యవస్థ మీద నమ్మకం లేదు. ఆయనవన్నీ విప్లవభావాలు. *అందుకే ఒక సంకీర్తనలో అంటాడు:*

***"సంధ్యాది నిత్యకర్మానుష్ఠానంబులు దప్పక నడిపిన నేమి? చతుర్వేద షట్ శాస్త్రముల్ నదివిననేమి? శత క్రతువులాచరించిననేమి? సకల ధర్మంబులు సేసిననేమి? మా సింహగిరి నరహరిదాసులకు దాసులైనంగాని లేదుగతి"***

ఇదే భావాన్ని అక్షరాలా ఈయన మార్గాన్నే అనుసరించిన అన్నమయ తన సంకీర్తనలో చెప్పాడు:

సహజ వైష్ణవాచారవర్తనుల సహవాసమే మా సంధ్య. .... అని

**నామసంకీర్తనలైతే కోకొల్లలు:**

దేవా, జయజయ, పరమపురుషా, పరమపదనివాసా, పరంధామా, పరతత్త్వప్రకాశా, అచలాచలా, అనుపమా, ఆదిపురుషా, అపరంపరా, అవ్యక్తా, అగణితగుణానందా, అమరేంద్రవంద్యా, అభయస్వరూపా, అఖిల బ్రహ్మాదిజనకా, విశ్వంభరా, విశ్వతోముఖా, శాశ్వతసచ్చిదానందా, ఏకరూపా, త్రయరూపా, పంచరూపా, అష్టరూపా, దశరూపా, శతరూపా, సహస్రరూపా, అక్షయలక్ష విచక్షణ ప్రమోదా, విచక్షణాలంకారా, నమో విభీషణ మోక్షకారణాయ. శ్రీకృష్ణ కువ్వారుస్వామీ, నమో నమో దయానిధీ!

ఆయన వ్రాసిన సింహగిరి నరహరి వచనాలను విమర్శకులు ఇలా వింగడించారు.

- ✧ **నామ సంకీర్తన రచనలు**
- ✧ **పౌరాణిక వచనాలు**
- ✧ **ఆధ్యాత్మిక వచనాలు**
- ✧ **కథా వచనాలు**
- ✧ **తన గురించి తానూ చెప్పుకున్న వచనాలు**
- ✧ **సంప్రదాయ వచనాలు**

అసలు మనకు కృష్ణమయ్య గురించిన విషయాలు చాలావరకు తెలియడానికి ఆయన గురించి ఆయన వచనాలలో వ్రాసుకొన్న విషయాలే. ఒకచోట ఇవితప్ప 'సింహాద్రి అప్పన్నని సంకీర్తన చేయుచున్నప్పుడు నవరత్న పంచరత్న కీర్తనల చెప్పగా' అనే మాటనుబట్టి కృష్ణమయ్య ఛందోబద్ధమైన గీతాలు కూడా రచించినట్టు తెలుస్తుంది.

ఆయన రచనలే కాదు ఆయన మహిమలూ దేశమంతా కథలు కథలుగా చెప్పుకునేవారు. ఒకరిద్దరు విగతజీవులకు ప్రాణదానం చెయ్యడంలాంటివి. ఆయన అనునిత్యం



సింహాచలం దేవాలయం

దేవాలయ ప్రాంగణంలో, ఏకాంతంలో, ప్రహ్లాద మందిరంలో సింహాద్రి అప్పన్నతో ప్రసంగిస్తారని చెప్పుకునేవారు. ఆయా విషయాలవల్ల అందరికీ ఆయన మీద భయభక్తులు పెరిగేయి.

ఆయన రచనలలో తాదాత్మ్యం, ప్రపత్తి, శరణాగతి గోచరిస్తాయి.

రోజులు గడుస్తున్నాయి, కృష్ణమయ్యను గురించి దేశమంతా పలుపలువిధాలుగా కొనియాడుతున్నారు. కాని సింహాద్రి అప్పన్న సంకల్పం వేరు. కృష్ణమయ్యకు ఒక పుత్రుడు కలిగాడు. ఎంతో ఆప్యాయంగా తల్లిదండ్రులు ఆ బిడ్డని సాకుతున్నారు. ఆ పిల్లాడికి ఏడు సంవత్సరాలు నిండాయి. ఏ కారణం లేకుండానే ఒకనాడు ఆ బాలుడు హఠాత్తుగా మరణించాడు. ఇంకొక కొద్దిరోజులకు తన తమ్ముడు అనంతాచార్యుని ఎవరో పొడిచి చంపారు. ఈ సంఘటనల వలన కృష్ణమాచార్యులలో ఏదో తెలియని వైరాగ్యం. వచనరచన కుంటువడింది. అయినా స్వామివారికి సంకీర్తన నివేదనం అనునిత్యం జరుగుతూనే ఉంది.

అహోబిలంలో పొతకమూరు భాగవతులు నారసింహునికి నాట్యవినోదులు. వారు తెరపడితే దానివెనుక స్వయంగా నారసింహుడే వచ్చి నాట్యం చేసేవాడట. వారంతటి భాగవతులు. వారు కృష్ణమాచార్యులు గురించి విన్నారు. స్వయంగా సింహాద్రి అప్పన్నతో అనుదినం సంభాషించే ఆ భాగవతోత్తముని దర్శిద్దామని వారు సింహాచలం వచ్చారు. కానీ వారికి కృష్ణమయ్య తిరుమాళిగ తెలియదు, ఆ తోవనే పోతున్న కృష్ణమాచార్యులునే ఆపి, స్వామీ మేము పొతకమూరు భాగవతులం, కృష్ణమాచార్యులు వారిని దర్శించి వారి తిరువడిగళ్ళు సేవించి తరించాలని వచ్చాము. వారి నివాసం ఎక్కడ అని అడిగారు. పుత్రశోకంలో పడి అస్తవ్యస్తంగా నిత్యానుష్టాలు లేకుండా ఉన్న తనను చూసుకొని సిగ్గుపడి, స్వామీ ఇదే వారి ఇల్లు. మీరిక్కడే ఉండండి నేను వారికి మీ రాక తెలియజేస్తానని లోపలి వెళ్ళాడు కృష్ణమయ్య పెరటి దోవన ఒక మంగలిని పిలిచి క్షురకర్మ చేయించుకుని, కాషాయం ధరించి, దండెము, చిటితాళాలు చేతబట్టి, నుదుట ఊర్ధ్వపుండరీకాలతో వారి ముందు వచ్చి నిలుచున్నాడు. ఆ తేజస్సు చూసి వారు పాదాలకు సాగిలి మ్రొక్కి, స్వామీ! మేము ఔబళ నారసింహుని ఆలయంలో భాగవతులం. మా పేర్లు నారాయణయ్య, ఔబళయ్య, అచ్యుతయ్య, అనంతయ్య, లక్ష్మయ్య. మిమ్ములను చూసి తరించేం అన్నారు. అప్పటికి కృష్ణమయ్య వారిమాటలలో చెప్పిన లెక్కప్రకారం చాతుర్లక్ష గ్రంథంలో ఇంకా ఒక లక్షా పాతికవేలు మిగిలి ఉన్నాయి. వారి రాకతో తిరిగి సంకీర్తన వచన రచనా యజ్ఞం ప్రారంభమైంది. ఆ రాత్రి కృష్ణమయ్య వారిచే సింహాద్రిలో భాగవతం ఆడించాడుట. అది ఒక అద్వితీయ ఆధ్యాత్మిక సంఘటన. అహోబిల నరసింహుడు, సింహాద్రి వరాహ నరసింహుని ఎదుట ఆడడం.

*కృష్ణమయ్యలో మునుపటికంటే ఎక్కువ వైరాగ్యం, భక్తి సాంద్రత ఇనుమడించాయి. అప్పటి ఒక వచనం ఇది:*

*దేవా, తనువులు మాయ, తలపోసి తలపోసి చెప్పెదనంటివా కళకళల మోహమిది. ఆశలపాషాణం బిది. అతుకులజల్లెడ యిది. తన బ్రతుకుకొఱకు పోరాడి పోరాడి యొరులం జెఱచెడు దుర్గంధపుడొంకయిది.. మమతమండోదరనిబట్టి దాసిగానేలి, యాచార్యుండనెడు హనుమంతునిఁ బంపి, యాలంకఁ జొచ్చి, సాధించి, జీవుండనెడు సీతను దెచ్చి మీ పాదారవిందముల భక్తికి హత్తించి దరిచేర్చుమీ, యతి రామానుజముని వరము, దాతారు. అనాథపతీ, స్వామీ. సింహగిరి నరహరీ, నమో నమో దయానిధీ.*

అన్నమయ్య కూడా ఇలాంటివాడే ఎక్కడో ప్రారంభించి మధ్యలో ఏ రాముడినో కృష్ణుడినో తెచ్చి కడకు వెంకటేశా అంటాడు.

ఓరుగల్లును కాకతీయులు పరిపాలన చేసేవారా కాలంలో. అప్పుడు పరిపాలిస్తున్న ప్రభువు ప్రతాప రుద్రుడు. ఆయన 1289-1323లో పరిపాలించాడు. కృష్ణమయ్య దేశాలు తిరుగుతూ, తీర్థయాత్రలు చేస్తూ ఆయన మాటలలో

'ఏక శిలా నగరం' చేరుకున్నాడు. ప్రతాపరుద్రుడు ఆయనను తన ఆస్థానంలో నియమించి వారి కీర్తనలు ప్రతీరోజూ వినేవాడట. ఒక సూర్యగ్రహణం రోజు కృష్ణమయ్యను వెంటబెట్టుకొని ప్రతాపరుద్రుడు నదికి స్నానికి వెళ్ళాడు. కాలికి ఏదో మూట తగిలింది. విప్పి చూస్తే అందులో కనులు మిరిమిట్లు గొలిపే నవరత్న ఖచితమైన బంగారు నగలు!

ప్రతాపరుద్రుడు కృష్ణమయ్యను ఈ నగలు ఎవరివి, ఏం చెయ్యాలి, అని అడిగాడు. ఇవి మా సింహాద్రి అప్పన్నకు నివేదించండి అన్నాడు కృష్ణమయ్య. సరే, ఆ భారం మీదే అని నగలు కృష్ణమయ్య ఇంటికి పంపించాడు ప్రభువు. కృష్ణమయ్య సాయం సంధ్య వార్చుకుని, హోమం చేసి నగలన్నీ ఒకటొకటిగా అగ్నిలో వేస్తున్నాడు. సింహాద్రి నారసింహాయైనమః, స్వాహా అంటూ. ఈ విషయం ఒక విద్వాంసుడు చూసి ప్రభువుకు ఫిర్యాదు చేశాడు. మరునాడు ఉదయం ప్రభువు కృష్ణమయ్యను పిలిపించి స్వామీ నేను మీకిచ్చిన నగలేం చేశారు అని అడిగాడు. నిన్ననే వప్పిభట్టు అనే బ్రాహ్మనికిచ్చి సింహాచలం పంపానే అన్నాడు కృష్ణమయ్య.

ఈలోగా ద్వారకుడు ప్రభూ! సింహాచలం దేవస్థానం నుంచి మీ దర్శనం కోరి ఎవరో వచ్చారు అని ప్రభువుకు నివేదించాడు. ప్రవేశపెట్టమన్నాడు ప్రభువు. ఆ వచ్చిన విప్రుడు ప్రభూ, మీరు స్వామివారికి పంపిన నగలు అందాయి, ఇదిగో రశీదు, అని నగల జాబితా సమర్పించాడు. సభలో అందరూ కృష్ణమయ్య మాహాత్మ్యానికి, భక్తితత్పరతకు నివ్వెరపోయారు. ప్రతాప రుద్రుడు కనకగిరి సీమలో 50 గ్రామాల మీద అధికారాన్ని, ఒక అగ్రహారాన్ని సైతం అతనికి దానం చేసాడు. దానితో కల్లూరు అనే గ్రామాన్ని కృష్ణమాచార్యులు కట్టించాడు. ఇది ఇప్పుడు ఖమ్మం దగ్గిరలో ఉంది.

కృష్ణమయ్య పట్ల ప్రతాపరుద్రునికి గౌరవం పెరిగింది. స్వామీ మీవంటివానిని నా ఆస్థానంలో ఉంచుకొని జన్మ పవిత్రం చేసుకున్నాను. మీరు వ్రాసిన చాతుర్లక్ష గ్రంథాన్ని రాగిరేకులపై చెక్కించే అవకాశం నాకు ప్రసాదించండి అని విన్నవించుకున్నాడు. ఆ తామ్రపత్ర యజ్ఞం జరిగింది. ఆ రాగిరేకులను కృష్ణమయ్య శ్రీరంగం తీసుకువెళ్ళాడు. ఏకామ్రనాథుడు వ్రాసిన ప్రతాపచరిత్రలో ఈ విషయాన్ని ఉటంకించడం గమనార్హం.

కృష్ణమయ్య ఎన్నో తీర్థయాత్రలు, కాశీ నుండి ప్రయాగ నుండి, శ్రీరంగం వరకు చేసి ఆయా స్థలాలలో ఎన్నో అద్భుతాలు చేసినట్టు దాఖలాలున్నాయి. ఈ వ్యాసంలో నేను ఉదహరించినట్టు ఆయన వచనాలు ఏ పదిపదిహేను పంక్తులకో పరిమితమైనవి కావు. పుటలు పుటలుగా ఉన్నవి ఎన్నో ఉన్నాయి. అందులో ఎన్నో కథలున్నవీ ఉన్నాయి. అజామీళుడు, అంబరీషుడు, విప్రనారాయణుడు, ఇలా ఎన్నో.

విచారించవలసిన విషయం ఏమంటే ఆయన రచనలు నాలుగు లక్షలు, దొరికినవి సుమారు రెండే రెండువందలు. తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలోను, మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భండారంలోను, కొన్ని ప్రతులు కనిపిస్తున్నాయి. రాగిరేకులేమైనదీ తెలియదు. వాటికి తిరుపతి దేవస్థానం వారు అన్నమయ్యకు చేసిన విధానంగా సింహాచలం అంత ప్రయత్నమూ చెయ్యలేదు.

సింహాచలం ఒక నాలుగు దశాబ్దాలపాటు 1564 నుండి 1604 వరకు మూతపడి ఉన్నట్టు చరిత్ర చెపుతోంది. తురుష్కుల దండయాత్రల్లో సింహాచల క్షేత్రం విధ్వంసానికి గురైంది. బహుశా కృష్ణమాచార్యుల వాఙ్మయం అప్పుడే అంతరించిపోయి ఉండవచ్చు.

అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రాగిరేకుల మీద వ్రాస్తే ఈనాడు మిగిలినవి సుమారు 14 వేల రెండువందలు.

ఆ రాగి రేకులు ఈ రాగిరేకులు ఏమైనవి అంటే మిత్రులు కామిసెట్టివారి మాట గుర్తొస్తుంది

'రాగము తెలియని జాతి రాగి కరిగించుకున్నది'.

కృష్ణమయ్య సింహాద్రి నరసింహుని అంశ. అన్నమయ్య విష్ణువునందకాంశ సంభూతుడు. వారు తెలుగు నుడికారాన్ని, భాషని, జాతికి భక్తితో రంగరించి నేర్పిన అత్యుత్తమ వాగ్గేయకారులు.

కృష్ణమయ్య తనకోరికను, జీవిత లక్ష్యాన్ని, చెప్పిన వచనం:

*దేవా! నాలుగు వేదములు నవబ్రహ్మలు ఒక కొమ్మట! అందేయు చిటితాళము మీ దివ్యనామ సంకీర్తన పరుండును ఒక కొమ్మట! వ్యాసపరాశరశౌనకాదులు ఋషులందరును గూడి తులాభారము దూచిననాడు సంకీర్తనపరునికి సరితూగవాయెనట! అనేక జన్మజన్మాంతరములనే బుట్టి సంకీర్తనపరుండే కావలయును, శ్రీకృష్ణకువ్వారుస్వామి, సింహగిరి నరహరీ!*

## వచనాలు

1. దేవా! మీ దివ్యమంగళాది చారిత్రంబైన ద్వయతిరు మంత్రము పరమరహస్యము. ఆచార్య కృపాకటాక్షము దొరికిన మనుజుండు క్రితంబున సుజనుండైననేమి, దుర్జనుండైననేమి. అతండు మీదివ్యపదంబున బొందు సకలజీవహింసలు చేసి మాంసము బం (ఖం?) డించేటి లోహము. వేదశాస్త్ర పురాణంబులు వ్రాసేటి లోహములున్ను పరుసము సోకిన శుద్ధ సువర్ణముగదా! అనాధిపతీ, సింహగిరి నరహరీ!

2. దేవా! నేను ప్రభాతకాలమున లేచి తిరుమణి తిరుచూర్ణంబులు ధరియించి దండెయు తాళంబులు పూని, పరమభాగవతులున్ను దానున్ను స్వామికోవెలకుంజని మిమ్ము స్తోత్రము సేయందొడంగిన. ద్రౌపదీమనోద్ధారకా, పాండవపక్షపాతీ, సర్వసమా, మాధవా, గోవర్ధనగిరిధరా, నీవేతప్పనితఃపరంబెరుగనని స్వామి ప్రసన్నవదనుండై అప్పుడిట్లనియె. నీకు నింత విచారంబే లా? నామోచ్చారణంబులు యెవ్వరేని పఠియించిరేని, చాతుర్లక్ష గ్రంథంబైననేమి, సహస్రంబైననేమి, అష్టోత్తరశతం బైననేమి, అంతఃకరణ శుద్ధిగాను ప్రభాతమందు లేచి తిరుమణియు తిరుచూర్ణంబులు ధరియించి యేకనామోచ్చారణంబులు చేసిన అతనికి పుత్రమిత్ర పౌత్రాభివృద్ధియు, ధన ధాన్య సమృద్ధియు, కామితై శ్వర్యంబులిచ్చి అంత్యమున అతనికి నా లోకంబు నిత్తున ని శంఖంబుపూరించి వేంచేసి(న?) కృతార్థుండనైతినని పరమభాగవతులును, దాసులన్ను తనపురంబునకేగె, శ్రీకృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ!

3. దేవా! నాలుగు వేదములు నవబ్రహ్మలు ఒకకొమ్మట! అందేయచిటితాళము మీ దివ్య నామసంకీర్తన పరుండును ఒక కొమ్మట! వ్యాసపరాశరశౌనకాయ ఋషులందరును గూడి తులాభారము దూచిన నాడు సంకీర్తన పరునికి సరితూగవాయెనట అనేక జన్మజన్మాంతరములనేబుట్టి సంకీర్తన పరుండే కావలుయను. శ్రీకృష్ణకువ్వారుస్వామీ. సింహగిరి నరహరీ!

4. దేవా! ప్రళయకాలమునాడు క్షీరాంబు ధిమీద మాయావటపత్రశయనుండవై లక్ష్మీభూకాంతలతో నన్ను మరచితివో, దేవ! విళంబున సంవత్సర ఆషాడ శుద్ధ ఏకాదశి ఈశ్వర సంవత్సరాలు మూటను, నా పుత్ర మిత్ర కళత్రాదులు అన్న బాంధవులు అన్నపానాదులులేక క్షుత్పిపాసలు చేత నున్ను ఉన్నారు. గనుక, నే నీదాసుండను, నీవు నా పతివి. నన్నేల మాయాంధకారునింజేసితివి? ఇహమందు సౌఖ్యభోగముకృప జేసి నన్ను రక్షింపవే, అనాధిపతీ, సింహగిరి నరహరీ!

5. దేవా ! భగవద్భాగవతులకు సమర్పింపక, తానునుభవించక కూర్చిన యర్థము ఇహపర, ఉభయ భ్రష్టంబౌను, అది యెట్లనిన, మధువుగూర్చిన మక్షికరీతియౌను. అటుగాన మా సింహగిరి నరహరికి తళిఘలు సమర్పించుక తళిఘల తచ్చేషం తాననుభవించవలెను. శ్రీకృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ!

---

ఆచార్య పప్పు వేణుగోపాల రావు, చెన్నై. ఇ-మెయిల్: pappuvenu@gmail.com

# ప్రకృతిహితమ్ - వేదవాఙ్మయమ్

– పూషడపు సుబ్బారావు

సాకార, నిరాకార విశ్వశ్రేయోశక్తుల అన్వేషణలో తలమునకలైన బుద్ధిజీవులు దర్శించి, వచించినదే అపార వేద వాఙ్మయము. కాలం కఱకు కత్తుల దెబ్బలకు కవచమే కాదు కండలనూ కోల్పోయి కేవలం శల్యామాత్రంగా నేడు వేద పురుషుడు మన ముందు నిలబడి ఉన్నాడు. కర్మభూమి అయిన మన భరతావనిలో సప్తసింధువులతో సహవాసం చేసిన మంత్రద్రష్టలు తాము గ్రహించిన జ్ఞానాన్ని శబ్ద బ్రహ్మగా ఆవిష్కరించినదే వేదము. పంచభూతాత్మకమైన ఈ జగత్తును విరాట్‌పురుష స్వరూపంగా వేదవాఙ్మయం వచించింది. మాంస నేత్రాలతో మనం దర్శించగలుగుతున్న ప్రకృతి శక్తులను సముచితమైన, సార్ధకమైన పేర్లతోనూ, కొన్నింటిని సంకేత నామాలతోనూ మన ఋషిగణం సంబోధించారు. "ఏకమ్‌సత్‌విప్రా బహుదా వదంతి" అన్న చందాన ఒక వ్యక్తినే నామవాచక, సర్వనామ, సంబోధనా విభక్తులతో ఎలా భిన్నంగా పలుకరిస్తున్నామో అలాగే వేదంలో కనిపించే దేవగణం కూడా ఒక్కడే అయిన ఈశ్వరుణ్ణి పలురూపాలు, పేర్లతోనూ ఉటంకించబడడానికి ఉన్నవారేనని ముందు గ్రహిస్తే వేదసూక్తాలను సమగ్రంగా కాకపోయినా, సమర్ధవంతంగా అర్ధం చేసుకోగలుగుతాము. జిజ్ఞాసువుల సౌలభ్యం కోసం వేదరాశి నాలుగుగా విభజించబడింది. వాటికి బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, ఉపవేదాలు దేవదారువుకు సోమలత అల్లుకున్నట్లుగా అంటిపెట్టుకుని వర్ధిల్లాయి. భూమిపైనున్న ప్రాకృతిక శక్తులను అష్టవస్తువులుగా, ఆకాశంలో ఉన్న శక్తులను ద్వాదశాదిత్యులుగా, అంతరిక్షంలోని శక్తులను ఏకాదశ రుద్రులుగా వేదం కీర్తించింది. పంచభూతాలు, రాత్రి, ఉషస్, సూర్య, చంద్ర, నక్షత్రాలు, వృక్షాలు, నదులు, పర్వతాలు, సముద్రాలు సమస్త సృష్టి దైవత్వాన్ని ఆపాదించుకున్నది, వేదవాణిలో మాత్రవే. ఆర్ష సంప్రదాయంలో ప్రకృతి, పరమాత్మ భిన్నం కాదు. ఈ భూమండలంలో మరే ఇతర మానవ సమూహాలు పొందలేనంత గాఢమైన తాత్త్విక సంఘర్షణను, అనుభూతులను భారతీయులు పొందగలిగారు. విశ్వేదేవతలుగా వారు తరచూ స్తుతించినది తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని మాత్రమేనని మనం మర్చిపోకూడదు. దేనిని ఈ జగత్తు నుండి పొందుతున్నామో దీనిని తిరిగి జగత్తునకందించడమే మనవారి దృష్టిలో యజ్ఞం. ఇష్టి, పశుబంధ, సోమయాగాలుగా, నిత్య, నైమిత్తిక, కామ్య యజ్ఞాలుగా ఇలా ఏ రూపంలో సాగిన క్రతువైనా ప్రకృతితో మమేకమై ఉంటుంది. నదుల నుండి నక్షత్రాలవరకు, అంతరిక్షం నుండి అత్తి చెట్టువరకూ అన్నీ శాంతిగా ఉండాలని పాతాలు వల్లెవేసిన మన ఋషి కుమారులు, కుమార్తెలు ప్రాకృతిక ప్రేమికులు కావడంవల్లనే 'వసుధైక కుటుంబకమ్' భావనను ప్రోదిచెయ్యగలిగారు. 'అగ్నిమీళే పురోహితమ్' అంటూ ప్రారంభమైన వేదనాదం విశ్వచోదక శక్తిగా, సమస్త చైతన్య, జడ, స్థావర, జంగమ రూపాలలో కనిపిస్తున్న భౌతిక జగతికి అగ్నిని మూలంగా వర్ణించింది. మార్తాండుడు మొదలు మానవుని కడుపువరకు అగ్ని వివిధ రూపాలు ధరించి వశిస్తున్నాడని గ్రహించింది. అగ్ని స్తుతితోనే ఋగ్వేదం ముగుస్తుంది.

అగ్నీధ్రులు (చరుపురోడాశములను వరి, గోధుమ, యవ పిండులతో తయారు చేయువాడు. సప్తపాక, సప్త హవి, సప్త సోమయజ్ఞాలలో హవిస్సులుగా వీటిని ఉపయోగిస్తారు.) చరుపురోడాశములను చక్కగా వండాలన్నా, సోమలతా రసాలను పాత్రల నిండా పిండాలన్నా, గోక్షీరాలతో కుండలు నిండాలన్నా, తమ గాదెలు నిండేటట్లు వేసిన పైరులు అమేయంగా పండాలన్నా ప్రకృతి కాంత నిత్య బాలింతలా నడయాడినప్పుడే సాధ్యపడుతుందని మనవాళ్ళు కొద్ది కాలంలోనే గుర్తించారు. ఋగ్వేదంలోని ఒకటవ మండలంలోని ఆనోభద్రాః సూక్తంలో వాయువు భూమి పుత్రుడుగా చెప్పబడ్డాడు. తల్లిచాటు బిడ్డలాగా ఆమెను వదలక ఉండటంవల్లనే కదా భూమి మీద జీవం మనగలుగుతున్నది. ఋగ్వేదం 10వ మండలంలోని సూర్యసూక్తం ఆదిత్యుణ్ణి

"దివస్ పుత్రునిగా", రాత్రీసూక్తమ్ రాత్రీదేవిని "దివిపుత్రిగా" అభివర్ణిస్తాయి. "జ్యోతిషా బాధతే తమః" రాత్రీదేవి తన ప్రకాశంతో చీకటిని పారద్రోలడమేగాక తన సహోదరి అయిన ఉషాదేవిని తన స్థానంలోనికి ఆహ్వానించి తాను స్వచ్ఛందంగా నిష్క్రమిస్తుంది అని, రాత్రీదేవికి నక్షత్రాలే కళ్ళు అని ఈ సూక్తం వర్ణిస్తుంది. ఋగ్వేదంలోని 7వ మండలం ఉషస్ సూక్తాన్ని వర్ణించింది. అథర్వవేదం 12వ కాండ భూసూక్తంతో పునీతమైంది. *'మాతా భూమిః పుత్రో అహం పృథివ్యాః । పర్జన్యః పితాస ఉనః పిపర్తు'* నేను పుడమి తల్లికి బిడ్డను – వర్షాధిపతి అయిన ఇంద్రుడు మాకు తండ్రి. వీరిరువురూ మాకు సంవృద్ధిని ఇచ్చుదురుగాక అని ఈ మంత్రార్ధము. ఈ సూక్తంలోనే భూత, భవిష్యత్తులకు భూమి నాయకురాలిగా చెప్పబడింది. ఓ భూదేవి నిన్ను త్రవ్వి ఏది నాటినా అది సత్వరమే పెరగాలని, నీ మర్మ, హృదయ స్థానాలను (దేవోత్సవాల ఆరంభ దినాన పురోహితులు, స్థానాచార్యులు క్రతు నిర్వాహక బ్రహ్మ సారథ్యంలో అంకురారోపణం అనే విధి నిర్వహిస్తారు. పవిత్రంగా ఉన్నచోట పుట్టమన్నును సిద్ధపరచి అక్కడ భూదేవి రూపాన్ని లిఖించి, అలంకరించి ఆమె శిరో, హృదయ, మర్మ స్థానాల నుండి మట్టి సేకరించి తొమ్మిది మట్టి ముంతల (నవపాళికలు)లో నింపి వాటిల్లో నవధాన్యాలుంచి మొలకెత్తిస్తారు. ఇక్కడ భూదేవి మర్మస్థానమనగా భూమి యొక్క పునరుత్పాదక మూల స్రోతస్సులు అని, హృదయ స్థానమనగా ప్రకృతి యొక్క ఇష్టాయిష్టాలని మనం అర్థం చేసుకోవాలి) మేము పాడుచెయ్యకుండా ఉండాలని ఇందులో ప్రార్థన కొనసాగుతుంది. గౌతమ మహర్షి తాను చల్లిన విత్తనాలు అతిశీఘ్రంగా ఫలితానికొచ్చేటట్లు బ్రహ్మచేత వరం పొందినట్లు పురాణవచనం.

''మధువాతా ఋతాయతే మధుక్షరంతిసింధవః మాధ్వీర్నస్సం త్వోషధీః'' వాయువు, జలము, భూమి, ఓషధులు, వనస్పతులు అన్నీ మధుమయం కావాలని ఋగ్వేదం అభిలషించింది. "గిరియస్తే పర్వతాహిమవంతో అరణ్యంతే పృథివీస్యోనమస్తు" హిమాలయాలు, పర్వతాలు, అరణ్యాలు, నదులు, సముద్రాలతో కప్పి ఉన్న భూమాతను (భరతమాతను) అథర్వవేదం కీర్తించింది. మిగతా ప్రపంచమంతా నదులు కేవలం జలప్రవాహాలే కానీ భరతఖండంలో మాత్రమే నేటికీ అవి తల్లులు. ఈ భావనకు మూలకందం వేదమే. "ఆపో అస్మాన్మాతరః" నదులు, జలం తల్లివంటివి అని "అంబితమే దేవితమే నదీతమే సరస్వతీ" అంటూ సరస్వతిని తల్లులకు తల్లి అని వేదం కొనియాడింది. ఋగ్వేదంలోని 10వ మండలంలో పుట్టి నాలుగు వేదములలోనూ కనిపించే 'మార్జన' మంత్రాల (నీటి ద్వారా పవిత్రీకరణ జరిపే మంత్రాలు)లో జలదేవతలు తల్లులుగా గౌరవించబడ్డారు. "ఆపోభవంతు పీతయే" మేము త్రాగడానికి నీరు అనువైనదిగా ఉండునుగాక అని ప్రార్థించింది ఇక్కడే. ఋగ్వేదంలోని అఘమర్షణ సూక్తమ్ గంగ, యమున, సరస్వతీ, శుతుద్రీ, మరుత్ వృధ, అర్జీ దేవతలు పరుష్ణి, అసిక్ని, వితస్త, సుషోమ అనే మిగిలిన నదీ దేవతలతో కలిసిరావాలన్న వేడుకోలు ఉంటుంది. వారుణీపతి ఊర్ధ్వ, అధోలోకాలతో పాటు మానవుల పాపాలను కడిగేవానిగా వర్ణించబడ్డాడు. సువిశాల సముద్రం నుండి సంవత్సరం పుట్టింది అన్న అర్థంలో "సముద్రాదర్ణవాదభి సంవత్సరో అజాయత" అన్న మంత్రం ఇందులో చెప్పబడింది. ఇక్కడ సంవత్సరం అంటే ఆరు ఋతువుల సముదాయం. ఋతుగమనానికి భూభ్రమణంతో పాటు, సముద్రం కూడా మేఘోత్పత్తికి, ఋతుపవనానికి, గ్రీష్మతాపానికి కారణమని గుర్తెరిగిన ఋషులు అలా గానం చేశారు. ''మా ఆపో మా ఓషధీ హిగ్ంసీః! పృథివీం మాహిగ్ంసీః!!" జలములను, ఓషధులను, భూమిని హింసించవద్దు అంటే వాటిని నాశనం చేయవద్దు అని యజుర్వేదం శాసించింది. "దున్నిన వెంటనే మొలకెత్తే నేల, మేధావులు, శ్రామికులు, కర్షకులు, వణిజులు నివసించే స్థితి కలిగి, రోగనాశనం చేసే శక్తినిచ్చే ఓషధులు, వృక్షాలుగల భూమి కావాలి'' అని అథర్వవేదం ఆకాంక్షించింది. "వాయుర్వై వృష్ట్యా ఇశోసఏవాస్మై పర్జన్యం వర్షయతి". గాలివలనే మేఘాలు చలించి, ఆనందించి వర్షిస్తాయని తైత్తరోయోపనిషత్ ఆనాడే తీర్మానించింది. ఆవు తోక పట్టుకుని జీవుడు వైతరణిని ఉత్తరిస్తాడన్నది అలా ఉంచితే గోవువెంట వత్సంలాగా నడిచి భారతీయ నాగరికత పరిఢవిల్లింది. మనది "గోసంస్కృతి" – "గోస్తుమాత్రా నవిద్యతే" గోవులకు సమానమైనది ఈ భూమిమీదే లేదు. "అంతకాయోగోఘాతమ్" గోహంతకులను శిక్షించండని యజుర్వేదం వక్కాణించింది. కృష్ణయజుర్వేదం ఒకటో కాండం 7వ పన్నం 10వ అనువాకంలో కొద్దిభాగం మరియు 4వ కాండం, 4వ పన్నంలో కొంతభాగం కలిపి పంచ

సూక్తాలతో ఒకటైన నీలాసూక్తంగా పఠించబడింది. ఇందులో ప్రాణులను రక్షించడమే విధిగాగలది, దక్షిణ దిక్కు నుండి భరతవర్షం పైకి వీచేది అయిన "మాతరిశ్వ" అనే వాయువును స్తుతించారు. విష్ణువు పరిపాలకునిగా కలిగినది అన్న అర్థంలోనే నీలాసూక్తం భూమిని విష్ణుపత్నిగా అభివర్ణించింది.

అశ్వనీ, మరుద్గణాలతో కలసి వర్షాధిపతియైన ఇంద్రుడు సస్యానుకూల వర్షం కురిపించి గోవులను రక్షించాలన్న వర్ణనలు వేదంలో తరచూ వినబడతాయి. సవితగా, పూషగా, సప్తాశ్వరథారూఢునిగా మార్తాండుడు జటిల వ్యాధులను పోగొట్టే దేవతగా ఋగ్వేదం మొదటి మండలంలోనే కొనియాడబడ్డాడు. అందుకే "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అన్న నానుడి పుట్టింది. అపూర్వ శక్తి సమన్వితగా యజ్ఞంలో ఉత్తమ హవిస్సుగా చెప్పబడిన సోమలతకు వర్షఋతువే తల్లి అని అంకురించిన సోమలత వర్షజలంతోనే పెరుగుతుంది అని ఋగ్వేదంలోని 2వ మండలంలో వర్ణనలున్నాయి. ఈ సోమం పృథ్విపై ఓషధీరూపంలోనూ, అంతరిక్షంలో చంద్రుని రూపంలోనూ ఉంటుంది. సోముడు (చంద్ర) సకల భూత స్రష్టగా, పూషుడు (సూర్య) సకల జగద్భర్తగా ఈ మండలంలోనే వర్ణించబడ్డారు. 5వ మండలంలో పృథ్వీని, అంతరిక్షాన్ని కొలవగల మానదండంగా వరుణుడు సూర్యుణ్ణి ఉపయోగించుకున్నాడన్న వర్ణన ఉంది. పండిన దోసపండు మాతృక నుండి ఊడిపడిపోయినట్లుగా మమ్మల్ని మృత్యువు నుండి వేరుచేయమని వేడుకునే మృత్యుంజయ మంత్రం ఋగ్వేదం 7వ మండలంలోనిది. వార్ధక్యాన్ని పోగొట్టే చ్యవన ప్రాశ్యం వర్ణన తరచూ ఋగ్వేదంలో చోటుచేసుకుంటుంది. ఉసిరి, ఆవు నెయ్యితో తయారుచేసే ఈ ఔషధం ప్రకృతి అందించిన కానుక. వశిష్ఠ మహర్షి ఈ మండలంలోనే వర్షాకాలంలో కప్పల విన్యాసాలను వర్ణించాడు. బూడిదరంగు, పసుపురంగు కప్పలు గురువును అనుకరించే శిష్యులవలే అరుస్తూ ఉంటాయని, బ్రాహ్మణులు వ్రతానుష్ఠానంలో గడిపినట్లు సరోవరం అడుగు పొరల్లో గడిపిన వాటికి వర్షధారలు చైతన్యాన్ని కలిగిస్తాయని అన్నాడు. అంతేగాక సోమయజ్ఞంలో బ్రాహ్మణులు మంత్రాలులాగా అన్ని దిక్కులూ ప్రతిధ్వనించేటట్లు ధ్వనులు చేస్తాయని చమత్కరించాడు. నదీ దేవతల రాణి, మంగళకర అశ్వంలాంటిది. సౌందర్యవతి, శుభ్రవస్త్రంవలే దర్శనీయమైనది, ద్యులోకం నుండి, భూమి నుండి, ఆకాశం నుండి బయలుదేరిన సప్తసింధువులలో గొప్పది అయిన సింధూనది వర్ణన 10వ మండలంలో విశేషంగా ఉంటుంది. సోమలత నూరడానికి ఉపయోగించే రాళ్ళుకూడా ఇక్కడ స్తోత్రార్హత పొందాయి. దేవ శునకమైన "సరమ" అనే ఆడకుక్క వర్ణన పశురక్షణలో నాడు వేటకుక్కలను పెంచేవారన్న విషయాన్ని ధృవీకరిస్తున్నది. పురుషసూక్తం ఈ భూమితో పాటు అంతరిక్షంలోని దివ్యపదార్థాలన్నీ పరమాత్మ నుండే ప్రభవించాయని రూఢిచేస్తుంది.

కృష్ణ యజుర్వేదం మొదటికాండ దర్భల్ని దేవకార్యం కోసం కోస్తూ తిరిగి నువ్వు ఎన్నో క్రొత్త శాఖలతో వర్ధిల్లాలి అని అభిమంత్రించి వాటిని మనం స్పృశించాలి అని, ఆ దర్భలతో అల్లేత్రాడు భూదేవి మొలత్రాడని వర్ణనలున్నాయి. రెండవ కాండలో త్వష్ట ప్రజాపతి కుమారుడు విశ్వరూపుడు అసురులకు మేనల్లుడు, దేవతలకు పురోహితుడుగానూ ఉన్నాడు. రహస్యంగా హవిస్సులు అసురులకు అర్పించడంతో కోపించిన ఇంద్రుడు అతడి 3 తలలనూ ఖండించడంతో, సోమపానం చేసిన శిరస్సు కపింజల (కముజుపిట్ట)గా సురాపానం చేసిన శిరస్సు కలవంక (పిచ్చుక)గా, అన్నం తిన్న శిరస్సు తీతువుపిట్టగా పుట్టాయన్న గాథ ఉన్నది. వృక్షాలు తమను మానవులు నరుకుతున్నందున తిరిగి పునర్వైభవం పొందడానికి, భూమి తనను మానవులు ఇబ్బడి ముబ్బడిగా త్రవ్వేస్తున్న కారణంగా తిరిగి పూర్వరూపం పొందాలని ఇంద్రుని బ్రహ్మ హత్యాపాతకాన్ని సైతం స్వీకరించి వరాలు పొందిన విషయం ఈ కాండలో ఉన్నది. ఇక చతుర్థకాండలో ద్యులోకం నుండి వచ్చే వర్ష బిందువుల నుండి శక్తిని గ్రహించిన (ఆపత్సుసర్వభేషజీః) రావి, మోదుగు చెట్లు మానవుల సర్వరోగాలను పోగొట్టగలవు. సర్వ దిక్కులలో నివసించే సర్పాలకు నమస్కారం అంటూ సాగే మంత్రాలున్నాయి. కృష్ణ యజుర్వేదంలో నాల్గవ కాండలో రుద్రాధ్యాయమనే నమక, చమకాలుంటాయి. ఆకులు, అలమలు, అరణ్యాలు, బావులు, చెఱువులు, నదులు, సముద్రాలు పర్వతాలు, పుష్పాలు, సర్వజంతుజాలం, ఈ విశ్వంలోని ప్రతి అణువూ అయిన రుద్రునకు నమస్కరించే అపురూప సన్నివేశం ఇక్కడే ఆవిష్కృతమౌతుంది. వృక్షపతిగా, పశుపతిగా ఈశానుడు ప్రకటించబడ్డాడు. ఇది పురుష సూక్తంలోని భావనకంటే సూక్ష్మంగా ఉంటుంది. తేనె, పాలు ఫలరసాలను మాకు ప్రకృతి ప్రసాదించాలన్న ప్రార్థన

ఉంటుంది. యవలు, తిలలు, మినుములు, పెసలు, గోధుమ, వరివంటి "గ్రామ్యోషధులు", కృషి చెయ్యకుండా పండే కొఱ్ఱులు, వెదురు బియ్యం, చిఱుధాన్యాలవంటి "అరణ్యాలు" మాకు లభించాలని శివునకు మొరపెట్టుకోవడం ఇందులో మనం గమనిస్తాము. 7వ కాండలో ప్రజాపతి శరీరం నుండి నాలుగు వర్ణాల ప్రజతోపాటే వరుసగా మేక, గొఱ్ఱె, గోవు, గుఱ్ఱం పుట్టాయి అని, సత్రయాగం (12 దినాలాచరించేది) సరస్వతీ తీరంలోనే చేయాలని వివరించబడి ఉంది. శుక్ల యజుర్వేదం ప్రథమాధ్యాయం మోదుగుపుల్లతోనే గోవుల మందలను అదిలించడాన్ని ప్రస్తావిస్తే 26వ అధ్యాయం సోమం పర్వత ప్రాంతాల్లో, నదుల సంగమ స్థలాల్లోనూ మేధావుల బుద్ధిలోవలే స్థిరంగా ఉంటుందని చెప్పింది. 36వ అధ్యాయం స్వర్గం, అంతరిక్షం, భూమి, జలం, ఓషధులు, వనస్పతులు, విశ్వేదేవతలు, బ్రహ్మ సర్వం శాంతిగా ఉందురు గాక అని స్వస్తి వాచకం పాడింది. సామవేదంలోని ఉత్తరార్చిక – 5వ అధ్యాయం ఇంద్రుడు వృత్రాసురునితోపాటు 810 మంది అసురులను చంపి సప్త సింధువులను భూమి మీద పాఱించడాన్ని మరోసారి మనోజ్ఞంగా వర్ణించింది. వజ్రాయుధానికి ముడిపదార్థమైన దధీచి కంకాళ సమితిని "శరణ్యావతి" అనే సరస్సులో ఇంద్రుడు గుర్తించడాన్ని ఈ అధ్యాయంలోనే చెప్పారు. తైత్తరీయోపనిషత్తులోని – భృగువల్లినందు "అన్నమ్ బహుకుర్వీత/తద్వ్రతమ్" – ఆహారాన్ని విస్తారంగా ఉత్పత్తి చేయాలి అదే మన తక్షణ కర్తవ్యం అని నిర్దేశించింది. సామవేద సంహిత 13వ అధ్యాయం రోగరహితమైన అన్నాన్ని (ఆహారాన్ని) మాత్రమే మాకు ప్రసాదించు అని సోమాన్ని అభివర్ణిస్తుంది. సామవేద సంహిత ఉత్తరార్చిక 20వ అధ్యాయంలో సింధుద్వీపుడనే ఋషి తల్లులు పిల్లలకు స్తన్యమిచ్చే విధాన పుణ్యజలాలు మమ్మల్ని పోషించాలని, వాయువు మాకు ఆయువును ఆనందాన్ని వృద్ధిపరచాలని ప్రార్థిస్తాడు. (సంధ్యా వందనంలో చదివే మంత్రభాగం).

అథర్వవేదము సూర్యస్నానం మొండి వ్యాధులకు మందుగా చెప్పింది. 21 మహాసర్పజాతులను ప్రథమ కాండలో కొనియాడారు. ఓషధులతో నిండిన మట్టి, శుద్ధజలం వ్రణాలను తగ్గిస్తాయని, జంగిడి చెట్టు నుండి తయారుచేసిన మణి రోగనిరోధకమని అలాంటిదే అయిన "పృశ్నిపర్ణి" మహత్తును ద్వితీయకాండ వర్ణించింది. మోదుగుచెట్టు కలపతో చేసిన "పలాశమణి" ధారణ, అశత్థమణి ధారణ, వరుణమణి, సోమమణిధారణ, రాజయక్ష్మ నివారణ (క్షయ)కు బిల్వమణిధారణ తృతీయకాండలో చర్చించబడింది. శంఖ, అంజన మణులను వర్ణించిన 4వ కాండ, ఎద్దులను పూజించాలని అవి తినే 7 రకాల మేతలు తెలిసిన యజమాని 7 సముద్రాలతో చుట్టి ఉన్న ప్రపంచ జ్ఞానమంతా తెలిసినవానితో సమానమని చెప్పింది. 6వ కాండ జమ్మి, రావి వృక్షాలు కలిసి పెరిగిన చోట "పుంసవనకర్మ" చేయాలని చెప్పింది. రైతు, ధాన్యము, ధాన్యవాహకులు, ధాన్యం తిన్నవారూ అందరూ సుఖంగా ఉండాలని కోరుకున్నది. జమ్మిని కేశసంరక్షణకూ వినియోగించవచ్చని చెప్పింది. "సహదేవి" అనే ఓషధి చతుష్పాద జంతువుల రోగనివారిణిగా ఉపయోగించేవారు. సర్పదష్టులైనవారికి ఉపశమనం కోసం "మధూక"మనే ఓషధిని వినియోగించడాన్ని 7వ కాండ పేర్కొన్నది. సూర్యచంద్రులు ఒకరి తరువాత ఒకరు ఆకాశంలో పసిబిడ్డల్లా పాకుతూ తిరగడంవలనే దివారాత్రులేర్పడుతున్నాయన్న చక్కని వర్ణన ఇక్కడే ఉంటుంది. 9వ కాండ వృషోత్సర్జన ప్రక్రియను విస్తారంగా వర్ణించి ఎద్దుకు ఇంద్రత్వాన్ని అనుగ్రహించింది. అశ్వనీ దేవతల స్తుతితో సర్వజీవులకూ ఆయురారోగ్య మహాభాగ్యం కలగాలని అథర్వవేదం పూర్తవుతుంది. వేదంలో అణువణువూ ప్రకృతితో పెనవేసుకొని ఉంటుంది. ఋగ్వేదంలోని శ్రీసూక్తంలో లక్ష్మీదేవి వనదేవత అయిన బిల్వవృక్షంగా వర్ణించబడింది. ఆమె అంగాలన్నీ పద్మతత్త్వాన్ని కలిగి ఉంటాయి. పద్మవనం ఆమె నివాసం. వంశపారంపర్య వ్యాధుల్ని సైతం పోగొట్టగల ఓషధులు, వనస్పతులను దేవతలుగా స్తుతించడం వేదంలో తరచూ పునరావృతమౌతుంది. భారం మోయగల ఎద్దులు, అక్షయంగా క్షీరమిచ్చే గోవులు, అవి స్వేచ్ఛావిహారం చేసే విశాలమైన పచ్చిక భూములు మాకు ప్రసాదించాలన్న ప్రార్థనలు వేదంలో లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. తమతోపాటు చతుష్పాద జంతువులు, సరీసృపాలు సమస్త జీవావరణం సుఖంగా వర్ధిల్లాలని కోరుకున్న సమూహంగా భారతీయులను సగర్వంగా వేదం విశ్వమానవ వేదికపై ముందు వరుసలో నిలబెట్టింది.

పూషడపు. సుబ్బారావు
అవనిగడ్డ, కృష్ణాజిల్లా. ఫోన్: 810 626 2243.

# పుంస్త్రీ

– నల్లపనేని విజయలక్ష్మి

పురాణేతిహాసాల నుండి కథలను తీసుకొని ఆధునిక దృక్కోణం నుండి వాటిని పునర్మూల్యాంకనం చేయటం, కథల్లోని అవాస్తవిక సంఘటనలను, అసంపూర్ణంగా చెప్పబడ్డ విషయాలను తమదైన సృజనాత్మకతతో వివరించటం అనేకమంది ఆధునిక రచయితలు చేశారు. యస్.యల్. భైరప్ప రచించిన 'పర్వ', వి.యస్. ఖండేకర్ రచించిన 'యయాతి', ఇరావతి కర్వేగారి 'యుగాంత' ఇటువంటివే. ఇదే పద్ధతిలో డాక్టర్ ప్రభాకర్ శిశిలగారు అంబ, భీష్ములకు సంబంధించిన సన్నివేశాలతో కూడిన భారత కథను 'పుంస్త్రీ' అనే పేరుతోనూ, పడవ నడిపే బెస్త కన్య నుండి కురు రాజ్యానికి సుస్థిరతను చేకూర్చిన రాజమాతగా సత్యవతి సాగించిన జీవిత ప్రయాణాన్ని 'మత్స్యగంధి' అనే పేరుతోనూ కన్నడంలో రచించారు. ఈ నవలలను వేలూరి కృష్ణమూర్తి తెలుగులోనికి అనువదించారు. కృష్ణమూర్తిగారు తెలుగు వారైనా వారి జీవితంలో అధికభాగం కన్నడ భాషా వ్యవహారమున్న ప్రదేశాల్లోనే గడిచింది. తెలుగు కన్నడ భాషల్లో సమానమైన ప్రావీణ్యం కలిగి ఉండటం, కన్నడ సాహిత్యాన్ని చదివే అవకాశం దొరకటంతో ఆయన అనేక కన్నడ నవలలు, కథలను తెలుగులోనికి అనువదించారు. ఉద్యోగ విరమణానంతరం డెబ్భైయేళ్ల వయసులో ఆయన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించటం విశేషం.

డా. ప్రభాకర శిశిల కన్నడ సాహిత్యంలో పేరెన్నికగల రచయిత. అర్థశాస్త్ర అధ్యాపకునిగా 28 సంవత్సరాల అనుభవంగల వీరు కన్నడంలో 50కి పైగా అర్థశాస్త్ర గ్రంథాలను, వ్యాసాలను రచించారు. యక్షగాన కుటుంబానికి చెందిన వీరు ఎన్నో యక్షగాన నాటకాలు రచించారు. పర్యటన కథలు, కథాసంకలనాలు, నవలలు రచించడమే కాకుండా సామాజిక, సాంస్కృతిక సంబంధమైన కార్యాలలో కృషి చేశారు. వీరు రచించిన 'పుంస్త్రీ' నవలకు పుట్టరాజ గవాయి ప్రశస్తి లభించింది. ఈ నవల ఇంగ్లీషు, సంస్కృతంతో పాటు పదకొండు భారతీయ భాషల్లోకి అనువాదమవుతున్నది. వీరు రచించిన 'మత్స్యగంధి' నవలకు యక్షగాన అకాడమీ ప్రశస్తి లభించింది. భారత కథను ఆధునిక దృక్కోణం నుండి పునర్మూల్యాంకనం చేసే క్రమంలో రచయిత పుంస్త్రీ నవలలో కొన్ని మార్పులు చేశారు. కొన్ని కల్పనలు చేర్చారు.

సత్యవతితో తన వివాహం జరిపించిన దేవవ్రతునికి శంతనుడు ఇచ్ఛామరణం పొందే వరాన్నిచ్చినట్లుగా భారతంలో చెప్పబడింది. కురుక్షేత్ర యుద్ధంలో నేల కూలిన భీష్ముడు తనను అంపశయ్యపై ఉంచమని కోరినట్లు, ఉత్తరాయణం వచ్చేవరకు వేచి ఉండి ఇచ్ఛామరణాన్ని పొందినట్లు వర్ణించబడింది. శాపాలు, వరాలవంటి అవాస్తవిక అంశాలకు తావు లేకుండా ఆధునిక దృక్కోణం నుండి కథాఘట్టాలను సృజించటానికి ప్రయత్నం చేసిన రచయిత అంపశయ్య గురించి ప్రస్తావించలేదు. భీష్ముడి హృదయంలో నాటుకున్న బాణం పెకలించడానికి వీలు లేని విధంగా గుండెలో లోతుగా నాటుకున్నదని, దానిని బయటకు లాగితే ప్రధాన రక్తనాళం చిట్లి ప్రాణానికే ప్రమాదమని, అలాగే ఉంచితే అపాయం లేదని రాజవైద్యులు చెప్పారని చెప్పటం, తద్వారా భీష్ముడు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు బాణాన్ని పీకివేసి మరణాన్ని పొందగలిగే అవకాశం కలిగినవాడిగా చిత్రించటం ఆయన చేసిన మార్పు. ఈ సందర్భంలోనే మానవులు ఉంటే దీర్ఘాయుష్కులుగా ఉండగలరేమోగాని అమరులుగా ఉండలేరని, చిరంజీవత్వం అనేది కేవలం కల్పనేనని భీష్ముడు, పరశురాముల సంభాషణ ఆధారంగా తేల్చి చెపుతాడు. శంతనుడు గంగ తనను విడిచిపెట్టి వెళ్లిన తరువాత 36 సంవత్సరాలకు పైగా మరే ఇతర స్త్రీని ఆశించకుండా ధర్మబద్ధంగా రాజ్యపాలన చేస్తూ కాలం గడిపాడని వ్యాస భారతంలో చెప్పబడింది. ఆ తరువాత అతడు వేటకు వెళ్లినపుడు గంగానదీ తీరంలో గంగ తిరిగి కనిపించి అతడికి కుమారుని అప్పగించినట్లు చెప్పబడింది. శంతనుడు దేవవ్రతుని ఇంటికి తీసుకొని వెళ్లిన తరువాత

పుత్ర ప్రేమను ఆస్వాదిస్తూ నాలుగు సంవత్సరాలు గడిపాడు. ఆ తరువాత అతడు వనవిహారానికి వెళ్లి సత్యవతిని చూడటం తటస్థించింది. ఈ లెక్కలన్నీ పరిశీలించినపుడు అప్పటికే దేవవ్రతునికి 40 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు తెలుస్తుంది.

శంతనుడు 20 సంవత్సరాల వయస్సులోనే గంగను వరించాడనుకున్నా, వారికి ఎనిమిదిమంది సంతానం కనుక గంగ అతడిని విడిచి వెళ్లేనాటికి అతడు 28 సంవత్సరాల వయస్సులో ఉండి ఉండాలి. ఆ తరువాత 40 సంవత్సరాలు కలుపుకుంటే అతడు సత్యవతిని చూసి మోహించింది 68 సంవత్సరాల వయస్సులో. 40 సంవత్సరాల వయస్సులో ఉన్న కుమారుని వివాహం తలపెట్టకపోగా తన దిగులుకు కారణాన్ని కనుగొనడానికి వచ్చిన కుమారునితో నీకేదైనా ఆపద కలిగితే భరత వంశం విచ్ఛిన్నమైపోతుందనే బాధతో వివాహాన్ని కోరుతున్నానని చెపుతాడు శంతనుడు. ఆ తరువాత దేవవ్రతుడు తన తండ్రి వలచిన కాంత దాశరాజు కుమార్తె అని మంత్రుల ద్వారా తెలుసుకొని, అక్కడకు వెళ్లి దాశరాజు కోరిక మేరకు భీష్మ ప్రతిజ్ఞ చేసి సత్యవతితో శంతనుని వివాహం జరిపిస్తాడు. తనయుడికి తన పట్లగల ప్రేమకు, భక్తికి మెచ్చి శంతనుడు అతడికి ఇచ్ఛా మరణాన్ని వరంగా అనుగ్రహించాడు. రచయిత శంతనుడికి మొదట ప్రతిజ్ఞ విషయం తెలియదని, తెలిశాక చాలా బాధపడ్డాడని, దేవవ్రతుడే సింహాసనానికి ఉత్తరాధికారి కావాలని కోరుకున్నాడని, సత్యవతి నీకంటె ఎక్కువ కాదు అని చెప్పడమేకాక, ప్రతిజ్ఞ చేయడానికి ముందు తననుగాని, సత్యవతినిగాని అడగలేదు కనుక తమ ఆదేశాన్ని అనుసరించి ఇష్టమైనవారిని వివాహం చేసుకొని హస్తినాపుర సామ్రాజ్యానికి వారసుడిని పొందాలని సూచించినట్లుగా మార్పు చేశాడు. కాశీ రాజు తన కుమార్తెలకు స్వయంవరాన్ని ఏర్పరచాడని వేగుల ద్వారా తెలుసుకొన్న భీష్ముడు తన తమ్ముడైన విచిత్రవీర్యుని కోసం ఆ కన్యలను జయించి తీసుకురావడానికి తల్లి అనుమతితో వెళ్లాడు. ఈ ఘట్టంలో కాశీరాజు హస్తినాపుర రాజు విచిత్రవీర్యునికి స్వయంవర ఆహ్వానం పంపక అవమానించాడని ఎక్కడా చెప్పబడలేదు. భీష్ముడు అందరినీ ఓడించి కాశీరాజ పుత్రికలను హస్తినాపురానికి తెచ్చాక అంబ తన మనసులోని మాట చెపుతుంది. ఆమె మాటలనుబట్టి ఆమె, సాళ్వరాజు పరస్పరం ప్రేమించుకున్నారని, స్వయంవరంలో ఆమె సాళ్వరాజును వరించడానికి ఆమె తండ్రి అంగీకరించాడని తెలుస్తుంది. అపుడు సాళ్వరాజు దన్యుడన్న కారణంగా అతడికి స్వయంవరాహ్వానం పంపకుండా కాశీరాజు అవమానించడమన్నది జరగలేదు. ఇది రచయిత చేసిన మార్పు. కాశీరాజు ప్రకటించిన స్వయంవరానికి వెళ్లేనాటికి భీష్ముడు వృద్ధుడు. వ్యాస భారతం ప్రకారం సత్యవతీ శంతనుల వివాహం నాటికి అతడి వయసు 40 ఏళ్లు అయితే సత్యవతికి వెంటవెంటనే చిత్రాంగద, విచిత్రవీర్యులు జన్మించారనుకున్నా, ఆనాటికి అతడు 60 ఏళ్లవాడు. అందుకే భీష్ముని చూడగానే అతడు వృద్ధుడు అనే చింతతో కాశీరాజ పుత్రికలు అక్కడి నుండి తొలగిపోయారని భారతం చెపుతుంది.

*వృద్ధః పరమధర్మాత్మా వలీ పలిత ధారణః*
*కిం కారణ మిహాయతః నిర్లజ్జః భరతర్షభః* (ఆది - 102 అ - శ్లో 8)

వృద్ధుడు, పరమ ధర్మాత్ముడు, నెరసిన జుట్టు కలవాడు, భరతవంశ శ్రేష్ఠుడు లజ్జను విడిచి ఈ స్వయంవరానికి రావడమేమిటి? అని స్వయంవరానికి వచ్చిన ఇతర రాజులు అతడిని అపహసించారని భారతంలో ఉంది. అయితే అంబ, భీష్ముల కథను ప్రధానంగా తీసుకొని పుంస్త్రీ నవలను రచించిన ప్రభాకర్ శిశిల ప్రధానోద్దేశం ఆయా పాత్రల మానసిక సంఘర్షణను, ప్రతిజ్ఞా పాలన పేరిట భీష్ముడు కారణంగా కురు రాజ్యానికి, అంబకు జరిగిన నష్టాన్ని చిత్రించడం కావటంవల్ల తదనుగుణంగా ఆయన కథలో కల్పనలు చేర్చాడు. భారతంలో విచిత్రవీర్యుడు చక్కని రూప పరాక్రమాలు కలవాడని, అతడు అంబిక, అంబాలికలతో ఏడు సంవత్సరాలు యథేచ్ఛగా కామభోగాలను అనుభవించాడని చెప్పబడింది. విచిత్రవీర్యుడు నపుంసకుడని, అతడిని వివాహమాడిన అంబిక, అంబాలికలు అనాఘ్రాత పుష్పాలుగానే మిగిలిపోయారని రచయిత కల్పించాడు. ఈ కల్పన అంబ విచిత్రవీర్యుని తిరస్కరించడానికి ప్రధాన కారణంగా నిలిచింది. సాల్వరాజు తిరస్కరణకు గురయ్యాక కూడా అంబ విచిత్రవీర్యుని గట్టిగా తిరస్కరించడానికి ఇదే కారణమయినట్లుగా రచయిత వర్ణించాడు. పరాక్రమమే పందెంగా పెట్టి పోరాటంలో గెలిచిన రాజకుమారుడికి ముగ్గురు కన్యలను కాశీరాజు ఇవ్వదలచుకున్నట్లుగా వర్ణించడం కూడా రచయిత చేసిన కల్పనే. ఈ కల్పన ఆధారంగానే రచయిత అంబ స్వరాన్ని బలంగా వినిపించగలిగాడు. శౌర్యానికి ప్రతిఫలంగా లభించిన కన్యలను వేరొకరికి కట్టబెట్టడమంటే వారిని వస్తువులవలె ఉపయోగించడమేనని ఆమె భీష్ముని చర్యను ప్రశ్నించింది.

భీష్ముని చర్యను సరైనదిగా ఆమోదిస్తే పరాక్రమవంతులు స్వయంవరాలలో గెలిచి తెచ్చే స్త్రీలను శౌర్యహీనులైన వారికి భోగవస్తువులుగా చేసే అపాయం ఉందని ఆమె ఎత్తి చూపింది. అభిమన్యుడు ద్రోణుడి ఎడమచేతి బొటనవ్రేలిని త్రెంచివేశాడని, ఆ కారణంగానే ద్రోణుడు సరిగ్గా యుద్ధం చేయలేకపోయాడని రచయిత వర్ణించాడు. జయద్రథుని వధ సందర్భంలోనూ సూర్యగ్రహణం వల్లకాక పశ్చిమ దిక్కున కర్పూరపురాశికి మంట పెట్టి దట్టమైన పొగను ఉత్పత్తి చేసి కృత్రిమమైన నల్లని మేఘం సూర్యుడిని కప్పేలా చేసి పాండవులు సూర్యాస్తమయం జరిగిందన్న భ్రమలో కౌరవులను పడేశారని రచయిత కల్పించాడు. కృష్ణుని యుద్ధతంత్ర నైపుణ్యానికి ఒక గొప్ప ఉదాహరణగా ఆ సంఘటనను సృష్టించాడు. ద్రుపదుడు తన రక్తసంబంధానికి చాలా దగ్గరైన ఒక బంధువును వివాహం చేసుకోవడం, అది సగోత్ర వివాహం కూడా కావడంవల్ల శిఖండి అలా జన్మించి ఉండవచ్చని భీష్ముడు భావించినట్లుగా రచయిత చెప్పాడు. తన పత్ని ద్వారా సమర్థుడైన మగ సంతానాన్ని పొందడం అసాధ్యమని భావించి ఆరోగ్యవంతులైన యువతీ యువకులను అతడు దత్తత చేసుకున్నాడని, వారిరువురినీ యజ్ఞం ద్వారా శుద్ధి చేయించి యజ్ఞ సంభవులని చెప్పుకున్నాడని వర్ణించాడు.

గంగాదేవి చిన్న వయసులోనే శంతనుడిని, కుమారుడైన దేవవ్రతుడిని త్యజించి విరక్తురాలై హిమాలయాలకు వెళ్లిపోయిందని రచయిత వర్ణించాడు. కాశీరాజ కుమార్తెల స్వయంవర వేదిక వద్దకు వెళ్లిన భీష్ముడు స్పష్టంగా తన సహోదరునికిచ్చి వివాహం జరిపించడం కోసం వారిని తీసుకువెళుతున్నానని, అభ్యంతరమున్నవారు యుద్ధంలో తనను జయించి వారిని చేపట్టవచ్చునని ప్రకటించాడు. కనుక తమ వివాహం విచిత్రవీర్యునితో జరుగనుందన్న విషయం రాజకుమార్తెలకు ముందే తెలుసు. అయితే వారికి హస్తినావతికి వచ్చిన తరువాత మాత్రమే ఆ విషయం తెలిసినట్లుగా, విచిత్రవీర్యుడిని చూడగానే వారిలో నిరాశానిస్పృహలు కమ్ముకున్నట్లుగా రచయిత వర్ణించాడు. ఏకలవ్యుడు అనే పేరుగల గిరినాయకుని పాత్రను రచయిత కల్పించాడు. 'పైనున్న వారి కాళ్లు పట్టకుండా క్రింది వర్గంవారు బ్రతకడం చాలా కష్టం. అందరూ సమానులు కావాలంటే శాస్త్రకారులు సమానతను ఒక జీవన విలువని అంగీకరించాలి. దానికి తగ్గ శాస్త్రాధార శ్లోకాలను రచించి వాటిని శాస్త్ర గ్రంథాలలో చేర్చాలి. రాజుల ద్వారా అవి అలవాటై పోయి ఆచరణ కావాలి. ధర్మమన్నది శాస్త్రాలలో ఉండదు. ఆచరణలో మాత్రమే ఉంటుంది.'వంటి ఆధునిక భావాలను ఈ పాత్ర ద్వారా పలికించాడు రచయిత. రచయిత చేసిన మార్పులు, కల్పనలన్నీ భారత కథలోని 'అవాస్తవిక' సంఘటనలను తొలగించి భీష్ముడు, అంబల మానసిక సంఘర్షణను ఆవిష్కరించడానికి, సరికొత్త కోణం నుండి భారత కథను అర్థం చేసుకోవడానికి దోహదకారులయ్యాయి.

**భీష్ముడు:**

జీవితకాలమంతా ఇతరులకు నైతిక భూమికగా నిలిచినవాడు, తన అంతరంగాన్ని పంచుకోగలవారు లేక ఒంటరితనపు వెలితిని అనుభవించినవాడు భీష్ముడు. గాయపడి మరణం కోసం ఎదురుచూస్తున్న సమయంలో తన జీవితంలో చోటుచేసుకున్న సంఘటనలను పునరాలోచించుకునే అవకాశం అతడికి లభించింది. ఆ సమయంలో అతడి మనసులో చెలరేగిన భావాలను, అతడు అనుభవించిన మానసిక సంఘర్షణను వర్ణించడం ద్వారా అతడి వ్యక్తిత్వాన్ని పాఠకుల ముందుంచాడు రచయిత. రాజమాత ఆజ్ఞానుసారం కాశీ రాజకుమార్తెల స్వయంవరానికి బయలుదేరిన సమయంలో అతడిలో తాను ప్రతిజ్ఞను నిలుపుకున్న తీరుపట్ల గర్వముంది. తనని తాను రాముడితో పోల్చుకున్నాడు. పితృవాక్య పరిపాలనకు వనవాసం చేసిన రామునికంటె తండ్రి సుఖం కోసం బ్రహ్మచారిగా బ్రతకడానికి, తమ్ముడి సుఖం కోసం స్వయంవర మంటపానికి వెళ్లి శౌర్య ప్రదర్శన చేయడానికి సిద్ధపడ్డ తన త్యాగమే గొప్పదన్న ఆభిజాత్యం అతడిలో కనిపిస్తుంది. అంబ తనను వివాహమాడమని కోరినపుడు సైతం 'దేశాన్ని పాలించేవారు బిడ్డలను పొందకున్నా చింత లేదు. జీవన విలువలను సృష్టించాలి, వాటిని కాపాడాలి.' అని 'అపుత్రస్య గతిర్నాస్తి' అని భావించేవారే నిండి ఉన్నప్పుడు తండ్రికొరకు బ్రహ్మచారిగా ఉండిపోతానని ప్రతిజ్ఞాబద్ధుడిగా ఉండిపోవడం ఎలాంటి విలువవుతుందో ఆలోచించు' అని తనను తాను ఒక గొప్ప విలువను నెలకొల్పుతున్నవాడిగా భావించుకున్నాడు. గుండెలో లోతుగా దిగిన బాణంతో మరణయాతన అనుభవిస్తూ మంచం మీద పడి ఉన్న సమయంలో పూర్వపు సంఘటనలను గుర్తు చేసుకొనే క్రమంలో అతడిలో ఏర్పడిన మానసిక సంఘర్షణ తన అభిప్రాయాలను మార్చుకొనేలా చేసింది. జయద్రథుని మరణవార్తను వినిపించడానికి

దుర్యోధన, దుశ్శాసనులు భీష్మునివద్దకు వచ్చారు. ఆ సమయంలో దుశ్శాసనుడిని చూసిన భీష్ముడికి అన్న చెబితే విషాన్నయినా త్రాగడానికి సిద్ధపడే అతడి భ్రాతృప్రేమ అంధనిష్ఠగా కనిపించింది. అదే సమయంలో తనను తాను తరచి చూసుకొని తండ్రి కోసం తాను చేసిన ప్రతిజ్ఞ కూడా ఒక రకంగా అంధనిష్ఠేనని నిర్ధారణకు వచ్చాడు. తాను చేసిన ప్రతిజ్ఞవల్ల కలిగిన గర్వం అప్పటికి తొలగిపోయి, తన నిర్ణయం / ప్రతిజ్ఞ సరైనది కాకపోవచ్చునన్న ఆలోచన, ఆవేదన అతడిలో చోటుచేసుకున్న తీరును రచయిత చక్కగా వ్యక్తం చేశాడు. రచయిత తన ఆధునిక భావాలను భీష్ముని ఆలోచనల్లో చొప్పించడం కూడా ఈ నవలలో కనిపిస్తుంది. లోకంచేత కొనియాడబడిన శూరులను బిడ్డలుగా కుంతి పొందడానికి కారణం భర్త అనుమతి తీసుకొని ఆమె తనకు ఇష్టమైనవారి ద్వారా బిడ్డలను పొందడమేనని భీష్ముడు భావిస్తాడు. 'పుట్టుకవల్ల శ్రేష్ఠత లభిస్తుందన్నది ఒట్టి భ్రమ.' అని, జాతి వ్యవస్థను మీరి పొందిన సంతానం శ్రేష్ఠంగా ఉంటుందనడానికి పరశురాముడు, వ్యాసుడు, ద్రోణుడు, కర్ణుడు, పాండవులు, తాను సాక్ష్యమని భీష్ముడు భావించినట్లుగా రచయిత కల్పించాడు.

**అంబ:**

అంబిక అంబాలికలు చక్కని వస్త్రాలు, విలువైన ఆభరణాలు ధరించి సింగారించుకోవడంలో ఆసక్తిగలవారుగా, వ్యక్తిత్వం లేనివారుగా ఈ నవలలో కనిపిస్తారు. వారికి భిన్నంగా అంబ క్షత్రియోచితమైన అస్త్రవిద్య, గుర్రపు స్వారి నేర్చుకోవడమే కాకుండా కావ్యాలు, శాస్త్రాలు అధ్యయనం చేసి గొప్ప వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న వనితగా కనిపిస్తుంది. స్వయంవరానికి శౌర్యాన్ని పోటీగా ఉంచడం, ఆ పోటీలో గెలిచినవాడిని చెల్లెళ్లతో కలసి పంచుకోవడం అంబకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఒక క్షత్రియుడు ఎంతమంది పత్నులనైనా పొందవచ్చునని, స్త్రీలకు స్వాతంత్ర్యం ఇవ్వకూడదని, స్త్రీలకు హృదయమే ఉండదని భావించే సమాజంలో ఆమె వేదన అరణ్యరోదనే అయింది. ఉపవనంలోని సరోవరంవద్ద సాళ్వభూపతిని కలుసుకొని అతడితో మాట్లాడి అతడి వ్యక్తిత్వంపట్ల అంబ ఆకర్షితురాలైనట్లుగా రచయిత కల్పించడంవల్ల అటు సాళ్వుని వ్యక్తిత్వం, ఇటు అంబ వ్యక్తిత్వం సువ్యక్తమయ్యాయి. తండ్రికి జరగబోయే హానిని ఊహించి తనను గాంధర్వ వివాహం చేసుకుంటానన్న సాళ్వుని ఆపిన బుద్ధిమంతురాలిగా, హస్తినకు వెళ్లిన తరువాత తన శాస్త్ర పరిజ్ఞానంతో, వాక్చాతుర్యంతో సత్యవతి, భీష్ములను ఒప్పించి సాళ్వునివద్దకు తనను పంపేలా చేసుకొన్న చతురమతిగా అంబ పాత్ర తీర్చిదిద్దబడింది. ఎవరికీ బాధ కలగని రీతిలో పరిస్థితులను చాకచక్యంగా నిభాయించి తనను చేరుకొన్న అంబను అర్థం చేసుకోవడంలో విఫలమైన సాళ్వుడు తన స్వాభిమానాన్ని నెపంగా చూపి ఆమెను తిరస్కరించిన ఘట్టాన్ని, వారిరువురి సంభాషణలను విపులంగా కల్పించిన రచయిత ఆ రెండు పాత్రల పట్ల పాఠకులకు సానుభూతి కల్గించాడు.

హస్తినావతికి సామ్రాజ్ఞి అయ్యే యోగాన్ని తిరస్కరించిన ఆమెకు హస్తినావతి ఆశ్రయంలో జీవించడం అభిమానాన్ని గాయపరిచే విషయం. అందువల్లనే గిరినగరిలో గడిపిన సమయం తన జీవితంలోనే అత్యంత ఆనందంగా గడిపిన సమయం అయినా అక్కడ నిలిచిపోవడానికి ఇష్టపడలేదు. యోగినిగా ఆశ్రమవాసం చేస్తూ శస్త్ర, శాస్త్ర పారంగతురాలు కావాలనే ఆశయంతో పరశురాముని ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలని ప్రయత్నించి భీష్ముని పట్టుదల కారణంగా విఫలమైన పరశురాముని చూశాక అవమానభారంతో, భీష్ముని మీద పగతో ఆమె తన జీవితాన్ని అంతం చేసుకుంది. మరణశయ్యపై ఉన్న వ్యక్తి తన జీవితాన్ని, తన తోటివారి జీవితాన్ని నిష్పక్షపాతంగా బేరీజు వేసుకొని, ఆయా సంఘటనలను, ఆయా వ్యక్తులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసే క్రమం భీష్మునిలో ప్రస్ఫుటమౌతుంది. పరుల నిర్ణయాలకు అనుగుణంగా జీవితాన్ని గడపలేక, తన ఇష్టాన్ని గెలిపించుకునే అవకాశం లేక మరణాన్ని ఆశ్రయించిన అభిమానం అంబలో వ్యక్తమౌతుంది. ఈ రెండు పాత్రల ఆధారంగానే భారత కథను, ముఖ్యంగా కురుక్షేత్ర యుద్ధ స్వరూపాన్ని రచయిత వ్యక్తం చేశాడు. కర్ణుడు అనుభవించిన మానసిక సంఘర్షణను సైతం రచయిత సువ్యక్తం చేశాడు. ఎన్నో ఆధునిక భావాలను కథలో చొప్పించాడు. భారత కథను, భారత పాత్రలను సరికొత్త కోణం నుండి ఈ నవలను తెలుగులోనికి అనుసృజన చేసిన వేలూరి కృష్ణమూర్తి గారు అభినందనీయులు.

డా. నల్లపనేని విజయలక్ష్మి
గుంటూరు. ఫోన్: 970 166 7350.



మోనియర్ విల్లియమ్స్

## ఇండాలజీ - 3
# మోనియర్ విల్లియమ్స్
## (1819-1899)

*- అవధానం రఘుకుమార్*

ఈస్టిండియా కంపెనీ బాంబే గవర్నర్ ప్రాంతంలో తొలి సర్వేయర్ – జనరల్ (అంటే ఆనాటి బాంబే ప్రావిన్సు భౌతిక, భౌగోళిక అంశాలపై పరిశోధించి ప్రభుత్వానికి వార్షిక నివేదికలు, తదితరాలు సమర్పించే సంస్థ)కు తొలి అత్యున్నత అధికారి కల్నల్ మోనియర్ విల్లియమ్స్. ఈస్టిండియా కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించిన తొలి రోజుల నుండే ఈ దేశానికి సంబంధించిన అనేక అంశాలపై ఒక క్రమబద్ధమైన, ప్రణాళికతో కూడిన, భవిష్యత్తులో అధికారం చెలాయించగలను అనే ముందస్తు ఆలోచనలతో అనేక పరిశోధనలు, సర్వేలు, అధ్యయనాలు చేసింది. ఇందులో వ్యక్తిగతంగా కొన్ని జరిగితే, మరికొన్ని కంపెనీ ప్రభుత్వపరంగా మరికొన్ని జరిగాయి. అలాంటి విస్తృత కార్యక్రమంలో భాగంగా బాంబే ప్రావిన్సులో "సర్వేయర్ – జనరల్" అనే విభాగాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఇలాంటి విభాగాల్ని కలకత్తా, మద్రాసు ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేశారు. తొలి బాంబే సర్వేయర్–జనరల్‌గా కల్నల్ మోనియర్ విల్లియమ్స్ అనే వ్యక్తిని నియమించారు. ఈ మోనియర్ విల్లియమ్స్ కొడుకే మోనియర్ మోనియర్ – విల్లియమ్స్.

ఇతను 1819లో బాంబేలో పుట్టాడు. ఈయన పేరు విల్లియమ్స్ – అయితే 1887లో తన పేరుకు ముందు మోనియర్ అనే పదాన్ని కలుపుకుని మోనియర్ – విల్లియమ్స్ అయ్యాడు. మూడేళ్ళ వయస్సులో విద్య కోసం ఇంగ్లాండ్‌కు వెళ్ళాడు. ఆక్సుఫర్డ్‌లోను, ఈస్టిండియా కంపెనీ కాలేజిలోనూ, ఆ పైన ఆక్సుఫర్డ్ యూనివర్సిటీలోను చదువుకున్నాడు. 1884లో హ్యూమానిటీస్‌లో ఆక్సుఫర్డ్ యూనివర్సిటీ నుండి గ్రాడ్యుయేట్ అయ్యాడు. 1899లో 80 ఏళ్ళ వయస్సులో ఫ్రాన్స్‌లో చనిపోయాడు. శ్యామ్ జీ కృష్ణ వర్మ (1857–1930) అనే ఆ కాలపు రెవల్యూషనరీ కూడా విల్లియమ్స్ అసిస్టెంట్‌గా కొంత కాలం పనిచేశారు. తన పూర్వపు ఇండాలజిస్టులు ప్రతిపాదించిన "ఇండో–ఆర్యన్", ''ఆర్యన్''లాంటి పదాలను, నిర్వచనాలను ఈయన సరాసరిగా, ఎలాంటి అనుమానం లేకుండా తీసేసుకున్నారు. ఈయన కూడా ఒక చోట : "గ్రీకు భాషకు సంస్కృతం పెద్ద అక్కయ్యలాంటిది. అంతేకాక గ్రీకు భాషా శాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి పెద్ద మార్గదర్శి. ఒక్క గ్రీకు భాషకే కాదు, అనేక ఆర్య, ఇండో–ఆర్య భాషలకు కూడా ఇది పెద్ద ఆదర్శం. అలాగే తులనాత్మక భాషా శాస్త్రానికి అది తొలి పలుకులాంటిది" అంటాడు. అయితే సంస్కృతాన్ని పెద్దక్క అన్నాడే కానీ, మాతృక అని మాత్రం కాదు. "ఆర్యన్", "ఆర్యన్ జాతి'' ''ఇండో–ఆర్యన్''లాంటి పదాలకు విపరీతమైన ప్రాచుర్యం ఈయన రచనలవల్లే కలిగింది అంటారు.

1844–58ల మధ్య కాలంలో ఈస్ట్ ఇండియా కంపనీ కాలేజిలో "ఆసియా భాషలు" అనే సబ్జక్టుకు అధ్యాపకుడిగా పనిచేశాడు. ఈ "ఈస్ట్ ఇండియా కంపెనీ కాలేజి (లేదా సరళంగా – "ఈస్ట్–ఇండియా కాలేజీ) 1806లో లండన్‌కు దగ్గరలో ప్రారంభించారు. ఈస్టిండియా కంపనీకి కావలసిన అధికారులకు (వీరిని ఆ కాలంలో "రైటర్స్" అని పిలిచేవారు), భారతదేశంలో కంపెనీ పాలనకు అవసరమైన శిక్షణను ఈ కాలేజిలో ఇచ్చేవారు. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం తరువాత ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను బ్రిటిష్ ప్రభుత్వం తీసేసుకోవడం జరిగింది. అందువల్ల ఈ కాలేజీని 1858లో మూసివేశారు. ఈ కాలేజీలోనే మోనియర్ – విల్లియమ్స్ అధ్యాపకుడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో "బోడెన్

ఛైర్ ఆఫ్ సాంస్కృత్" (బోడెన్ అనే పేరుతో సంస్కృత విభాగానికి) ఒక శాఖను, అధిపతిని నిర్ణయించే ప్రక్రియలో 1860లో ఈయన మాక్స్ ముల్లర్‌తో పోటీపడ్డాడు. అంతకు ముందు ఈ స్థానంలో హొరేస్ హేమన్ విల్సన్ అనే వ్యక్తి ఉండేవాడు, ఆయన మరణానంతరం ఈ స్థానాన్ని భర్తీ చేసే ప్రయత్నంలో మాక్స్ ముల్లర్, మోనియర్ విల్లియమ్స్‌లు పోటీ పడినా చివరికి అది మోనియర్ విల్లియమ్స్‌క దక్కింది.

ఈ పదవికి పోటీ కూడా చాలా భయంకరమైన, తీవ్రమైన ఎన్నికల ప్రచారంలా జరిగిందట. అప్పటికే హేమన్ విల్సన్ 1831 ప్రాంతాల నుండి అనేక సంస్కృత గ్రంథాల ప్రతులను తెప్పించి యూనివర్సిటీలో భద్రపరిచాడు. తన వారసుడిగా విల్లియమ్స్‌ని ఆయన మరణానికి ముందే ప్రకటించాడు. మాక్స్ ముల్లర్ నిజానికి విల్లియమ్స్‌కంటే గొప్ప సంస్కృత పండితుడు వేదాలను అధ్యయనం చేయడం ద్వారా సంస్కృత సాహిత్యం, భారతదేశపు సంస్కృతి మీద గొప్ప గౌరవం, ఉదారభావాలు కలిగినవాడు. ముల్లర్‌తో పోల్చుకుంటే విల్లిమయ్స్‌కు అంత గొప్ప అధ్యయనం లేదు. అయితే విల్లియమ్స్‌కి భారతదేశంతో ఎక్కువ పరిచయం ఉంది. ప్రాక్టికల్ 'జ్ఞానం' (అనుభవం, ఆచరణతో కూడిన జ్ఞానం) ఉంది. అంతేకాక ఆయన భారతదేశం, సంస్కృతం పట్ల ముల్లర్ ఉదార వాదనలను వ్యతిరేకించాడు. "ఇంగ్లీషు దేశ ప్రజలు భాషని (సంస్కృతభాష) తాత్వికంగా చదివేంత అవసరం లేనివారు. వారి అవసరం ఆచరణాత్మకం" అని నమ్మేవాడు. ఇవన్నీకాక ఆక్సుఫర్డ్ యూనివర్సిటీలో ఈ సంస్కృత విభాగానికి నిధులకు ఇచ్చే ప్రధాన దాతలు క్రిస్టియన్ ప్రవక్తలు. వారి ఉద్దేశ్యం సంస్కృత భాష అధ్యయనం ద్వారా మత ప్రచారం. నిజానికి మాక్స్‌ముల్లరూ, విల్లియమ్స్ ఇద్దరు కూడా ఆ స్థానం కోసం జరిగిన ప్రచారంలో అదే తమ ఉద్దేశ్యంగా చెప్పుకున్నారు. ఏది ఏమైతేనేం చివరికి మోనియర్-విల్లియమ్స్ ఆ స్థానానికి ఎన్నుకోబడ్డాడు.

అలా యూనివర్సిటిలో బోడెన్ ఛైర్ ఆఫ్ సంస్కృతంకు ఎన్నుకోబడిన తరువాత విల్లియమ్స్ తన ప్రకటనలో ఓరియంటల్ జ్ఞానం ఇండియాను క్రిస్టియన్ మతంలోకి మార్చడం కోసమే అని బాహాటంగానే ప్రకటించాడు. 1877లో విల్లియమ్స్ వ్రాసిన పుస్తకం "హిందూయిజం"లో కూడా ఆయన ప్రధాన ప్రతిపాదన హిందూమతం త్వరలో అంతం అవుతుందనీ, ఇస్లాం ఆ వెలితిని భర్తీ చేసే ప్రయత్నాన్ని అడ్డుకుని, క్రిస్టియన్ ప్రవక్తలు ఆ ప్రయత్నం చేయాలనే ప్రతిపాదన చేశాడు. ఈ పుస్తకాన్ని ప్రచురించింది కూడా - సొసైటీ ఫర్ ప్రమోటింగ్ క్రిస్టియానిటీ అనే సంస్థనే. సౌరభ్ దూబె అనే రచయిత తన "అన్‌టచబుల్ పాస్ట్స్ - రిలిజియన్, ఐడింటిటీ, అండ్ పవర్ అమాంగ్ ఏ సెంట్రల్ - ఇండియన్ కమ్యూనిటీ, (1998) అనే పుస్తకంలో ఈ పుస్తకం గురించి ప్రస్తావిస్తూ - "హిందూయిజం" అనే పదం ఇంగ్లీషు భాషలో సాధారణ పదంగా మారడంలో ఈ పుస్తకం చాలా తోడ్పడింది అని అంటాడు.

విల్లియమ్స్ 1883లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో "ఇండియన్ ఇన్సిట్యూట్" అనే ప్రత్యేక సంస్థను స్థాపించాడు. ఆనాటి "ఇండియన్ సివిల్ సర్వీసెస్ (ఐ.సి.ఎస్)"కు ఇది ప్రధానమైన బోధన, శిక్షణ సంస్థ. ఈ సంస్థ ద్వారా సంస్కృత భాష, భారతీయ సంస్కృతిపై పరిశోధనలు కూడా జరిగాయి. ఈ సంస్థను నిర్మించడానికి, వనరుల కోసం 1875, 1876, 1883లలో ఈయన భారతదేశం కూడా పర్యటించాడు. అనేకమంది భారతదేశపు రాజులు, సంస్థానాలు కూడా దీనికి ఆర్థిక సహాయం చేసినాయి. 1896లో ఈ సంస్థ తన స్వంత భవనాన్ని కూడా సంపాదించుకుంది. కానీ 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఈ సంస్థ మూసివేయబడింది.

హిందూయిజం మీద తన రచనలలో విల్లియమ్స్ ఒక్క అద్వైత సిద్ధాంతం మాత్రమే హిందూ మతాన్ని ఉన్నతంగా ప్రతిబింబిస్తుందని సూచించాడు. హిందూమతంలో అత్యున్నత మోక్ష ప్రతిపాదన కూడా అద్వైతమే అని కూడా అన్నాడు. "కర్మ", "భక్తి"లాంటి హిందూమతంలోని మిగిలిన ఆలోచనా ధోరణులు ఆ మతం యొక్క తక్కువస్థాయి ఆధ్యాత్మిక ప్రతిపాదనలు అన్నాడు. ప్రపంచంలో అన్ని మత, తాత్విక ప్రతిపాదనలు హిందూయిజంలో ఉన్నాయని కూడా అన్నాడు.

ఈయన 1872లో "సంస్కృతం - ఇంగ్లీషు" నిఘంటువున తయారు చేశాడు. తరువాత 1899లో ఎర్నస్ట్ ల్యూమన్, ఇతరులతో కలసి దీన్ని సవరించిన నిఘంటువును కూడా విడుదల చేశారు. 1876లో విల్లియమ్స్‌కు "నైట్ బ్యాచిలర్" లేదా "నైట్ హుడు" అనే స్థాయి ఇవ్వబడింది. 1887లో "నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియా" బిరుదు ఇచ్చారు. ఈయన 1886లో "అమెరికన్ ఫిలోసఫీ సొసైటీ"లో కూడా ఎన్నికైన సభ్యుడు. "రాయల్ ఏసియాటిక్ సొసైటీ" ఉపాధ్యక్షుడు. అనేక బిరుదులు, సన్మానాలు

పొందాడు. ఈయన కాళిదాసు రచనలు – "విక్రమోర్వసి", "శకుంతల"లను ఇంగ్లీషులోకి అనువదించారు. అలాగే అనేక నీతి శాస్త్రాలను, నల-దమయంతి, రామాయణాలను గురించి ఇంగ్లీషు భాషలో "హిందూ లిటరేచర్" (హిందూ సాహిత్యం) అనే పేరుతో విస్తృతంగా వ్రాశాడు. విల్లియమ్స్ అనేక విషయాలపై స్వంత పుస్తకాలు కూడా వ్రాశారు. అందులో (1) ప్రాథమిక సంస్కృత వ్యాకరణం, (2) రోమన్ లిపి సంస్కృత లిపికి ఉన్న సంబంధాలు, (3) భారతీయ జ్ఞానం, (4) హిందూయిజం, (5) ఆధునిక భారతదేశం – భారతీయులు అనే పేరుతో భారతదేశం గురించి ఈయన అనుభవాలు తదితరాలు, (6) బ్రాహ్మణిజం – క్రిస్టియానిటీల తులనాత్మక గ్రంథం... ఇలా ఇంకా చాలా విషయాలపై ఈయన గ్రంథాలు చాలా విరివిగా వ్రాశారు.

"హిందూయిజం" అనే పదాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చిన వ్యక్తి. అలాగే "బ్రాహ్మణిజం" అనే పదం కూడాను. నిజానికి హిందూమతం, హిందూయిజం అనే పదాలను అరబ్ దేశపు వర్తకులు, ఇతరులు వాడినపుడు అది కేవలం సింధూ నదికి ఆవల జీవించేవారు అనే ప్రాదేశిక, భౌగోళికి అర్థంలోనే ఉండేది. ఈ పదం యొక్క తొలి వాడుకలో అది – క్రిస్టియానిటీ, ఇస్లాంలాగా ఒక మతం అన్న అర్థంలో లేదు. నిజానికి భారతదేశంలోని మతాలలో జైన, బౌద్ధ మతాలలాగా "హిందూ మతం" అనే ఆలోచన లేదు. వైదిక, మతాలు, వైదిక మతాలు కానివి అనే భావన కొంతమేరకు ఉంది. దాదాపు ప్రతి సంస్కృత పండితుడు, భారతదేశం గురించి బాగా తెలిసినవారు వాడిన పదం – సనాతన ధర్మం. అయితే విల్లియమ్స్ పుణ్యమా అని "హిందూయిజం" ఒక ఏకీకృత మతంగా, భారతీయులలో అత్యధిక ప్రజల మతంగా నిర్వచింపబడింది. తరువాతి కాలంలో అనేకమంది రచయితలు, మేధావులు– ఇటు వామపక్షాలలోనూ, ఇతర ఆలోచనా ధోరణులలోనూ, ఈ "హిందూయిజం" అనే పదాన్ని ఒక ఏకశిలా సదృశ సమూహంగా నిర్వచించడంలోనూ, విశ్లేషణకు వాడుకోవడంలోనూ కొన్ని లాభాలు, అనేక ఇబ్బందులూ – రెండూ కలిగాయి. అలాగే విల్లియమ్స్ భారతదేశ సామాజిక శాస్త్రానికి, సాంస్కృతిక చర్చలకు, మతపరమైన వివాదాలకు అదనంగా కూర్చిన పదం "బ్రాహ్మనిజం." తరువాతి కాలంలో సాధారణ పదంగా, సామాజిక ఉద్యమాలలో, శాస్త్రాలలో ఈ పదం చర్చకు వస్తోంది. ఇండాలజిస్ట్‌గా విల్లియమ్స్ వేదాలు మినహాయించి మిగతా సంస్కృత సాహిత్యం మీద ఎక్కువగా దృష్టి సారించాడు. ఇండాలజీని చదివే చాలామందికి ఈయన పుస్తకాలు ప్రామాణిక గ్రంథాలు. ఈయన ఒక భాషా నిపుణుడు. చాలా వరకు టెక్ట్స్‌బుక్కు విధానంలో ఈయన రచనలు ఉంటాయి. ఇతను వ్రాసిన పుస్తకాలలో "ఇండియన్ విస్‌డమ్" (భారతీయ జ్ఞానం) చాలా గొప్ప రచన అంటారు. అందులో అనేక సాహిత్య గ్రంథాల నుండి ప్రత్యేక భాగాలను సేకరించి సాధారణ పాఠకుడిని దృష్టిలో ఉంచుకుని వ్రాశారు. అయితే అతని ఆశయాలని, ఉద్దేశాలను ఆయన దాచుకోలేదు. ఆయన శ్రమంతా తన బ్రిటిష్ దేశపు పౌరులకు, ముఖ్యంగా బ్రిటిష్ కంపెనీ, బ్రిటిష్ ప్రభుత్వ అధికారులకు భారతదేశం పట్ల అవగాహన పెంచడం, భారతదేశంలో క్రైస్తవ మిషనరీలకు ఈ జ్ఞానం ఉపయోగపడటం కోసమే ఈ విషయంలో తన అభిప్రాయాలను ఎలాంటి దాపరికం లేకుండా ప్రకటించుకున్నాడు.

''సెంటర్ ఫర్ ఇండిక్ స్టడీస్'' అనే ఒక సంస్థ ఈ మధ్యకాలంలో ఈ బ్రిటిష్ ఇండాలజిస్ట్‌ల సంస్కృత జ్ఞానాన్ని, నైతికతను, వారి అంతర్గత వలసవాద, మతవాద ఆలోచనలను ప్రశ్నిస్తూ కృషి చేస్తోంది. రాజీవ్ మల్హోత్ర తదితరులు దీని వెనకాలి వ్యక్తులు. ఈ మధ్యకాలంలో డా॥ సుబ్రతో రాయ్ ఈ సంస్థ వెబ్‌సైట్‌లో "డిసానెస్టీ ఆఫ్ కాలోనియల్ "స్కాలర్స్" – ది కేస్ ఆఫ్ మోనియర్ విల్లియమ్స్" (జూన్ 8, 2021) – అనే వ్యాసం ఒకటి ప్రచురించారు. అందులో "ఇండాలజీ" అనే సబ్జెక్టు పేరుతో చాలా దుర్మార్గం జరిగింది అంటారు రాయ్. అనేక నిర్హేతుకమైన, అనాలోచితమైన భావనలని ప్రచారం చేశారు అనేది రాయ్ వాదన. ముఖ్యంగా ''ఆర్య'' అనే పదంతో ఈ దేశపు అగ్రవర్ణాలతో యూరోపియన్లకు సంబంధాలను నెలకొల్పి, తద్వారా తమ పాలనకు నైతికతని, చరిత్రను కల్పించుకున్నారనేది కూడా ఇంకో అభియోగం. ఈ ప్రయత్నంలోనే ఇలాంటి ఆర్య, అనార్య అనే పదాలను సృష్టించారనీ, ఇవన్నీ తప్పుల తడకలనీ వీరి వాదన.

ఈ ప్రయత్నంలో భాగంగానే మోనియర్ విల్లియమ్స్‌తో సహా అనేకమంది యూరోపియన్లు – సంస్కృత భాష, వేదాలూ – ఈ రెండు ఇండియాకు బయటి నుంచి వచ్చాయని, అంటే అవి రెండు యూరోపియన్ పుట్టుక కలిగి

ఉన్నాయి అనే భావననూ బలంగా తెరమీదకు తెచ్చారు. నిజానికి 18, 19వ శతాబ్దాలకు ముందు ఇంగ్లీషు నిఘంటువులు తమ పదాలకు గ్రీకు, లాటిన్ మూలాలనే చూపించాయి. కానీ ఆర్యన్, ఇండో-యూరోపియన్ సిద్ధాంతాల ఫలితంగా చాలా ఇంగ్లీషు పదాలకు సంస్కృత మాతృకలను వెదకడం ద్వారా, సంస్కృతం యూరోపియన్ భాషగా, ఆర్యన్లు యూరోపిన్లుగా, భారతదేశానికి వారిని వలసవాదులుగా చిత్రీకరించడం, తద్వారా 19వ శతాబ్దపు భారత్‌పై యూరోప్ ఆధిపత్యానికి చట్టబద్ధను, చారిత్రకతనూ కట్టపెట్టే ప్రక్రియ జరిగింది అనేక ఇండాలజీ వ్యతిరేకుల వాదన.

నిజానికి విల్లియమ్స్ "బోడెన్ ఛైర్"కు సంస్కృత భాష అధ్యాపకుడిగా ఎన్నికయిన తర్వాత 1860లో ఇచ్చిన తొలి ఉపన్యాసపు శీర్షిక కూడా "భారత దేశంలో మిషనరీ కార్యకలాపాలకై సంస్కృత అధ్యయనం." అంటే విల్లియమ్స్ మాటలలో దాపరికం ఏమీ లేదు. ఆ ఉపన్యాస ప్రతికి వ్రాసిన ఫుట్-నోట్సులో కూడా అసలు "బోడెన్ ఛైర్" ఆక్సుఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసింది క్రిస్టియన్ మత ప్రచారానికే అని కూడా వ్రాశాడు. బోడెన్ కూడా రాయల్ ఇండియన్ ఆర్మీలో ఒక కల్నల్ ర్యాంకు అధికారి. ఇతను కూడా యూనివర్సిటీకి ఆర్థిక సహాయం చేస్తూ ఈ "ఛైర్"ను ఏర్పాటు చేసినపుడు ఈ ఉద్దేశ్యాన్ని తన వీలునామాలో స్పష్టంగానే చెప్పాడు అంటారు.

ఇంతకు ముందు మనం ప్రస్తావించిన "సెంటర్ ఫర్ ఇండిక్ స్టడీస్"వారు, రాజీవ్ మల్హోత్ర, సుబ్రతోరాయ్‌లాంటి వారేకాక, గతంలో ఇండాలజీ రెండవ భాగంలో పేర్కొన్న కోన్రాడ్ ఎల్స్ట్‌లాంటివారు కూడా - ఈ "ఆర్య" అనే పదం "జాతి"ని సూచించే అర్థంలో సంస్కతృతంలో వాడినట్టుగా దాఖలాలు లేవని అంటారు. అయితే - మార్క్సిస్ట్, అంబేద్కరైట్, తదితర వామపక్ష, ఉదారవాద మేధావులు ఇండాలజీ, ముఖ్యంగా విల్లియమ్స్‌లాంటివాళ్ళు 'విస్తృతంగా వాడుకలోనికి తెచ్చిన - ''ఆర్య'', ''ఇండో-ఆర్యన్,'' "హిందూయిజం," ''బ్రాహ్మనిజం''లాంటి పదాలని తమ వాదనలలో బలంగా వినిపిస్తారు. ఇప్పటికీ రెండు వర్గాల నుండి ఈ చర్చ చాలా తీవ్రంగానే నడుస్తోంది. రెండు వర్గాలు తమ వాదనలకు తమకు అందుబాటులో ఉన్న చారిత్రక, జీవ-జన్య శాస్త్రపరమైన సాక్ష్యాలను ముందుకు తీసుకొస్తున్నారు. బహుశః ఈ చర్చకి సమీప భవిష్యత్తులో ఒక పరిష్కారం లభిస్తుందా అనేది కూడా ప్రశ్నార్థకమే.

విల్లియమ్స్ తను రూపొందించిన సంస్కృత నిఘంటువులో ఈ "ఆర్య" అనే పదానికి చాలా అర్థాలు ఇచ్చారని చెబుతారు. ఒకచోట ఈ పదానికి ఋగ్వేదంలో మూలాలు ఉన్నట్లు విల్లియమ్స్ తన నిఘంటువులో పేర్కొన్నాడు. విమర్శకులు ఋగ్వేదంలో అలాంటి పద ప్రయోగం లేదూ అని వాదిస్తున్నారు. వీరి వాదనలో అది ఇంగ్లీషు-జర్మన్ భాషల వక్రీకరణ. "ఇరాన్" అనే పదాన్ని కూడా "ఆర్యన్" అనే మూల పదపు భ్రంశ రూపంగా విల్లియమ్స్‌లాంటి యూరోపియన్స్ నిఘంటువులో పేర్కొన్నారు. ఇలాంటి అనేక పదాలను ఈ మధ్యకాలంలో ప్రశ్నిస్తూ కొంతమంది హిందూ స్కాలర్స్ అనేక చర్చలను లేవదీస్తున్నారు

పైన పేర్కొన అంశాల ఆధారంగా మనకు అర్థం అయ్యేది ఏమిటి? ఇండాలజీ యొక్క తొలి దశలో అనేక మంది యూరోపియన్ మేధావులు సంస్కృత భాషని అధ్యయనం చేసిన మాట వాస్తవమే కానీ ఆ అధ్యయనం కేవలం భాషపట్ల, లేదా భారతదేశపు సంస్కృతిపట్ల అభిమానంతో మాత్రమే కాదు. ఈ తొలి ఇండాలజిస్ట్‌లలో భాషా శాస్త్రజ్ఞులు, ఫిలాలజిస్టులు ప్రముఖంగానే ఉన్నా ఇవి ఎక్కువగా యూరోపియన్ క్రిస్టియన్ మిషనరీల ఆశయాలకు అనుగుణంగా, వారి ప్రచార అవసరాలకు అనుకూలంగానే జరిగాయి. ముఖ్యంగా మోనియర్-విల్లియమ్స్, మాక్సు ముల్లర్‌లు ఆక్సుఫర్డ్ విశ్వ విద్యాలయపు "బోడెన్ ఛైర్" కోసం పడిన పోటీలోనూ, ఆ తరువాతి వారి ప్రకటనలలోనూ అదే ప్రముఖంగా కనబడుతోంది. అయితే వారి ప్రయత్న ఫలితాలు తరువాతి దశలలో ప్రపంచ వ్యాప్తంగా సంస్కృత భాషాధ్యయనానికి, భారతీయ వేద, ఉపనిషద్, బుద్ధిస్ట్, జైన్, ఇతర సాహిత్యాల అధ్యయనానికి చాలా ఉపయోగపడ్డాయి. వారి ఉద్దేశ్యం ఏదైనా ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది జ్ఞానులకు భారతదేశం గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకతను, ప్రేరణనూ కలిగించడంలో విల్లియమ్స్ జోన్స్, మోనియర్ విల్లియమ్స్, మాక్సు ముల్లర్‌ల పాత్రను కాదనలేము.

డా. అవధానం రఘుకుమార్
హైదరాబాద్. ఫోన్: 944 101 5709.




మొరవపల్లి వెంకటరమణారెడ్డి

# శాస్త్రవేత్తలు

*- నాగసూరి వేణుగోపాల్*

## డా. ఎం.వి. రెడ్డి

కరువు జిల్లా అనంతపురం శాస్త్రవేత్త భారతమాతకు అక్షయపాత్ర ఇవ్వటమా? ఇది ఆశ్చర్యంగా ఉంది కదూ! కానీ 'సాంబ మసూరి' వరి సృష్టికర్త డా. ఎం.వి. రెడ్డి గురించి తెలుసుకుంటే, అలా వ్యాఖ్యానించక తప్పడం లేదు! మెతుకు చిమిడిపోకుండా, మల్లెపువ్వులా విప్పారే సాంబ మసూరి వరి అన్నం రుచికి రుచి, దిగుబడికి దిగుబడి! 2014 ఏప్రిల్ 23న తన 85వ ఏట బెంగుళూరులో చికిత్స పొందుతూ కనుమూసిన మొరవపల్లి వెంకటరమణారెడ్డి సాధించిన పరిశోధనా విజయాలు విశేషమైనవి. బి.పి.టి. 5204 రకమంటే చాలామందికి అర్థం కాకపోవచ్చు కానీ, సాంబమసూరి, కర్నూలు సోనా, సోనామసూరి, జీలకర్ర మసూరి... ఇలా మన తెలుగు రాష్ట్రాలలో పిలువబడేది, ఇంకా తమిళనాడులో 'సీరాకపొన్నీ', ఉత్తర భారతదేశంలో 'ఆంధ్ర మసూరి'గా ప్రచారంలో ఉండేది ఒకే వరి రకం... అయితే, పేర్లు మాత్రం వేర్వేరు!

మీకు 'నెంబర్ల వరి' పేరు గుర్తుందా? 1964కు పూర్వం ఈ వరి రకం బహుళ ప్రజాదరణలో ఉండేది. 'సాంబా' వరి అనే ఈ రకం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో బాగా పండేది. దీన్ని సాంకేతికంగా జి.ఇ.బి-24 అని పిలిచేవారు. బియ్యం బాగా నాణ్యంగా ఉన్నా, దిగుబడి తక్కువ! మొక్కకాండంలో దృఢత్వం లేకపోవడంవల్ల మొక్క పొలంలో పడిపోయి ఉండేది. అయితే అన్నం బాగా ఒదిగి కంటికి యింపుగా ఉండేది! మార్కెట్లో గిరాకీ ఎక్కువ. అయితే పంట పండిస్తున్న రైతుకు నష్టం వచ్చేది.

1967లో బాపట్ల వ్యవసాయ కళాశాల 'మసూరి' వరి రకం ప్రవేశపెట్టింది. ధాన్యం నాణ్యంగా ఉండి, కంకి దృఢంగా ఉండి దిగుబడి అధికంగా ఉండేది. మార్కెట్లో గిరాకీ ఉండడంవల్ల దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే 'మసూరి' కూడా 'సాంబా' రకంలాగా పంటకు కోతలు వచ్చే సమయంలో నేలపై వాలిపోవడంవల్ల అపారనష్టం కలిగేది. మరీ ముఖ్యంగా అక్టోబరు - నవంబరు నెలల్లో వచ్చే ఈశాన్య ఋతుపవనాల వర్షానికి గింజ కంకి పైననే మొలకెత్తి 50 నుంచి 90 శాతం నష్టం కలిగేది. రైతులకు లాభదాయకం కాకపోయినా, ఆరగించే వారి ఆదరణ తగ్గలేదు.

దీనికి కొంచెం ముందు అంటే 1964లో మనీలా (ఫిలిప్పైన్సు)లోని అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానం ద్వారా కొత్త వరి వంగడం మనదేశంలో ప్రవేశించింది. మన వాతావరణానికి అనువుగా ఉండి, ఎక్కువ దిగుబడినిచ్చే ఈ వరి ముతకగా ఉండి ముద్దగట్టేది. అంతేకాక చీడపీడలకు తట్టుకునే రకం కాదు ఇది. కానీ, కాండం దృఢంగా, పొట్టిగా ఉండి, మొక్క వాలేది కాదు. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులో నిటారుగా ఉండి, ఒక ఆకు నీడ మరో ఆకు మీద పడకుండా అధిక స్థాయిలో కిరణజన్య సంయోగక్రియ సాధ్యమయ్యేది. ఏ రుతువులోనైనా 125 -135 రోజుల్లో పంట చేతికి వచ్చేది. ఈ రకం పేరు తైచింగ్ నేటివ్ -1.

ఈ మూడు రకాల వరి వంగడాలను గమనించండి. వీటిల్లో ఏఏ గుణాలు మనకు ఆదర్శ పాత్రమవుతున్నాయి? 'సాంబ' వరి రకంలో గింజ నాణ్యత, వంటకు పనికి వచ్చే గుణాలు, కంకి పైననే తడిస్తే మొలకెత్తని లక్షణాలు, అలాగే 'మసూరి' రకంలో కంకిలో గింజల చిక్కటితనం, మొక్క నిర్మాణం, ఎక్కువ దిగుబడి, ఋతుప్రభావం స్వల్పంగా ఉండటంవంటి ధర్మాలను ఒకే రకం వరిలో సాధించగలిగితే ఎలా ఉంటుంది?? దివ్యంగా ఉంటుంది!!! ఎక్కువ

దిగుబడినిచ్చే గుణం, గింజ నాణ్యత ఇంకా తైచింగ్ నేటివ్ - 1 రకం సుగుణాలు- మూడింటిలోని మంచిధర్మాలను కలిపి పటిష్టమైన కొత్తరకం సృష్టిస్తే..? అలా ఆలోచించగలగడమే భావుకత! సాధించగలగడమే పరిశోధన!!

అలా తయారైన రకమే బి.పి.టి. 5204 !!! అలా అంటే అర్థం కాకపోవచ్చు. కానీ.. సాంబ మసూరి, కర్నూలు సోన, సోన మసూరి, జీలకర మసూరి... బయటి ప్రపంచానికి ఆంధ్ర మసూరి అంటే సులువుగా తెలుస్తుంది. సాంబ మసూరి బియ్యం చాలా నాజూకుగా, నిగనిగలాడుతూ, బాగా ఉడికి తెల్లగా ఉండి, కంటికింపుగా, నాలుకకు రుచిగా ఉంటుంది. దిగుబడికి దిగుబడి, ధరకు ధర ఉండటంతో రైతులు కూడా ఈ సాంబ మసూరి వేయాలని యిష్టపడేవారు. ఈ సాంబ మసూరి వరి వంగడానికి ఆధారభూతమైన సాంబ, మసూరి, తైచింగ్ నేటివ్ -1 అనే రకాలు నేడు కాలగర్భంలో కలిసిపోయాయి. సాంబ మసూరి మాత్రం యింటా, బయటా ఆదరణ పాత్రమై విదేశీ మారకద్రవ్యంతోపాటు మన దేశానికి పేరు ప్రతిష్ఠలు సాధించి పెట్టింది. మరి ఈ పరిశోధన సాధించిన మేధావి ఎవరు? ఏ వ్యవసాయ శాస్త్రవేత్త మేధస్సు నుండి ఈ సాంబ మసూరి పొంగి వచ్చిందో తెలుసా? ఆ ప్రతిభావంతుడు, ప్రజాధురీణుడు - డా. మొరవపల్లి వెంకటరమణా రెడ్డిగారు!

డా. యం.వి. రెడ్డిగా ప్రఖ్యాతులై 'సాంబ మసూరి' వరి రకానికి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు సాధించి పెట్టారు. ఈ వ్యవసాయ శాస్త్రవేత బోధన చేస్తూనే, దేశంలోని అత్యుత్తమ పరిశోధన సాగించడం, మంచి ఫలితం సాధించడం.. ఒక్క డా. యం.వి. రెడ్డి గారికే సాధ్యమయింది. అలాగే బోధన, పరిశోధనల్లో అద్భుత ఫలితాలు సాధించి కళాశాల నిర్వహణలో కూడా గణనీయమైన చాతుర్యం ప్రదర్శించి, విజయం పొందడం చిన్న విషయం కాదు. తిరుమల దగ్గర ఉండే అలిపిరిలో



వరి సమృద్ధి పంట

పొద్దుతిరుగుడు పువ్వు, వేరుశెనగ మీద పరిశోధన సాగించిన పరిశోధనా కృషీవలుడు కూడా డా. యం.వి.రెడ్డి గారే!

డా. యం.వి. రెడ్డి అనంతపురం జిల్లా తనకల్లు మండలం ఎద్దులవాడ్ల పల్లిలో 1929 అక్టోబరు 3న జన్మించారు. తండ్రి నంది రెడ్డి, తల్లి లక్ష్మమ్మ. వీరికి నలుగురు సంతానం. డాక్టర్ ఎం.వి. రెడ్డికి ఇద్దరు అన్నలు, ఒక అక్క. వారి విద్యాభ్యాసం మొలకల చెరువు, మదనపల్లి (చిత్తూరు జిల్లా) పాఠశాలల్లో సాగింది. 1954లో బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి బి.ఎస్సీ. (అగ్రి) పట్టా పొందారు. అది కూడా ఉత్తమ శ్రేణిలో మొదటి ర్యాంకు. 1955లో అదే కళాశాలలో అసిస్టెంటు లెక్చరర్గా చేరి 1958లో ఎం.ఎస్.సి. సాధించారు. 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడింది. యుఎస్ ఎయిడ్ కార్యక్రమం క్రింద అమెరికాలో కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీలో డా. రెడ్డి 1967లో డాక్టరేటు పట్టా పొందారు. ప్రఖ్యాత బ్రీడర్ (గోధుమలు) డా. ఇ.జి. హైనీగారి నేతృత్వంలో పరిశోధన ప్రారంభించారు. వారి పరిశోధన అంశం "ప్లాంట్ బ్రీడింగ్ మరియు జెనెటిక్స్". డా. ఇ.జి. హైనీ దగ్గర పరిశోధన చేయడం గొప్ప అదృష్టమంటారు. డా. హైనీలాగా తను కూడా భారతదేశం వచ్చాక కొత్తరకాల వంగడాలు సాధించాలని రెడ్డి కలలు కనేవారు. ఒక విశిష్టమైన విజయం వెనుక ఒక అపురూపమైన తపన ఉంటుంది! 1975లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులయ్యారు. అదనంగా ఐసిఎఆర్ వారి డైరక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ సంస్థ డైరక్టరుగా కూడా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్రిసాట్ - ఎపియు రాక్ ఫెల్లర్ కార్యక్రమం క్రింద వివిధ దేశాల్లో శెనగ పరిశోధనా స్థానాలు సందర్శించారు. తదుపరి బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ కూడా అయ్యారు. 1983లో తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు.

1988లో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరక్టరుగా పదవీ బాధ్యతలు చేపట్టి ప్రొద్దుతిరుగుడులో ఎ.పి.యస్. హెచ్-11, వేరుశనగలో బిపిటి 1 రకం కూడ సృష్టించారు. 1989లో పదవీ విరమణ చేశారు. దాదాపు 34 సంవత్సరాల పాటు బోధనా, పరిశోధనా రంగాల్లో రాణించి 1989 తర్వాత బెంగళూరులోని ఒక ప్రయివేటు కంపెనీలో హైబ్రిడ్ విత్తన బ్రీడర్గా 1994 దాకా పనిచేశారు. వ్యవసాయ

విశ్వవిద్యాలయంలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్ పీరియన్స్ (ఆర్.ఎ.డబ్ల్యు.ఇ.) రూపకల్పనలో ప్రధానపాత్ర పోషించారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తనకు తండ్రి యం. నందిరెడ్డి స్ఫూర్తి కల్గించారని సగర్వంగా చెప్పేవారు డా. రెడ్డి. ఎనభైయ్యేళ్ళ ముది వయస్సులో కూడా తన తండ్రి కపిల తోలి, చేనుకు నీరుపెట్టేవారని రెడ్డి ఆనందంగా చెప్పేవారు. తండ్రిగారి వ్యవసాయశైలిని చాలా జాగ్రత్తగా అధ్యయనం చేశారు. తల్లి లక్ష్మమ్మ చక్కని క్రమశిక్షణతో పెంచింది. తల్లిదండ్రుల చేయూతతో తనకు ఒక విశిష్టమైన ఆలోచనాశైలి అబ్బిందని రెడ్డిగారంటారు. అలాగే విద్యాభ్యాసం మదనపల్లి బీసెంట్ థియోసాఫికల్ హైస్కూలులో సాగడంవల్ల ఉత్తమ విలువలతో కూడిన వ్యక్తిత్వం తనకు కల్గిందని భావిస్తారు. తన విషయాలన్నిటా తన అర్ధాంగి, హోమియో వైద్యురాలు డా. ఎం. అన్నపూర్ణగారి చల్లని హస్తముందంటారు.

2008లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఉత్తమ వ్యవసాయ శాస్త్రవేత్త పురస్కారంతో గౌరవించింది. ఇంకా ఉత్తమ అధ్యాపకుడు, ముఖ్యమంత్రి బంగారు పతకంవంటివి కూడా చాలా లభించాయి. ఆ పరిశోధన ఈ రెండు వాక్యాలు రాసినంత సులువు కాదు. ప్రతి దశలో, కొన్ని వందలు వేలు సంఖ్యలో ప్రతి మొక్కనూ వరి పొలంలో పరిశీలించి, వాటిలో మన లక్ష్యానికి దగ్గరగా ఉండే కొన్ని మొక్కలను ఎంపిక చేసి, వాటి సంతతిని వివిధ దశలలో నిశితంగా పరిశీలించి, స్వచ్ఛమైన సంతతిని ఎంపిక చేసి ఏడెనిమిది సంవత్సరాల అవిరామకృషి ఫలితంగా 'సాంబ మసూరి' వంగడం సాధ్యమైంది! 1986లో వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వరి పండించేందుకు ప్రోత్సహించింది. 1988లో సెంట్రల్ రిలీజ్ కమిటి ద్వారా దేశమంతటా విడుదలై సంచలనం సృష్టించింది, ఆదరణపాత్రమైంది. సోనామసూరి వరిరకాన్ని రూపొందించి ఆకలి తీర్చిన డా. ఎం.వి. రెడ్డి మొక్కల మధ్యనే కాకుండా మనుషుల మధ్యన కూడా తెగుళ్ళు నశింపచేసిన ప్రతిభాశాలి! వారు బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల మధ్య వుండే కులవైషమ్యాలను నిర్మూలించి, విద్యాపరంగా కూడా మంచి ఫలితాల దిగుబడి సాధించిన ధీశాలి కూడా!

## సైన్స్... బోధకుడు, పరిశోధకుడు, పరిపాలకుడు, పరివ్యాపకుడు

# డా. బి. ఆర్. రావు

డా. బి.ఆర్. రావు గారి పూర్తి పేరు బెర్రి రామచంద్రరావు. ఆయన పేరెన్నికగన్న భౌతిక శాస్త్రవేత్త. బోధన, పరిశోధనలలో రాణించడం విశేషం కాకపోవచ్చు. ఆయన విద్యారంగ పరిపాలనా రంగంలో కూడా విశేషంగా సేవలందించారు. రాజ్యసభ సభ్యులుగా కూడా ఉన్నారు.

డా. రావు 1922 నవంబరు 21న విశాఖపట్నం జిల్లా యలమంచిలి గ్రామంలో జన్మించారు. తీరంతో జీవితం ముడిపడిన సత్యనారాయణ, సుభద్రమ్మ దంపతులకు రెండో సంతానం ఆయన గొప్పగా పేరుగాంచడం గర్వకారణం. విశాఖపట్నం మిసెస్ ఏవియన్ హైస్కూలులోనూ, తర్వాత అదే సంస్థ కళాశాలలో చదివారు. ఈ కళాశాలలోనే సి.వి. రామన్ చదవడం విశేషం. సి.వి. రామన్‌వద్ద పరిశోధన చేసిన సూరిభగవంతానికి పరిశోధనలో శిష్యుడు బి.ఆర్. రావు! 1941లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బి.ఎస్సీ ఆనర్స్ పట్టా పొందిన తర్వాత 1944-45లో ఎం.ఎస్సీ (భౌతిక శాస్త్రం) పూర్తి చేశారు. ఆయన చేసిన కృషికి మెట్కాఫ్ మెడల్ లభించింది. పిమ్మట డా. సూరిభగవంతం గారి వద్ద అతిధ్వనులు (అల్ట్రాసానిక్స్) ప్రధాన అంశంగా పరిశోధన ప్రారంభించారు.


బెర్రి రామచంద్రరావు

ఎక్కువ పౌనః పున్యంగల అతిధ్వని తరంగాల కాంతి వివర్తనం - అనే అంశంతో 1948లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డి.ఎస్సీ. పొందారు. డి.ఎస్సీతో ఆయన అతిధ్వనుల పరిశోధన ఆగలేదు, కొనసాగింది. ఆ విభాగంలో చాలా ఉపయోగకరమైన కొత్త విధానాలను, పరికరాలను డా. బి.ఆర్. రావు రూపొందించారు. ఎం.ఎస్సీ కాగానే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డెమాన్‌స్ట్రేటర్‌గా చేరి మూడేళ్ళకు సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్ అయ్యారు. 1950లో ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి, 1953 రీడర్, 1958లో

ప్రొఫెసర్ అయ్యారు. 1951లో తొలి కామన్వెల్త్ సీనియర్ రీసెర్చి ఫెలోగా ఆస్ట్రేలియాలో ప్రొఫెసర్ డి.ఎఫ్. మార్టిన్ దగ్గర 'అయనోస్పియరిక్ స్పేస్ ఫిజిక్సు'లో పరిశోధన చేశారు. ఇది ఆయనకు పెద్ద మలుపు. ఈ రంగంలో భారతదేశంలో ఎంతో కృషి చేసిన డా. ఎస్.కె. మిత్రాతో పరిశోధనా పరిచయం కలిగింది. ఈ విభాగంలో డా. బి.ఆర్. రావు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూపొందించిన ప్రయోగశాల అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. అక్కడ ఆ స్థాయి వనరులూ, నైపుణ్యం ఒనగూడాయి.

కేవలం పరిశోధన మాత్రమేకాక, ఏక కాలంలో బోధన గురించి కూడా ఎంతో దృష్టి పెట్టారు. స్నాతకోత్తర కోర్సులు రూపొందించి, భవిష్యత్ పరిశోధనలకు బాటలు వేశారు. అవసరమైన పాఠ్య ప్రణాళికనే కాదు. పాఠ్య పుస్తకాలను కూడా వెలువరించారు. 'ఫిజిక్స్ ఆఫ్ సాలిడ్ స్టేట్' అనే పుస్తకం ఎంతో గౌరవాన్ని పొందింది. అమెరికాకు చెందిన అకడమిక్ ప్రెస్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. వీరి నేతృత్వంలో కాంతి, అతిధ్వనుల వివర్తనం, ఘన పదార్థాల స్థితి స్థాపకతా స్థిరాంకాలు, ద్రవ పదార్థాల్లో అతిధ్వనుల వేగం, విక్షేపణ, శోషణంవంటివీ, పాలిమర్ల విద్యుత్ విశ్లేషణలు మొదలైన అంశాలకు సంబంధించి ఎంతో పరిశోధన వీరి నేతృత్వంలో జరిగింది. వీటికి సంబంధించి 100కు పైగా పరిశోధనా పత్రాలున్నాయి. ఎన్నో పిహెచ్‌డిలకు నిర్దేశకత్వం వహించారు.

ట్రాన్సిస్టర్‌లో విసరణం (డిఫ్యూసన్) మొదలైన పరామితులను కొలవడానికి చాలా సరళమైన, మెరుగయిన విధానాలు రూపొందించారు. అతిధ్వనుల వేగాన్ని, శోషణాన్ని అధ్యయనం చేయడానికి కొత్త విధానం ఏర్పరచారు. అలాగే ద్రవ, వాయు పదార్థాల్లో అతి ధ్వనుల ఉష్ణోగ్రత తేడాలను విశ్లేషించారు. సూర్యునిలోని మచ్చలకు సంబంధించిన శోధన చేశారు. హారిజాంటల్ అయనోస్పియరిక్ గాలులు సంబంధించి కూడా ఎంతో కృషి చేశారు.

ప్రణాళిక, పరిశోధన, ఫలితాల ప్రకటన, నూతన పరికరాల రూపకల్పన ఒకవైపు సాగగా, మరోవైపు బోధన, పాఠ్య ప్రణాళిక, పాఠ్యపుస్తకాల ప్రయోగశాలల ఏర్పాటు ఇంకోవైపు ఉన్నాయి. ఈ రెండుకాక పరిశోధనకు సంబంధించి మరింత పై స్థాయిలో కృషి చేశారు. అందువల్లనే 1971లో ఆప్టికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రారంభమైంది. ఈ సంస్థకు అనుబంధంగా మూడు నెలలకోసారి 'ది జర్నల్ ఆఫ్ ది ఆప్టికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' ప్రచురణను ప్రారంభించారు. 1972లో ఇండియన్ ఫిజికల్ సొసైటీ విశాఖపట్నం శాఖను ప్రారంభించారు. 1977-'80 కాలంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఉన్నారు. 1982లో తిరుపతిలో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షులు. అమెరికా, స్పెయిన్, బ్రెజిల్, మలేషియా, జపాన్ మొదలైన ఎన్నో దేశాలను పరిశోధన నిమిత్తం పర్యటించిన డా. బి.ఆర్.రావు ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రేడియో సైన్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు.

1974-76 కాలంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఉపాధ్యక్షులుగా ఎన్నో ఉపయుక్తమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితంగా విశ్వవిద్యాలయాల్లో యూనివర్సిటీ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్లు ఏర్పడ్డాయి. వీటిని సమన్వయం చేయడానికి ముంబయి, బెంగుళూరులలో ప్రాంతీయ కేంద్రాలు కూడా కలిశాయి. సైన్స్ విద్య ఆధునికీకరణకూ, విశ్వవిద్యాలయాలు- కళాశాలల మధ్య అంతరాలు తగ్గడానికీ వీరు చాలా కృషి చేశారు. విశ్వవిద్యాలయాల్లో కంప్యూటర్లు వీరి హయాంలోనే ప్రవేశించాయి. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడానికి అవార్డులు ప్రారంభించారు. ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటు కావాలని ఎంతో తాపత్రయపడి, శ్రీ పి.వి. నరసింహారావు ప్రధానిగా, శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో విశేష కృషి చేసి సాధించారు.

1976-83 కాలంలో రాజ్యసభ సభ్యులుగా ఉన్న వీరు ఒక్క భౌతిక శాస్త్రంలోనే కాకుండా వ్యవసాయం, ఆరోగ్యం, జీవశాస్త్రంవంటి ఇతర రంగాలతో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉన్నారు. వీరు జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులు కావడం అప్పట్లో చర్చనీయాంశమైంది. 2005 సెప్టెంబరు 24న కీర్తిశేషులైనా - వీరి కృషీ, పట్టుదలా, విజయాలు... అపూర్వం, అజరామరం!

డా. నాగసూరి వేణుగోపాల్, హైదరాబాద్. ఫోన్: 944 073 2392.

# బొబ్బిలి రాజుల తొలి రాజధాని
# రాజాం

– *గార రంగనాథం*

తాండ్ర పాపారాయుడి పౌరుషానికి ఆలవాలమైన రాజాం, బొబ్బిలి రాజుల తొలి రాజధాని. రాజాంలో కోట కట్టుకుని, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, ఆ కోట నుండి కొన్నాళ్ళు పాలించిన తరువాత ప్రత్యేక కారణాలవలన వారు బొబ్బిలిలో కోట కట్టుకుని అక్కడికి తరలిపోయారు. అనంతర కాలంలో విజయనగర రాజుల కీర్తి కళంకానికి, బొబ్బిలి రాజుల అభిమానధనానికి నిలువుటద్దమై, చరిత్రప్రసిద్ధమైన బొబ్బిలి యుద్ధం అక్కడే జరిగింది.

ఐతే ఎక్కడ చూచినా బొబ్బిలి రాజులు అంటారే కాని, వారి తొలి రాజధాని రాజామేనని, వారు రాజాంలో కొన్నాళ్ళుండి పాలన సాగించారని పేర్కొనరు. అటు బొబ్బిలి సంస్థాన చరిత్రలోగాని, ఇటు శ్రీకాకుళం జిల్లా చరిత్రలోగాని, కళింగదేశ చరిత్రలోగాని స్పష్టంగా ఎవరూ రాయలేదు. రాజాం రాజధానిగా మాటవరసకు రాసినా, ఎన్నాళ్ళున్నారు? ఎలా పరిపాలించారు? ఎప్పుడు బొబ్బిలిలో కోటకట్టుకొని వెళ్ళారు అనే విషయాలు స్పష్టంగా లేవు. అలా స్పష్టపరచలేకపోయినా వారు రాజాంలో పరిపాలించారనడానికిగల ఆధారాలను చెబుతూ, వారి తొలి రాజధాని రాజాం అనే విషయాన్ని స్థాపించాలనే ఈ నా ప్రయత్నం. అలా స్థిరపరచాలంటే బొబ్బిలిరాజుల తొలి చరిత్ర పరిశీలించాల్సి ఉంటుంది.

1652లో గోల్కొండ నవాబు ఈ ప్రాంతంలోని తిరుగుబాట్లను అణచడానికిగాను తన ఏజంట్‌గా షేర్ మహమ్మద్ ఖాన్‌ను ఫౌజుదార్‌గా పంపించాడన్నది చారిత్రక సత్యం. ఖాన్ తనకు సాయంగా నెల్లూరు జిల్లా వెంకటగిరిని పాలిస్తున్న పెదరాయుడు (నిర్వాణరాయుడప్ప)ను, పూసపాటి మాధవ రాజును తోడ్కొని వచ్చాడు. విజయవాడ దరినిగల, కొండపల్లికి సమీపంలోని పూసపాడుకు చెందిన క్షత్రియులు కనుక వారు పూసపాటివారయ్యారు. ఈ ప్రాంతానికి రాకముందరే ఆ ఇరువంశాల మధ్య శత్రుభావన ఉండేది.

1655 సరికి ఈ ప్రాంతం పూర్తిగా తన అధీనంలోకి రావడంతో, దానికి సహకరించిన మాధవరాజుకు భోగాపురం హుండాను, పద్మనాయక వెలమయైన పెదరాయుడుకు రాజాం హుండాను ఇజారాకు ఇచ్చాడు. పెదరాయుడు రాజాంలో కోట కట్టుకోగా, పూసపాటి గజపతులు కుంభినీపురం అనే ప్రస్తుత కుమిలి గ్రామంలో కోట కట్టుకున్నారు. ఈ విధంగా షేర్ మహమ్మద్‌ఖాన్ ఉత్తర సర్కారులలో ప్రవేశం 1652 అని, విజయనగరం, బొబ్బిలి సర్దారులకు రాజ్యాల ఏర్పాటుకు 1655లో అనుమతినిచ్చాడని స్పష్టపడుతోంది. పూసపాటివారు బొబ్బిలి యుద్ధంలో హతుడైన పెదవిజయరామరాజు కాలంలోనే కుమిలిని విడిచి పెట్టారు. 1713–14లో విజయనగరంలో పెద్దకోటను కట్టుకొని విజయ నగరం, విజయ రామరాజు, విజయనామ సంవత్సరం, విజయదశమి, విజయవారం ఇలా ఐదు విజయాలతో కూడిన రోజున కోటప్రవేశం చేశారు. షేర్ మహమ్మద్ ఖాన్ వీరికి ఆయా ప్రాంతాలను ఏలుకొమ్మని ఇచ్చిన తరువాతనే బొబ్బిలి, విజయనగరం, రాజాం పట్టణాలు ఏర్పడ్డాయనేది నిర్వివాదం.

పెదరాయుడు, అతని కొడుకు లింగప్ప రాజాం హుండాను పరిపాలిస్తున్న రోజుల్లో షేర్ మహమ్మద్ ఖాన్ కొడుకును పితూరీదారులు ఎత్తుకుపోయారు. లింగప్ప సైన్యంతో వెళ్ళి పలాస దరి రంగవాక అనేచోట అక్కడి గిరిజనులను ఓడించి అతనిని విడిపించుకొని వచ్చి ఖాన్‌కు అప్పగించారు. అతడు పరమానందభరితుడయ్యాడు. నవాబునకు ఈ విషయాన్ని తెలియజేసి అతని అనుమతితో గుఱ్ఱంపై ఒకరాత్రి చుట్టిరాగల గ్రామాలను లింగప్పకు షేర్ మహమ్మద్ ఖాన్ పేష్కస్ కట్టనక్కరలేకుండా బహుమానంగా ఇచ్చాడు. ఇంకా రాజా, బహదూర్ బిరుదులతో పాటు

రంగరావు బిరుదము, తెల్లజెండా, ఢంకా, నౌబత్ (బేండ్)వంటి ఇతర రాజలాంఛనాలను బహూకరించాడు. ఆ విధంగా రాజాం నుండి ప్రస్తుత బొబ్బిలి పట్టణానికి మధ్యగల 1. కంచరాం, 2. తెర్లాం, 3. గంగన్నపాడు, 4. ఉద్దవోలు, 5. అంపావల్లి, 6. గంగాడ, 7. వంతరాం, 8. నారాయణపురం, 9. పలగర, 10. ఉత్తరావల్లి, 11. అంట్లవరం, 12. గలావల్లి గ్రామాలను లింగప్ప పొందాడు. కంచరాం రాజాం మండలానికి చెందింది కాగా, మిగిలినవి ఆ గ్రామానికి అనుసరించి విజయనగరం జిల్లాకు చెందిన తెర్లాం, బలిజిపేట మండలాలలో ఉన్నాయి. పోట్లాటవలన పొందిన గ్రామాలు కనుక వీటిని పోటు గ్రామాలని పిలుస్తూ ఒక పరగణాగా అప్పటి నుండి 1868 వరకు బొబ్బిలి రాజులు పాలించుకున్నారు. అప్పటికే వారికి బొబ్బిలి, రాజాం, కవిటి, సీతానగరం పరగణాలున్నాయి. ఈ ఐదు పరగణాలూ బ్రిటిషు కాలంనాటి విజయనగరం సంస్థానానికి ఆనుకొని ఉన్న చీపురుపల్లి, గజపతినగరం, శ్రీకాకుళంతో పాటు సాలూరు, పార్వతీపురం, పాలకొండ తాలూకాలకు చెందినవిగా చెప్పవచ్చు.

కవి సార్వభౌముడు శ్రీనాథుడు (1365-1441) ప్రౌఢదేవరాయల ఆస్థానంలో గౌడ డిండిమభట్టును ఓడించి కనకాభిషేకము పొందాడు. అనంతరం అప్పటికే రాచకొండను ఏలుతున్న పద్మనాయక వెలమ ప్రభువు ఆస్థానానికి వెళ్ళదలిచాడు. ఆ సమయంలో 'నన్నెట్టు మెప్పించెదో రావుసింగ మహీపాలు ధీవిశాలు నిండుకొలువున నెలకొనియుండి' అని సరస్వతీదేవిని ప్రార్థించాడు. ఆంధ్రదేశంలో వెలమలకు రాచకొండ మూలకేంద్రం కాగా రావు ఇంటి పేరుగా లేదా బిరుదుగాగల సింగభూపాలుడు అప్పుడు దానిని పాలిస్తున్నాడు. ఆ విధంగా పరంపరగా వస్తున్న రావు బిరుదము బొబ్బిలి రాజులకు అప్పటికే ఉంది. అట్టి వెలమవారు రంగవాక విజయులైనందున షేర్ మహమ్మద్ ఖాన్ ఇచ్చిన రంగ అనే బిరుదును కలుపుకొని ఆనాటి నుండి రావువారు 'రంగరావు'లయ్యారు. అనంతరం వచ్చిన బొబ్బిలి రాజవంశీయులు తమ పిల్లలకు సాధారణ పేర్లతోపాటు రంగారావు అనే బిరుదు నామాన్ని తప్పనిసరిగా పెట్టుకున్నారు. రావు అనేది పద్మనాయక రాజులకు పేరుకు ముందు బిరుదుగా వస్తుంది. రాజులు కాని పద్మనాయక వెలమలకు రావు పదం పేర్ల వెనుక రావడం సంప్రదాయం. వారిని చూచి అనంతర కాలంలో ఇతర సామాజిక వర్గాలవారు కూడా రావు పదాన్ని పేర్ల చివర తగిలించుకోవడం సాధారణమయింది. అప్పారావు, సుబ్బారావు ఇలా... ఇది ఇలా ఉండగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలాస దగ్గరి అప్పటి రంగవాకయే రంగవాయి అయి ప్రస్తుతం రంగోయిగా మారిందని చెప్పవచ్చు. ఆ గ్రామానికి చెందిన జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు అర్ధశతాబ్ది క్రిందటివరకూ తమ గ్రామాన్ని రంగవాయిగా పిలిచేవారని చెప్పారు.

విజయనగర రాజ్యం బొబ్బిలి సంస్థానంకంటే నాల్గురెట్ల పైచిలుకు అధికం. యానాంతో పాటు గోదావరి అంచువరకు వ్యాపించి ఉంది. బొబ్బిలి దొరలకు, విజయనగర పూసపాటివారికి మధ్య వైరం ఉత్తర సర్కారులకు రాకముందరే ఉందని చెప్పుకున్నాం. కంటిలో నలుసులా ఉన్న పద్మనాయక వెలమలను నిర్వీర్యం చేస్తే ఈ ప్రాంతాన్ని ఏకచ్ఛత్రంగా ఏలుకోవచ్చునేది విజయనగర రాజుల ఏకైక లక్ష్యం. ఇలాంటి రాజ్యకాంక్ష కలిగినవారికి దూరంగా ఉంటే మంచిదన్న భావంతోనే రాజాం నుండి రావువారు బొబ్బిలి వెళ్ళారని చెప్పవచ్చు. పై పోటుగ్రామాలు రాజాం నుండి బొబ్బిలి వరకూ వ్యాపించి ఉండడం మరొక కారణం కావచ్చు. బస్తర్ నుండి గిరిజన పితూరీలను అడ్డుకోవడం కోసం బొబ్బిలిలో కోట కట్టుకున్నారని చరిత్ర పుస్తకాలలో రాస్తూ వస్తున్నారు.

రావువారు బొబ్బిలిలో కోట నిర్మించుకొని అక్కడికి వెళ్ళిన తరువాత కూడా విజయనగర రాజుల దాడుల మధ్యే బ్రతకవలసి వచ్చింది. ఇరు రాజ్యాల సరిహద్దులో నీటి తగువులు అధికంగా ఉండడంవలన అనేకమార్లు విజయనగర రాజులు బొబ్బిలి కోటపై దండెత్తినా వారు కసికందలేదు. వెలమ దొరలకు మనోధైర్యం, ఆత్మవిశ్వాసం మెండు. మేమంతా ఒక తెగ (ట్రైబ్) అనే భావన ఉండేది. అందుచేతనే యుద్ధం అనగానే వెయ్యిమంది వెలమ వీరులు చేరిపోయి యుద్ధాన్ని ముందుండి నడిపించేవారు. కుమిలిలో ఉండి బొబ్బిలి కోటను వశపరచుకోవడం కష్టమనే భావనతోనే పూసపాటివారు విజయనగరంలో రాతి కోటను పటిష్టంగా కట్టుకున్నారని చరిత్ర.

రాజాం నుండి బొబ్బిలికి తరలిపోయిన వెలమ దొరలు రాజాం కోటను సైనిక స్థావరంగా మార్చుకున్నారు.

శ్రీకాకుళం జిల్లాకు పడమటి హద్దున రాజాం ఉండగా, ఒక త్రికోణానికి మరి రెండు కోణాలా అన్నట్టు బొబ్బిలి, విజయనగరం పట్టణాలు విజయనగరం జిల్లాలో ఉంటాయి. రాజాం నుండి విజయనగరం వెళ్ళే త్రోవలో రాజాంకు 8 కిలోమీటర్ల దూరానగల గార్రాజు చీపురుపల్లివద్దగల దిబ్బ ఇరు రాజ్యాలకు సరిహద్దు. సరిహద్దు కనుకనే అప్పట్లో అక్కడ తమతమ జెండాలను పాతి ఉంచేవారు. కనుకనే నేటికీ దానిని జేండాల దిబ్బ అనే పిలుస్తారు. ఈ దిబ్బకు ఉత్తరాన బొబ్బిలి రాజ్యం, దక్షిణాన విజయనగర రాజ్యం ఉండేది. విజయనగరం రాజులు బొబ్బిలి మీద దండెత్తాలంటే రాజాం నుండే ప్రయాణించాలి. అప్పటికి ఇరు పట్టణాల మధ్య అదే ప్రధాన రహదారి. అందు చేతనే బుస్సీ సైన్యాన్ని, విజయనగర సైన్యాన్ని ముందే అడ్డుకోవడం కోసం బొబ్బిలిరాజులు తమ సర్దారు తాండ్ర పాపయ్యను రాజాంలో జెండాల దిబ్బవద్ద కాచుకొని ఉండమని ఆదేశించారు. తాండ్ర పాపారాయుడు బొబ్బిలి రాజుల బంధువు కాగా, ఎలాంటి సైన్యాన్నైనా చికాకు పెట్టగల సమరయోధుడు. అతడు రాజాంలో ఉన్నాడని తెలిసే సైన్యాలు రాజాం మీద నుండి కాకుండా అడ్డుగా ఆకులకట్ట అడవిలో నుంచి త్రోవ చేసుకుని బొబ్బిలి చేరిపోయాయి. ఈ విషయం పాపయ్యకు తెలియకుండా పోయింది. సైన్యాలు రాజాం నుండి వచ్చినా, తాండ్ర పాపయ్య, అతని రాజాం సైన్యం బొబ్బిలిలో యుద్ధంలో పాల్గొన్నా కథ వేరేలా ముగిసేది. ఇది ఆంగ్ల చరిత్రకారులు అంగీకరించిన సత్యం.

1757 జనవరి 19న బుస్సీ, విజయరామరాజుల సైన్యం బొబ్బిలి పట్టణానికి సమీపంలో విడిది చేసింది. బొబ్బిలి యుద్ధం ఆ జనవరి 24 ఉదయం సుమారు 9 గంటలకు ప్రారంభమై 8 గంటలపాటు నడిచింది. అదేరోజు సాయంత్రానికి బొబ్బిలి కోట ధ్వంసమయింది. పై విషయాలు పుట 4 – బొబ్బిలి–నీల్‌కన్ పెరుమాళ్–ది టాపికల్ బుక్ కో– కోయంబత్తూర్–1960 అనే ఆంగ్ల పుస్తకంలో ఉన్నాయి. నాడు బుస్సీ విడిది చేసిన చోటన ఏర్పడిన గ్రామమే నేటి బొబ్బిలి దరి బూశాయవలస. మూడు రాత్రుల తరువాత జనవరి 27వ తేదీ రాత్రి ఇంకా అక్కడే నివసిస్తూ నిద్రిస్తున్న విజయరామరాజు గుడారానికి నలుగురు బొబ్బిలి వీరులు ప్రవేశించారు. బైట ఇద్దరు ఉండి లోనకు ఇద్దరు వెళ్ళారు. లోపల దూరిన ఇద్దరిలో ఒకడైన తాండ్ర పాపారాయుడు, విజయరామరాజు వేడుకుంటున్నా అతనిని కసితో 32 పోట్లు పొడిచి చంపేశాడు. ఆ అరుపులకు రాజు సిపాయిలు మేల్కొన్నారు. బొబ్బిలి ధ్వంసకుడైన విజయరామరాజును అంతమొందించామన్న సంతృప్తితో అప్పటికే చుట్టుముట్టిన సిపాయిల చేతిలో నలుగురూ వీరమరణం చెందారు–అదే పుస్తకం 7వ పుటలో. 'ఇద్దరు విఫలమైనా మరో ఇద్దరు దాడిచేయడానికే బయటవేచి ఉన్నారని, ఇది రాజపుత్రవీరుల యుద్ధసంసిద్ధత అని కొనియాడుతూ, వెలమ వీరులు కూడ రాజపుత్రులేనని చరిత్ర చెబుతుంది.' – అని ఈ సందర్భంలోనే ఈ విషయాన్ని ఆంగ్ల చరిత్రకారుడు జె.టి. వీలర్ తన *హిస్టరీ ఆఫ్ ఇండియా* అనే పుస్తకంలో రాసినట్టు ఉటంకించబడింది. తాండ్ర పాపయ్య బొబ్బిలి పులి కాదు, గజపతి కుంభస్థలాన్ని చీల్చిన రాజాం సింహం. పంచలోహ నిర్మితంగా భావించబడుతున్న, తాండ్ర పాపయ్య మెడలో ధరించిన, సుమారు 700 గ్రాముల బరువున్న, 300 ఏళ్ళనాటి ఐదుపేటల తావళం నేటికీ ఠాణా వీధిలోని రాజాం మండల రెవెన్యూ కార్యాలయంలో పెట్టెలో భద్రపరచబడి ఉంది.

బొబ్బిలి యుద్ధంలో మరణించిన రాజారావు గోపాలకృష్ణ రంగారావుకు 14–10–1751న జన్మించిన వెంకట రంగారావు అనే పేరుగల కొడుకు ఉన్నాడు. చిన్ననాటి నుండీ ఈయనను చినరంగారావు అని పిలుస్తుంటారు. ఆ ఆరేళ్ళ బాలుడిని యుద్ధబీభత్సమైన కోట నుండి తప్పించి సామర్లకోటలోగల పిన్ని జగ్గమాంబ దగ్గరకు చేర్చమని రాజదంపతులు ఒక వ్యక్తికి అప్పగించి సాగనంపారు. యుద్ధంలో రావు రంగారావు మరణించగా, అతని తమ్ముడు వెంగళరావు శరీరం నిండా గాయాలతో మరునాడు బుస్సీకి చిక్కాడు. అతని రక్షణకు ఏర్పాట్లు చేసిన బుస్సీ రక్షకుడితో పాటు దొరికిన చిన రంగారావుకు కూడా పటిష్టమైన రక్షణ కల్పించాడు. వెంగళరావును సంరక్షకుడిగా చిన రంగారావును బొబ్బిలి రాజ్యానికి అధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. రాజు రంగరావు తమ్ముడైన ఈ వెంగళరావు యుద్ధంలో వీరోచితంగా పోరాడి మరణించాడని సినీమాలలోను, బుఱ్ఱకథలోను చెప్పడం చరిత్ర విరుద్ధం. బుస్సీ ఉత్తర సర్కారులు దాటిన వెంటనే విజయనగర రాజులు బొబ్బిలి, సీతానగరం పరగణాలను ఆక్రమించుకున్నారు. ఇంతలో వెంగళరావు ఆయుధ సంపత్తితో రాజాం, కవిటి పరగణాలను స్వాధీనం చేసుకొని

రాజాంకోటలో చిన రంగారావుతో పాటు ఉన్నాడు. ఐతే విజయనగర రాజుల పడగ నీడ రాజాంలోని చినరంగారావు మీద కూడ పడుతూనే ఉంది.

విజయనగరానికి చెందిన పెదవిజయరామరాజు బొబ్బిలియుద్ధంలో మరణించగా చిన విజయరామరాజు అధికారంలోకి వచ్చిన రోజులవి. అతని అన్న, సంస్థానానికి దివాన్ అయిన సీతారామరాజు పరమ క్రూరుడు, మోసగాడు. బొబ్బిలి, సీతానగరం పరగణాలను తిరిగి ఇచ్చేస్తామని, తమ కోటకు రమ్మని చాలాసార్లు చిన రంగారావును ఆహ్వానించాడు. 1765లో సంరక్షకుడు, చిన్నాన్న అయిన వెంగళరావు మరణించాడు. కొన్నాళ్ళు చినరంగారావు రక్షణ బాధ్యత ఇనుగంటి చిన నరసయ్య చూసుకున్నాడు.

అన్నాళ్ళూ చిన నరసయ్య మాటకు విలువిచ్చిన రంగారావు 16 సంవత్సరాల వయస్సులో అతని మాటను కాదని విజయనగరం వెళ్ళాడు. దాంతో సీతారామరాజు చినరంగారావును విజయనగరం కోటలో బంధించాడు. “1766లో విజయనగర దివాన్ సీతారామరాజు రాజాములో నున్న చిన రంగారావు (16 సం)ను మాయోపాయమున బంధించి బొబ్బిలిని వశపరచుకొనెను.” -పుట.51 - పద్మనాయక చరిత్ర - రెండవ భాగము - కోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణ రావు. (బుచ్చి నాయన గారు) ఆనాటినుండి రాజాం, కవిటి పరగణాలు కూడా విజయనగర రాజులచేతికిందికి చేరిపోయాయి. 1757 నుండి 1794 వరకు కొన్నాళ్ళు బొబ్బిలి, సీతానగరం పరగణాలు, మరికొన్నాళ్ళు మొత్తం బొబ్బిలి సంస్థానం దాదాపు 37 సంవత్సరాలపాటు విజయనగర రాజుల చేతిలో చిక్కిపోయింది.

రెండేళ్ళ తరువాత చిన రంగారావు విజయనగరం కోటనుండి తప్పించుకుని సామర్లకోటలోగల పినతల్లి జగ్గమాంబ దరికి చేరాడు. కొద్దినాళ్ళు మాత్రమే అక్కడ ఉండి, బొబ్బిలి ప్రాంతం నుండి వెలమ పెద్దలను, అనుచరగణమైన తెలగాలను రప్పించుకొని హైదరాబాద్ చేరుకున్నాడు. అక్కడ చాలా సంవత్సరాలు మకాం వేసి నిజాం నవాబును ఒప్పించి, పూర్వ రాజ లాంఛనాలతో బొబ్బిలి కోటకు రాజుగా ఒక లేఖను చిన రంగారావు సంపాదించుకున్నాడు. ఈ సందర్భంగా నిజాం నవాబ్ ఒక అశ్వాన్ని, ఢంకాను అతనికి బహుమతిగా ఇచ్చాడు. 1794 సరికి ఉత్తర సర్కారులు పూర్తిగా ఈస్ట్ ఇండియా కంపెనీ వశమయ్యాయి. అందుచేత చినరంగారావు నిజాం నుండి తెచ్చిన ఉత్తరాన్ని చదువుకొని, అప్పటి విశాఖపట్నం కలెక్టర్ అతనిని బొబ్బిలి రాజుగా పునఃస్థాపించాడు. 1907లో అప్పటి బొబ్బిలిరాజు వెంకట శ్వేతాచలపతి రంగారావు కూర్చిన బొబ్బిలి *జమీందారీ* అనే ఆంగ్ల గ్రంథంలోని 84 నుండి 90 పేజీల వరకుగల విషయ సారాంశంగా పై మూడు పేరాలను రాశాను. ఇంతవరకూ చెప్పిన బొబ్బిలి రాజుల చరిత్రలోని అన్ని ముఖ్యఘట్టాలలోనూ రాజాం ప్రముఖ స్థానాన్ని ఆక్రమించే ఉంది. బొబ్బిలి సంస్థాన చరిత్రలో రాజాం పట్టణ పాత్ర ఇంత గొప్పగా ఉండగా రాజాం రాజధానికి దొరుకుతున్న మరికొన్ని ఆధారాలను పరిశీలిద్దాం.

“ఈ సంస్థానాధీశుల ఉపరాజధానియైన రాజాము పరిసరముల పరివేష్ఠితుడైన శ్రీ సీతారామస్వామి నిలయము, సీతారామపురము. ఇచ్చట ప్రఖ్యాత దేవళములు ఉండుటచే దీనిని గుళ్ళ సీతారామపురమందురు.

కీ.శ. 1652 నాడు లింగప్ప నాయడు రంగవాక విభుడై రంగరావులైన నాటినుండి రాజాము కోట వీరి అధీనములోనున్నదగుటచే ఈ స్వామి ప్రస్తుత బొబ్బిలి వేణుగోపాలునికంటె పూర్వుడు. రాజాము కోటకు సన్నిహితుడు ఈ దేవుడు.” - పద్మనాయక చరిత్ర - ప్రథమ భాగం - పుట 105 - కోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణ రావు. (బుచ్చి నాయన గారు) పై ఉటంకింపులవలన రాజాంలో కోట ఉండేదని, వేణుగోపాల స్వామి ఆలయానికి పూర్వమే సీతారామాలయం కట్టారని స్పష్టపడుతోంది.

ఈ పద్మనాయక చరిత్రలోని రెండవ భాగంలోగల 56,57,58 పుటలలోని విషయాన్ని విశ్లేషిద్దాం. వీటిలో వేణుగోపాలస్వామి, సీతారామస్వాముల ఆలయాల ఆస్తుల వివరాలు పొందుపరచబడ్డాయి. వేణుగోపాలస్వామికి మూడు కిలోల పైచిలుకు బంగారు ఆభరణాలుండగా, సీతారామస్వామికి నాలుగు కిలోలకు పైగా ఆభరణాలను రావువారు సమర్పించుకున్నారు. ఇందులో సీతారామస్వామికి 20 తులాల బంగారంతో చేసిన ఉత్తర జందెం ఆలయ ప్రాచీనతను స్పష్టపరుస్తోంది. ఇది ‘నాలుగు పేటలతో వరహాలు, మొహిరీలు కలిగి రెండు బంగారు మొహర్లుకలవి’ అని రాస్తూ ‘ఈ మొహర్లు ఉరుదూ అక్షరములలో ఉన్నవి’

అన్నారు. గోలకొండ నవాబుల ఫౌజుదార్ షేర్‌మహమ్మద్ ఖాన్ మీద గొప్ప గురితోనున్న రోజులలో కట్టించబట్టే ఈ ఆలయంలో భద్రాచల రాముని ప్రతిష్ఠ చేశారు. అంతేకాకుండా ఉరుదూ మొహర్లు రాములవారి జందెంలో చోటుచేసుకున్నాయి. కాకుంటే పద్మనాయక వెలమలు విశిష్టాద్వైత శాఖకు చెందినవారు గనుక ఆ కోవెలలో ఆళ్వారులను ప్రతిష్ఠించారు. ఉర్దూ అక్షరాల ప్రసక్తి బొబ్బిలి వేణుగోపాలస్వామి నగలలో లేదు. అది ఆంగ్లేయులు ఈ ప్రాంతంలో బలపడిన తరువాత కట్టిన కోవెల. "శ్వేతాచలపతి రంగారావు బొబ్బిలి సంస్థానమును క్రీ.శ 1830 నుండి 1862 వరకు పాలించెను. ఇతడు తండ్రి కాలమున ప్రారంభింపబడిన వేణుగోపాలస్వామి దేవాలయమును క్రీ.శ. 1837లో పూర్తి చేసెను." - ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 3వ భాగం. 664 పుట - బి.ఎన్. శాస్త్రి. గుళ్ళసీతారామ పురంలోని సీతారామస్వామి ఆలయ నిర్మాణ రీతిలోనే మరో 150 సంవత్సరాలు గడిచిన తరువాత బొబ్బిలిలో ఇప్పుడున్న కోటతో పాటు వేణుగోపాలస్వామి ఆలయాన్ని సంస్థానాధీశులు కట్టుకున్నారు.

ఈ సీతారాముల కోవెలలో ఏకశిలపై సీతారాములను చెక్కి ఉంచారని, లక్ష్మణ, ఆంజనేయులు లేని సీతారాములు గనుక తొలుత దీనిని ఏకాంత సీతారామాలయం అనేవారని, ఈ దేవాలయాన్ని చూసే తమ పూర్వులు 250 సంవత్సరాల క్రిందట రాజాంకు ఆరు కిలోమీటర్ల పడమరనగల రాజీపేటలో కంచి వరద రాజస్వామికి గుడిని కట్టించి స్వామితో పాటు ఆళ్వారుల ప్రతిష్ఠ చేశారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పీసపాటి సత్యనారాయణాచార్యులు ఈ రచయితకు తెలియజేశారు. గుడులు ఎక్కువ ఉన్నాయి కనుక అనంతర కాలంలో జనవ్యవహారంలో గుళ్ళసీతారామపురంగా మారిందని కూడా చెప్పారు. ఈ సీతారామపురానికి దక్షిణ దిశలో రంగరావుల చిహ్నంగా రంగరాయపురం ఉంది. ఈ రెండు పురాలూ బొబ్బిలి రాజుల పాలనా చిహ్నాలు కాగా వీటి పరిసరాలలో అన్నీ వలసలు, పల్లెలు, పాడులు, ఊరులే ఉన్నాయి. అంతేకాదు ఈ గ్రామాలకు ఉత్తర దిక్కున లింగాలవలస, వావిలవలస గ్రామాలున్నాయి. పరిశీలిస్తే తొలికోట రాజాంలో కట్టిన పోటుగ్రామాల వీరుడు లింగప్ప పేరునే లింగాలవలస ఏర్పడిందనడంలో పాఠకులకు ఎట్టి అభ్యంతరమూ ఉండక పోవచ్చు. ఇంతకీ ఆ గ్రామంలో చెప్పుకోదగ్గ లింగాలేవీ లేవుకూడా! నేటికీ లింగాలవలసలోగల వెలమదొరలలో ఇనుగంటివారే అధికంగా ఉన్నారు. అప్పటి ఠానేదారైన మైనరుగారి భవంతి వావిలవలసలో శిధిలమై నేటికీ ఉంది. ఇంకా ఈ సీతారామస్వాముల ఆలయంలో పెద్దపెద్ద ఇత్తడి వాహనాలు, రాతి ముక్కలతో చేసిన పెద్దపెద్ద జాలుల కిటికీలు, శిలా విగ్రహాలు ఆలయ ప్రాచీనతను తెలియజేస్తున్నాయి. ఈ ఆలయానికి స్థానాపతి ఉండేవారు. పండితుడైన ఆయన నేటికి 80 ఏళ్ళ క్రిందట కావ్య నాటకాలను, అమరాంధ్రాలను తనకు చెప్పారని మా తండ్రి అప్పలనాయుడు నాతో గతంలో చెప్పారు. ఈ దేవస్థానంలో డోలా యాత్ర వైభవోపేతంగా వారం రోజులపాటు జరిగేదని పరిసర ప్రజలు నాటుబళ్ళు కట్టుకొని కుటుంబాలతో వచ్చి సీతారాములను దర్శించుకొని, వంటలు చేసుకొని యాత్ర చూసేవారని, సంవత్సరానికి సరిపడా పాత్రసామాను కొనుక్కొనేవారని కూడా చెప్పారు. వైష్ణవ అర్చకులు, దేవదాసీ వ్యవస్థ, ఇతర కైంకర్యాల వారు అర్థశతాబ్ది క్రిందటివరకూ ఈ గ్రామంలో ఉండేవారు. డోలా పౌర్ణమినాడు డోలికా ఉత్సవంకోసం బహిరంగ ప్రదేశంలో కట్టిన పెద్ద రాతి మంటపం చెక్కు చెదరకుండా నేటికీ నిలిచి ఉంది. గుడికి చుట్టూ పెద్ద తోటతో, ఆకాశమంత ఎత్తు గాలిగోపురం ఆకర్షణీయంగా ఉంటుంది..

"శ్రీ రాయదప్పగారు అప్పట్లో రాజాంలో చిన్న కోట కట్టుకొనిరి. వెలుగోడు వెంకటగిరి ప్రాంతాలను విడచి రాజాంలో చిన్న జమీందారుగా స్థిరపడిరి" - బొబ్బిలి రాజావారి జీవిత యాత్ర-ప్రథమ భాగం-10, 11 పుటలు - నిష్ఠల సీతారామ శాస్త్రి. ఈ రచయిత కూడా బొబ్బిలి రాజుల తొలి రాజధాని రాజామేనని అంగీకరిస్తున్నారు.

చినరంగారావు (బొబ్బిలి యుద్ధములో మిగిలిన ఆరేళ్ళ బాలుడు) కొన్నాళ్ళు పాల్తేరున, కొన్నాళ్ళు పిఠాపురమున, యుక్త వయస్సు వచ్చిన పిదప రాజామున పెరిగినట్లు చెప్పుదురు." (పాత బొబ్బిలి చరిత్ర సంక్షిప్త సమీక్ష)

"ప్రథమ విశ్వంబరదేవుగారి కాలములోనున్న నందాపుర రాజ్యము ఇంచుమించుగా యావత్తు విశాఖపట్టణపు జిల్లాయును, గంజాము జిల్లాలో శ్రీకాకుళం తాలూకాలో బొంతలకోడూరు మకాము కలిసి యుండేది." - పుట - 428 - రాళ్ళబండి సుబ్బారావు - కళింగదేశ

చరిత్ర. ఈ వాక్యంవలన షేర్‌మహమ్మద్ ఖాన్ ఈ ప్రాంతానికి వచ్చేసరికి ఈ బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన ప్రాంతాలు జయపురం సంస్థానాధీశుని చేతిలో ఉండేవని తెలుస్తోంది. (పూర్వపు నందాపురవే ప్రస్తుతం జయపురంగా పిలువబడుతోంది) షేర్ మహమ్మద్ ఖాన్‌ను ఓడించి సంధి చేసుకున్నవాడీ విశ్వంబరదేవుడే. అట్టితరి రాయుడప్ప ఇక్కడ నూతనంగా కోట కట్టుకొని పాలించడం ప్రారంభించాడు. ఆ విధంగా రాజులు నివసించిన ఊరు కనుకనే రాజాం అయిందని కచ్చితంగా చెప్పవచ్చు.

ఇక సాహిత్య చరిత్రలోనికి వెళితే కొట్రా వేంకటేశ్వర్లు (1730-90) అనే కవికి బొబ్బిలి సంస్థానాధీశులు రాజాంకు ఆరు కిలోమీటర్ల దూరంలోనున్న ఇల్లం నాయుడు వలసను ఇనాంగా ఇచ్చారు. అతడు విమలాంగీ పరిణయం అనే రెండాశ్వాసాల ప్రబంధాన్ని రాశాడు. అది ఓరియంటల్ లైబ్రరీలో ఉంది. అంతేకాకుండా తన గ్రామానికి చెందిన చీడి యల్లంనాయుడు అనే మోతుబరి మీద 133 పద్యాలతో ఓ శతకం లిఖించాడు. దీని ప్రతి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉంది. ఈ విషయాలు ఆరుద్ర రచించిన ప్రజాశక్తిబుక్ హౌస్ వారి సమగ్రాంధ్ర సాహిత్యం - 8వ భాగం - 222,23,24 పుటలలో ఉంది. ఈ యల్లమనాయుడే ఇక్కడకు వలస వచ్చి గ్రామాన్ని ఏర్పాటు చేయడంవలన అతని పేరన ఈ గ్రామం యల్లమనాయుడు వలసగా, కాలక్రమంగా ఇల్లంనాయుడు వలసగా మారి ఉంటుంది. అక్కడి చీడివారే సమీపంలోని పెనుబాక గ్రామానికి చేరి ఉంటారు. రాజాం విజయనగరం ప్రధాన రహదారిలోగల ఆ గ్రామంలో వారు నేటికీ మోతుబరి రైతులు. కొట్రా వేంకటేశ్వర్లును బాలకవి అని కూడా అంటారు. చిన్ననాడే పద్య రచన చేయడంవలన అతనికి ఆ బిరుదు నామం ఏర్పడి ఉంటుంది. రాజాంకు ఉత్తరాన 3కిలో మీటర్ల దూరానగల బాలకవివలస ఈ కవిపేరన ఏర్పడిందేమో? బొబ్బిలి కవులలో తొలికవిగా సాహిత్య చరిత్రకారులు రాశారు, కాని ఈయన బొబ్బిలిలో నివసించినట్టు మాత్రం రాయలేక పోయారు. బొబ్బిలి యుద్ధకాలానికి ఇతడు యౌవ్వనంలో ఉండి ఉంటాడు. తాండ్ర పాపారాయుడి దర్శనం కూడా పొంది ఉండడు. ఏమయినా రాజాంకు చెందిన కవి బొబ్బిలి కవులకు, శ్రీకాకుళం జిల్లా కవులకు కూడా మొదటివాడిగా గుర్తింపు పొందడం రాజాంకు ఒకింత గర్వకారణం.

రాజాంలో పద్మనాయక రాజులు ప్రజారంజకంగా పరిపాలించారనడానికి అప్పట్లో వారు ఈ ప్రాంతంలో కట్టించిన కోవెలలు, తవ్వించిన చెఱువులు, నిర్మించిన రహదారులే నిదర్శనం. అప్పటి కోటలోనే ప్రస్తుతం కోర్టులు నడుస్తున్నాయి. రాజాం ఠాణావీధిలో చెలికానివారి ఇళ్ళను అనుసరించి రాజగోపాలస్వామి ఆలయం (ఆండాళమ్మ కోవెల), దానికి తూర్పు రోడ్డుకు ఆనించి తూర్పు అంచున రామలింగేశ్వర ఆలయం అప్పటి రాజధాని చిహ్నాలుగా నిలిచి ఉన్నాయి. అగ్రహారం వీధిలోని స్ఫటిక లింగంగా ఉన్న ఈ రామలింగేశ్వరుడిని తాండ్ర పాపయ్య ప్రతిదినమూ వచ్చి అభిషేకించే వాడని చెబుతారు. వెలమదొరలు గొప్ప వైష్ణవ భక్తులయినప్పటికి, మత సహనం కలిగినవారనడానికి నిదర్శనం ఈ రెండు ఆలయాలతో పాటు, రాజాం పట్టణానికి చెందిన డోలపేటలో ఒకే ప్రహరీలో వారు నిర్మించిన శైవ వైష్ణవ ఆలయాలు. డోలపేట ఆలయాలకు వారు సుమారు రెండువందల ఎకరాలభూమిని కానుకగా ఇచ్చినట్టు రికార్డులు ఉన్నాయి, వాటిలో నేటికీ కొన్ని భూములు దేవస్థానం అధీనంలో ఉన్నాయి.

ఉత్తర సర్కారులపై ఆంగ్లేయుల ఆధిపత్యం వచ్చిన తరువాతే వెలమ దొరలు సుఖంగా నిద్రపోయారు. ఆ ప్రశాంత సమయం నుండి ఇటు రాజ్యపాలన, అటు కృతి కర్తృత్వం, కృతిభర్తృత్వంవంటివి చేయగలిగారు. బొబ్బిలి రాజా నిర్వాణరాయుడప్ప 1802-30 మధ్యగల 28 సంవత్సరాల తన పరిపాలనలో తాను గ్రంథాలను రాయడమే కాకుండా పండితులను ఆదరించి గ్రంథరచన చేయించాడు. ఆ యా గ్రంథాలు, ప్రబంధాలను ఆధారంగానే బొబ్బిలి చరిత్రను తరువాతి వారు రాసుకొచ్చారు లేదా ఆంగ్లేయ లేఖకులు రాసిన వానిని ఆధారం చేసుకున్నారు. శిలాశాసనాల అవసరం తప్పిపోవడం, సాహిత్య పోషణ జరగకపోవడం, చరిత్ర రాసే అలవాటు ఆనాటికి భారతీయులకు లేకపోవడంవలన బొబ్బిలి రాజుల తొలినాటి రాజాంపాలన చరిత్రపుటలకెక్కలేదు. బొబ్బిలిలో మొదట చిన్న కోట కట్టారని, దానిని చిన్నదిగా భావించి రెండవది పటిష్టంగా కట్టారనేది చరిత్ర. ఆ రెండవకోట యుద్ధంలో ధ్వంసమయింది. ఆ కారణంవలన కూడా అంతకు ముందరి చరిత్ర కాలగర్భంలో కలిసిపోయింది.

*మిగతాది 38వ పుటలో..*

# అధ్యాత్మే అసలు సంగతి

– వి.యస్.ఆర్. మూర్తి

అసహనం నుంచి, అస్పష్టత నుంచి, వ్యక్తి ఆలోచన నుంచి, ఊహాత్మక భావనా స్థితి నుండి, విస్తరణ కాంక్ష నుంచి, విభజనాంచిత ధోరణి నుంచి పురుడు పోసుకుంటే, అది మతం! అది సర్వజన సమ్మతం కాబోదు. ఇంతవరకు కాలేదు. సంక్లిష్టమైన భావపరిధిలో, పరిమిత శక్తితో, అపరిమిత ఆశలతో పుడుతుంది కనుక, మతం ఎన్నటికీ మార్గదర్శనం చేయలేదు. మతానికి, వ్యక్తిపరమైన బంధం ఉన్నందున, అది అనేక వ్యతిరిక్త శక్తులను కూడగట్టుకుని, బలాన్ని పుంజుకుని, కాలగమనంలో, చరిత్ర గతిలో వికృత రూపాన్ని సంతరించుకుని వ్యక్తిని, వ్యవస్థను, జాతిపురోగతిని నిరోధించి, సంకెళ్లు తగిలిస్తుంది. బుద్ధిజీవుడుగా మనవలసిన మనిషిని బద్ధజీవుడిగా మార్చి, అసంబద్ధ, అహేతుక జీవన దృక్పథాన్ని అలవాటు చేస్తుంది. మానవ మేధను, మానవ శక్తిని నిర్వీర్యం చేసి, సంకుచిత పరిధిలో మనిషిని గంగిరెద్దుగా, అర్థం తెలియకుండా వ్యర్థంగా తిరిగే గానుగెద్దుగా, యాంత్రిక జీవిగా మారుస్తుంది. అంతేకాదు జాతిని, వర్గ, వర్ణ, విభేదాలతో విభజించి, సాంఘికంగా, మానసికంగా ఒంటరివాణ్ణి చేస్తుంది.

వ్యష్టి, సమష్టి, సృష్టి పరస్పరాశ్రితంగా భావించి జీవయాత్రను సాగించవలసిన మనిషి, మతం మత్తులో స్వధర్మాన్ని, కర్తవ్యాన్ని మరచి, సృజనాత్మకతను కోల్పోయి, మరమనిషిగా ఒకే వృత్తంలో తిరిగి తిరిగి, చేరవలసిన చోటుకు చేరకుండానే, అందుకోవలసినది అందుకోకుండానే, అందించవలసినది చెందించకుండానే, మళ్లీ యథాస్థానానికి చేరుకుంటాడు. ఈ ప్రక్రియలో మానసిక బానిసత్వము, ద్వేషము విజృంభించి, మానవ సంబంధాలను, వ్యక్తి స్వేచ్ఛను విచ్ఛిన్నం చేసి, జాతి దుర్బలమై క్రమంగా క్షీణదశకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో యుద్ధం రూపుదిద్దుకుని, బలహీనుడిపై బలవంతుడిది పైచేయి తేగానే స్పర్థ, పగ, వగ, సమాజాన్ని అతలాకుతలం చేస్తుంది.

మతం, అన్నివేళలా బయట ప్రయాణం చేయిస్తుంది. మనిషికి, తను చేయవలసిన అంతరంగ ప్రస్థానం ఒకటి ఉన్నదన్న స్పృహను సైతం కలుగజేయదు.

వర్తమాన సమాజం మతాన్ని అధ్యాత్మగా భావించి, రెండూ ఒకటేనన్న భావనను బలీయం చేసుకుని జీవిస్తున్నది. నిజానికి ఈ రెండింటి మధ్యా ఉన్నది, సంఘర్షణే తప్ప సమన్వయం లేదు.

మతానికి అధ్యాత్మ లేదు!

అధ్యాత్మకు మతం లేదు!!

ప్రకృతి నిరంతరమూ అనుభవించే పరిణామ క్రమంలోంచి, సమాజగతి, గమనాలలోంచి, వ్యక్తి ఆలోచనా పరిణితిలోంచి, వికాసమానం చెందే మానవ మేధలోంచి, ఆశావహ దృక్పథంలోంచి, భవిష్యద్దర్శనాపేక్షలోంచి, ఆదర్శవాదంలోంచి, పదార్థ భావనను దాటిన యథార్థ దృక్పథంలోంచి పుట్టేది, అధ్యాత్మ! అది మతాతీతమైనది. కానీ ధర్మసంబంధి. జాతిసంస్కారంలోంచి, వికాసమానంవైపు నడిపించేదే చోదకశక్తి. అధ్యాత్మ ఆలోచనాత్మకం. చింతనాత్మకం. కర్తవ్య బోధాత్మకం. భౌతికవాదం నుండి, అనాత్మ స్థితి నుండి, సంపూర్ణ శక్త్యావరణంలో నుండి, అంతర్దృష్టి దిశగా వెలుగు దారిలో నడిపించే, దారిదీపం, అధ్యాత్మ! జీవితాన్ని భ్రాంతిగాకాక, క్రాంతికారిగా, దర్శనం చేయించే మౌనవ్యాఖ్య.

జీవిత పరమార్థాన్ని, దానిని అనుభవంలోకి తెచ్చుకోగల ఒడుపును, ఓర్పును, కూర్పును, నేర్పును నిర్దుష్టంగా, నిరపేక్షంగా అందించే శక్తిమూలం, అధ్యాత్మ! ఆలోచనా స్రవంతిని క్రమబద్ధం చేసి, మనోతీవ్రతను నిగ్రహించి సర్వహితము, సర్వశ్రేయోదాయకము అయిన ఆచరణకు రూపమిచ్చే విరించి, అధ్యాత్మ!

సత్యము, ధర్మము, శాంతి, ప్రేమలను, విశ్వజనీన భావనను పెంపొందిస్తూ, అణుక్షేత్రం నుండి ఆత్మక్షేత్రంవైపు

వడివడిగా అడుగులు వేయించి, లోచూపును అలవాటు చేస్తుంది. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అంటే ఉన్నదంతా బ్రహ్మమేనన్న భావనను స్థిరం చేసి, మనుసును స్థిమితం చేస్తుంది. ఎంతగా వివరిస్తుందంటే, ఆత్మను ఒక బ్రహ్మపదార్థంగాకాక, 'ఆత్' అంటే 'ఏమీ', 'మా' అంటే లేదు, అని స్పష్టం చేస్తుంది. 'ఏమీ లేదు' అంటే ప్రత్యేకంగా లేదని, ఉన్నదంతా బ్రహ్మమేనని సనాతన ధర్మసూత్రాన్ని సరళంగా, సూటిగా, గంభీరంగా, ఉదాత్తంగా బుద్ధికి చేరవేస్తుంది, చేరువ చేస్తుంది. మానవుడి భావనా సీమను నిత్యవసంతుర్తువుగా సంభావనా స్ఫూర్తితో, జీవన వృక్షంపై పండిన పండుటాకులను, ఎండుటాకులను రాల్చి, అక్కడే చిగురాకులు మోసులెత్తుతుంటే, మొగ్గలు పుట్టి, పూలై వికసించి, కాయలై కాచి, పండై ఫలించి, పరిణామ క్రమంలో సంవిద్ఫలాన్ని అనుగ్రహిస్తుంది. అధ్యాత్మమూలం కనుక, దాని ఉనికి శాశ్వతం. ఋతువు వెంట ఋతువు రూపాంతరీకరణ దీప్తిగా భాసించి, కొత్తదనానికి అనునిత్యమూ చోటిచ్చే దాత, విధాత, అధ్యాత్మ! అది నిత్య, సత్య, స్థిర, సంస్థితం!!

అది కాల్యాద్యవిచ్ఛిన్నం, అపరిణామకాంతి. తాను కదలకుండా, మనసును, బుద్ధిని, చిత్తాన్ని, ఇంద్రియాలను ఒక శృతిలో, లయలో సంచలింప చేయగల విన్నాణి. అది నిశ్చలం, నిభృతం! దేనికీ లొంగని, పొంగని, కుంగని, వంగని ఆత్మశక్తి, జ్ఞానాదిత్యం! మామిడినీ, వావిలిని, తరతమ భేదం లేకుండా ప్రభావితం చేయగల సమవర్తి, సహవర్తి! మతం, యుద్ధాన్ని ఉసిగొల్పుతుంది. అధ్యాత్మ, సమరాన్ని నిరోధిస్తుంది. మతం, అశాంతికి, అస్పష్టతనకు, అనాచారానికి, అవిద్యకు, అహంకారానికి, అసమత్వానికి పాదు చేస్తుంది. మత్తుమందువంటిది, మతం! మనిషిని అచేతన స్థితిలో నిలబెడుతుంది.

అధ్యాత్మది సువిశాల, సుందర ప్రాంగణం. అది ఏ జాతికైనా ఆశ్రమం, ఆశ్రయం! శాంతివరదాయి. కళ్యాణ ప్రదాయి!

మతములన్నియు మాసిపోవును!
జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును!

వి.యస్.ఆర్. మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త
హైదరాబాద్. ఫోన్: 944 060 3499.

*36వ పుట తరువాయి...*

**బొబ్బిలి రాజుల తొలి రాజధాని రాజాం...**

లభిస్తున్న బొబ్బిలి రాజ్య చరిత్రలో కూడా అక్కడక్కడా భిన్నాభిప్రాయాలున్నాయి. అంతిమంగా పైన పొందుపరచిన అంశాలవలన రావువారు ఒకతరం పాటు ఐనా రాజాంలో ఉండి పాలించి ఉంటారని, పరిస్థితుల ప్రభావంవలనే బొబ్బిలిలో కోట కట్టుకొని వెళ్ళిపోయారని నిర్ణయించవచ్చు. అంతేకాని చరిత్రలో రాసినట్టు రాజాం హుండాను ఇస్తే, రాజాంలో కోట ఉండగా, వెంటనే బొబ్బిలిలో కోట కట్టుకొని వెళ్ళారనేది అసంగతం. రాజాం కోటలో బొబ్బిలి రాజులు ఎన్నాళ్ళున్నారు? గుళ్ళ సీతారాంపురంలో దేవాలయాన్ని ఎప్పుడు నిర్మించారు? బొబ్బిలిలో తొలికోటను ఎప్పుడు కట్టుకున్నారు? వంటి ఆధారాలు దొరకడం లేదు. అలాగే షేర్ మహమ్మద్ ఖాన్ కొడుకు పేరేంటి? అతడు ఎప్పుడు బందీ అయ్యాడు? ఏ సంవత్సరం విడుదల అయ్యాడు? అన్నీ ఉరమరగా ఊహించు కోవాల్సిందే! పై ప్రశ్నలకు జవాబులు దొరికితే రాజాం చరిత్రను మరింత వాస్తవంగాను, కట్టుదిట్టంగాను చెప్పడానికి వీలౌతుంది. కొట్రా బాలకవి రచించిన విమలాంగీ పరిణయం, యల్లమనాయుడు శతకంలలో ఏమైనా రాజాం భోగట్టా ఉందేమో పరిశీలించాల్సి ఉంది. వెలమ దొరలు తొలినుండీ రాజాంలోనే స్థిరమైన కోట కట్టుకొని పాలించి ఉంటే విజయనగరరాజుల తాకిడిని తట్టుకొనేవారేమో ననిపిస్తుంది. బొబ్బిలి సైన్యంతోపాటు తాండ్ర పాపయ్య, అతని సైన్యం మూకుమ్మడిగా శత్రుసేనల్ని చీల్చి చెండాడేవి. అంత సులువుగా పద్మనాయక వీరులు శత్రువులకు చిక్కరనేది చారిత్రక సత్యం. తొలి నాళ్ళలో వెలమ వీరులకు స్థానమిచ్చి, పేరు ప్రఖ్యాతులిచ్చిన రాజాం, బొబ్బిలి యుద్ధం జరిగిన తరవాత కష్ట సమయంలో పదేళ్ళపాటు బొబ్బిలి రాజా చినరంగారావుకు ఆశ్రయమిచ్చింది. అలాంటి రాజాంను రావువారు విడిచి తిరిగి బొబ్బిలిలోనే కోట కట్టుకోవడం రాజాం అభివృద్ధికి గొడ్డలి పెట్టయింది. రాజాం నీరు త్రాగి అర్ధశతాబ్దిపాటు జీవించినవాడను గనుక ఈ మాత్రమైనా రాజాం చరిత్రను ఒకచోటచేర్చి రాయగలిగినందుకు ధన్యుడనయ్యానని ఆనందిస్తున్నాను. భావి పరిశోధకులు ఇతోధికంగా కృషిచేసి రాజధానిగా రాజాం చరిత్రను మరింత స్పష్టపరుస్తారని ఆశిస్తాను.

గార రంగనాథం, రాజాం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్: 988 575 8123.

# జానపదం

## సామాన్యుడి ప్రతిభకు సజీవ సాక్ష్యం

*– ఎమ్. కురుమయ్య యాదవ్*

సాహిత్యం అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది రామాయణం, భారత భాగవతాలు, అష్టాదశ పురాణాలు, వేద వేదాంగాలు, కావ్యాలు, ప్రబంధాలు వంటి పండిత శిష్ట సాహిత్యమే. కానీ ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. సామాన్య మానవునిలోని ప్రతిభకు, పాండిత్యానికి, అతనిలోని భావుకతకు, తాత్విక చింతనకు నిలువెత్తు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఆ రెండో పార్శ్వమే జానపద సాహిత్యం. ఒకప్పుడు చదువురానివారు మాట్లాడే భాషను గ్రామ్యం అన్న పేరుతో దానికి ప్రామాణికతను ఇవ్వటానికి ఇష్టపడేవారు కాదు, అలాంటి సందర్భాలలో వారి సాహిత్యాన్ని ఇక ఏ విధంగా గుర్తించగలరు. కానీ నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, శ్రీ నాథుడు దేశి కవితా ఉద్యమకారులు పదకవులువంటి కొద్దిమంది ప్రాచీన కవులు మరియు ఆధునిక కాలంలో నేదునూరి గంగాధరం బిరుదురాజు రామరాజు నాయని కృష్ణకుమారివంటి జానపద పరిశోధకుల కృషి ఫలితంగా, వాడుక భాషను సైతం సాహిత్య మాధ్యమంగా గుర్తించిన తర్వాత ఈ జానపద సాహిత్యం సైతం వెలుగులోకి తీసుకురాబడింది. అసలు దీని గురించి విచారిస్తే, జనపదం అంటే పల్లెటూరు అని, అందులో నివసించే ప్రజలను జానపదులు అని అంటారు కానీ ఎర్రన్న గారు "జానపదుల్ పురీ జనుల్" అని అభివర్ణించారు. అలా చూస్తే జానపద సాహిత్యం పల్లెటూరివాళ్ళదా లేక పట్టణాలవాళ్లదా అసలు జానపద సాహిత్యం అంటే ఏమిటి?దానికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి? అని పరిశీలిస్తే, "సహజ స్ఫురణ శక్తిగల అనాలోచిత కళ"నే జానపద సాహిత్యం అంటారు. అంటే జానపద సాహిత్యం ఆశువుగా అప్రయత్నంగా వెలువడుతుంది. దీనికి ఎటువంటి శిక్షణ, అనుభవం అవసరం లేదు. పరస్పర కళాత్మక సంబంధంగల సంగీతంతో కూడిన సాహిత్యం ప్రక్రియ.

''సంగీత సాహిత్యలతో కూడిన నిరక్షరాస్యుని భావగీతమే జానపద సాహిత్యం". అంటే జానపద సాహిత్యం సృష్టికర్తలు అందరూ ఎలాంటి అక్షర జ్ఞానం లేని కార్మిక, కర్షక, శ్రామిక జనాలే. భావగీతం అంటే మనసులోని అనుభూతికి ఒక రూపం ఇవ్వటం. ఇందులో సంగీతంతో పాటు సాహిత్యం కూడా మిళితమై ఉంటుంది. సాహిత్యం అంటే నిబద్ధమైన చందోనియమాలు, లక్షణాలు కావు. కేవలం లయను సృష్టించే పద విరుపులు మరియు అంత్యప్రాసలు.

జానపద సాహిత్యం యొక్క ముఖ్య లక్షణం "ఆత్మాశ్రయత్వ కవిత్వం". ఆత్మాశ్రయత్వం అంటే తన మనసులోని అనుభూతికి ఒక రూపం కల్పించడమే, ఇందులో ఎటువంటి నియమాలు సూత్రాలు ఉండవు. కేవలం వ్యక్తి అనుభూతికే తొలి ప్రాధాన్యత ఉంటుంది. తాను అనుకున్నది మాత్రమే చెబుతాడు. తొలితరం వ్యక్తి తనకు నచ్చిన అంశాలు, తనకు నచ్చిన రీతిలో వివరిస్తే, ఆ తర్వాతి తరం వ్యక్తి అదే భావాన్ని మరో రీతిలో వివరిస్తాడు. అందువల్ల జానపద సాహిత్యానికి నిర్దిష్టమైన లక్షణాలు ఉండవు.

దీన్నిబట్టి చూస్తే "జానపద సాహిత్యం అంటే ఒక నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించినది కాదు. ఒక నిర్దిష్ట తత్వానికి సంబంధించినది"అని తెలుస్తుంది. మనిషి సంచార జీవి నుంచి సంసారం జీవిగా మారిన తర్వాత తన భావ వినిమయం కోసం భాష ఏర్పర్చుకున్నాడు. ఆ భాష ద్వారానే తన భావాలను పరస్పరం మార్పిడి చేసుకున్నాడు. తొలుత కేవలం భాష మాత్రమే ఉండేది. దానికి లిపి ఉండేది కాదు. తన మనసులోని భావాన్ని మాటల ద్వారా వ్యక్తం చేయడంవల్ల భాషాజ్ఞానం పెరిగింది. తన మాటలలోని పదాలకు క్రమపద్ధతిలో విరుపులవల్ల దానికి లయ చేకూరి, ఆ మాటలకు ఆకర్షణ పెరిగేది. లయ కలిగిన వాక్కు నాదంగా పరిణతి చెందింది. లయ లేని వాక్కు వచనంగానే స్థిరపడిపోయింది. ఆ నాదానికి అంత్యప్రాసను చేకూరిస్తే అది సంగీత స్పర్శగల గేయంగా పరిణామం చెందింది. అదే జానపద సంగీత ఆవిర్భావానికి తొలిమెట్టుగా అభివృద్ధి చెందింది. ఆనాటి మనిషి పూర్తిగా శ్రమజీవి ఒక పని చేసేటప్పుడు అలసట తెలియకుండా ఆ పని మరింత ఆసక్తిగా ఉండడానికి సంగీతాన్ని ఆశ్రయించేవారు. అలా ఈ జానపద సంగీతం ఒకరి నుంచి మరొకరికి నోటి ద్వారానే చేరింది.

ఒకరి ద్వారా మరొకరు నేర్చుకొని పాడేవారు. అలా సంగీత ప్రక్రియ పుట్టింది. కానీ దానికి అంశం కావాలి. సమాజ జీవిగా మారిన తర్వాత మనిషి తన చుట్టూ ఉన్న వ్యక్తులను, ప్రకృతిని పరిశీలించగా అందులో కొన్ని రకాల అంశాలు కనపడ్డాయి అవి – 1. ప్రణయ/ప్రేమ/అనురాగాలు, 2. తాత్వికత/మార్మికత.

"ప్రణయం/ప్రేమ/అనుబంధం" ఇందులో వ్యక్తులు/ ఒక అంశంతో తనకుగల అనుబంధంలోని అంతఃసౌందర్యం ఉంటుంది. *బావ మరదళ్ల మధ్య ఉండే సరసం, అలకలు, తల్లీ బిడ్డల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమ / అన్నాచెల్లెళ్ల అనురాగాలు / పల్లెటూరిపై ఉండే మమకారం / తను చేసే పనిపై ఉండే ఇష్టంవంటివి.*

"తాత్వికత/మార్మికత" తన చుట్టూ జరిగే సంఘటనల వెనుక ఉన్న తన ఆలోచనలకు, మేధస్సుకు అందని అలౌకిక భావనలను తత్వంగా వర్గీకరించారు. జననం – మరణం, కర్మ ఫలం, దైవంవంటివి. మానవుడికి లిపీ పరిచయం అయిన తర్వాతనే వేదాలు పురాణాలు ఇతిహాసాలు కావ్యాలువంటి శిష్ట సాహిత్యం పురుడుపోసుకుంది. కానీ లిపి ఏర్పడక ముందే జానపద సాహిత్యం జన్మించి, తనకంటూ ఒక అస్తిత్వాన్ని ఏర్పరచుకుంది. అలా చూస్తే మానవుని తొలి సాహిత్యంగా జానపద సాహిత్యం నిలుస్తుంది. "సాహిత్యానికి అల్లిక నేర్పించింది జానపదం అయితే సాహిత్యానికి రాత నేర్పించింది మాత్రం శిష్ట సాహిత్యమే. కానీ అల్లిక అంటరానిదైంది రాత రాజై కూర్చుంది."

జానపదులు పుట్టినప్పటి నుంచి చనిపోయేంతవరకు తాము జరుపుకునే వేడుకల్లోనూ తాము చేసే ప్రతి పనిలోనూ ఉన్న మూల తత్వాన్ని పాటల రూపంలో పాడుకునేవారు. అందులోనే ప్రేమ, హాస్యం, వెటకారం, ఆవేశం, బాధ, భక్తి.. వంటి ఎన్నో భావోద్వేగాలను చేర్చేవారు.

"లాలి పాటలు" ప్రతి తల్లి తన బిడ్డ నిద్రపుచ్చడానికి లాలి పాటలు పాడేవారు.

"శోభనం" మంగళ హారతి ఇచ్చే సమయాల్లోనూ, మంగళ స్నానాలు చేయించే సమయాల్లోనూ ముత్తయిదువులు పాడే పాటలను శోభనం అనేవారు.

"సువ్వి" ధాన్యం దంచేటప్పుడు పాడే పాటలు.

"ఏలలు" నాయకుని గురించి నాయక ఆహ్వాన పూర్వకంగా పాడే పాటలు.

"అప్పగింతల పాటలు" తల్లి తన కూతురికి పెళ్లి చేసి అత్తవారింటికి పంపే సందర్భంలో అత్తవారింట్లో ఎలా విధంగా నడుచుకోవాలి తెలియజేస్తూ పాడే పాటలు.

జానపదులు కేవలం పాటనే కాదు తమ విరామ సమయాన్ని ఆహ్లాదంగా గడపడానికి ఎన్నో కళారూపాలు కూడా సృష్టించుకున్నారు, అవి– "కురవంజి తోలుబొమ్మలాట వీధి నాటకం యక్షగానం బుర్రకథ హరికథ.." మొదలైనవి.

జానపదుల కథలన్నీ గేయ రూపంలోనే ఉంటాయి. మనిషి తలచుకుంటే దేన్నైనా సాధించగలడు అనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉంటాయి. జానపద కథలు ఎక్కువభాగం వీరరస ప్రధానమైన కథలు ఉంటాయి. గాయక భిక్షువులు వీటిని ఊరూరు తిరుగుతూ పాడుతుంటారు.

జానపదులు తమ కోసం మరణించిన వీరులను, వ్యవసాయానికి చెందిన దేవతలను, చెట్లు పుట్టలు పశువులు జంతువులు మొదలగు ప్రకృతిలోని ప్రతి అంశాన్ని దైవంగానే పూజించేవారు. జానపద సాహిత్యమంతా కేవలం సాధారణ మానవుని జీవితాన్ని, శ్రమైక్య జీవన సౌందర్యాన్ని గురించి వివరించేవి. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయేంతవరకు అతను చేసే కార్యక్రమాలను అతడి సంపూర్ణ జీవన చక్రాన్ని రసరమ్యంగా వర్ణించేదే జానపద సాహిత్యం. జానపద సాహిత్యంలో పురుషులతోపాటు స్త్రీకి కూడా సమ ప్రాధాన్యం ఉంటుంది జానపద సాహిత్యంలో స్త్రీని ప్రేమకు ప్రతిరూపంగా, దైవాంశంగాను భావించేవారు.

ఇలా శిష్ట సాహిత్యానికి ఏ మాత్రం తీసిపోని అద్భుతమైన సాహిత్యంకలది జానపద సాహిత్యం. కానీ వీటికి గ్రంథస్థం లేకపోవడంవలన, పండితులు శిష్ట సాహిత్యంపట్ల చూపినంత ఆదరణ దీనిపట్ల చూపకపోవడంవలన అంతగా ప్రాధాన్యం పొందలేకపోయాయి. రాజులు జమీందార్ల ప్రేమకథలు ప్రణయగాథలు శృంగార విలాసాలు గురించి వివరించే కవులు పండితులకు జానపద సాహిత్యం అనేది అంతగా మింగుడుపడని విషయమే. వారి దృష్టిలో జానపద సాహిత్యం అంతా గాలివాటపు కవిత్వమే. విస్తృత పరిధి, సామాన్యుడి జీవితానికి సారూప్యత ఉండటంవలన సమాజాన్ని జానపద సాహిత్యం చైతన్యం చేసినట్లుగా శిష్ట సాహిత్యం చేయలేకపోయింది. అందుకే పదకవులు తమ భావజాలాన్ని ప్రసరింపజేయడానికి జానపద సాహిత్యాలనే ఎన్నుకొన్నారు. చరిత్రలో ఎన్నో ఉద్యమాలు ప్రజలను

చైతన్యం చేయడానికి జానపద సాహిత్యాన్ని మాధ్యమంగా ఎన్నుకొన్నారు. జానపద సాహిత్యం ఒక భాషకు, ఒక జాతికి, ఒక దేశానికి, ఒక కాలానికి సంబంధించినది కాదు. ప్రతి భాషలోనూ, ప్రతి జాతిలోనూ జానపద సాహిత్యం ఉంటుంది. ఇది సార్వజనీనమైనది అలాగే జానపద సాహిత్యం అనేది నిరంతర ప్రక్రియ, పాత కొత్తల కలయిక.

సాహిత్యం అంటే సంస్కృతిని ప్రతిబింబించేలా చేసేది అని అర్థం. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలువంటి నిబద్ధ విషయాలను పూర్వుల లక్షణాలు, నిర్దిష్టతలకు అనుగుణంగా ఒక రూపాన్ని సంతరించుకున్న శిష్ట సాహిత్యంకంటే సామాన్య మానవుని జీవన విధానానికి, కళాత్మక అభివృద్ధిని జోడించిన జానపదమే సాహిత్యం అన్న పేరుకు అసలైన అర్హత కలది. కానీ సాహిత్య చరిత్ర రచనకు యోగ్యమైన తత్వం లేకపోవడం మూలాన జానపద సాహిత్యం గుర్తింపు నోచుకోలేక పోయింది. అలా అని కవులందరూ పూర్తిగా జానపద సాహిత్యాన్ని విస్మరించలేదు. కొంతమంది కవులు సమయానుగుణంగా తమ రచనల్లో జానపద సాహిత్యము సైతం చొప్పించారు. మరికొంతమంది జానపద సాహిత్యంనే రచన మాధ్యమంగా ఎన్నుకున్నారు.

నన్నయ్య నాగీ గీతాలుగా, నన్నెచోడుడు గౌడ్ గీతాలు, అంకమాలికలు, ఆరతులు అన్న పేరుతో పాల్కురికి సోమనాథుడు సువ్వి పాటలు, శంకర పదాలు, ఆనంద పదాలు, తుమ్మెద పదాలు వెన్నెల పదాలు గొబ్బి పదాలు అన్న పేరుతో తమ రచనల్లో జానపద సాహిత్యానికి సైతం స్థానం కల్పించారు. శివకవి యుగంలో దేశి కవులంతా జానపద సాహిత్య రచనకే మొగ్గు చూపించారు. శ్రీనాథుడు తాను రాసిన "పల్నాటి వీర చరిత్ర"లో జానపద సాహిత్యం గురించిన వివరణ కలదు. వేమన వీర బ్రహ్మంవంటివారు తమ రచనల్లో జానపదుల వికాసానికి ఆసక్తి కనబరిచారు. అన్నమయ్య అచ్చమైన తెలుగు బాణీలలో పాటలు పాడి ప్రజలలో సామాజిక చైతన్యాన్ని కల్పించారు. అన్నమయ్య కవిత్వంలో జానపద సాహిత్యం అంతర్భాగమై విలసిల్లుతుంది. కానీ ఆధునిక కాలంలో రచయితలంతా వివిధ భావజాలం అన్న పేరుతో జానపద సాహిత్యాన్ని పూర్తిగా విస్మరించారు. పాశ్చాత్యులలో తొలిసారి జానపద సాహిత్యంపై ఆసక్తి కనబరిచినవారు గ్రిమ్స్ సోదరులు. తొలినాళ్ళలో జానపద సాహిత్యంలో "పాపులర్ ఆంటీక్విట్స్" అన్న పేరుతో పిలిచేవారు. వాటికి folk lore పేరును సూచించినవారు విలియం జాన్ థంస్. అందుకే అతడిని శబ్దబ్రహ్మగా పిలుస్తారు. జానపద సాహిత్యంను వాటి స్వభావాల ఆధారంగా విభజించివారు R.S. భాగ్స్ & డార్సన్. పాశ్చాత్యులలో జానపద గేయాల సేకరణకు ఆద్యుడు కె.ఎ. బోయల్.

తెలుగునాట జానపద విజ్ఞానం గురించి శాస్త్రీయ పద్ధతిలో కృషి చేసింది కల్నల్ మెకంజీ. జానపద సాహిత్య అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి నేదుకురి గంగాధరంగారు. జానపద సాహిత్య అభివృద్ధికి తన పొలాన్ని సైతం అన్ని వేసి, అనేక ప్రాంతాల్లో పర్యటించి 6 వేలకు పైగా జానపద గీతాలు సేకరించారు. జనపదం అన్న పదాన్ని జన భాహుళ్యంలో ప్రచరం చేసిన ఘనత ఇతనికే దక్కుతుంది. అందుకే ఇతడిని జానపద వాఙ్మయోద్ధరకుడుగా ఇతడిని కీర్తిస్తారు. జానపద విజ్ఞానం గురించి తొలిసారిగా పరిశోధన చేసిన వ్యక్తి బిరుదురాజు రామరాజు గారు. ఇతడు "జానపద గేయ సాహిత్యం"పై విశేష కృషి చేశారు. జానపద సాహిత్యంను మానవతా దృక్పథంతో పరిశోధించిన మరో వ్యక్తి నాయని కృష్ణకుమారిగారు. జానపద సాహిత్యంలోని కళాత్మకత, సాహిత్యత వెలుగులోకి వచ్చిన తర్వాత ఎన్నో విశ్వవిద్యాలయాలు జానపద సాహిత్యంపై పరిశోధన అవకాశాలు కలిపిస్తున్నాయి.

జానపద సాహిత్యము సామాన్య మానవుని జీవన విధానంను వివరించటమేకాక ఆనాటి రాజరిక పరిపాలనలోని అసలైన సామజిక జీవన చిత్రణను నిక్కచ్చిగా వివరిస్తుంది. సమాజంలోగల విభిన్న కుల, మత, వర్ణాల సమైక్య జీవన విధానంలో ఇమిడివున్న అంతఃసౌందర్యాన్ని ఆనాటి సమాజ నిర్మాణ చట్రాన్ని పరిపూర్ణంగా, కళాత్మకంగా వివరించగలిగేది జానపద సాహిత్యం మాత్రమే.

ఒక్క మాటలో చెప్పాలంటే జానపద సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అంటే మానవ సంఘ సంస్కృతిని అధ్యయనం చేయడమే!!!!

ఎమ్. కురుమయ్య యాదవ్
హైదరాబాద్.
ఫోన్: 779 955 3493.

# కోయ చినుకుముగ్గు

– *నాగజాను సూరేపల్లి*

**పరిచయం:**

దక్కన్ పీఠభూమిలో తెలంగాణ ఒక ప్రాంతంగా భారత చారిత్రాత్మకంగా దక్కన్ పీఠభూమిలో 112, 077 చదరపు కిలోమీటర్లు. ఈ మధ్యకాలంలో 2 జూన్ 2014న ప్రత్యేక తెలంగాణ భారత పార్లమెంట్ ద్వారా రూపాంతరం జరిగింది. తెలంగాణ ప్రాచీన సాంస్కృతికంగా, చిత్ర, శిల్పకళగా, చారిత్రాత్మకంగా, ప్రత్యేకంగా జానపదం,గిరిజన విజ్ఞానం, చిత్ర, శిల్పకళ వర్ధిల్లింది అని చెప్పవచ్చు.

"ఆర్ట్" అంటే "కళలు" ఇంగ్లీషులోని ఆర్ట్ అనే పదం ఆర్ట్స్ అనే గ్రీకు భాషాపదం నుంచి వచ్చింది. ఆర్ట్స్ అంటే ప్రకృతి కానిది అని అర్థం (Art is that which is not nature) కళ. కృత్రిమంగా రూపొందించబడినది అని అర్థం. "Art Imitates Nature" అని అరిస్టాటిల్ చెప్పాడు. మనిషి ప్రకృతిని చూచి దానికి అనుకరణగా కళను రూపొందించాడు. అందులో కళలు కూడా ఉన్నాయి. అందువల్లనే "Nature Taught Art" ప్రకృతిలో కళలు నేర్పింది అని మిల్టన్ చెప్పారు. చెప్పేదేమిటంటే జానపద, గిరిజన కళలను చాలావరకు మనిషి, ప్రకృతిని చూచి సృష్టించాడు. అయిన ప్రకృతిలో ఉన్నదాన్నే ఉన్నట్లుగా కాకుండా, ప్రకృతి అతని మనస్సుకు గోచరించినట్లుగా చిత్రించాడు. అంటే మనిషి ప్రకృతిలో ఉన్నదాన్ని చూసి దానిని ప్రతి సృష్టి చూశాడన్నమాట. తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్న వేల యేండ్ల మూలవాసి ఆధారాలు, జానప నమూనాలు, శాతవాహన, కాకతీయ శిల్ప, సాంప్రదాయ సంపద తెలంగాణ విశిష్టతను పరిపూర్ణం చేస్తాయి.

తెలంగాణలో రాతి చిత్రకళలు, శిల్పకళలు మరియు దేవాలయాలు కట్టడాలు, పెంబర్తి నగిషీలు, చిత్రకళ, నిర్మల్ బొమ్మలు, దక్కన్ చిత్రకళ, కోలలు, భూదాన్ పోచంపల్లి చేనేత పరిశ్రమ, చేతివృత్తి కళలు, ఆదివాసిల నాగరికత, శిల్ప, చిత్రాలు, ఇలా ఎన్నో కళల నిలయం తెలంగాణ. తెలంగాణలో గిరిజన 11 తెగలు అందులోని వివిధ ఉపతెగలు ప్రజల జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రకృతి జీవనంలో ఇమిడి ఉంటుంది.

**గిరిజన సమాజ సంస్కృతి, జీవన విధానం కళలు ప్రకృతి వ్యక్తీకరణమే గిరిజన సంస్కృతి కళలు:**

సమాజం మారినా గిరిజన జీవన విధానం, కళలు కూడా కొంత మార్పు జరుగుతుంది. గిరిజన విధానం వ్యక్తికరణలో ప్రధానంగా గిరిజన కళలు ఉంటాయి. ఇవి ఆదివాసి సంస్కృతిక సమాజం నుండే వచ్చాయి. భారతీయ ఆదివాసి సమాజం విశేషంగా గిరిజన సమాజం ఒక సాంప్రదాయక సమాజం. కాబట్టి అది చిన్నచిన్న జన సమూహాలుగా వివిధ తెగల రూపంలో, దొంతరలమాదిరిగా విభజించబడిన భూమి ప్రాధాన్యతగల సమాజం దీనిలోని ప్రతి అర ఒక విశిష్ట జీవన శైలిలో కూడిన సంస్కృతి కళలు కలిగి ఉంటుంది. ఏ సమాజమూ ప్రపంచంలో వస్తున్న మార్పుల నుండి అతీతం కాలేదు. ప్రపంచంతో పాటు తనూమారుతూ ఉంటుంది. భారతదేశంలో ప్రత్యేకించి గిరిజన సమూహంలో ఇతోధికమయినా మార్పులు చేర్పులు చూడవచ్చును. ఒక తరం నుండి మరొక తరానికి ప్రతిబింబింపజేసే సంస్కృతి సాంప్రదాయాలను కళలను విజ్ఞానంగా చెప్పవచ్చు. ఆదివాసిలు ఎక్కువగా అడవి, ప్రకృతితో ముడిపడి ఉంటుంది. వీరు ఎటువంటి పండుగలు, దేవతలను, ఉత్సవాలు, జాతరలు జరుపుకుంటారు. నిత్య జీవితంలో దైనందిన అవసరాలకు వారు ఏ వస్తువులు తయారు చేస్తారు, దానిలో కళలను మలుచుకుంటారో, పుట్టినప్పటి నుండి మరణించేవరకు వారు వివిధ కార్యక్రమాలను జరుపుకుంటారు, అందులో వారు చిత్ర, శిల్పి, అలంకరణ నమూనాలు, చేతి పనులు, వారి ఆహారపు అలవాట్లు, వేషధారణ, పోషించిన కళలు, వాస్తు, భాషా, సాహిత్యం, ప్రత్యేక సమయంలో విరామ సమయంలో,

మానసిక శారీరక ఉల్లాసం కోసం ఆడుతూ, పాడుతూ, జాతర, ఉత్సవాల్లో వారి కళత్మకతను చూడవచ్చును. ఈ తరుణంలో తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలో గొండ్, కోయ్య, వాటి ఉపతెగలు నాయక్ పోడ్, తొటి, ఓజాల కళ రూపాలు చూడవచ్చును. వీరి కళలు ఆధునికత మార్పు జరుగుతూ వస్తుంది.

**గిరిజన కళలు కళారూపాలు:**

అడవిలో దొరికే కలపను వాటి యొక్క నారను వెదురును ఇతరవాటిని ఉపయోగించి వారికి జీవన వినియోగంకొరకు అవసరంగా మలుచుకుంటారు. చేతివృత్తులు, చాటలు, బుట్టలు, తడకలు, ఉయ్యాలలు, బుర్రకాయలు, గాదెలను, ఇల్లు, వేటకు అవసరము వాటిని వివిధ వస్తువులు తయారు చేసుకుంటారు. ఆదివాసిలో గ్రామాల్లో పెళ్ళి, పండుగలు, జాతరల్లో, ఇంటిలోను గోడలకు చిల్లు, ముగ్గు మరియు వివిధ రకాలుగా ముగ్గులు వేస్తారు. అందులోను ఐరన్‌కుండలు, పెళ్ళి, దేవర సమయంలో గిరిజనులు వాటిపైన అలంకరణతో తయారు చేస్తారు. వీటిని పవిత్రంగా చేస్తారు. గిరిజన ఉపతెగలలో తొటి అనే తెగవారు దేవర, ఇతర సాంకేతిక చిహ్నాలు, పేర్లు ఇతరవాటిని అచ్చు అలంకరణం చేస్తారు. మరొక తెగవారు గోండులో ఓజా అనేవారు చిన్న చిన్న రాగితీగలు, మైనపు తీగలతో కంచు బొమ్మలు, జంతువులు, వారి దేవతలు, పక్షులు, అవసరమైన వాటిని ఎంతో శ్రద్ధతో తయారు చేస్తారు.

**కోయ కళరూపం:**

సంప్రదాయ కోయ నృత్యానికి తోడుగా ధిమిస మరియు డాల్ గుడ్డలను జోడించడంవలన కథావివరణ మరింత ఆసక్తికరంగా మారిందనటంలో ఎలాంటి సందేహము లేదు. ఆసక్తికరమైన కథావివరణలో కోయ జీవితాలను మరింత కళాత్మకంగా వివరించడం జరిగింది. ఇందులో ఉపయోగించే డాల్‌గుడ్డ రంగురంగుల వస్త్రాల మీద కోయ కళాత్మక జీవితాలను చిత్రించడం ద్వారా మరింత ఆసక్తి నెలకొల్పబడింది. ఇందులో ముఖ్యంగా వారు వారి గుడిసెలను లేదా ఇండ్లను అందుబాటులో ఉన్నకలప, వెదురు బొంగులు, తాటి ఆకులను ఉపయోగించి, ఆకర్షణీయంగా తయారుచేస్తారు.

**చినుకు / చిల్లుకు / చిల్లు కళ:**

అలా నిర్మించిన ఇండ్లను ప్రత్యేకమైన ఆర్ట్‌తో సుందరీకరిస్తారు. అందులో ముఖ్యంగా చినుకు కళ. ఇది కూడా సాంప్రదాయబద్ధంగా అనుసరిస్తున్నదే. ఇందులో వివిధ రకాలైన డిజైన్‌లు, ఆకృతులు కన్పిస్తాయి. అలాగే వారి ఇండ్లను ఎర్రమట్టి, నల్లమట్టి (పుట్టమట్టి) పెండలను కలిపిన మిశ్రమంతో ఇంటిలోపల మరియు బయట గోడలకు పూయడం మరియు ప్రత్యేక కళాత్మక చిత్రాలు చినుకు ముగ్గుతో చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ డిజైన్‌లను (నమైనా అలంకరణలు) మెత్తగా మారిన బియ్యం పిండితో కూడిన ద్రవమిశ్రమాన్ని చేతివేల్లతో చిలకరించడం ద్వారా ప్రత్యేకత సంతరించుకుంది. కొన్నిసార్లు బియ్యపిండి కుంకుమ కూడా ఉపయోగిస్తారు. డిజైన్ కొరకు మట్టిపెండ మిశ్రమంతో కూడిన దానిపై ఎరుపు, తెలుపు గోధుమ రంగుగీతల ద్వారా మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. బియ్యాన్ని చీమలకు ఆహారంగా కూడా దీనిని ఉపయోగిస్తారు. అంటే ప్రకృతిలో భాగం వీరు ప్రకృతిలో జీవులకు ఆహారంగా ఇస్తారు. ఇలా బొమ్మలను గీతలు, చుక్కలు, చేతి చిలకరింపులతో ప్రత్యేకంగా ఉంటుంది. ప్రస్తుత ప్రపంచంలో విద్యావంతులు అయిన యువతులు మరికొన్ని ఆధునిక డిజైన్లు ఉపయోగించి సంప్రదాయ అలవాటుకు బిన్నమైన ఆకర్షణ సృష్టించారు. ఆధునిక యువతులు వారు పట్టణంలో నేర్చుకున్న ముగ్గులను కూడా జోడిస్తున్నారు. నా యొక్కక్షేత్ర పర్యటనలో కూడా సంప్రదాయ చిలు ముగ్గుకళ కేవలం సుదూర గ్రామలలో, దట్టమైన అటవి ప్రాంతాలలో (పెద్దమనుషులు) వారికి తెలిసిన వ్యక్తుల ఇంటిలో మాత్రమే కనిపిస్తుంది.

**చిలుకు ముగ్గు:**

తెల్లరంగు దీనితో తయారు చేస్తారు. చిలుకు రంగును బాగా నానబెట్టిన బియ్యం మెత్తగానూ తయారు చేస్తారు. అలా తయారు చేసిన మిశ్రమాన్ని గోడల లోపలినేల, బయటవైపు ఉండడం ద్వారా / పూయుడం ద్వారా ఆకర్షణీయంగా తయారు చేస్తారు. కొన్నిసార్లు చిన్న చిన్న రంగు రాళ్ళను కూడా గోడలో అమర్చుతారు.

చినుకు ముగ్గు ఎందుకు ఉపయోగిస్తారు? ఆకర్షణీయంగా ఉంచడం కొరకేనా? ఇదంతా తెల్ల రంగులను ఆకర్షణీయంగా ఉంచడంతో పాటు ఉపయోగించే మట్టిపెండ మరియు సున్నంలు సూక్ష్మజీవి సంహారిణిగా కూడా ఉపయోగ పడుతాయి మరియు బ్యాక్టీరియా (వైరస్‌ల నుండి తమను తాము రక్షించుకొనుట కూడా చినుకు ఆర్ట్

ఉపయోగపడుతుంది. వీటికి తోడుగా ఆదివాసి కళాకారుడు, బొక్కిలి నాగేశ్వరరావు గారి బంధువులు గారి పరిశీలన ప్రకారం సహజంగా కోయలు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటం. వారికి ఎలాంటి విద్యుత్ శక్తి అందుబాటులో లేకపోవడం వలన వెలుతురు సృష్టిలో భాగంగా గోడలకు తెల్లని బియ్యపు మిశ్రమ లేదా సున్నంలను బాగంగా గోడలకు తెల్లని బియ్యపు మిశ్రమ లేదా సున్నంలను ఉపయోగించడం వలన సహజ వెలుతురుని ప్రతిబింబించుట వలన కొంత వరకు వెలుతురు ఉంటుంది. సహజమైన చంద్రకాంతి పరివర్తనం చెంది వెలుతురు గుడిసెలలో ఉంటుంది. ముగ్గులతో ఇంటిముందు ఇంటిలోపల కూడా అలంకరించుట జరుగుతుంది.

**చినుకు టెక్నిక్ (పద్ధతి) మాత్రమే ఎందుకు?**

పూర్వకాలంలో మరియు ఇప్పటికి దూరప్రాంతాలలో కూడా ఎలాంటి విద్యుదీకరణ అందుబాటులో లేకపోవడం వలన ఏ పని చేసినా కూడా పగలు మాత్రమే చేయాలి అందులో రాత్రి సహజంగా వెలుతురు సృష్టించుకునే విషయంలో ఎలాంటి ఆర్ట్ ఉపయోగిస్తారు. గోడలు తయారికి అత్యధికంగా కోయల ఇండ్లు అన్నియు మట్టిగోడలు, ఎదురు బొంగులతో కూడిన గోడలు, తాటి ఆకులతో కూడిన పైకప్పులను ఉపయోగించి నిర్మించేవారు. అలా తయారు చేసిన గోడలను ప్రత్యేక ఆకర్షణీయంగా మరియు వెలుతు జోడించవచ్చు. మట్టిని బాగా నానా బెట్టి గోడలకు అవసరమగు విధంగా మిశ్రమలతో తయారు చేసుకొని కుండల నిర్మాణం చేస్తారు.

**చిలుకు ముగ్గు ఇతర కళలకుగల సంబంధం:** చిలుకు ముగ్గు చిన్న చిన్న చుక్కలు మరియు చేతి వేళ్ళతో (చిలకించుట) వలన ఏర్పడే కళాత్మక ఆకృతాలు అయిన చెట్లు, పర్వతాలు మరియు ఇతర కళాత్మక ఆకృతాలు ఏర్పడుతాయి. గోండు తెగలు కూడా కొన్ని కొన్ని కళా చిత్రాలను వేయుటకు చిన్న చిన్న చుక్కలు, గీతలు ఉపయోగించుట ద్వారా కళాత్మక చిత్రాలను వేయుట అనేది చిలుకు ముగ్గు అభివృద్ధి దిశగా గమనించవచ్చు. చిలుకు ముగ్గు చిలుకుట నుండి గీతలు మరియు ఆకృతులు మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. ఇలా చాలా సులభంగా డెకరేషన్ చేయుటకు అవకాశం కల్గింది. అందుకు ఇది చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిని చూస్తానికి చెట్టు, త్రిశూలం ఆకృతులు ప్రకృతి ఆకారాలు కూడా చూడవచ్చును.

గిరిజనులలో ఆదివాసిల తెగల జీవన విధాన కళారూపాలు, చిల్లు ముగ్గు ఇందులో చర్చించడం జరిగింది. అలాగే క్రమక్రమంగా మరుగునపడిపోతున్న ఆదివాసీల కళలను కొంత వరకు పరిశోధనలు జరగాలి, అలాగే వారి కళారూపాలు వెలుగులోకి తేవడానికి ప్రయత్నం. ప్రపంచీకరణ వల్ల వారిజీవన విధానంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయి, తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఉదా వాటి ఇంటిలోని, పాత్రంలోని ఆధునీకరణ వస్తువులు, కళారూపాలు చూడవచ్చు. వీరి జీవనం, సంస్కృతిని, చిత్ర శిల్పకళలను ఇంకా పూర్తిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంటుంది.

ఈ నేపథ్యంలో ఆదివాసీలను కూడా ఇతర ప్రజల్లాగానే భావించాలని వారి కళరూపాలు గుర్తించాలని వేడుకుంటున్నారు. అలాగే పరిశోధకులు ఎన్నో పరిశోధనలు జరగాలని నా భావన.

నాగజాను సూరేపల్లి, వరంగల్. ఫోన్: 949 143 7460.

## తెల్లవారె!

<u>మోహనరాగము - ఝంపతాళము</u>

*మగువ తన కేళి కా - మందిరము*
*వెడలెన్*
*వగకాడ మాకంచి - వరద తెల్లవారె*
*ననుచు ॥*
*విడజారు గొజ్జంగి - విరిదం జడతోను*
*కదుచిక్కుబడి పెనగు - కంటసరితోను*
*నిదురకన్నుల దేరు - నిదురమబ్బుతోను*
*తొదరిపదయుగమున దడబడెడు*
*నడతోను!*

*సొగసి సొగయనివలపు - సొలపు*
*జూపుల తోను*
*వగవగల ఘనసార - వాసనల తోను*
*జిగిమించు కెమ్మోవి -*
*చిగురుకెంపులతోను*
*సగముకుచముల విదియ -*
*చందురులతోను*

*తరితీపు సేయు సమ - సురతి*
*బడలిక తోను*
*జరుతపావడ చెరగు - జార్పైట తోను*
*యిరుగడల కైదండ లిచ్చు*
*తరుణుల తోను*
*పరమాత్మ మువ్వగోపాల తెల్లవారె*
*ననుచు ॥*

క్షేత్రయ్య పదాలు - శ్రీనివాస చక్రవర్తి

**భా**ష పుట్టుక భావానికి పట్టం కట్టింది.

భావాల ప్రభావం తరాల అంతరాలు దాటి కాలాంతర ప్రస్థానంలో నాగరికతలు పుట్టించి, గిట్టించి, యుద్ధాలు చేయించి, స్మశానాలు (మరుభూములు) నిర్మించి మనిషిని సంఘంగా మార్చి, మళ్లీ ఏకాకిని చేసి, అద్వైతాన్ని ద్వైతంగావించి, లక్షల, వేల సంవత్సరాలలో ఇప్పటికీ ఒంటరిగా నిశ్శబ్దంలో నిలబెట్టింది.

నిశ్శబ్దం మేధోస్థితి, భావస్థితి. దీనికి వాహకమే శబ్దం. మాట నీ శబ్దం – నిశ్శబ్దంలో ప్రయాణించి, శూన్యంలో రూపుదిద్దుకుని, నా భావనలో లీనమవుతోంది.

మౌనం అవ్యక్త భాష. వాస్తవ భాష కూడా. నీ మాటకు మాటకు నడుమ మౌనం ద్వారానే నీ పదాలు అర్థమవుతున్నాయి. నా భావం నీకు చేరాలంటే నీ భాష నాకు తెలిసి ఉండాలి. నా మౌనం నీవు అవగాహన చేసుకోవాలి. నేనంటే నా ఆలోచనలే కదా! నేనంటే ఆలోచనలే – లేక ఈ ఆలోచనలతో నేనయ్యానా? అంటే నాకంటే ముందుగానే ఆలోచనలు ఉన్నాయి. ఇది బుద్ధుని బోధ కూడా. నీవు లేకపోయినా ఆలోచనలు ఉంటాయి అని! మరి నా మాట ద్వారానో – నా మౌనం ద్వారానో ఆలోచనలు నీకు చేరవలసిన అవసరం ఏముంది? శ్రద్ధగా వింటే నిశ్శబ్దం వినపడుతుంది – మౌనం అనుభవంలోకి వస్తుంది. ఆలోచన ఆత్మీయమై దర్శనమిస్తుంది.

* * *

గజిబిజి ఖగోళంలో చీకటి శూన్యంలో అనంత విశ్వంలో మనిషి ఆరాటాన్ని – మనసు సంవేదనలను – వెన్నెల నిశ్శబ్దాన్ని – చీకటి ఆక్రందననీ – అనామకుల నిష్క్రమణనీ – ఇవన్నీ గమనిస్తుంటే చివరకు మిగిలేది శూన్యమేనా? ఎంతటి విషాదం ఇది!

ఇదే ఆరాటంతో గ్రహాంతర యానాల్లో మనిషి చేస్తున్న అన్వేషణకు ఫలితాలు ఏమిటి? గురుత్వ శక్తి హీనతా? ఇది మళ్ళీ ప్రాణం పోస్తుందా? అయితే ఇక్కడి నిర్జీవులందరినీ చంద్రుని మీదకు తరలిద్దామా? అక్కడ అమృతం దొరుకుతుందా? ఓ చంద్రుడా చెప్పవా!

* * *

జీవితంలో ఎన్నో చూసి, ఎంతో నేర్చి, మరెంతో చదివి, దేనికీ కాకుండా ఏదో తీరాల్లో – ఎక్కడో అంచుల్లో నిలబడి – నేను ఏమిటి – నేనెవర్ని అని ప్రశ్నించుకుంటే – సమాధానం ప్రతిధ్వని మాత్రమేనా? గతంలో నుంచి, గత స్మృతులలో నుంచి రేపటిని నిర్మించే విధానంలో ఎంతో ఆశ ఉంది. ఎంతటి ఘర్షణ జీవితం! ఎన్ని రాపిడి రవ్వలు – అవేనా వెలుగులు?

# నిశ్శబ్దం

కానీ ప్రకృతిలో పునరుత్పత్తి ఎంత సహజంగా!

అందంగా అద్భుతంగా జరిగిపోతుంటుంది. చిన్న పక్షి వదిలిన తడి చుక్క – నేలలో ఇంకిపోయింది – వెలుతురికి – గాలికి – వసంతానికి – ఆ విత్తుకు ప్రాణం మట్టి పొరల్లోంచి చీల్చుకు వచ్చింది. వెలుతురులోకి ఆ చిన్న మొక్క కళ్ళు తెరిచింది. చిన్న పక్షి వదలిన చిన్న తడి!

* * *

మనం ఏం చేస్తున్నాం? ఎన్నో తయారు చేస్తున్నాం – అన్నీ అంతలోనే మొహం మొత్తుతాయి. మళ్ళీ కొత్తవి తయారు చేస్తుంటాం కష్టపడి – అదీ అంతే – మళ్ళీ కొత్తది కావాలి – కానీ ప్రకృతిలో వికసించే పూలు పాతపడుతున్నాయా? ఎప్పుడైనా మొహం మొత్తుతున్నాయా? ఏ పండయినా – పాతపడిపోతోందా? మనం సమూహాల్లో – సమావేశాల్లో పడి శబ్దాల జడివానలో చిక్కుపడి అసలు వినాల్సినవి – వినలేకపోతున్నాము – చూడవలసినవి కూడా చూడలేకపోతున్నాం – ప్రకృతిలో ఎప్పుడు – ఎలా అనుసంధానం పొందగలం? శబ్దానికి – నిశ్శబ్దానికి అద్వైతీకరణ జరిగినట్లుగా – మనిషికి – ప్రకృతికీ జరగగలదా?

ఈ జన్మకి – ఈ నేలకీ – ఈ బంధాలకీ – గాయాలకీ దుఃఖానికి – పరిసరాలకీ – పరివారానికీ వీడ్కోలు చెప్పగలమా – మరో గ్రహానికి – ఈ ప్రపంచాన్ని వదిలి పోగలమా? మరో దేహానికి మారగలమా?

నా అంతరంగంలో నిశ్శబ్దంగా ఎన్నో గంటలు మోగుతూనే ఉన్నాయి. మరి నేనెటు పోవాలి? ఎలా పోవాలి?

అయినా వెళ్లకుండా వచ్చేది ఎలా?

Tail Spark: I tried to live in simple way

Oh! Why it's so difficult!?

* * *

**సహజీవనం:**

అతను చిన్నప్పుడే చిన్న మొక్క నాటాడు. రోజూ ఆడుతూ ఇన్ని నీళ్లు పోసేవాడు. పాడుతూ ఆకులు నవనవలాడుతూ గాలికి ఊగటం చూసి నవ్వేవాడు. ఆ మొక్క అతనితోపాటే పెరుగుతూ వచ్చి చెట్టయింది. అతడు చెట్టు నీడలో నులక మంచం మీద పడుకునేవాడు. నల్లటి పళ్లు రాలి పడుతుండేవి. తింటూ మబ్బుల్నీ, ఆకాశాన్ని చూస్తూ పిల్లల్ని పెంచాడు. వెన్నెలలో పెళ్లాంతో సరసలాడాడు. పొలం పనులు చేసి వచ్చి, బావి నీళ్లతో ఒళ్లు తడుపుకునేవాడు. చెట్టు పెరిగి పెద్దదైపోయింది. ఆకులు రాలుస్తోంది, కొమ్మలు కొన్ని విరిగి పడుతుండేవి. అవి ఏరి చలికాచుకొనేవాడు. నడివయస్సు దాటిపోయింది. చెట్టు నీడను ఇస్తూనే ఉంది. అతనికి వయస్సు మీద పడుతోంది. పిల్లలు పెరిగి ఎటో వెళ్లిపోయారు. పెళ్లాం కాలంలో కలసిపోయింది. చేతిలోకి వెదురు కర్ర వచ్చి చేరింది. కళ్లకు జోడు ఎప్పుడో వచ్చింది. అతని పళ్లు ఒక్కొక్కటీ రాలిపోతున్నాయి. చెట్టు పళ్లు రాల్చడం ఆగిపోయింది. పొలం పనులు చేయలేకపోతున్నాడు. చెట్టు కొమ్మలు చాలా ఎండి, విరిగిపడుతున్నాయి. కొత్త చిగుళ్లు తగ్గిపోయాయి. అతను ఎండి ఎముకల గూడులా మంచం మీద పడి ఉండేవాడు. చెట్టు కూడా ఎండిపోవటం చూస్తూనే ఉన్నాడు. ఒకనాడు గాలి, ఉరుములకు చెట్టు కూలిపోయింది. కుదురులో తడే లేదు. ఇద్దరు ముగ్గురు వచ్చి గొడ్డలితో కూలిన చెట్టును కట్టెలుగా నరికారు. ఆ తర్వాత కొద్ది రోజులకే అతను పండిన ఆకులా రాలిపోయాడు. మరుభూమికి అతనిని మోసుకుపోయారు. పెరటిలో కట్టెలుగా మారిన, అతను నాటిన చెట్టు అతనితో సహగమనం చేసింది.

*"…. రవీంద్ర స్మృతి* ***మిసిమి*** *నవంబరు – 2021 సంచిక చూసి ముగ్ధుడనై, ఇంకా ఆ భావ పరంపరతో కూడిన ఆనందంలో ఉన్నాను. లలిత లతంగతా పరిశీలన కోమలమలయ సమీరే! అంటూ పాడుతూ నాట్యం చేస్తున్నాను. జయదేవుడు రసికావతంసుడు. నిజంగా! పద్మావతీచరణ చారణ చక్రవర్తి సుమా! పద్మావతి తెలుగింటి ఆడబిడ్డ. ఆమె నృత్యం చేస్తుంటే జయదేవుడు పాడుతూ ఆనందం నర్తనం చేస్తాడన్నమాట. జయదేవుడు అష్టపదులు సంస్కృతంలో వ్రాసిన ఆదిశంకరులవారికి మించిపోయారనిపిస్తుంది. సకల మాధుర్యంతో తెలుగులో 1930 ప్రాంతంలో పద్మావతీ చరణ చారణ చక్రవర్తి అనే పద్యరూపకాన్ని తల్లావఝుల శివశంకర శాస్త్రిగారు వ్రాశారు. వారు తరంగాలు వ్రాసిన నారాయణ తీర్థులవారి వంశానికి చెందినవారు. నవ్యసాహిత్యానికి ఆద్యులు. ఆ రమణీయమైన చిత్రాలను చూస్తూ రసజగత్తులో విహారం చేస్తున్నాను. అందమైన, ఆకర్షణీయమైన ముద్రణా సౌందర్యంతో* ***మిసిమి*** *మెరిసిపోతూ పాఠకుల చేతిలో వాలింది. రవీంద్రనాథ్‌గారి విశ్వజనీనమైన సంస్కారానికి ముచ్చటపడినా వారిని చూడలేకపోయానే అని మనస్సులో బాధగా మూలుగుతున్నాను. నవంబరు – 2021 సంచికలోని ప్రతి రచనా పరమాద్భుతంగా ఉంది. పప్పు వేణుగోపాలరావుగారు జయదేవుని అష్టపదులు చదువుతూంటే ఆచార్యులు పప్పు వేణుగోపాలరావుగారు పీఠం మీద కూర్చుని పాఠం చెబుతున్నట్లుగా ఉంది. నాదోపాసిని నటరాజ రామకృష్ణ గారి రచన రమ్యంగా ఉన్నది. నటరాజ రామకృష్ణ గారు నిలువునా నిండైన కళాకారుడు. పూర్వపు దేవదాసీలందర్నీ కలసి వారి నుండి నృత్య నృత్త రీతులను గురించి అధ్యయనం చేసి జాతికి అందించిన నాట్యకళాశీలి రామకృష్ణ. బెంగుళూరు నాగరత్నం విద్యాసుందరి. నాట్యకళాకారిణి. అంతకంటే గొప్ప సంగీత విద్వాంసురాలు. ఏ కర్ణాటక సంగీత విద్వాంసుడు చేయలేని కార్యక్రమాన్ని నాగరత్నం తీసుకుని త్యాగరాజస్వామి వారి ఆరాధనా మందిరం కట్టించి శాశ్వత కీర్తిని పొందారు ఆమె. కర్ణాటక సంగీత విదుషీమణి. దక్షిణ భారతీయులకు ప్రాతఃస్మరణీయురాలు. దేవదాసి చట్టాన్ని రద్దు చేయకుండా ఆనాటి ప్రభుత్వంతో కందుకూరి వీరేశలింగంగారితో పోరాడిన వీర నారీమణి. ఈ రచన ద్వారా ఎన్నో నూతనమైన విషయాలు విన్నాను. తనికెళ్ల భరణిగారు గొప్ప నటులే కాదు మంచి రచయిత కూడా! గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారిని గురించిన రచనలో సంగీతం విన్నాను. పారుపల్లివారి గురువులు సుసర్ల దక్షిణామూర్తిగారి పేరిట ఆరాధనోత్సవాలు నిర్వహిస్తే పారుపల్లి వారి శిష్యులు, అత్యంత గురు సన్నిహితులూ అయిన అన్నవరపు రామస్వామిగారు పారుపల్లివారి పేరిట ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ రావటం గురుభక్తి, సంప్రదాయం – సంస్కృతీ సంపదా గుర్తుచేస్తున్నారు. ఈ తరంవారు కొంచెమైనా తెలుసుకుంటారు! బుద్ధుని తాత్వికతా – సూయాజ్ కాలువ – అచ్చమాంబ – నిడదవోలు మాలతిగారి అనువాద సాహిత్యం ఇవన్నీ మనసులో గుడికట్టి పూజించుకుంటున్నాను…."*

*– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు. ఫోన్: 954 211 8184.*

# విలియం హోగార్త్

(1697–1764)

*– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*



విలియం హోగార్త్

18వ శతాబ్దపు తొలి సగంలో అవినీతికి మారుపేరు లండన్ నగరం. దుర్లక్షణాలు, పాశవిక వినోదాలకు నిలయం. ద్వంద్వయుద్ధాలు, వ్యభిచారం, కోళ్ళ పందేలు, కట్టేసిన ఎలుగు మీదికి కుక్కలను ఉసిగొలిపి ఆనందించే 'జంటిల్మెన్' వినోద కాలక్షేపాలు ఒక పక్క; ఇంద్రియ లోలత్వం, ఉన్నత కుటుంబాల్లో పని పిల్లలను పాడుచేసే సాధారణ విచ్చలవిడితనం ఇంకోపక్క వీటికి తోడు సంస్కారం లోపించిన ఉన్నత వర్గం, జూదగాళ్ళ చేతుల్లో మోసపోయే సాధారణ జనం, జిన్‌లో మునిగి తేలే నిమ్న తరగతులవారు. అంగరక్షకుడు తోడు లేకుండా రాత్రుల్లో వీధుల్లో తిరగలేని పరిస్థితి, పొగమంచులో ఐరిష్ రౌడీ మూకల చేతుల్లో దాడికి గురి అయ్యే ప్రమాదం పొంచి ఉండేది. పూట గడిస్తే చాలన్నట్లుగా పెన్నీకొక పంక్తి రాసిచ్చే చౌకబారు రచయితలు, షిల్లింగుతో తృప్తిపడే వేశ్యలు, మురికివాడల్లో (గ్రబ్ స్ట్రీట్) జీవితం, కళారంగంలో చీకటి వ్యాపారులు – ఇటలీ కళాఖండాలను చోరీ చేసి వేలంపాటలో అమ్ముకుని పొట్ట నింపుకోవడానికి నిత్యం పోరాటం చేసే సామాన్య ప్రజలు – ఇదంతా ఒక పార్శ్వం. అటువంటి మురికి, పాపపు కాలంలోనే వెలసి ఇంగ్లండు కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన శక్తివంతమైన మర్యాదస్తుల బృందం: గలివర్ సృష్టికర్త జోనాథన్ స్విఫ్టు, తొలి నిఘంటు నిర్మాత, రచయిత శామ్యూల్ జాన్సన్, నవలా, నాటక కర్త హెన్రీ ఫీల్డింగు, నటుడు డేవిడ్ గారిక్, శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్, పెయింటర్ ఎన్‌గ్రేవరు విలియం హోగార్తుల బృందానిది మరో పార్శ్వం". ప్రముఖ కళా చరిత్రకారుడు, విమర్శకుడు థామస్ క్రేవన్ కళ్ళకు కట్టినట్లు వర్ణించిన లండన్ దృశ్యం యిది. విలియం హోగార్తు లండన్‌లో దిగువ మధ్యతరగతి కుటుంబంలో 1697లో జన్మించాడు. తండ్రి లాటిన్ టీచర్, తల్లి ఏన్‌గిబ్సన్ గృహిణి– భార్య జేన్ థార్న్‌హిల్. తొలినాళ్ళలో లెస్టర్ ఫీల్డ్ దగ్గర అప్రెంటీస్‌గా శిక్షణ పొందాడు. ఎన్‌గ్రేవింగ్‌లు, ఇటలీ ఫ్రెంచి పెయింటింగు చెక్కడపు పనితో ప్రభావితుడౌతాడు. నైతికాంశాల మీద వరుస చిత్రాలు (సిరీస్) వేశాడు. కథాత్మక చిత్రాల్లో నాటి సాంఘిక దురాచారాలను చూపించాడు. 'రాయల్ సొసైటీ ఫెలో ఆఫ్ ఆర్ట్స్' గౌరవాన్ని పొందాడు. రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేయడంలో ప్రత్యేకమైన శైలిని పాటించాడు. తర్వాత అదే 'హొగార్తియన్ శైలి'గా గుర్తింపు పొందింది. అటువంటి కాలంలో– అందరికన్నా భిన్నంగా స్వానుభవాలను, సామాన్య ప్రజా జీవితాన్ని తన చిత్రాల్లో చూపించిన కళాకారుడు, పెయింటర్, ప్రింట్ మేకర్, ఎన్ గ్రేవర్, కార్టూనిస్టు, సాంఘిక విమర్శకుడు. విలియం హోగార్త్ చిత్రాలలో వాస్తవికతను చూపించి ఉన్నత శ్రేణి కళాకారుడిగా పేరు గడించాడు.

హోగార్తు పుట్టిందీ, పెరిగిందీ, మరణించిందీ అంతా లండన్‌లోనే. లండన్ లంచగొండులకూ, అవినీతి ఆర్టిస్టులకూ, వ్యభిచారులకూ నిలయమైనప్పటికీ నగరాన్ని అమితంగా ప్రేమించాడు. నగరంలో జరిగే ఏ సంఘటనైనా హోగార్త్ దృష్టి నుండి తప్పించుకోలేకపోయేది. సంతలు, సత్రాలు, (ఇన్స్) బూతు చిత్రప్రదర్శన, ఎన్నికల దొమ్మీలు, పల్లె డాన్సర్లు, బహిరంగ మరణశిక్షలవద్ద చేతిలో స్కెచ్ పుస్తకంతో కన్పించేవాడు. ఇరవైయేండ్ల వయసుకే అన్నిరకాల ప్రకటనలకు డిజైన్ చెయ్యడం, వ్యాపారస్తుల కార్డులు రూపొందించడం నేర్చుకున్నాడు. సహబ్రిటిష్ ఆర్టిస్టులకంటే ఒక మెట్టు పైనుండేట్లుగా శ్రమించాడు.

థార్న్‌హిల్ అనే ప్రముఖ పెయింటర్ దగ్గర అప్రెంటీస్‌గా పనిచేస్తూ, అతని అందమైన కుమార్తెతో లేచిపోతాడు. తర్వాత పెయింటింగు వృత్తిలో మంచి సంపాదనతో మెరుగైన జీవితం గడపవచ్చని నిరూపించాడు. "చిత్రకళే నాటకరంగం అందులోని మనుషులే (చిత్రాలే) నా పాత్రధారులు" అని చెప్పుకున్నాడు. కథా చిత్రాలతో నగరంలోని అందరి దృష్టిలో పడడమే కాకుండా వరుస పెయింటింగులతో సమాజంలోని రుగ్మతల్ని ఎత్తిచూపాడు. ఒక వేశ్య (హార్లాట్) ప్రగతి వర్ణనాత్మక చిత్ర చయనిక – అందమైన పల్లెటూరి అమ్మాయి నగర జీవితంలో ఎలా చెడిపోయిందీ చెప్పే కథ. అలాగే ద రేక్స్ ప్రోగ్రెస్ ఎనిమిది




వరస చిత్రాలలో విచ్చలవిడి జీవితం గడిపిన ఓ ధనిక యువతి కథానికగుండా, వేశ్యలతో, జూదంతో పతనమై, మెంటల్ హాస్పిటల్ ఎలా దారుణమైన చావుకు గురైందీ చూపిస్తాడు. ఈ చిత్రం ఉన్నత వర్గాల్లో కలవరం కలిగిస్తుంది. అందువల్ల రేక్స్ ప్రోగ్రెస్, హార్లెట్స్ ప్రోగ్రెస్ అంతటి విజయం సాధించలేకపోతుంది. ఒకవైపు సమాజాన్ని పరిశీలిస్తూ వాటిని చిత్రాలలోకి అనువదిస్తూనే, అనేక మంచి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. బ్రిటిష్ జార సంతతి కొరకని అనాథ వైద్యశాలను, ఆర్ట్ స్కూలును స్థాపించాడు. అన్నిరంగాల్లో ఉన్న మోసాలను ఎదుర్కొన్నాడు. హోగార్త్ మూడవ చిత్ర పరంపరలో నాటి ఉన్నత సంపన్న వర్గాల్లో పెండ్లి పేరిట జరిగే అన్యాయాల్ని చూపించాడు. వారి పెండ్లిళ్లలో జరిగే మోసాలు, చావుల్ని చూపించిన హోగార్త్ చిత్రాలను సంపన్నులు అసభ్యమైనవి, అశ్లీలమైనవిగా ఈసడించుకుంటారు. కొన్ని చారిత్రక అంశాల మీద చిత్రాలు వేశాడు కానీ అందులో గొప్పగా పేరు తెచ్చుకోలేకపోయాడు. హోగార్త్ జీవిత చరమాంకం పోట్లాటలు, వాదనలు, వివాదాల మధ్య గడపడంతో ప్రశాంతత లోపిస్తుంది. ఆ పర్జిస్థితుల్లో కూడా 'సౌందర్యం' అంశంగా పుస్తకం రాశాడు.

హోగార్త్ పోర్ట్రెయిట్లను వేయడంలో కూడా సిద్ధహస్తుడు. నటుడు డేవిడ్ గారిక్‌ను రిచర్డ్-III గా చిత్రించినందుకు రెండు వందల పౌండ్ల పారితోషికం తీసుకుంటాడు. అప్పటివరకూ ఏ ఇంగ్లీష్ పెయింటరూ అంత గొప్ప పారితోషికాన్ని పొంది ఉండలేదు. మన రూపాయల్లో చెప్పుకోవాలంటే దాని విలువ ఇప్పుడు నాలుగు లక్షల రూపాయలు. హోగార్త్ వేసిన ఇతర పోర్ట్రెయిట్లు: లార్డ్ లోవట్, కాప్టెన్ కోరమ్ (హోగార్తు మిత్రుడు, పరోపకారి), ష్రింప్ గర్ల్ (మత్స్య కన్య), బిషప్ హడ్లీ. బిషప్ హెర్రింగ్; తన భార్య, అమె ఇరువురు సోదరీమణుల పోర్ట్రెయిట్లు బ్రిటిష్ పెయింటింగుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

లండన్ జీవితాన్ని ఎంతగా ప్రేమించాడో అంతకన్నా ఎక్కువగా నాటి లండన్ దురాచారాలను ఖండించాడు. బానిసలతో చాకిరి చేయించుకునే తెల్లవారిని, ఓట్లు కొనడాన్ని, ఫ్రెంచివారిని, జిన్ తాగుబోతులను అసహ్యించుకున్నాడు. మనుష ద్వేషి అయిన జోనాథన్ స్విఫ్ట్‌వలె కాకుండా మనుషుల్ని, మానవత్వాన్ని ప్రేమించాడు. బ్రిటిష్ స్త్రీలను అందమైన ధనికవర్గ స్త్రీలు, దొరసానులు, దేవతలుగా కాకుండా, సాధారణ సజీవమూర్తులుగా చిత్రించాడు. ఏ ఇతర ఇంగ్లీషు పెయింటరూ హోగార్తు అంత ఇష్టంగా, గాఢంగా తన అనుభవాలను చిత్రాలుగా వేసి ఉండడు. వృత్తిపరమైన మోడళ్ళ జోలికి పోకుండా నిజజీవితంలోని మామూలు జనాన్నే తనకు మోడళ్ళుగా చేసుకుని పెయింటింగులు సృష్టించాడు. ఒక పెయింటింగులో యువతి తన ఉబ్బిన పొట్టను చూపిస్తుంటే దానికి కారకుడైన ధూర్తుడు నిర్లజ్జగా ఆమె చేతిలో చిన్న నాణాన్ని ఉంచడం చూపిస్తాడు. ష్రింప్ గర్ల్‌లో మానవత్వం చూపిస్తే ఈ చిత్రంలో మోసాన్ని చూపిస్తాడు. తాగుబోతు పిచ్చివేషాలను, అలగా జన బహిరంగ ప్రేమ కలాపాలను పెయింటింగుల్లో చూపించాడు. అదీఇదీ అని లేకుండా ఇంగ్లాండు అంతా అతనికి ప్రేరణ కలిగించింది. మంచీ, చెడూ, మొరటుదనం, క్రౌర్యం, సున్నితత్వం అన్నింటినీ తన చిత్రాల్లో చూపించాడు.

**హొగార్తు నైతిక చిత్రాలు:**

1731 నాటికి పూర్తిచేసిన నైతిక చిత్రశ్రేణిలో ఘనవిజయం సాధించిన రేక్స్ ప్రోగ్రెస్, హార్లెట్స్ ప్రోగ్రెస్ (వేశ్య, వ్యభిచారుల గతి) విచ్చలవిడిగా జీవించి హాస్పిటల్‌లో ముగిసిన జీవితాన్ని చూపిస్తాడు. హోగార్తు పెయింటింగ్‌లకు అసంఖ్యాకంగా ప్రతికృతులు (కాపీ పెయింటింగ్స్) పుట్టుక రావడంతో, 'కాపీరైట్' హక్కుల గురించి పోరాడుతాడు. ఫలితంగా 1735లో కాపీరైట్ చట్టం పార్లమెంటు ఆమోదం పొందుతుంది. తనకేకాక, తోడి కళాకారులందరికీ మేలుచేసే చట్టం పుట్టడానికి కారణం హోగార్తు చేసిన ఒంటరి పోరాటం. ఉన్నత వర్గాల వివాహ వ్యవస్థలోని లోపాల్ని (Marriage-A-Lo-Mode) ఎత్తిచూపిస్తూ ఆరు చిత్రాల పరంపరను చిత్రిస్తాడు. కుటుంబ గౌరవం, సౌకర్యం కొరకు

జరిగే వివాహాల్లో విషాదం వెన్నంటి ఉంటుందనీ, ప్రేమ పునాదుల మీద జరిగే పెండ్లిండ్లు సంతోషాలకు నిలయాలనీ ఈ చిత్ర పరంపర ద్వారా సందేశం యిస్తాడు. దీన్ని హోగార్తు చత్ర పరంపరలో ఉత్తమమైనదిగా చెప్పుకుంటారు. ఇది 18వ శతాబ్దపు బ్రిటన్ వివాహం – నైతికతపైన చర్చకు దారితీసింది.

**శ్రమజీవి – సోమరితనం:**

1747లో రూపొందించిన 12 వరస చిత్రాలలో ఇద్దరు పని నేర్చుకునే బాలుర కథ, శ్రమజీవి – సోమరిపోతుల జీవితాలు చివరకు ఎలా మారిపోతాయో చూపుతుంది. వృత్తికి అంకితమైన కష్టజీవి అంచలంచెలుగా యెదిగి నగర మేయర్ కావడం, పనిపాటలు లేకుండా గడిపిన సోమరి వేశ్యాలోలుడు, బందిపోటుగా మారి మరణశిక్షను అనుభవించడం ఈ కథాచిత్రాల అంశం. బైబిల్ ప్రోవెర్బ్స్. 10:4 ఈ చిత్రాలకు మూలం. హోగార్తు సునిశిత పరిశీలనాశక్తికి, నైతిక నిబద్ధతకు ఇవి తిరుగులేని సాక్ష్యాలు. ఈ చిత్రాలు ఆనాటి ప్రొటెస్టెంట్ ఇంగ్లాండుకు ప్రతీకలుగా నిలుస్తాయి.

**బీర్ బజారు– జిన్ గల్లీ (Beer Street Vs Gin Lane):**

బీర్ ప్రియులు, జిన్ తాగుబోతుల జీవితాల్లోని వైవిధ్యాన్ని చూపే చిత్రాలు, బీర్ తాగేవారిని మర్యాదస్తులుగా, చురుగ్గా, ఉల్లాసంగా, అభివృద్ధికి సంకేతాలుగా చూపిస్తూ, జిన్ ప్రభావం ఎంత భయంకరంగా ఉంటుందో చూపిస్తాడు. జిన్ లేన్‌లో మనుషులు చిన్న ఆకారాల్లో, సోమరులుగా, అజాగ్రత్తపరులుగా కన్పిస్తారు. గల్లీ మొదట్లో వున్న ఆడమనిషి జిన్ మత్తులో ఉంటే ఆమె వొడి నుండి జారిపడే పసివాణ్ణి చూపిస్తాడు. జూడిత్ డఫర్ అనే ఆమె నిజమైన కథకు అది పెయింటింగు రూపం. జిన్ కొనడానికి డబ్బులు లేక కన్నబిడ్డను గొంతు పిసికి చంపుతుంది. దుస్తుల్ని అమ్ముకుని వచ్చిన డబ్బుతో జిన్ కొనుక్కోవాలన్న దారుణమైన కోరిక ఆమెతో ఆపని చేయిస్తుంది. ఆ రోజుల్లో ఆడవాళ్ళంతా జిన్‌కు ఎంతగా బానిసలైనారో తెలిపే ఉదంతం అది. దాని ఫలితమే 1951లో వచ్చిన 'జిన్ ఏక్ట్'. మదర్స్ రూయిన్‌గా పేరుబడ్డ జిన్, జిన్ అంటే విపరీతమైన వెర్రి. దానివల్ల నేరాలు, మరణాల సంఖ్య, వ్యభిచారం పెచ్చు పెరిగిపోవడం, అన్నీ అదుపులోకొస్తాయి. హొగార్తు పెయింటింగులు ఈ చట్ట ప్రచారానికి బాగా ఉపయోగపడతాయి. మరొక చిత్రం 'క్రూరత్వంలో నాలుగు దశలు' జంతువుల పట్ల మనుషుల క్రూరత్వాన్ని చూపిస్తుంది. కుక్కలు, పిల్లులు, గుర్రాలు ఎంత హింసకు లోనవుతుందీ, కోచ్ డ్రైవర్ గుర్రాలను హింసించడమూ చూస్తాము. మార్క్ ట్వెయిన్ తన కలంతో చురకలంటిస్తే, హోగార్తు తన కుంచెతో నాటి దురాచారాలను వ్యంగ్యంగా చిత్రించాడు. హాస్యం, జాలి, వ్యంగ్యం మంచీ, చెడూ, క్రౌర్యం, సున్నితత్వం అన్నింటినీ తన చిత్రాల్లో చూపించాడు. ఇంగ్లాండు జీవితంపై వేసిన చిత్రాల్లో మానవత్వం చూపిస్తూనే, ఘాటుగా విమర్శించడం హొగార్తు ప్రత్యేకత. ఫ్రాన్స్ పర్యటన తర్వాత 1748లో చిత్రించిన 'కాలీగేట్'వల్ల ఫ్రెంచి వారి కోపానికి కారణమౌతాడు.



హోగార్త్ చిత్రం

**స్వీయ చిత్రం:**

పెంపుడు కుక్క 'ట్రంప్' పక్కన ఉండగా 1749లో వేసిన స్వీయ చిత్రంలో తాను బాగా చదువుకున్న ఆర్టిస్టుగా కన్పించడానికి షేక్‌స్పియర్, మిల్టన్, జోనాథన్ స్విఫ్టుల సంపుటాలను చూపించాడు. హోగార్తు దంపతులకు సంతానం కలగనందున వారు చాలామంది అనాథ శిశువులను ఫోస్టర్ పేరెంట్స్‌గా పోషించారు. అనాథ పిల్లలకొరకు హాస్పిటల్ ఒకదానిని స్థాపించి దానికి వ్యవస్థాపక గవర్నర్‌గా వ్యవహరించాడు. లీస్టర్ స్క్వేర్‌లోని వారి నివాసగృహం ప్రస్తుతం హోగార్తు హౌస్‌గా, మ్యూజియంగా మార్చబడింది. జీవత కాలంలో 144 చిత్రాలను రచించి 67వ యేట మరణించాడు. సమకాలీన చిత్రకళకు పుష్టిని కలిగించడం, అమెరికా చిత్రకారుల పైన మృదువైన ప్రభావాన్ని చూపడం హోగార్తు ప్రత్యేకత. వర్ణనాత్మక కథాచిత్రాల శ్రేణులను (సిరీస్) రూపొందించన హోగార్తుకు సాటిరాగల కళాకారులు ఇంకెవరూ కనిపించరు. రాయల్ సొసైటీ ఫెలోషిప్ పొందాడు.

18వ శతాబ్దపు ఇంగ్లండు ప్రథమశ్రేణి పెయింటర్లలో హొగార్తుది అగ్రస్థానం అనడంలో సందేహం లేదు.

టి. విశ్వేశ్వర ప్రసాద్
హైదరాబాద్. ఫోన్: 798 139 8250.

# కథాశిల్పం

– డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల

*గత నెల తరువాయి...*

కథ ఎలా ఉండాలి అనే అంశంపై తెలుగులో ఎన్నో వ్యాసాలూ, ఉపన్యాసాలు వచ్చినప్పటికీ, ప్రామాణిక గ్రంథం మాత్రం డా. పోరంకి దక్షిణామూర్తి గారు వ్రాసిన 'కథానిక స్వరూప స్వభావాలు' సాహిత్య విమర్శనా గ్రంథం. అది వారి పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం. తరువాత పుస్తకరూపంగా వచ్చినది. పోరంకి గారు కథానిక లక్షణాలను అగ్నిపురాణం నుండి, ఎడ్గార్ ఆలెన్ పో, బ్రాండన్ మాథ్యూస్‌ల నుండి ఉదహరించారు. ఆ లక్షణాలను స్థూలంగా వస్తువు, శైలి, శిల్పము అనే మూడు వర్గములుగా క్రోడీకరించవచ్చును. పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు వస్తుప్రధానమైన కథలకు "పెళ్ళిచూపుల కథలు, ప్రేమకథలు, సెక్సు కథలు, బస్‌స్టాప్ కథలు, గుమాస్తా కథలు,...... అంటూ నలభై రకాలతో ఒక పట్టిక ఇచ్చారు. అది వ్యంగ్యపూర్వకమయిననూ, ఒకవిధంగా నిజం కూడాను. కవితకులాగానే, కథకునూ కాదేదీ అనర్హం. కాలస్థాన ప్రమేయములు కూడా కథలకు వస్తువులవుతాయి. సి. రామచంద్ర రావు గారి వేలు పిళ్ళై కథలు, సత్యం శంకరమంచి వ్రాసిన అమరావతి కథలు, వంశీ వ్రాసిన దిగువ గోదారి కథలు ఈ కోవకు చెందుతాయి.

శైలికి ఉపవర్గాలు పాత్రల చిత్రణ, భాష, కథావేగం, ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుషలలో కథకు సరైన ఎంపిక. మల్లాది రామకృష్ణ శాస్త్రి, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ముళ్ళపూడి వెంకట రమణవంటి రచయితల భాషాశైలి ప్రత్యేకంగా ఉంటుంది. వారి కథలను ఇంగ్లీషులోకి అనువాదం చేయటం చాలా కష్టం.

కథా శిల్పానికి వస్తే, సాహిత్యంలో అది ప్రపంచవ్యాప్తం. నిర్మాణం నమూనా ఇక్కడ ఉన్న రేఖాచిత్రం చూపిస్తుంది. ఈ రేఖాకృతి (Diagram) సర్వకథాన్వయయోగ్యమైనది. ముందు చిన్న ప్రస్తావన, తరువాత సంఘర్షణ మొదలవుతుంది. ఆ ఆరోహణలో కథకు బిగువు ఇస్తుంది. శిఖరంపై పరాకాష్ఠ చెందుతుంది. తరువాత అవరోహణలో ఉపసంహారం. ఆ పై ముగింపు. నిర్మాణ పద్ధతి ఒకటే అయినను, ఎన్నో రకాల వైవిధ్యం తీసుకు రావచ్చును. ఆరోహణ నిటారుగా ఉండవచ్చును, అంటే పరాకాష్ఠ కథ ముందులోనే వచ్చేస్తుంది. కొన్ని కథల్లో ఒక శిఖరానికి బదులు రెండు మూడు చిన్న శిఖరాలు ఉండవచ్చును. శిఖరాన్ని చివరకు నెట్టితే అవరోహణ ఆకస్మికంగా ఉంటుంది. పాఠకుడికి షాక్ కలుగుతుంది. ఇటువంటి ప్రక్రియను ఓ హెన్రీ కొసమెరుపు అంటాము. ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన అయిదు కథలను తీసుకొని, ఆ కథకులు ఈ శిల్ప రేఖాకృతిని ఎలా మలిచారో పరిశీలించుదాం. ముందు ఆ కథలను పరిచయం చేస్తాను.

ఫ్రెంచి రచయత గీ డి మొపాసా (Guy De Maupassant, 1850–93) మూడు వందల కథలు, ఆరు నవలలు వ్రాశాడు. మొపాసా కథల్లో The Necklace కథ ఎంతో ప్రాచుర్యమైన కథ. మటిల్డా ఎంతో సౌందర్యరాశి. భర్త గవర్నమెంట్ ఆఫీసులో చిన్నతరగతి క్లర్కు. మటిల్డా తన అందానికి తగ్గట్లు ధనవంతుల కుటుంబంలో ఉంటూ, పెద్ద భవనాలలో ఖరీదయిన ఫర్నిచరు, సిల్కు కర్టెన్లు, తివాసీల మధ్య విలాస జీవితం ఊహిస్తూ, తన దారిద్రానికి బాధ పడుతుంటుంది. భర్త ఒకరోజు తన పెద్ద బాసు, మంత్రి గారి దగ్గర నుండి ఆహ్వానపత్రం తెచ్చి గర్వంగా భార్యకు ఇస్తాడు. వాళ్ళిద్దరినీ మినిస్టరు తన ఇంటికి డిన్నరు పార్టీకి ఆహ్వానిస్తాడు. అంత పెద్ద పార్టీకి వెళ్ళటానికి తనకు నగలు ఏమీ లేవని మటిల్డా ఏడుస్తుంది. భర్త సలహా మీద, మటిల్డా తన ధనవంత స్నేహితురాలి వద్ద నుండి వజ్రాల నెక్లెస్

తెచ్చుకొంటుంది. పార్టీలో మటిల్డా ఆనందంగా గడుపుతుంది. పెద్దపెద్ద ఆఫీసర్లు మటిల్డాతో డాన్సు చేస్తారు. తెల్లవారుజాము నాలుగు గంటలవరకు పార్టీలో సంతోషంగా గడిపి, అలసిపోయి ఇంటికి చేరుతారు ఆ దంపతులు. ఇంటికి వెళ్ళాక తన నెక్లెస్ పోయిందని మటిల్డా గుర్తిస్తుంది. ఎంత వెతికినా ఎక్కడా కనపడదు. నగల షాపులకు వెళ్లి చూస్తే, అలాంటి నెక్లెస్ నలభై వేల ఫ్రాంకులవుతుందని తెలుసుకొంటారు. ఎందరి దగ్గరో అప్పులు చేసి, డబ్బు కూడగట్టి, కొత్త నెక్లెస్ కొని, తన స్నేహితురాలికి ఇస్తుంది. కాని ఆ అప్పులు తీర్చడానికి పది ఏళ్ళు పనిమనిషి ఉద్యోగం చేస్తుంది. మటిల్డా ఆ వెట్టిచాకిరీతో మనిషి పీలగా అవుతుంది, ముఖవర్చస్సు, కళ పోగొట్టుకొంటుంది. పదేళ్ళ తరువాత ఒకరోజు మటిల్డా తన స్నేహితురాల్ని చూసి, పిలుస్తుంది. ఆమె గుర్తుపట్టలేదు. ఏమిటి ఇలా అయ్యావని అడుగుతుంది. తను ఇచ్చిన నెక్లెస్ ఆ పార్టీలో పోయిందని, అప్పులు చేసి అలాంటి నెక్లెస్ కొని తనకు ఇచ్చానని, ఆ అప్పులు తీర్చటానికి పదేళ్ళు పట్టిందని చెప్పుతుంది. ఆ స్నేహితురాలు కలత చెంది, మటిల్డా చేతులు పట్టుకొని, "అయ్యో పిచ్చిదానా, నేను నీకు ఇచ్చింది నకిలీ నెక్లెస్. మహా అయితే, అయిదు వందల ఫ్రాంకులయి ఉంటుంది" అని అంటుంది.

**జాక్ లండన్** (1876–1916) రెండు వందల పైగా కథలు, పదిహేను నవలలు వ్రాశాడు. ఆ కథల్లో To Build a Fire సుప్రసిద్ధమయిన కథ. ఇప్పటికీ అమెరికాలో హైస్కూలు సిలబస్‌లలో ఈ కథ కనపడుతుంది. ఒక ప్రయాణీకుడు యూకాన్ ప్రాంతంలో ఒకరోజు ప్రొద్దున బయల్దేరతాడు. పగలంతా నడిస్తే రాత్రికి తన స్నేహితులున్న క్యాంపుకి చేరగలడు. ఎముకలు కొరికే చలి. నివురు గప్పిన మబ్బు. యూకాన్ ప్రదేశం అది. తాను నడుస్తున్న త్రోవ ప్రక్కనున్న పెద్ద దిబ్బ ఎక్కి, అతను చుట్టూ చూశాడు. దట్టమైన సరివి చెట్ల మధ్యలో తూర్పుగా తను నడవాల్సిన ఓ చిన్నత్రోవ. వాచ్ చూస్తే తొమ్మిది గంటలయింది. మేఘాల్లేని ఆకాశం అయినా సూర్యుడు వచ్చే అజ లేదు. ఆ చిరుచీకటి ప్రకృతినంతా విషాదకరం చేస్తున్నది. అగ్గి లేని రోజులు అతనికి అలవాటే. గతకొన్ని రోజులు అతను సూరీడిని చూడలేదు. ఇంకా కొద్ది దినాలు గడిస్తేగాని సూర్యుడు కనపడడని అనుకున్నాడు. ఆ దిబ్బ మీద నుండి చూస్తుంటే ఆ యుకాన్ మైలు వెడల్పు, అంతా మూడడుగుల ఎత్తు మంచుగడ్డ. ఆపైన ఇంకా మూడడుగుల హిమపాతం. మంచుపొడి పొర. అక్కడక్కడా మంచుగడ్డల మూలంగా ఎత్తుపల్లాలు. అంతా తెల్లటి పరదా, మంచు ఎడారి. దూరంగా ఉన్న సరివి చెట్ల అంచులు మాత్రం ఆ తెల్లటి కాన్వాసులో సన్నటి నల్ల గీత గీసినట్లుగా ఉన్నది. ఆ లైను ఒక్కటే కాలిబాట. మనుషులు నడిచే త్రోవ. అక్కడ నుంచి దక్షణంగా అయిదు వందల మైళ్ళు పోతే చిల్కూట్ పాస్, డయా, సముద్రం. ఉత్తరంగా డెబ్భయి మైళ్ళు దూరంలో డాసన్ ఉన్నది. కాని ఇవన్నీ – ఆ అంతులేని సన్నటి బాట, సూర్యుడూ మేఘాలు లేని పట్టపగలు నింగి, దుర్భరమైన చలి, ఈ వింత విచిత్రమైన పరిస్థితి – అతనేమీ పట్టించుకోలేదు. అంత మాత్రాన అతనికు వీటన్నిటికీ అలవాటు అనిగాదు. ఈ ప్రదేశానికి అతను క్రొత్త. ఇక్కడ అతనికి మొట్టమొదటి శీతాకాలం. మైనస్ యాభై డిగ్రీలు (ఫారన్ హీట్) అంటే మంచు గడ్డకట్టే ఉష్ణోగ్రతకి ఎనభయి డిగ్రీలు దిగువ. అది మాత్రమే తెలుసు అతనికి, కాని దాని అర్థమూ, శరీరంపై దాని ప్రభావం, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలీదు. ఇలాంటి భయంకరమైన చలి వాతావరణం గురించి అంతగా తెలియకపోవడమే అతని సమస్య. మైనస్ యాభై డిగ్రీలలో శరీరం గడ్డకట్టుకుపోతుంది. అటువంటి క్రూర ప్రకృతిలో మానవుని అస్థిరత, దుర్బలత అతనికి గట్టి అవగాహనలేదు. చేతులికి మందమైన గ్లోవులు, చెవులకు కవర్లు, మందపాటి మేజోళ్ళు, మొకాసిన్ బూట్లతో చలినుండి కాపాడుకోవాలని మాత్రం తెలుసు.

మళ్లీ నడవటానికి సిద్ధం అవుతూ, అతను ఉమ్మేశాడు అనుకోకుండా. ఫెళ్ళుమని మ్రోత మోగింది, అతను ఉలిక్కిపడ్డాడు. మళ్లీ ఇంకొకసారి ఉమ్మేశాడు. మళ్లీ అట్లాగే పెళ్లుమని మ్రోత మోగింది గాలిలోనే ఆ ఉమ్ము స్నో మీద పడకముందే. మైనస్ యాభై డిగ్రీలు ఉష్ణోగ్రతలో ఉమ్ము స్నోమీద పడగానే ప్రేలుతుందని తెలుసు. కాని ఇలా గాలిలోనే ఉమ్ము ప్రేలుతుందంటే మైనస్ యాభైకన్నా తక్కువ టెంపరేచర్ ఉన్నట్లు గ్రహించాడతను. ఇదంతా ఇలా ఉంచి, చీకటి పడేలోపు హేన్డర్ సన్ వాగు దగ్గరకి చేరాలి. అక్కడ తన మిత్రబృందం క్యాంపు చేస్తున్నారు. వాళ్ళందరూ ఇండియన్ క్రీక్ మీదుగా వెళ్లారు. తనేమో దూరపు దోవన వచ్చాడు, క్యాంపులో చలిమంట, వేడి భోజనం రెడీగా ఉంటాయి. మరి లంచ్ కోసం తను తెచ్చుకున్న శాండ్విచ్

కోటు లోపల ఉన్నది. సరివి చెట్లమధ్య గుండా అతను జోరుగా నడుస్తున్నాడు. ఒక అడుగు మంచు పడినట్లుంది ఈ రాత్రి. మెత్తగా పొడిగా ఉండటంతో నడవటానికి సులువుగా ఉంది. తన వెనుక అతని కుక్క నడుస్తోంది త్వరగా, అతి చలిలో వణుక్కుంటూ. కుక్క శ్వాస చలికి తెల్లటి పొడిగా మారి కుక్క మొఖాన తెల్లటి కోటింగ్‌లా ఉన్నది. అతని గడ్డం మీసం కూడా అలాగే శ్వాస మూలంగా మంచుగడ్డ పీలికలు వేలాడుతున్నాయి. అతను పొగాకు నమలడంవల్ల ఆ గోధుమ రంగు జ్యూస్ పెదాల మీద గడ్డకట్టిపోయింది. పొరపాటున అతను క్రింద పడితే అతని గడ్డం గాజు పెంకులాగ ఫెళ్ళున పగిలిపోతుంది. కొన్ని మైళ్లు నడిచాక ఓ చిన్న వాగు దగ్గరకు చేరాడు. ఇదే హెండర్సన్ క్రీక్ అని గ్రహించాడు. గడ్డకట్టిపోయింది. ఇక్కడ నుండి పదిమైళ్ళల్లో ఈ వాగు రెండు పాయలుగా చీలుతుంది. ఇప్పుడు పదిగంటలయింది. గంటకు నాలుగు మైళ్ల చొప్పున నడుస్తున్నాడు. పన్నెండున్నరకు ఆ పాయల చీలిక దగ్గరకు చేరుకోగలనని అనుకొన్నాడు. ఆ సంతోష సమయాన్ని తను లంచ్‌తో ఆనందించుదామని అనుకొన్నాడు. నడుస్తున్న త్రోవలో మంచుపొర పగిలింది, మోకాలు లోతు మంచునీటిలో దిగిపోయాడు. ఆ గోతిలో నుండి పైకి వచ్చి, బూట్లను, మేజోళ్ళు ఆరబెట్టటానికి మంట వేయటానికి ప్రయత్నిస్తాడు. చెట్ల మోడులను, ఎండుకొమ్మలు పోగుచేసి, చలిమంట వేస్తాడు. అది రాజుకోబోయే సమయానికి, పైనున్న చెట్టునుండి మంచుకుప్ప పడుతుంది. మంట ఆరిపోతుంది. ఇంకోసారి మంట వేయటానికి సమయం చాలదు. తన కుక్కని చంపి దాని పొట్టలో వెచ్చదనానికి చేతులు, కాళ్ళు వెచ్చబరచుకొందామనే ఆలోచన వస్తుంది. కుక్క అది పసిగట్టి, దూరంగా పరుగెత్తుతుంది. శరీరం చాలామట్టుకు ఘనీభవించటంతో, అతని సత్తువ పూర్తిగా మందగిస్తుంది. చేతిలో కత్తి జారిపోతుంది. క్రిందకు వంగి, ఆ కత్తిని తీసుకొనే శక్తీ లేదు. ఆ మంచుదిబ్బ మీద చతికిలపడతాడు. శీతల మృత్యువుని తప్పించుకోలేనని గ్రహిస్తాడు. కళ్ళుమూసుకొని, దీర్ఘ నిద్రలోకి వెళ్లిపోతాడు. ఘనీభవించిన తన యజమాని శరీరాన్ని వదిలి, కుక్క క్యాంపువైపుకి పోతుంది. మనిషికి, ప్రకృతికి మధ్య సంఘర్షణలో ప్రకృతిదే పైచేయి అనే సత్యాన్ని ఈ కథ సున్నితంగానూ, భయంకరంగానూ సూచిస్తుంది.

**ఆంటన్ చెకోవ్** (Anton Chekhov, 1860–1904) రెండు వందల పైగా కథలు, అయిదు నవలలు, నాలుగు నాటకాలు రచించారు. The Kiss అనే కథలో ఒక రిటైర్ అయిన ఆర్మీ జనరల్ తన జూనియర్ మిలిటరీ ఆఫీసర్లను డిన్నరు పార్టీకి ఆహ్వానిస్తాడు. అందరూ డిన్నరు, డ్రింకులు, డాన్సులతో హోదాలు, సంపదలు ఉన్న పైతరగతివారి జీవితాల్ని ఆ రాత్రి చవి చూస్తారు. జూనియర్ ఆఫీసరు ర్యాబొవిచ్ భయస్తుడు. సిగ్గు, బిడియం ఉండటంతో ఆ పార్టీలో మిగతావాళ్ళతో కలవలేకపోతాడు. కొందరు బిలియర్డ్స్ ఆడుకోవటానికి వేరే రూముకి వెళ్తారు. ర్యాబొవిచ్ కూడా ఆ రూముకి వెళ్ళతాడు. అది నచ్చక తిరిగి డాన్సు హాలుకి వస్తూ, ఆ పెద్ద భవనంలో దారి తప్పి, ఒక చీకటి గదిలోకి అడుగు పెడతాడు. వెనక నుండి ఒక యువతీ వచ్చి, ర్యాబొవిచ్‌ని కౌగలించుకొని, అతన్ని ముద్దు పెట్టుకొంటుంది. వెంటనే అతడు తన ప్రియుడు కాదని గ్రహించి, కేకవేసి, పరుగెత్తుకుపోతుంది. ర్యాబొవిచ్ ఆ మెత్తటి ఆలింగనంతో, సుగంధ పరిమళాలతో, చుంబనంతో ఉక్కిరిబిక్కిరి అవుతాడు. డిన్నరు టేబుల్ దగ్గర ఆ అమ్మాయి ఎవరయి ఉంటుందా అని చుట్టూ చూస్తాడు. ఆనవాళ్లు కనపడవు. ఆ తరువాత ప్రతి రోజూ ఆ యువతి గురించే ఆలోచిస్తాడు. ఆమెను పెళ్లిచేసుకొని, దాంపత్య జీవనం చేయడం ఊహించుకొంటాడు. ఆ ఆలోచనలతో జీవితం మీద ఆసక్తి పెంచుకొంటాడు. నాలుగు నెలలు మిలిటరీ విన్యాసాల కోసం తన బృందంతో కలిసి వేరేచోటికి వెళతాడు, తిరిగి వచ్చాక కూడా అదే ఆలోచనలు వెంటాడుతుంటాయి. ఆర్మీ జనరల్ మళ్ళీ అందర్నీ ఇంకొక పార్టీకి ఆహ్వానిస్తాడు. తోటి జూనియర్ ఆఫీసర్లు అందరూ వెళ్తారు. ర్యాబొవిచ్ చివరి నిమిషంలో మనసు మార్చుకొని, తన రూములోనే ఉండిపోతాడు.

**ఓ. హెన్రీ** (1862–1910) మూడు వందల ఎనభై పైగా కథలు వ్రాసారు. వాటిలో The Gift of the Magi ప్రసిద్ధి చెందిన కథ. ఇది డెల్లా, జిమ్ దంపతుల కథ. క్రిస్టమస్ ముందు రోజు డెల్లా తన భర్తకు కానుక కొందామని అనుకొంటుంది. కాని తన దగ్గర రెండు డాలర్లు మాత్రం కూడా లేవు. నిలువుటద్దంలో తనను చూసుకొంటుంది. మోకాళ్ళదాకా ఉన్న తన పొడుగాటి, మెత్తటి, అందమైన కేశాలను చూసుకొంటుంది. వెంటనే హెయిర్ డ్రెస్సరు షాపుకి

వెళ్లి, జుత్తుని అమ్మివేస్తుంది. ఇరవై డాలర్లు వస్తాయి. వాటితో భర్త వాచ్‌కి పెట్టుకొనే చైను కొంటుంది. రాత్రి ఏడింటికి జిమ్ ఇంటికి వస్తాడు. "జుత్తు ఎందుకు కత్తిరించావు?" అని అడుగుతాడు. "నీకు వాచ్ చైను క్రిస్టమస్ గిఫ్ట్‌గా కొనటానికి, అమ్మేశాను. అయినా కురులు మళ్ళీ పెరుగుతాయి కదా." అంటుంది. డెల్లాకు తను తెచ్చిన గిఫ్ట్ చూపిస్తాడు. డెల్లా ఎప్పటి నుండో కోరుకొంటున్న దువ్వెనల సెట్ ఇస్తాడు. డెల్లా కంటినీరు పెట్టుకొంటుంది. తను కొన్న వాచ్ చైను ఇస్తుంది. జిమ్ "అది పెట్టుకోవటానికి నా దగ్గర వాచ్ లేదు. వాచ్ అమ్మివేసి, ఆ డబ్బుతో నీకు దువ్వెనలు కొన్నాను." అంటాడు.

**షర్లీ జాక్సన్** (1916–65) రెండు వందలపైగా కథలు, ఆరు నవలలు వ్రాశారు. The Lottery కథలో ఒక వేసవి రోజున ఆ చిన్న గ్రామం ప్రజలందరూ ఊరి సెంటరుకి చేరతారు. లాటరీ ఆ ఊరిలో ప్రతి ఏడూ జరిగే సంఘటన. రైతులు పంటల గురించి మాట్లాడు కొంటున్నారు. స్త్రీలు ఊళ్ళో కబుర్లు చెప్పుకొంటున్నారు. పిల్లలు పక్కనే ఉన్న రాళ్ళగుట్ట దగ్గర ఆడుకొంటున్నారు. లాటరీ మొదలయింది. అందరూ ఉత్కంఠతో, నిశ్శబ్దంగా చూస్తున్నారు. ప్రతి కుటుంబం తరఫున ఒకరు వెళ్లి లాటరీ డబ్బాలో నుంచి ఒక చీటీ తీస్తున్నారు. ఒక కుటుంబానికి మాత్రం నల్ల చుక్క ఉన్న చీటీ వస్తుంది, మిగతావాళ్లకు ఖాళీ చీటీలు వస్తాయి. బిల్ హచిన్సన్ కుటుంబానికి నల్లచుక్క చీటీ వస్తుంది. ఆ కుటుంబంలో భార్యాభర్తలతో పాటు, ముగ్గురు పిల్లలున్నారు. ఆ అయిదుగురూ మళ్ళీ చీటీలు తీస్తారు. నల్లచుక్క చీటీ మిసెస్ హచిన్సన్‌కి వస్తుంది. ఆమె ఆ గుంపు మధ్యలో నించున్నది. అక్కడ గుమి గూడిన జనం అందరూ రాళ్ళు తీసుకొని మిసెస్ హచిన్సన్‌ని కొడతారు. "ఇది అన్యాయం, అన్యాయం'' అనే రోదన ఆమె నుండి వినిపిస్తుంది.

మొపాసా నెక్లెస్ కథ పైన చూపించిన శిల్ప రూపాకృతికి పూర్తి రూపాన్నిస్తుంది. మటిల్డా పార్టీలో నెక్లెస్ పోగొట్టుకొన్న సంఘటనతో ఆరోహణ బిగువుగా సాగుతుంది. పదేళ్ళ తరువాత స్నేహితురాల్ని కలవటం కథకు పరాకాష్ఠ. ఎంతో రక్తిగట్టిన కథ. బహుళ ప్రాచుర్యమయినది. ఈ కథపై విమర్శలూ ఉన్నాయి. నిజానికి నలభైవేల ఫ్రాంకులతో మటిల్డా ఆ నెక్లెస్ కొన్నట్లేనని, ఆ నెక్లెస్ ఆమెకు చెందకుండా జరిగిన అన్యాయానికి కథకుడే బాధ్యుడని విమర్శకులు అంటారు. ఎన్నో కథాసంపుటాల్లో ఈ కథ వచ్చినప్పటికీ, ఒక కథాసంపుట సంపాదకుడు మటిల్డాకు జరిగిన హృదయ విదారకమైన అన్యాయం మూలంగా నెక్లెస్ కథని తిరస్కరించాడట. లి జాక్ లండన్ వ్రాసిన To Build a Fire కథలో అంతయూ ఆరోహణయే. అవరోహణ ఉండదు. కథ సగం చదివేసరికి, ఆ ప్రయాణీకుడు చీకటి పడేలోపు క్యాంపుకి చేరలేడని పాఠకుడికి అర్థం అవుతుంది. కాని ఆ తీవ్ర శీతలాన్ని అధిగమించటానికి అతడు చేసే పోరాటం ఉత్కంఠభరితంగానూ, హృదయ విదారకంగానూ ఉంటుంది. చివరకు విషాదకరంగా ప్రకృతియే గెలుస్తుంది.

ఆంటన్ చెకోవ్ వ్రాసిన ది కిస్ కథలో సంఘర్షణారోహణ చిన్న ఏటవాలుతో సాగుతుంది. యువతి చీకట్లో ర్యాబొవిచ్‌ని ముద్దుపెట్టుకోవటం పరాకాష్ఠ సన్నివేశం. ఈ సన్నివేశం కథలో ముందే వస్తుంది. అవరోహణ ర్యాబొవిచ్ నిరంతరం ఆ యువతిని గురించి ఊహించుకోవటం. ఇక్కడ అంతా అంతర్మథనమే కాని క్రియాపూర్వకంగా ఉండదు. చెకోవ్ కథల్లో ఆరోహణావరోహణలు చిన్న ఎత్తులో ఉంటాయి. వీటిల్లో కథాంశం, సంఘర్షణ, పరాకాష్ఠలాంటివి ప్రస్ఫుటంగా కనపడవు, సున్నితంగా ఉంటాయి. సాధారణ జీవితంలో ఉండే చిన్న మెలికలు, తళుకులు మాత్రం ఉంటాయి. చెకోవ్ కథలు జీవన ఖండికలు, బ్రతుకు రెమ్మలు. అవి నిశ్చల సరస్సులో చిరుతరంగాలపై కాగితపు పడవ పయనించినట్లుంటాయి. అందుకు ఈ కథయే ఉదాహరణ.

ఓ. హెన్రీ వ్రాసిన The Gift of the Magi కథలో శిల్పరూప భాగాలన్నీ ఉన్నాయి. పైగా ప్రస్ఫుటంగా కనపడతాయి. ఈ కథ ఓ. హెన్రీ బ్రాండు చట్రంలో బిగించిన కథ. డెల్లా తన భర్తకు వాచ్ చైను కొనటానికి తన జుత్తు అమ్మివేస్తుంది. జిమ్ తన వాచ్ అమ్మి, భార్యకు దువ్వెనల సెట్ తెస్తాడు. రెండు గిఫ్టులు తాత్కాలికంగా వ్యర్థం. కాని వారి ప్రేమ గాఢమైనది. ఈ కథ నూట ఇరవై సంవత్సరాల క్రితం అమెరికాలోని పేదరికాన్ని చూపిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటి కథ అమెరికాలో పనిచేయదు, తెలుగులోనూ పనిచేయదు. వాచ్ చైను, దువ్వెనల సెట్ ఇచ్చుకోవటం బహుశా 1940, 50 దశకాల్లో తెలుగులో సమంజసంగా ఉండేదేమో. కథాకాలంనాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థలు

కథల్లో ప్రతిబింబించాలి కదా! షర్లీ జాక్సన్ వ్రాసిన లాటరీ కథ పాఠకుడిని అమాయకత్వంతో చెలగాటం ఆడుతుంది. లాటరీ అంటే ఎవరో ఒకరు ఏదో గెలుచుకోవటం అనే భావనతో పాఠకుడిని నమ్మిస్తుంది కథారచయిత్రి. వాతావరణం, జనసమూహం, పిల్లలు ఆడుకోవటంలాంటి వర్ణనలతో కథారోహణ సాఫీగా నడుస్తుంది. శిఖరానికి చేరుకున్నాక, ఒక్కసారి అమాంతంగా ఓ. హెన్రీ మెలికతో రచయిత్రి కథను క్రిందకు తోసేస్తుంది. పాఠకులు దిగ్భ్రాంతికి గురి అవుతారు. మూఢనమ్మకాలు సమాజాన్ని తిరోగమనపథంలో తీసుకు వెళ్తాయన్నది ఈ కథ సందేశం. నరబలి చేస్తే వచ్చే సీజనులో పంటలు బాగా పండుతాయన్న అత్యోక్తి నమ్మకంపై కథను బిగించి, రసవత్తరంగా చిత్రించి, భీభత్సంగా ముగించారు రచయిత్రి.

తెలుగు కథల్లోకి వస్తే, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'అరికాళ్ళ కింద మంటలు' అరుదైన కథ. ఇందులో వస్తువు, శైలి, శిల్పము సమపాళ్ళలో తోడైనవి. వస్తువు వితంతు పునర్వివాహం. పదహారేళ్ళ రుక్మిణి వితంతువయి, రుక్కమ్మగా పుట్టింట్లోనే ఉంటుంది. ఈ కథంతా ఒక్కరోజు జరుగుతుంది. అమ్మ, అమ్మమ్మ, పెద్దక్క, చిన్నక్క, చెల్లెలు, తమ్ముడు అందరూ పనులప్పగిస్తారు. పనిమనిషిగా చూస్తారు. సూటిపోటి మాటలతో వేధిస్తారు. ఆ రాత్రి అమ్మమ్మ రుక్కమ్మ తండ్రితో రుక్కమ్మకు మరునాడు శిరోముండనం చేయించమంటుంది. రుక్కమ్మ వింటుంది. ఆ రాత్రి ఇంట్లో నుండి పారిపోతుంది. వీధిలో జట్కావాడిని పంతులుగారి తోటలోకి తీసుకువెళ్తావా అని అడుగుతుంది. కాని డబ్బుల్లేవు. వీరేశలింగం పంతులుగారి తోటకయితే, డబ్బునివ్వక్కరలేదు అని చెప్తాడు. జట్కా మేఘాల మీద వెళ్తుంది. మలుపు తిరిగిందంటూ, రచయిత కథ ముగిస్తాడు. ఎనిమిది అధ్యాయాలలోని మొదటి ఏడిట్లో కథ అంతా సంభాషణలతోనే జరుగుతుంది. పేర్లు ఉండవు. సంభాషణా వాక్యాలన్నీ చిన్నవిగా, పొడిపొడిగా ఉంటాయి. పాఠకుడు రుక్కమ్మ స్థితిని ఊహించుకోగలడు. శ్రీపాదగారు ఎంచుకొన్న శైలి పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది. జట్కాబండి వాడితో మాట్లాడినపుడు, కథ శిఖరంపై పరాకాష్ఠకు చేరుకొంటుంది. భాషాశైలి కూడా మారుతుంది. సంభాషణలతో పాటు వివరణ ఉండటంతో కథ వేగం, తీవ్రత తగ్గుతాయి. వస్తుబలమున్న కథ శ్రీపాదగారి చేతిలో ఆణిముత్యమయింది.

పోరంకి దక్షిణామూర్తి గారు వ్రాసిన Glowing Moon-light (వెన్నెల పండిన వేళ) కథ రాయలసీమలోని ఒక చిన్న పల్లెటూరులో జరుగుతుంది. అయిదారు ఏళ్లగా వర్షాలు లేకపోవటంతో అందరూ ఊరువదిలి వెళ్ళిపోతున్నారు. శివన్న పనిచేసే యజమాని కుటుంబం కూడా వెళ్ళిపోతున్నది. వారితో వెళ్ళిపోకుండా తను మాత్రం ఆ ఊళ్లోనే ఉండటానికి నిశ్చయించుకొంటాడు. యజమాని కుటుంబం వెళుతున్న బళ్లనన్నీ ఊరిబయటకు సాగనంపి శివన్న వెనక్కి తిరిగివచ్చి, రెండు మూడు రోజుల వరకూ తన గుడిసె దాటి బయటకు రాలేదు. మూడో రోజు రాత్రి బయటకు వచ్చి చూస్తే ఊరంతా నిర్మానుష్యంగా ఉన్నది. ఊరి బావి దగ్గర ఒక ఆవు ఒంటరిగా కనిపించింది. తోటి మందలో నుండి తప్పిపోయినట్లున్నదని ఆ ఆవుని తనతో తీసుకువెళుతాడు. మధ్యలో ఆవు ఆగి 'అంబా' అని అరుస్తుంది. ఒక చిన్న సందులో నుండి చిన్న పిల్ల ఏడుపు వినిపించింది. అయిదేళ్ళ పిల్ల ఏడుస్తూ కనపడింది. ఆ పాపను ఎత్తుకొని, ఆవును ఇంటికి తీసుకు వెళుతాడు. అంతా తన అదృష్టం అనుకొంటూ, ఆనంద పడతాడు. ఈ కథ కూడా శిల్పరేఖాకృతిని అనుసరించింది.

కొడవటిగంటి కుటుంబరావు గారి 'ఫోర్త్ డైమెన్షన్' కథలో రాజా తన స్నేహితుడి (కథకుడు)తో తన అనుభవాలు చెప్తాడు. ఐన్ స్టీనూ, థీరీ అఫ్ రెలటివిటీ తెలుగు కథల్లోకి రావటం లేదు అంటూ, తన చుట్టాలమ్మాయి ఇందిర గురించి చెప్తున్నాడు. ఇందిర రాజాకంటే మూడేళ్ళు పెద్దది. రాజాకి అయిదేళ్లున్నప్పుడు ఇందిర కుటుంబం తమ కుటుంబంతో రెండు మూడు నెలలు ఉన్నారు. ఇద్దరూ సన్నిహితం అయ్యారు. తరువాత మూడేళ్ళకు ఇందిర పెళ్ళిలో కలుస్తారు. రాజాకు అప్పటి ఇందిర ఇష్టం ఉండదు. క్రితంసారి కలిసిన ఇందిరను ఊహించుకొంటాడు. తరువాత రెండుమూడేళ్ళకొకసారి కలుస్తారు. కలిసినప్పుడల్లా రాజాకు అప్పటి ఇందిర ఇష్టం ఉండదు. ప్రతిసారీ క్రితంసారి కలిసిన ఇందిరను ఇష్టపడతాడు. కాని ఎప్పుడూ తన ప్రేమను చెప్పలేకపోతాడు. ఇందిర రెండో డెలివరీ జరుగుతున్నప్పుడు చనిపోతుంది. జీవిత గమన దశల్లో ఇందిరకన్నా తను ఎప్పుడూ ఒక దశ వెనకనున్నానని రాజా భావన. కాలానికి భౌతిక ప్రపంచంలో ఉనికి ఉంటుంది కాని రూపం ఉండదు. అటువంటి కాలం ఈ కథలో ఒక పాత్ర వహిస్తుంది. అది

ఈ కథ ప్రత్యేకత. ఇంకో ప్రత్యేకత కథంతా ఒక పాత్ర ఇంకో పాత్రకు చెప్పటం. ఇలాంటి కథలను క్లబ్బు కథలనవచ్చును. ఒక పాత్ర కథ చెపుతుంటే, ఇతర పాత్రలు శ్రోతలవుతారు. తెలుగు కథల్లో ఇది పాతుకుపోయిన, పరిపక్వ దశకు చెందిన ప్రక్రియ. ఇందుకు బీజం రామాయణం నుండి, మహాభారతం నుండి వచ్చింది. వాల్మీకి తన శిష్యులకు రామాయణం ఉపదేశించుట, వైశంపాయనుడు జనమేజయ మహారాజుకి మహాభారత కథ వినిపించుట ఈ ప్రక్రియకు నాంది. పానుగంటివారు సాక్షి వ్యాసాలలో ఇదే ప్రక్రియను వాడారు.

పూసపాటి కృష్ణంరాజు గారి కథ 'మహారాజయోగం'లో రెండు పరాకాష్ఠలుంటాయి. రెండవ పరాకాష్ఠ మొదటి పరాకాష్ఠను కొట్టివేస్తుంది. ఆంధ్ర యూనివర్సిటీ కాంపస్ దగ్గరలో ఆరుగురు స్టూడెంట్‌లు ఒక అద్దె డాబాలో నివసిస్తుంటారు. పన్నెండేళ్ళ నాగులు వాళ్ళ ఆఫీసు బాయ్. నాగులు రాత్రిపూట వసారాలో చాపమీద పడుకొంటాడు. ఒక అర్ధరాత్రి ఒక స్టూడెంట్ వసారా లైటు వేస్తే, నాగులు తల దగ్గర త్రాచుపాము పడగెత్తి ఉన్నది. అతను పెద్ద కేక వేయగానే అందరూ బయటికి వచ్చారు. పాము బయట పొదల్లోకి దూరిపోయింది. నాగుల్ని నిద్రలేపి, అతన్ని పరీక్షించారు. వాడిని పాము కాటు వేయలేదు. నాగులు చాలా అదృష్టవంతుడనీ, పాము పడగవేస్తే, అది మహారాజ యోగం అని వాళ్ళందరూ అనుకొంటారు. నాగులుతో చెపుతారు. ఒకరోజు నాగులు బజారుకి వెళ్లి వస్తుంటే, సిటీ బస్సు క్రింద పడి చనిపోతాడు. పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి 'నీళ్ళు' కథలో జోగినాథం హైస్కూలు పూర్తి చేశాక, విజయవాడలో ఒక ఆఫీసులో క్లర్కు ఉద్యోగంలో చేరుతాడు. జోగినాథం పల్లెటూరి నుండి వచ్చాడు. ఆ ఊరి ప్రాంతంలో వానలు పడవు. నీళ్లకి తీవ్రమైన ఇబ్బందులు. బావులు ఎప్పుడూ అడుగంటి ఉంటాయి. విజయవాడలో నీళ్ళు సమృద్ధిగా ఉండటంతో, ఎంతో ఆనందంగా గడుపుతాడు. రోజూ ప్రొద్దున ఏటిదగ్గర స్నానం చేస్తాడు. రాత్రిపూట తన రూము దగ్గరున్న బావిదగ్గర రెండో పూట స్నానం చేస్తాడు. తన పెద్ద చెల్లెలుకి పెళ్లి చేసి, అమ్మనూ, చిన్న చెల్లెలుని విజయవాడ తీసుకువద్దామని కలలు కంటాడు. కాని దురదృష్టవశాత్తు ఒకరోజు ఏటి దగ్గర కాలు జారి ఏట్లో మునిగిపోతాడు. తెలుగు కథానికలు ప్రపంచ కథల స్థాయికి ఏమాత్రం తీసిపోవు. తెలుగులోని మంచి కథలన్నీ ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి. కాకపోతే చదువరులకు అవన్నీ సులభంగా లభ్యం కావటంలేదు. తెలుగు కథలపై సమీక్షలు, విమర్శలు అంతర్జాతీయ సాహిత్య పత్రికలలో రావలసిన అవసరం ఉన్నది.

*వచ్చే సంచికలో: విలియమ్ షేక్స్పియర్*

డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల
e-mail: rravella2@gmail.com.,
1-703-338-2194 (mobile and whatsapp)

## ఒక్కటే మాటన బలిమిని (బేహాగ్ – రూపకం)

*పల్లవి:* *ఒక్కటే మాటన బలిమిని ఒప్పుకొంటి గదరా ఆపై అక్కటా నేనోపజాలరా* ॥ఒక్కటే॥

*చరణము 1:* *ఎకసక్కెముగాదు లేర ఎంతసేపు సహింతురా / పకపకమని నవ్వకుర పరులు*
*రాబోయేర సామి* ॥ఒక్కటే॥

*చరణము 2:* *మొగము మొగముతో జేర్చి ముద్దుబెట్టుటంతెగాని / చిగురుమోవి పంటిగంటు*
*సేయబోకురా / తగుమాత్రము మొలకచన్ను బొగడలంటు టంతేకాని*
*నగుబాటుల చేతిగోరు నాటనియ్యబోకుర సామి / పకపకమని నవ్వకుర పరులు*
*రాబోయేర సామి* ॥ఒక్కటే॥

*చరణము 3:* *ఇంతదాక మగవానిని ఎరుగుదునా నేడెకాని / ఇంతటి తడవైన బొంక నెటులవు*
*నవునా / ఇంతెకాదు నేటిరాత్రి కింటియాతనితో నన్ను / మంతనమున గలుపబూన*
*మాటలాడుచున్నవారు* ॥ఒక్కటే॥

*చరణము 4:* *ప్రొద్దుమాపువేళాయెర పురుష దూరనుండి వచ్చు / సద్దులేక పోయివత్తు*
*చాలించుమురా / పెద్దలు విని చూచిరన్న ఇద్దరికిని మోసమగును*
*వద్దు వినర సింహనగరవాసుడ రంగేశుడ ఇది* ॥ఒక్కటే॥



యశోద ఠాకూర్

**కేళీగోపాలమ్**

*- మల్లాది రామకృష్ణశాస్త్రి*

సాహిత్యంలో ఈ శతాబ్దం నోబెల్ తారలు - 3

# ఇమ్రె కార్టెస్

*- ముక్తవరం పార్థసారథి*

"పాశవికంగా, భీతావహంగా, మన ఊహా నరకాల్ని అతి క్రూరమైన శిక్షలుగా తలపించే ఒక మనుషులు సృష్టించిన ప్రళయంలో చిక్కుకున్న వ్యక్తి అనుభవాల్ని, అనుభూతుల్ని, చారిత్రక నేపథ్యంలో గ్రంథస్తం చేసినందుకుగాను" హంగేరియన్ రచయిత ఇమ్రె కార్టెస్‌కు 2002 నోబెల్ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని పొందిన తొలి హంగేరియన్ ఇతడే.

జర్మన్ కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో జీవితాన్ని/మరణాన్ని గురించి, నియంతృత్వం ఎంత విషాదానికి దారితీయగలదో, వ్యక్తిగత స్వేచ్ఛ కనుమరుగైన పరిస్థితుల్లో మనుషులకు, జంతువులకు ఎలా తేడా లేకుండా పోతుందో ఈయన తన పుస్తకాలలో విస్తృతంగా చర్చించాడు (ఆ హోల్‌కాస్ట్‌లో బతికి బయటపడ్డ కొద్దిమందిలో ఇమ్రే కార్టెస్ ఒకడు!). రచయితలు ఇలాంటి పుస్తకాలు ఏ ఉద్దేశంతో రాసినా ఊహాతీతమైన ఆనాటి మానవ హననం పునరావృతం కాకూడదని చెప్పే హెచ్చరికలుగానే తరువాతి తరాలకు పనికొస్తాయి.

యూదు సంతతికి చెందిన కార్టెస్ హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జన్మించాడు. మధ్యతరగతి కుటుంబం. సెకండరీ స్కూల్లో, యూదులకు చెందిన స్పెషల్ క్లాస్‌లో చదువుకుంటున్న పద్నాలుగేళ్ల కార్టెస్‌ను 14వ ఏటనే ఇతర హంగేరియన్ యూదులతో కలిపి ఆశ్విక్ (Auschwitz) కాన్సన్‌ట్రేషన్ క్యాంపుకు తరలించారు. 1945లో క్యాంపు నాజీల చెర నుండి విముక్తమైన తర్వాతి స్కూలు చదువు పూర్తిచేసి, జర్నలిస్టుగా, అనువాదకుడిగా కొత్తజీవితం ప్రారంభించాడు కార్టెస్. ఆనాటి యువకులందరిలాగే తొలుత ఇతడు కూడా కమ్యూనిజం వైపే మొగ్గుచూపాడు. నీచే, ఫ్రాయిడ్, విట్‌గెన్ స్టైన్ ఎలియాస్ కానెట్టీలను అనువదించాడు.

ఇతని ప్రముఖ రచన 'ఫేట్‌లెస్‌నెస్', 'ఆస్విక్, బుకెన్ వాల్ట్, జైట్స్ కాన్సెంట్రేషన్ కాంపులో పదిహేనేళ్ల జార్జి కోవ్ అనబడే కుర్రవాడి అనువాలను చిత్రిస్తుంది. తొలుత కమ్యూనిస్టు ప్రభుత్వం ఈ నవలను ప్రచురణకు తిరస్కరించిందిగాని 1975లో ఇది వెలుగు చూసింది. కొందరు దీన్ని ఆత్మకథాత్మకమన్నారు. రచయిత కాదన్నాడు. పియాస్కో (1988), కాడిష్ ఫర్ ఎన్ అన్‌బార్న్ చైల్డ్ (1990)లు ఈ మన హోలోకాస్ట్ ట్రిలజీలోని తర్వాతి రెండు నవలలు. తన రచనలకు హంగేరీలో ఆదరణ లభించకపోవడంతో జర్మనీకి కార్టెస్ తన నివాసం మార్చుకుని, డాన్‌మ్యాట్, ష్నిట్లర్‌డర్, డోర్ట్స్‌లను అనువదించాడు. 2013 తర్వాత ఈయన ఆరోగ్యం దిగజారింది. ఆపరేషన్లు జరిగాయి. పార్కిన్సన్ డిసీజ్, డిప్రెషన్‌తో బాధపడ్డాడు. నోబుల్ బహుమతి తర్వాత కూడా, జర్మనీలోనే ఉండిపోవడంతో, కార్టెన్, హంగేరీలో వివాదాస్పద రచయితగా మారాడు. ఒక ఇంటర్వ్యూలో బుడాపెస్ట్‌ను 'ముక్కలు చెక్కలైనా' హంగేరీగా వర్ణించడంతో ఆయన పట్ల విముఖత మరింత పెరిగింది.

**కార్టెస్ నోబుల్ ఉపన్యాసం నుండి:**

బహుశా నియంతృత్వ ప్రభుత్వాల నీడలో గడపడంవల్ల కావచ్చు. మేధోపరమైన జీవితానికి దూరంగా గడపటంవల్ల కావచ్చు. నా సాహిత్య చైతన్యం కాస్త భిన్నంగా తయారైంది. నా కథావస్తువు సమకాలీనం కాదు. చదవాలనే ఆసక్తి కలిగించకపోవచ్చు. అందువల్ల నాదంతా నాకోసం నేను రాసుకున్న, ప్రైవేటు విషయంగానే పరిగణిస్తాను.

ఈ అబద్ధాల లోకంలో నేను రాసింది 'పిచ్చి గోల' అనిపిస్తే అనిపించవచ్చు. ప్రపంచ ఒక ఆబ్జెక్టివ్ రియాలిటీ అంటారు. అంటే మన ఇష్టాయిష్టాలతో సంబంధం లేని ఒక వాస్తవం. కానీ నాకు 1955లో ఒక వసంత కాలపు ఉదయాన *తత్వశాస్త్రంలో ఏం చెప్పినా సరే, ఈ లోకంలో ఒకే వాస్తవం ఉంది* అని నేను గ్రహించాను. నా జీవితం నాకు ముఖ్యం. కొద్దికాలం ఈ లోకంలో బతకడానికి వచ్చాను. ఈ అవకాశాన్ని జారవిడుచుకోవద్దు. మరెవరి అధికారమో నా నుండి నా హక్కుని లాక్కోనివ్వదు.

ఇంకేముంది! నా చుట్టూ ఉన్న ప్రపంచం తలకిందులైందని వేరే చెప్పాలా! అది ఆబెక్టివ్ రియాలిటీయో కాదో తెలియదు కానీ కాదనలేని వాస్తవం. నేను కమ్యూనిస్టు హంగేరీ గురించి ప్రస్తావిస్తున్నది అక్కడ పరిఢవిల్లిన సోషలిజం గురించి. ఈ లోకం ఒక ఆబ్జెక్టివ్ రియాలిటీ అయితే, ఇక్కడి మనుషులందరూ ఆబ్జెక్టివ్ తప్ప మరేం కాదన్నమాట.

*మిగతాది 58వ పుటలో*

# ఓ ప్రశ్న

*– వి. రాజా రామమోహనరావు*

'మనం వర్తమానంలో జీవిస్తున్నామా?' ఇది వల్లభనేని అశ్వినీకుమార్ వేసిన ప్రశ్న. ఈ ప్రశ్న నా ఒక్కడికే కాదు, ఇంకా చాలామందికి చెందుతుందని నా ఉద్దేశం. భౌతికంగా అందరం వర్తమానంలోనే ఉన్నాం. ప్రశ్నలో అంతరార్థం అది కాదు. మానసికంగా, సాంస్కృతికంగా, ఆదర్శపరంగా, ఆలోచనాపరంగా ఎలా ఉంటున్నాం? అని. ఎక్కువ కాలం కాకుండా, ఒక్క అరవైఏళ్లు వెనక్కి చూసినా, అప్పటి విలువలు ఇప్పుడు లేవు. అప్పటి అభిమానాలు, ప్రేమలు, ఆప్యాయత, స్నేహాలు, తోటివాళ్ల కోసం పడే ఆరాటం, వాటి రూపురేఖలు మారిపోయాయి. పెళ్లి జరిగిందంటే, వారం రోజులు ముందే వచ్చే బంధువులు, స్నేహితులు, సందడి... కుటుంబ సభ్యుల కష్ట, సుఖాల కలబోత... ఆ రోజుల్లో పెళ్లంటే కేవలం పుస్తెకట్టి, భోజనాలు చేసే తతంగం కాదు, ఓ సమాదరణ సమావేశం, ఓ ఉత్సవం, జీవితకాలం పదేపదే గుర్తుపెట్టుకునే జ్ఞాపకం. ఇది జీవితపు పలు పార్శ్వాలలో ఓ ఉదాహరణ మాత్రమే. ఈనాడు ఏ పెళ్లికైనా వారం రోజులు ముందు వెళ్లే అవకాశం, సమయం రెండూ అంతంత మాత్రమే. అలా వారం రోజులు ముందునుంచీ పెళ్లి ఇంట్లో ఉండి, ఆ జీవన నాణ్యతని అనుభవించండి అని చెప్పే పరిస్థితుల్లో కూడా లేము. మరిప్పుడు మనం ఏం చేస్తున్నాం. ఆనాటి ఆ పెళ్లిళ్ల గొప్పని స్తుతిస్తూ, ఇప్పటి పరిస్థితికి పెదవి విరుస్తూ బతుకుతున్నాం. ఇది సరైందా? ఇప్పుడు ఉన్నంతలో మరింత మెరుగ్గా ఎలా మెలగాలి అని ఆలోచిస్తున్నామా?

ఇంక పిల్లల విషయం. వాళ్లకి నీతులు చెప్పని పెద్దలు ఇంచుమించు లేరనే చెప్పాలి. ఇలా ఉండు, అలా చేయి, ఫలానా పద్ధతి క్రమశిక్షణ లేకపోతే జీవితం నాశనమైపోతుంది అని చెబుతుంటాం. ఏ విలువల ఆధారంగా మనం అలా చెబుతున్నాం. కొన్ని దశాబ్దాల వెనకటి విలువల ఆధారంగా అలా చెప్పడం సరైంది అవునో కాదో ఆలోచిస్తున్నామా? ఈనాటి పిల్లలకి చందమామ కథలిచ్చి చదవమంటే చదువుతారా? గోళీలు, తొక్కుడుబిళ్లా ఆటల్లో వాళ్లకిప్పుడు ఆసక్తి ఉంటుందా? ప్రొద్దున్న స్కూల్‌కి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన పసిపిల్లలకి, స్కూల్లో అంతా మరో ప్రపంచంలా గడుస్తుంది. అది గ్రహించే పెద్దవాళ్లు ఎంతమంది? తమ చిన్నతనంలో స్కూళ్లు, పిల్లలు ఎలా ఉండేవారో ఇప్పుడూ అంతే అనే భావన. కానీ ఇప్పుడు స్కూళ్లలోకి ప్రపంచమంతా చొరబడింది. పెద్దవాళ్లకి ఎన్ని ఆరాటాలో పిల్లలకి అంతకుమించిన ఒత్తిడి. అది గ్రహిస్తున్నామా?

అలాగే యువత పరిస్థితీనూ. పొద్దున్ననగా వెళ్లి ఏ అర్ధరాత్రికోగాని తిరిగి ఇంటికి రావటానికి వీలు లేని ఉద్యోగాలు. కడుపు నిండా తినడానికీ, కళ్ల నిండా నిద్రపోవడానికీ వీలు లేని అలసట, ఆరాటం. వాళ్లకి ఇంట్లో ఖాళీగా ఉండే ముసలాళ్లు నీతులు చెబితే తలకెక్కుతాయా? రాత్రి మూడు, నాలుగింటికి పడుకునే ఉద్యోగ తీరులో, పొద్దునే సూర్యోదయంకన్నా ముందే లేచి తయారవమంటే సాధ్యమా? ఎప్పుడో గడిచిపోయిన కాలాన్నే పట్టుకుని ప్రవర్తిస్తున్నామా? ఈనాటి పరిస్థితుల ప్రకారం ఉన్నామా?

జీవితాన్ని సుసంపన్నం చేసేవి, ఆనందమయం చేసేవి లలిత కళలు. నిత్య శ్రమని మరపించి, సేదతీర్చే ఉపకరణాలు అవి. అవి ఈనాడు వాటి రంగు, రుచి, ప్రయోజనాన్ని పూర్తిగా మార్చుకున్నాయి. ప్రపంచవ్యాప్త వ్యాపార నైపుణ్యమంతా వాటిలోకి చొరబడిన కాలం ఇది. జీవన వాస్తవికత ఉన్న సినిమాలు, శ్రావ్యత ఉన్న గానం ఇంచుమించు కనుమరుగైపోయాయి. జీవితపు అలసట తీర్చాల్సిన కళారూపాలు, జీవితాన్ని ఇంకా ఉద్రిక్తపరచి, అశాంతిని పెంచుతున్నాయి. వాటిని భరించలేనివాళ్లు, వాటికి దూరంగా ఉంటూ నిర్వ్యాపరంగా కాలం గడుపుతున్నారు. లేదా గతాన్ని తలుచుకుని దిగులుకి గురవుతున్నారు. తలుచుకుంటే ఇందులోంచి బైటపడలేమా? లైక్‌మైండెడ్ స్నేహితులో, సన్నిహితులో, తమ పరిసరాల్లోనే ఒకచోట చేరి సంప్రదాయ సంగీతం, చక్కటి లలితగీతాలు వినవచ్చు. పాటల పేరుమీద వస్తున్న ఈనాటి చాలా శాతం, శబ్దకాలుష్యం నుంచి దూరం కావచ్చు. అలౌకిక ఆనందానుభూతిని పునరావృతం చేసుకోవచ్చు. ఈ దిశగా

ఎంత ప్రయత్నం జరుగుతోంది? ఇంక సాహిత్యరంగం. ఏ ఇతర భారతీయ భాషల్లోనూ లేని దౌర్భాగ్యం మనకి మాత్రమే పట్టింది. వార, మాసపత్రికలన్నీ గబగబా మూతపడిపోయాయి. ఇప్పుడు తెలుగులో వస్తున్న వార, మాసపత్రికల్ని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. రచనలు చేసి ప్రయోజనమేమిటి? అచ్చేసే పత్రికలేవి? అన్న పరిస్థితి. ఇంకా కొన్ని పెద్ద సంస్థలు పెద్ద ఎత్తున పోటీలు పెడుతున్నారు. దురదృష్టం ఏమిటంటే ఎవరి ఎజెండా వారిది. సాహిత్యాన్ని సంపూర్ణ దృష్టితో నిండుగా, జనహితంగా, జీవన ప్రతిబింబంగా తీర్చిదిద్దాలన్న కోర్కెకన్నా ఇతర భావనలే ఎక్కువగా ఉన్నాయి. వంద పేజీలు విడువకుండా చదివించే గుణం రచనకి ప్రాణంలాంటిదని చాలామంది సాహితీ న్యాయనిర్ణేతలు అనుకోవటంలేదు. చరిత్ర పరిశోధన అని, మారుమూల ఎక్కడో జరిగే విచిత్ర సంఘటనే గొప్ప ఆధునిక కథావస్తువని, రకరకాల ధోరణుల ప్రాచుర్యం ఎక్కువగా ఉంటోంది. ఆ రకం రచనలు చాలామంది ఆసక్తిగా చదువుకోలేరు. చదవకుండా ఉండనూలేరు. ఈ విచిత్ర స్థితిగతుల్ని విశ్లేషించుకోగలిగితే, ప్రాచుర్యానికి, రకరకాల ప్రపంచాలకి, గ్లామర్‌కి తలవొగ్గకపోతే తప్పనిసరిగా ఎప్పటికైనా మార్పు వస్తుంది. ఆ దారిన ప్రయత్నాలేమైనా జరుగుతున్నాయా? మన జీవితానికి ఈ పై విషయాలతో ప్రత్యక్ష సంబంధం కనిపించకపోవచ్చు. కానీ పరోక్షంగా ఇవన్నీ జీవన నాణ్యతని ప్రభావితం చేస్తున్న అంశాలే. వందల ఏళ్లు వెనక్కి వెళ్లి అప్పటివాటిని గొప్ప చేయటం, రేపు ఎప్పుడో ఇలా జరుగుతుందని అతిగా ఊహాగానాలు చేయటం రెండూ మన వర్తమాన కర్తవ్యాన్ని పలచన చేస్తాయి.

నిన్నటికన్నా, రేపటికన్నా, ఈనాడు చాలా విలువైంది. ఆ విలువని నిలుపుకోవటమే, నిలుపుకోవడానికి మరింత లోతుగా ఆలోచించి మనుగడ సాగించటమే, వర్తమానంలో బతకటమంటే.

వి. రాజా రామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805, 040-27038805.

---

*56వ పుట తరువాయి...* **ఇమ్రె కార్టెస్**

వాళ్ళ జీవితాలు పరస్పర సంబంధం లేని కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు తప్ప మరేం కాదన్నమాట. ఏడాది తర్వాత హంగేరియన్ విప్లవం వచ్చింది. సబ్జెక్టివ్‌గా మారింది. కానీ సోవియట్ యుద్ధశకటాలు వచ్చి త్వరలోనే ఆబ్జెక్టివిటీని పునరుద్ధరించాయి. కొంతకాలం క్రితం జాఁ పాల్ సార్త్ర్ *ఎవరి కోసం మనం రాయాలి?* అనే ఒక చిన్న పుస్తకం ప్రచురించారు. అనేక సందేహాల, చర్చల తర్వాత ప్రతి రచయిత *తన కోసం తను రాసుకోవాలి* అనే నిర్ధారణకు వచ్చాను నేను. నన్ను చదివే పాఠకులే లేరు. నన్ను ప్రభావితం చేయటం కోసం నేను రాయాలి. ఆ ప్రయత్నాలు అర్థరహితం. నేను రాసినదానికి *నేనే రచయితను నేనే పాఠకుణ్ణి.* ప్రభుత్వం, రాజ్యం సాహిత్యాన్ని తన కబంధ హస్తాలలో బంధించినప్పుడు నాకు నేను చెప్పుకున్న జవాబు ఇది. అయితే, అంతకన్నా అంతకన్నా క్లిష్టమైన ప్రశ్న మరొకటి ఉంది. *ఎందుకు రాస్తాం?* చరిత్ర నన్నొక అనామకుడిగా, జీవచ్ఛవంగా మార్చింది. నాజీ కాన్సన్ట్రేషన్ క్యాంపుల నుండి వచ్చాక పదేళ్ల తర్వాత స్టాలిన్ టెర్రర్‌ను అనుభవిస్తున్నాను. నాకు తెలిసిందంతా కొన్ని అనుభవాలు, కొన్ని జ్ఞాపకాలు, కొన్ని పిట్టకథలు మాత్రమే. ఇదంతా నా ఒక్కడి అనుభవమే కాదు. నాలాంటి లక్షలాదిమందిలో నేనొకడిని. జ్ఞానోదయమైనట్లనిపించింది. కొత్త విషయం తెలిసింది. సోషలిజం అనేది ప్రూస్ట్ టీలో ముంచుకొని తిన్న అపురూపమైన కేక్‌లాంటిది. అన్నీ తిన్న క్షణాన ఆయనకు తన గతమంతా కళ్ళముందు సినిమాలాగా కనిపించింది. 1956 విప్లవం తర్వాత హంగేరీలోనే ఉండి నియంతృత్వం ఎలా పనిచేస్తుందో కళ్ళారా చూశాను. అదృష్టంకొద్దీ రచయితకు తన వృత్తి కొనసాగించడానికి కావలసిన పరికరాలు చాలా తక్కువ. కాగితం, కలం ఉంటే చాలు. హిట్లర్ నుండి స్టాలిన్ నియంతృత్వంలోకి వచ్చాడు. ఇక అన్యాపదేశంగా రాయడం తప్ప గత్యంతరం లేదు. బహుశా స్వేచ్ఛ ఉన్న పశ్చిమ దేశాల్లో బతికితే నేను ఫేట్‌లెస్‌నెస్ రాయలేకపోయేవాడిని. స్వీడిష్ అకాడమీ, తన పురస్కార ప్రస్తావనలో ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా పేర్కొంది.

1945, ఫిబ్రవరి 18 నాడు ఒక నాజీ క్యాంపు డాక్యుమెంట్‌లో ఖైదీ 64, 921 – ఇమ్రె కార్టెస్ – జననం 1927 మరణించాడు అని రాశారు. అందులో రెండు అర్థాలున్నాయి. నా వయస్సు 2 యేళ్లు ఎక్కువ వేశారు. విద్యార్థిని అని కాకుండా వర్కర్ అన్నారు. ఒకసారి మరణించాను కదా, ఇక బతకవచ్చు.

ముక్తవరం పార్థసారథి, హైదరాబాద్. ఫోన్: 917 761 8708.

# జ్ఞాపకాల జడివాన!

– పద్మశ్రీ ఎస్.వి. రామారావు



పద్మశ్రీ ఎస్.వి. రామారావు

*గత నెల తరువాయి*

అందుకే అందరు ఆయన చుట్టూ తిరిగేవారు. ఈ సంగతి నాకు బాగా పరిచయం అయ్యాక ఆయనే చెప్పారు. నెహ్రూ గారు ఒకసారి వెంకటాచలంగారిని పిలిచి – "చూడండి. సాలార్‌జింగ్ గారు కలెక్ట్ చేసిన ఎన్నో గొప్ప కళాఖండాలు అన్ని, ఒకచోట హైదరాబాదులో ఉన్నాయి. వాటిని ఒక పద్ధతిలో ప్రదర్శించి మ్యూజియంగా ఏర్పాటుచేయండి. ఆ పని మీరే చేయగలరు" అన్నారట. ఆ బాధ్యతను జి.వెంకటాచలం గారు ఎంతో శ్రమపడి ఘనంగా చేసారు.

వెంకటాచలం గారు (అందరూ వారిని "వెంకా" అని పిలిచేవారు. నేను అలానే పిలిచేవాడిని.) నాకు ఆయన "రెహ్మాన్ చుగతాయి" అన్న మహాగొప్ప చిత్రకారుడు చిత్రించిన పెద్ద డ్రాయింగు ఇచ్చారు. అది రెహ్మాన్ చుగతాయ్ గారు వెంకటాచలం గారికి ఇచ్చారట. ఈ డ్రాయింగు, నా ఇతర పుస్తకాలతో పాటుగా మాయమైపోయినది – నా ఇంట్లో – గుడివాడలో. వీరు బెంగళూరులోని "కంటోన్మెంట్"లో ఒక పెద్ద బిల్డింగ్ కట్టించి, దానిలో తనకున్న కళాసంపదనంతటినీ, తను ప్రేమించే బెంగళూరు మహానగరానికి అంకితం చేశారు. నా ఆయిల్ పెయింటింగును కూడా అందులో ఉంచారు. ఈ గ్యాలరీకి వెంకటాచలం గారు తన మిత్రుని పేరు పెట్టారు. ఆ గ్యాలరీ పేరు "ఫ్రెడ్ హార్వీ ఆర్ట్ గ్యాలరీ". మొదటి నుండి వారికీ నాకూ గురుశిష్యుల సంబంధంగా ఉండేది. వారు అమృతహృదయులు. చిత్రకారునిగా నా అభివృద్ధికి కారకులైన పుణ్యాత్ముడు.

రెండేండ్ల తర్వాత న్యూఢిల్లీలోని 'నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్'లో ఉంచేందుకు గాను జడ్జీలుగా వచ్చారు అయిదురుగు మద్రాసుకు. ప్రముఖ కళాకారులు, కళావిమర్శకులు, దేశంనుండి వచ్చిన అన్ని చిత్రాలను మద్రాసు ఆర్ట్ మ్యూజియంలో ఉంచారు. వాటి నుండి కొన్ని చిత్రాలను సెలక్ట్ చేసి కొన్నారు. అలా ఈ నా – 'బిలియర్డ్స్' చిత్రాన్ని– కూడా ఎన్నికచేసి కొన్నారు. ఈ "నేషనల్ గాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్", మన దేశంలో ఉన్న అత్యంత గొప్ప చిత్రకారుల చిత్రాలను మాత్రమే కొని, భారతదేశ ప్రభుత్వం భద్రపరుస్తుంది. చిత్రాలు కొనబడ్డవారందరిలో నేనే చిన్నవాడినని అన్నారు మా ప్రిన్సిపాల్ ఫణిక్కర్ గారు. నావి మొత్తం అయిదు చిత్రాలు కొన్నారు – రెండు సంవత్సరాలలో.

ఆంధ్రప్రభ దిన, వార పత్రికలు, ఆంధ్రపత్రిక దిన, వార పత్రికలు, చందమామ, భారతి, మాసపత్రికలు స్వతంత్ర వారపత్రిక – ఇవే ముఖ్యమైనవి. అవన్నీ మద్రాసు నగరం నుండే వచ్చేది. వాటిని రైలులో ఆంధ్రప్రదేశ్ అంతటికి పంపేవారు. చిత్రకారులు వేసిన చిత్రాలు గాని, గీసిన రేఖా చిత్రాలు గాని ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికల వారే వేసేవారు. నలుపు, తెలుపుల్లో ప్రచురించేవారు. ప్రతి చిత్రానికి 15 రూపాయలు చొప్పున ఇచ్చేవారు చిత్రకారులకు. ఆంధ్రప్రభకు నార్ల వెంకటేశ్వరరావు గారు ఎడిటరు. ఆంధ్రపత్రిక, భారతికి అధిపతులు, ఎడిటరు గారు శివలెంక శంభుప్రసాద్ గారు. భారతి మహాగొప్ప సాహిత్య పత్రిక. అందులో విశ్వనాధ సత్యనారాయణ గారి లాంటి ఉద్దండులు వ్రాసిన వ్యాసాలు ప్రచురింపబడేవి. తెలుగు భాష మీద వ్యాసాలు, ఛందోబద్ధ పద్యాలు; పండితుల మధ్య జరిగే వాగ్వివాదాలు; పుస్తక సమీక్షలు ఉండేవి. భాష గ్రాంధికంగా ఉండి, మామూలు చదువరులకు అర్థం అయ్యే విధంగా ఉండేది కాదు. తెలుగు డిక్షనరీ దగ్గర ఉండితీరాలి. అయినా నాలాంటి వాడు వ్రాసిన వ్యాసాలు ఎన్నోసార్లుగా ప్రచురించబడ్డాయి – చిత్రకారుల

మీద, చిత్రకళ మీద వ్రాసిన వ్యాసాలు, ఆంధ్రప్రదేశ్ నుండి, మద్రాసు నగరం నుండి, లండన్ నుండి వ్రాసినవి ఎన్నో ఉన్నాయి భారతిలో.

ఆమంచర్లలో గోపాలరావుగారు ఒకసారి నన్ను ఆంధ్రపత్రిక ఆఫీసుకు తీసుకొని వెళ్లారు. ఈయన మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో, సంవత్సరానికి ఒకసారి జరిగే చిత్రశిల్ప కళా ప్రదర్శనలకు తప్పక వచ్చేవారు. అలాగే ఎన్నోసార్లు వచ్చారు. కళల మీద, సాహిత్యం మీద బాగా పరిజ్ఞానం ఉన్నవారు. చిత్రకళల ప్రదర్శనల మీద వ్యాసాలు వ్రాసేవారు. పొట్టిగా, గుంభనగా ఉన్న శరీరం, గుండ్రటి బరువైన తల, తెల్లటి జుట్టుతో ఎంతో హుందాగా ఉండేవారు. ఎప్పుడూ పైపు త్రాగుతుండేవారు. అది ఆయన పర్సనాలిటీకి ఎంతగానో నప్పింది అని చెప్పవచ్చు. అలాగే ఆంధ్రప్రభ ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు గారి పర్సనాలిటీకి తగ్గది, సిగరెట్. ఈయన్ని "చైన్‌స్మోకర్" అనేవారు. సిగరెట్ చేతిలో లేకుండా ఈయన్ని చూచిన వారు లేరనే చెప్పాలి. సన్నగా బారుగా ఉన్న నార్లగారికి పైపు ఏ విధంగా నప్పదు. సిగరెట్టు ఎంతో నాజూకుతనం తెచ్చిందని తలుస్తాను వీరికి.

నన్ను శివలెంక శంభుప్రసాద్ గారికి పరిచయం చేసింది ఆమంచర్ల గోపాలరావుగారు. ఆంధ్రపత్రిక ఆఫీసు చాలా పెద్దది. నన్ను పరిచయం చేస్తూ "రామారావు చాలా గొప్పగా చిత్రిస్తాడు, ఎన్నో బహుమతులను ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించి పొందాడు. చక్కటి పేరు తెచ్చుకున్న చిత్రకారుడు. ఇతని చిత్రాలు నాకు బాగా నచ్చుతాయి. భారతదేశంలోని అందరి చిత్రాల్లా కాకుండా ఇతని చిత్రాల పోకడలే వేరు. చిత్రకళా పద్ధతులలో ఎన్నో నూత్న ప్రయోగాలు చేశాడు" అన్నారు. శంభుప్రసాదరావుగారు నేను తెచ్చిన చిత్రాల ఫోటోగ్రాఫులను చూచారు. అందులోనివి రెండో, మూడో తీసికొని ఆంధ్రపత్రికలో ప్రచురిస్తామన్నారు. టీ తెప్పించారు. ఎంతో బాగుంది టీ. అది బాగా జ్ఞాపకం నాకు. పింగాణీ కప్పు, సాసర్‌తో తెచ్చారు, ఒక ట్రేలో పెట్టుకొని. "కొత్త చిత్రాలు వేస్తే, నువ్వు వాటి ఫోటోలు మా ఆఫీసులో ఉన్న, మా అబ్బాయి రాధాకృష్ణకు ఇవ్వు. మేం ప్రచురిస్తాం అన్నారు.'' ఎంతో ఆదరాన్ని, ప్రేమను చూపించారు. మొదటిసారిగా కలిసినప్పుడే, ఎంతగానో మంచి ఇంప్రెషన్ కలిగింది ఆయన మీద నాకు. వేమరాజు భానుమూర్తిగారు సెంట్రల్ గవర్నమెంటు వారి ఇన్‌ఫర్‌మేషన్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్న పెద్ద ఆఫీసరు. వీరి ఆఫీసు మద్రాసులో ఉంది. ఈయన మంచి రచయిత, పాత్రికేయులు, గ్రంథకర్త. అందరితో కలిసిపోయి ఎప్పుడూ చిరునవ్వుతో సరదాగా ఉండేమనిషి. ఒకసారి డాక్టర్ దేశ్‌ముఖ్‌గారు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు మద్రాసు వచ్చారు. వారిని పరిచయం చేయాలని, నన్ను వారి మోటారు సైకిల్ వెనుక కూర్చోబెట్టుకొని తీసుకొని వెళ్లారు ఆంధ్రమహిళా సభ భవనంకు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారే స్థాపించారు ఆంధ్ర మహిళా సభను. అది ఇంతింతై అంతంతై మద్రాసు నగరంలో ఎంతగానో పేరు తెచ్చుకున్న సంస్థగా పెరిగింది. ఎన్నో రంగాలలో స్త్రీలకు సామాజిక సేవ చేసే సంస్థగా ప్రఖ్యాతి పొందినది. ఇది తెలుగువారికి గర్వకారణం. మద్రాసు నగరంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి సోదరుడు నారాయణరావు గారు, "ఆంధ్రమహిళ" అనే పత్రికను తానే ఎడిటరుగా నడుపుతున్నారు. అదే సమయానికి ఆయన గూడ వచ్చారు, అక్కడకు. నన్ను ఆయనకి పరిచయం చేశారు. మీకు ఏమైనా రచనలు చేసే వ్రాసే అలవాటున్నదా అని అడిగారు. వ్రాస్తాను అన్నాను. అయితే మా పత్రికకు ఏదైనా వ్రాయండి. ప్రచురిస్తాం అన్నారు. ఒప్పుకున్నాను.

తోలుబొమ్మల మీద ఓ వ్యాసం వ్రాసి పంపించాను. తోలుబొమ్మలు మొదటగా మహారాష్ట్రలో ప్రారంభమైనాయి. ఆంధ్రప్రాంతాలకు వచ్చిన తర్వాత రామాయణ, భారత కథలతో ఎంతో గొప్పగా అభివృద్ధి చెందింది ఒక గొప్ప కళగా. తర్వాత ఈ కళ ఆంధ్రప్రాంత మంతటా ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. తోలుబొమ్మలతో వేసే రామయణ నాటకాన్ని చూడని గ్రామాలు లేవు ఆంధ్రదేశంలో. తర్వాత ఈ కళ ఇండోనేషియాకు వెళ్లింది. ఆ దేశ పద్ధతుల్లో మాదిరిగా, నూతనంగా తోలుబొమ్మల రూపాలు మారినాయి. పూర్తిగా తెలుగు ప్రాంతాలలో ప్రచారమవుతున్న మన ఇతిహాసాల్లో మాదిరి ఆకారాలతో పోల్చిచూస్తే, ఇండోనేషియాలోనివి, అక్కడ సాంప్రదాయ చిత్రకళలో చిత్రించే విధంగా, వారి శిల్పాల్లో మల్చే విధంగా, సన్నగా బారైన శరీరాలతో సూదిగా ఉండే మోచేతుల్తో బారైన ముక్కుల్తో ఉన్నాయి. రామాయణాన్ని తోలుబొమ్మలతో ఒక డ్రామాను రాత్రి అంతటా పూర్తిగావేస్తారు. ఈ ప్రదర్శనలు ప్రపంచంలోనే గొప్ప పేరు తెచ్చుకున్నాయి, ఇండోనేషియన్

తోలుబొమ్మలను ఎంతో మంది కళాభిమానులు సేకరించి భద్రపరచుకుంటారు గొప్ప కళారూపాలుగా. రాజస్థాన్‌లో తోలుబొమ్మల కళ మరోవిధంగా అభివృద్ధి చెందింది. చెక్కతో చేసిన బొమ్మలకు పైన దారాలు కట్టి ఆడిస్తారు బొమ్మల్ని. వాటిని "స్ట్రింగ్ పప్పెట్స్" అంటారు. ఈ చెక్కబొమ్మలకు గుడ్డలతో బట్టలు – పరికిణీలు లాంటి వాటితో అలంకరించి నాటకాల మాదిరిగా – మన ఆంధ్ర లెదర్ పప్పెట్స్ వలె ఇతిహాస కథల్ని ప్రదర్శిస్తారు. ఇది సారాంశం. అటు ఎడిటరు గార్కి, ఇటు నా మిత్రుడు వేమరాజు భానుమూర్తి గార్కి నచ్చింది నే వ్రాసిన తోలుబొమ్మల మీద వ్యాసం. నన్ను వేమరాజు భానుమూర్తిగారు శివలెంక శంభుప్రసాదరావు గారి వద్దకు తీసికొనివెళ్లారు. అప్పటికే నాకు పరిచయం ఉన్నది గదా ఆయనతో. ఈ దఫా నన్ను రచయితగా పరిచయం చేశారు భానుమూర్తిగారు. ఆంధ్రమహిళలో ప్రచురించబడ్డ నా వ్యాసాన్ని ఆయనకు ఇచ్చారు. శంభుప్రసాద్ గార్కి ఆశ్చర్యం వేసింది. నేను జానపద చిత్రకళ మీద కూడా వ్యాసాలు వ్రాయగలనా అని. అప్పటికే నా చిత్రాల్ని ఆంధ్రపత్రికలో ప్రచురిస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత నన్ను వారి ఆఫీసుకు రమ్మని పిలిచారు శంభుప్రసాద్‌గారు. అలాగే వారిని కలిసాను వారి ఆఫీసులో. నా వ్యాసం బాగున్నదని, శైలి గూడ అందరికి నచ్చే విధంగా ఉన్నదని, నన్ను ఆర్ట్ మీద ఏవైనా వ్యాసాలు వ్రాయమన్నారు భారతికి. ఇటువంటి వ్యాసాలు *భారతి* పత్రికకు సరిపోతాయి అని అభిప్రాయపడ్డారు. అలా వ్రాయడం కళలమీద ప్రారంభించాను. జైమినీరాయ్ గారి మీద, "మన చిత్రకళ" అని రాజపుత్, మొఘల్, అమృత షెహర్‌గిల్ ల చిత్రకళను వివరిస్తూ వ్రాసాను. అవన్నీ భారతిలో ప్రచురించారు. తర్వాత ఎన్నో వ్యాసాలు వ్రాసాను చిత్ర, శిల్పకారుల మీద. (నేనప్పుడు మౌంట్ రోడ్డు దగ్గర ఒక మేడపైన అద్దెకు తీసుకుని ఉంటుండేవాడిని. నలుగురు బెంగాల్ చిత్రకారులు కూడా ఆ మేడమీద ఉండేవారు. వాళ్ళు అందరూ బెంగాలు నుండి వచ్చి, మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చిత్రకళ నేర్చుకుంటుండేవారు). మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు నేను "కూమ్" నది గట్టున నడుస్తూ, 30 నిమిషాలలో వెళ్లేవాడిని. తన కొడుకు రాధాకృష్ణ గార్ని నా దగ్గరకు పంపి నేను వ్రాసిన వ్యాసాల్ని తెప్పించుకునేవారు పత్రికలో ప్రచురించడానికి శంభుప్రసాద్ గారు. నేను లండన్ వెళ్లిన తర్వాత కూడా చాలా వ్యాసాలు పికాసో, బ్రాక్, బెన్‌నికల్సన్ మొదలగు చిత్రకారుల మీద, అమెరికన్, యూరోపియన్ చిత్ర, శిల్పకారుల మీద చాలా వ్యాసాలు వ్రాసాను. లండన్‌లో జరిగే పెద్ద పెద్ద ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్స్ మీద వివరణగా రివ్యూలు వ్రాసాను. అలాగే బ్రిటిష్ చిత్రకళ, కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన, అమెరికన్ – బ్రిటిష్ శిల్పులు – ప్రదర్శన, రష్యన్ ఐకాన్‌ల మీద, ఆఫ్రికా కళాసంపద హెడ్డింగులతో మరెన్నో వ్యాసాలు 'భారతి'కి వ్రాశాను.

ఏది వ్రాసినా ప్రచురిస్తాము అన్న మాట ఇచ్చి నాతో వ్రాయించుకున్న మహానుభావుడు శివలెంక శంభుప్రసాద్‌గారు. నా చిత్రాల్ని ఎన్నిటినో నలుపు, తెలుపుల్లో, రంగుల్లో కూడా ప్రచురించారు.

నేను మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుతున్నప్పుడే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "రవీంద్రభారతి"ని హైదరాబాద్ నగరంలో స్థాపించింది. ఇందులోనే లలితకళా అకాడమి, సాహిత్య అకాడమి, సంగీత నాటక కళా అకాడమీలు ఉన్నాయి. ఇలా రవీంద్ర భారతిని స్థాపించిన మొట్టమొదటి రాష్ట్రం, భారతదేశం మొత్తంలో మన రాష్ట్రమే. తెలుగువారందరు గర్వించారు – ఆనందించారు. అయితే జరిగిందేమిటంటే లలిత కళా అకాడమిలో ఉన్న సభ్యుల్లో, ఎవరెవరో చిత్రశిల్ప కళలకు సంబంధించని వారు కూడా ఉన్నారు. ఒకరు – వాహిని విజయ స్టూడియోస్‌లో వారి గార్డెన్స్‌ను చూచేవారు – వారిని గూడా మెంబర్‌గా వేసారు. ఆ స్టూడియోస్ చక్రపాణి, నాగిరెడ్డి గారివి. అంతకంటే గొప్ప సినిమాలు తీసేవారు గాని, అంత కంటె గొప్ప స్టూడియోగాని తెలుగువారికి లేవు – ఆరోజుల్లో. ఇంకా తెలుగువారివి చిన్న సినిమాలు తీసే ఫిల్మ్ స్టూడియోలు కొద్దిగా ఉన్నాయి మద్రాసులో. చక్రపాణి నాగిరెడ్డిగారు చాలా చాలా గౌరవనీయులు. ఎంతో పలుకుబడి ఉన్నవారు తెలుగు ప్రజల్లో, ప్రభుత్వంలో.

నాకు కోపం వచ్చింది. రాకరాక వస్తే లలిత కళా అకాడమి తెలుగువారికి – ఒక గార్డెనర్ ఉండటమేమిటి కమిటీలో అని. ఒక పెద్ద వ్యాసం వ్రాసాను. "లలిత కళా అకాడమి ఎందుకు పెట్టింది గవర్నమెంట్? ఆంధ్రప్రదేశ్‌లో చిత్రశిల్ప కళలకు ఆదరణ ఇచ్చి, ప్రజల్లోకి తీసుకొని వెళ్లి, అందర్ని సాధ్యమైనంతవరకు కళాభిమానులుగా, కళాప్రియులుగా చేయడానికి; ఆర్ట్ స్కూలు ఏర్పరచి ఎంతో

మంది కళలపై ప్రేమ ఉన్న విద్యార్థులు నేర్చుకునేందుకు అవకాశం కలగజేసేందుకు; ప్రతి జిల్లాలో చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాట్లు చేసేందుకు; మరుగునపడిన సంప్రదాయ కళల్ని వెలికితెచ్చి, ఆదరణ ఇచ్చేందుకు; జైళ్ళలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఖైదీల మనసుల్లో సున్నితత్వాన్ని, ఆనందాన్ని పంచిపెట్టి సాత్వికులుగా చేసేందుకు; చిత్రకళా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ఆర్థికంగా ఆదరణ ఇచ్చేందుకు, ప్రతి సంవత్సరం పెద్దగా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి ప్రభుత్వం కొన్ని అవార్డులను, నగదు బహుమతులను ఇవ్వవలసిన ఆవశ్యకత ఉన్నదని గుర్తించడం; వయసుపై బడ్డ చిత్రకారులకు ఆర్థిక సహాయం చేయడం; ప్రతి కాలేజీల్లో ఆర్ట్ విభాగాన్ని పెట్టడం అన్నవి ముఖ్యమైన విషయాలు. ఇంకా ఎన్నో కళలను ప్రజల వద్దకు తీసుకొనివెళ్ళేటటువంటి విషయాల్ని గురించి ఆలోచనలు చేసేందుకు, లలిత కళా అకాడమిలో విజ్ఞత గల సభ్యులు ఉండాలి. మా చిత్రకారులకు ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి ఒక వంతెనలా ఉంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం.

మరి ఈ అకాడమిలోని సభ్యులెవరు? ఎవరిని సంప్రదించి కళలతో సంబంధంలేని వాళ్లను సభ్యులుగా ఎన్నుకున్నది ప్రభుత్వం? ఎటువంటి వారిని ఎన్నుకోవాలి సభ్యులుగా? చిత్ర, శిల్పకారుల్ని; కళారంగ చరిత్ర విభాగాల్లో కృషి చేస్తున్న యూనివర్సిటీ ప్రొఫెసర్లను; స్కాలర్లను; కళావిమర్శకులను; కళాప్రియులను; కళాపోషకులను; ప్రభుత్వరంగంలో ఎంతగానో కళారంగంలో పనిచేస్తున్న రాజకీయ వ్యక్తులను ఎన్నుకోవాలి. వారే ఉండదగినవారు సభ్యులుగా. అయితే మరి మాధవపెద్ది గోఖలే గార్ని ఎందుకు చేర్చుకోలేదు కమిటీలో?. ఆయన గూడా మహాగొప్ప చిత్రకారుడే కాకుండా, రచయిత, గ్రంథకర్తగా బాగా పేరుపొంది విజయవాహినీ స్టూడియోస్‌లో చీఫ్ ఆర్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు గదా! నార్ల వెంకటేశ్వరరావు గార్ని, ఆంధ్రులు గర్వంగా చెప్పుకునే విఖ్యాత చిత్రకారుడు కె.శ్రీనివాసులుగార్ని, ఆమంచర్ల గోపాలరావు గార్ని ఎందుకు తీసుకోలేదు మెంబర్లుగా? కమిటీలో ఉన్నవారిలో ఎవరికంటే వీరందరూ తక్కువ కాదే! అయినా సంజీవదేవ్, గుఱ్ఱం మల్లయ్యగార్ని సభ్యులుగా చేర్చినందుకు సంతోషంగా ఉన్నది" అని వ్రాశాను.

"చిత్ర శిల్పకళలతో ఏమాత్రం సంబంధం లేని ఈ క్రొత్త సభ్యులు, చిత్రకారులందరికి సమ్మతంకాదు. మేము నిరాశ చెందాం. ప్రభుత్వం, చిత్రకారుల అవసరాలను, ఆశయాలను సావధానంగా గుర్తించి మాకు అండగా ఉండాలి – ఆదరణ ఇవ్వాలి అన్నదే మా మనవి". ఈ వ్యాసం చదివారు శంభుప్రసాద్‌గారు. భారతిలో ప్రచురించారు. నన్ను పిలిపించి నాతో అన్న మాటల్ని వ్రాస్తున్నాను. "ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. స్పందించిన వారు ఎంతో మంది ఉన్నారు నీ వ్యాసం చదివి. నాకు చాలా ఆనందంగా ఉంది. నీలో ఉన్న ఆవేశం అందరి మనసుల్ని తట్టింది" అన్నారు.

"రామారావు ఒక పని చేద్దామని ఉంది. ఇంతగా కదిలించిన ఈ వ్యాసాన్ని తిరిగి, మన ఆంధ్రపత్రిక వారపత్రికలో వేద్దాం. ఇంకా ఎంతోమంది చదువుతారు. అందరూ చదవాలన్నదే నా కోరిక" అని ఈ వ్యాసాన్ని ప్రచురించారు ఆంధ్రపత్రిక వారపత్రికలో.

నా వ్యాసం వచ్చిన తర్వాత ఆంధ్ర ప్రభుత్వం, విజయవాహినిలో ఉన్న గార్డెనర్‌ను, లలిత కళా అకాడమి మెంబర్ల లిస్టునుండి తీసివేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా లలితకళా అకాడమి వారి చిత్రశిల్పకళా ప్రదర్శనను హైదరాబాద్‌లో ఏర్పాటుచేశారు. నగదు బహుమతుల రూపాన అవార్డులు ఇచ్చారు. ఆ ప్రదర్శనకు నేనూ పంపాను నా చిత్రాల్ని. నాతో బాటుగా మా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుండి, మద్రాసునగరంలో ఉన్న ఇతర తెలుగు చిత్రకారులు గూడ పంపారు. నా చిత్రానికి ఒకదానికి అవార్డు, నగదు బహుమతి ఇచ్చి గౌరవించారు లలితకళా అకాడమి వారు. నా చిత్రాల్ని ఒకదాన్ని క్రొత్తగా స్థాపించిన ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ వారు కొన్నారు, వారి కలక్షన్ కొరకు. నవాజ్‌జంగ్ బహద్దూర్‌గారు అనుకుంటాను ఆ నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గారు. ఆయన చేతులమీదుగా నాకు బహుమతి అందజేశారు. గవర్నర్‌గారు సన్నగా, బారుగా ఉన్నారు. నేను గూడ సన్నగా, చిన్నగా, పొట్టి చొక్కా, పొడుగు లాగు వేసికొని అవార్డు తీసుకొన్నాను. బాగా గుర్తుంది ఆ దృశ్యం నా మనసులో. మరొక చిత్రాన్ని రాజభవన్‌లో ఉంచేందుకుగాను కొన్నారు. నా చిత్రం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గారుండే భవంతిలో ఉన్నదని, లలితకళా అకాడమి అవార్డు పొందిన చిత్రకారుడిని అని తలుచుకుంటే ఆనందంతో,

ఎంతో గౌరవభావంతో నా హృదయం స్పందిస్తుంది ఇప్పటికి. అదే నా చిత్రకళకు వచ్చిన ప్రముఖమైన గుర్తింపుగా భావించాను.

శంభుప్రసాద్‌గార్కి ఆరోగ్యం బాగుండలేదు. అందుకని లండన్ వెళ్లి అక్కడ ఉన్న డాక్టర్ల దగ్గర సలహాలు తీసుకుందామని తలచారు. ఆ సందర్భంగా శంభుప్రసాద్ గారి భార్య నాకు ఒక ఉత్తరం వ్రాసారు లండన్‌కు. నేనెప్పుడు వారిని చూడలేదు, మాట్లాడలేదు, కలుసుకోలేదు. అప్పటికే నేను లండన్‌లో స్థిరపడ్డాను, కామన్‌వెల్త్ ఫెలోగా లండన్ యూనివర్శిటీలో. వారు వ్రాసింది ఏమంటే "శంభుప్రసాద్ గారు మొదటిసారిగా లండన్ వస్తున్నారు. అంతా వారికి క్రొత్త. మీరు ఉన్నారని నాకు, మా కుటుంబానికి ధైర్యంగా ఉన్నది. మీరు ఎక్కడ నివాసమున్నారో లండన్‌లో తెలియదు. మీరున్నచోటనే, ప్రక్కన ఏ హోటల్ ఉంటే అందులోనే, మా వారు ఉండాలి. మీరు ఎప్పుడూ మా వారికి అండగా ఉండాలి. మావారు మద్రాసు తిరిగి వచ్చేవరకు ఆయనను అతి జాగ్రత్తగా కంటికిరెప్పలా చూచుకోవాలి మీరు. అది నా కోరిక. గ్రహించగలరు".

యూనివర్శిటీ ఆఫ్ లండన్ వారు కొత్తగా కట్టించిన అత్యాధునిక కామన్‌వెల్త్ భవనంలో ఉంటున్నాను. నాకు ఒక ప్రత్యేకమైన గది ఉన్నది. అందులో ఉండేవారందరికి అలాగే విడివిడిగా గదులున్నాయి. గది లండన్ నగరం సెంటర్‌లో, యూనివర్శిటీకి నడిచివెళ్లే అంత దగ్గరగా ఉన్నది. ఈ భవనం ప్రక్కనే ఒక మంచి హోటల్ ఉన్నది. అది కూడా పేరున్నదే. అక్కడ నేను వారికి ఒక రూము తీసుకున్నాను. నేను ఎప్పుడూ ఆయన దగ్గరకు వెళ్లి పలకరిస్తూ ఉండేవాడిని. ఆయన గూడ నా రూముకు వచ్చేవారు నడిచి. పక్కనే ఉన్నది గదా నాకు వారి హోటలు.

శంభుప్రసాద్ గారు నేను, ఇండియన్ హోటల్స్‌లో భోజనానికి వెళ్లేవాళ్లం ప్రతిరోజూ. ఆయన వారి ఇంటి నుండి నల్ల కారప్పొడి తెచ్చారు. అది అన్నంలో ఇద్దరం కలుపుకొని తినేవాళ్లం. ఏ కూర ఉన్నా సరే భోజనంలో, ఆ కారప్పొడి కలుపుకొని గాని తినేవారు గాదు – అలాగే నేనున్నూ. హోటల్‌లోని భోజనం అంత తృప్తికరంగా లేదు వారికి. కారం తక్కువ వేస్తారు కూరల్లో అనేవారు. మరి ఇంగ్లీషు వాళ్లు కూడా వస్తారు కదా భోజనం చేసేందుకు. మనం తిన్నంత కారపు వంటలు, వారు తినలేరుగదా. అందువల్లనే కొద్దిగా కారాలు తగ్గించే వంటలు చేసేవారు మన ఇండియన్ రెస్టారెంట్ల వారు. లండన్ నగరంలో మాత్రమేగాక అన్ని ఊళ్లలో అంతే, అలాగే యునైటెడ్ కింగ్‌డమ్ అంతా–అంటే ఇంగ్లీష్‌దేశం అంతా అని.

నాకు "travel sickness" అనే ఇబ్బంది ఉన్నది లండన్‌లో ఉండగా. అంటే నేను కారులో గాని, బస్సులోగాని ప్రయాణం చేస్తే ఒక గంటసేపు, కడుపులో తిప్పటం మొదలుపెట్టేది. ఇక కారు దిగి, రోడ్డు పక్కకు వెళ్లి వాంతి చేసుకునేవాడిని. ప్రయాణం చేయాలంటే భయంగా ఉండేది నాకు. అందుకే నేను లండన్ నగరంలో ఎక్కువగా ప్రయాణాల చేయలేదు, 1963లో ఒక సంవత్సరం వరకు. శంభుప్రసాద్ గారు తనకు తెలిసిన ఒక తెలుగు డాక్టరు గారితో కలిసి ఎవరో స్పెషలిస్టు డాక్టరు గారిని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చూడాలని ప్లాను చేసుకొన్నారు. ఆయన వెళ్లేచోటుకు హాస్పిటల్ లండన్ నగరానికి మూడు గంటల దూరంలో ఉన్నది, కారులో ప్రయాణం చేస్తే. నన్ను కూడా రమ్మన్నారు వారి వెంట శంభుప్రసాద్ గారు. సరే అన్నాను. నాకు 26 ఏండ్లు అప్పుడు. అయినదానికి లేని దానికి బిడియం పడే లక్షణం నాది. నేను రాను అని, నిజమైన కారణం చెప్తే శంభుప్రసాద్ గారు నమ్మరేమో అనే సంశయం. "నాతో రావడానికి ఇష్టంలేక ఏదో కథ చెప్తున్నాడు రామారావు" అని అనుకుంటారేమో అని భావించాను. అదీగాక వారితో వెళ్లవలసిన బాధ్యత నాకు ఉన్నది గదా! అందుకే సరే అన్నాను.

ఇక చూడండి ఏమి జరిగిందో. ముగ్గురం బయలుదేరాం. కారు లండన్ నగరం దాటిందోలేదో నాకు కడుపులో త్రిప్పడం మొదలయింది. కారు రోడ్డు పక్కన ఆపి, నేను కారు దిగి వాంతులు చేసుకోవడం జరిగింది. అలా ఎన్నిసార్లో చెప్పలేను. శంభుప్రసాద్ గారు సంగతేమిటిని అడిగితే నిజం చెప్పాను నాకున్న ఇబ్బంది. ఒకవేళ "నేను రానంటే మీరు నన్ను అపార్థం చేసుకుంటారేమో అని చెప్పలేదు'' అన్నాను. నా బాధకు, ఇబ్బందికి వారు బాధపడ్డారు. '''నాకు చెప్పవలసింది రామారావు ముందుగానే, నేనే రావద్దు మావెంట అనే వాడిని గదా!" అన్నారు. తిరిగి వచ్చేప్పుడు గూడా అలాగే ఇబ్బంది పడ్డాను. నెమ్మదిగా డ్రైవ్‌చేస్తూ డ్రైవరు మా అందరిని తీసుకువచ్చాడు లండన్‌కు. ఆయన వచ్చినపని జయప్రదం అయింది.

శివలెంక శంభుప్రసాద్ గారు క్షేమంగా తిరిగివెళ్లారు మద్రాసుకు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు ట్రావెల్ సిక్‌నెస్ ఉన్నది అన్నాను గదా! ఒకసారి, లండన్‌లో ఉన్న నా మిత్రుడు తన చెల్లెల్ని చూడడానికి కేంబ్రిడ్జి నగరానికి రమ్మన్నాడు. ఆయన బెంగుళూరు నుండి వచ్చారు లండన్‌లో చదవడానికి. నేను ససేమిరా రానన్నాను. కారులో వెళ్దామని అతని ఉద్దేశం. రైలులో అయితే వస్తాను అన్నాను. మరొకస్నేహితుని కారు అది. ఆ స్నేహితుడు డ్రైవ్ చేస్తారు. అతను బలవంతంగా ఒప్పించాడు కారులో వెళ్లేందుకు. అతను అన్నాడు 'నువ్వు నాతోరా. నీకు నేను కొన్ని లవంగాలు ఇస్తాను. అవి నోట్లో పెట్టుకొని ప్రయాణం చెయ్యి. అప్పుడప్పుడు వాటిని కొరుకు. నోటిలో ఉండగానే ఆ రసం మ్రింగు. మళ్లీ మళ్లీ లవంగాలు అలాగే నోట్లో వేసుకో. నా మాట నమ్ము. మేమిద్దరం ఉన్నాం గదా! నీకేమి ఇబ్బంది ఉండదు. ఖచ్చితంగా నీ ప్రోబ్లమ్ సాల్వ్ అవుతుంది. అవ్వకపోతే సరే మా కోసం బాధపడ్డాను అనుకో" అన్నారు. సరేనని ప్రయాణానికి ఒప్పుకున్నాను. వెళ్లేప్పుడు ఇబ్బంది పడ్డాను. చేసేది ఏమీ లేదు గదా అని నన్ను నేనే సమర్ధించుకున్నాను. కాని తిరిగి వచ్చేప్పుడు మంత్రం వలె పనిచేసాయి లవంగాలు. కడుపులో త్రిప్పడం, తగ్గిపోవడమే కాదు. మాయమైపోయింది. అప్పటి నుండి ఈరోజు వరకు గూడా ట్రావెల్ సిక్‌నెస్ నా దగ్గరకు రాలేదు. ఇది మాయో, మంత్రమో! నాకు జీవితంలో జరిగిన ఆశ్చర్యాతి ఆశ్యర్యాలలో ఇది ఒకటి.

శంభుప్రసాద్ గారి పెద్దకొడుకు శివలెంక రాధాకృష్ణగార్ని లెక్కలేనన్నిసార్లు కలిశాను. శంభుప్రసాద్ గారు ఉన్నప్పుడు, లేనప్పుడున్నూ, ఎప్పుడు అమెరికా నుండి వచ్చినా మద్రాసు వెళ్లి మాంబళంలోని LUZ కార్నర్‌లో ఉన్న అమృతాంజనం ఆఫీసుకువెళ్లి రాధాకృష్ణ గారితో కొంతసేపు గడిపి వచ్చేవాడ్ని. అలాగే విజయవాడలో ఆంధ్రపత్రిక ఆఫీసులో కలిశాను. హైదరాబాదు ఆఫీసులో కలిశాను. ఆయన గూడా తండ్రిలానే సౌమ్యుడు. సాహిత్యం మీద అపారమైన ప్రేమ–మరి ఆంధ్రపత్రికను, భారతిని నడిపింది ఆయనే గదా ఎన్నో ఏండ్లుగా! నేను ఎప్పుడు వెళ్లినా రాధాకృష్ణ గారి ఆఫీసుకు నాకు కాఫీ తెప్పించేవారు. కాఫీ త్రాగేముందుగా ఇద్దరం నవ్వుకునేవాళ్లం. ఒకర్నిఒకరు చూచుకొని, వారి ఆఫీసులో కాఫీ నాకు నచ్చుతుందని వారికి తెలుసు, నాకు తెలుసు గదా!

నేను లండన్‌లో ఉండగానే శంభుప్రసాద్‌గారి కూతురు, అల్లుడు వచ్చారు. అల్లుడు మెడికల్ డాక్టర్. కిడ్నీ మార్పిడి విభాగంలో రీసెర్చి చేసే విషయంలో లండన్ వచ్చి అక్కడే రెండు లేక మూడు సంవత్సరాలు ఉన్నారు. ఈయన గూడా రాధాకృష్ణగారి లానే ఓర్పుఉన్న వ్యక్తి. ఎప్పుడు ప్రశాంతంగా ఉంటూ కనిపించేవారు. ఆ విధంగా వారితో గూడా చాలా దగ్గర స్నేహం ఉన్నది నాకు.

శంభుప్రసాద్ గారు నన్ను చిన్న కుఱ్ఱవాడినని ఏనాడు భావించలేదు. మొదటిసారిగా ఆయన్ని కలిసినప్పుడు నాకు 18 సంవత్సరాల వయస్సు. అప్పుడు గూడా వారు పెద్దవయస్సు ఉన్న వ్యక్తిగానే నన్ను గౌరవించారు. ఇప్పుడు తల్చుకుంటే ఆశ్చర్యమేస్తుంది. ఆయన ముందు నేను ఎంతటివాడిని – ఏవిధంగా చూచినా! ఆఫీసులోని కాఫీ బాగున్నదని ఒకసారి అన్నాను వారితో. ఎప్పుడూ శంభుప్రసాద్ గారిని వారి ఆఫీసులో కలిసినా, ముందుగా కాఫీ తెప్పించేవారు నాకు – వారి ఆఫీసులోని కాఫీ అంటే ఇష్టమని. మరువలేని మహోన్నత వ్యక్తిగా నా మనసులో స్థిరనివాసం ఏర్పడింది వారికి. అందుకు నేను గర్వించడమే కాదు, అదృష్టంగా భావిస్తాను, అంతటివారు నాకు తెలుసు అని, స్నేహితులు అని అందరికి చెప్పుకుంటూ.

నేను వ్రాసిన ప్రతి వ్యాసాన్ని అంతగా పేరున్న భారతిలో, ఆంధ్రపత్రికలో ప్రచురించి, నన్ను ఆంధ్రులకు అత్యంత గౌరవంగా పరిచయం చేసిన ఆ మహానుభావుడికి, ప్రేమమూర్తికి, మనస్ఫూర్తిగా వందనాలు అర్పిస్తున్నాను.

భగవంతుని ఆశీర్వాదం వల్లే నే చిత్రించిన చిత్రాలు దేశంలో అంచెలు అంచెలుగా గుర్తింపు తెచ్చుకోవడం సాగించాయి. ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌కు చిత్రాలను పంపుతుండేవాడిని. ఎన్నో చిత్రాల్ని అమ్మడం, బహుమతులు పొందడం జరుగుతూనే ఉండేది. ఆ విధంగా నా చిత్రకళకు ఎక్కువగా గుర్తింపు రావడం జరుగుతున్నది. వచ్చిన డబ్బుల్ని గుడివాడలోని మా తల్లిదండ్రులకు పంపేవాడిని. నా చిత్రాల్లో వైవిధ్యం కొరకు చూసేవాడిని. దేశీయ చిత్రకళా విశిష్టతను మాత్రమే కాక, వివిధ దేశాల శైలి విధానాలను అవగాహన చేసుకొనేందుకు ప్రయత్నించాను. ఎప్పుడైతే గొప్ప ఆర్టిస్టునవ్వాలని నిర్ణయం తీసుకున్నానో, అప్పుడే కొన్ని

పద్ధతులను జీర్ణం చేసికొన్నాను. వాటిని తూచాతప్పకుండా అనుసరించాను – ఈనాటికి అదే పద్ధతిని అవలంబిస్తున్నాను – అది ఏమంటే: స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో దీక్షగా విద్యనభ్యసించడం, కాంపోజిషన్, బ్యాలన్స్, ప్రపోర్షన్, టెక్స్చర్స్, రంగుల్లో ట్రాన్స్‌పరెన్సీ, ఒపేక్ క్వాలిటీస్ లాంటి టెక్నికల్ పద్ధతులను, క్షుణ్ణంగా అవగాహన చేసుకొని జీర్ణించుకోవడం, ఎన్నోన్నో చిత్రాలను ఎక్కువగా చిత్రించి, అమ్మి డబ్బు సంపాదించాలనే కోరికను నా దగ్గరకు రానివ్వకుండా చూసుకోవడం అన్నది మా తల్లిదండ్రుల దగ్గర నుండి నేర్చుకున్న విషయం. ఆ దృష్టితోనే సృజనాత్మకంగా, సొంతంగా, మొదటి నుండి చిత్రాలను వేయప్రారంభించాను. ఇది చదివితే వచ్చేది కాదు – సంవత్సరాల తరబడి సాధన చేస్తేనే సాధించగలిగేది అని అర్థం చేసుకున్నాను. ముఖ్యంగా చిత్రకళాశాలలో నేర్పేది ఆడ, మగవారిని మోడల్స్‌గా ఉంచి పెన్సిల్‌తో, క్రేయాన్స్‌తో, స్కెచెస్ వేయడం లైట్ అండ్ షేడ్లు గుర్తించి చిత్రిస్తూ, మోడలుగా నిల్చున్న లేక కూర్చున్న వ్యక్తి శరీరంలో ఏభాగంలో లావుగా ఉంటుంది, సన్నగా ఉంటుంది, ముఖంలోని బుగ్గలు ఉబ్బెత్తుగా ఉంటే, చెంపలు నున్నగా ఉంటే, కండ్లు లోపలకు పోయి ఉంటే అవి ఎలా స్కెచెస్‌గా వెయ్యాలి, తల ఏ ఆకారంలో ఉంది, ముఖం కోలగా ఉన్నదా, గుండ్రంగా ఉన్నదా, అనేటువంటి ఎన్నో, ఎన్నో విషయాలను నిరంతరం ప్రాక్టీసు చేయడం వల్లనే అవగాహనకు ఆస్కారం ఉంటుంది. తర్వాత అదే లైఫ్ మోడల్‌ను చూస్తూ నీటిరంగుల్లో, తైలవర్ణాలలో చిత్రించడం. అది వర్ణ మిశ్రమాలను అర్థం చేసికొని వేసే పద్ధతి. మరో రకమైన ప్రాక్టీసు కూడా కావాలి – బయటకు వెళ్లి ప్రకృతి సౌందర్యాలను, నగరపు వీధులను, జూలోని జంతువుల్ని, చూచినదానినల్లా స్కెచెస్ రూపాన వెయ్యడం. ఈ విషయ పద్ధతులనే మొదటగా నేర్చుకుంటారు ప్రతి ఆర్ట్ స్టూడెంటు. తర్వాత రంగుల్లో వెయ్యడం. ఇవన్ని చేసినా గొప్ప కళాకారుడు అవుతాడనే గ్యారెంటీ లేదు. ఎంతో క్షుణ్ణంగా చిత్రకళ నేర్చుకున్న తర్వాత కూడా, గొప్ప చిత్రాకారుడు అవుతాడని నమ్మకం లేదు. ఎంతోమంది కష్టపడి సంగీత విద్య నేర్చుకున్నవారు ఉన్నారు. అయినా ఒక్కగానొక్క శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారే సృజనాత్మకుడు, వాగ్గేయకారుడుగా గుర్తింపబడ్డారు. నే చెప్పదలచుకున్నది ఏమిటంటే టెక్నికల్ యాస్పెక్ట్స్‌ను క్షుణ్ణంగా నేర్చుకొనడం తప్పనిసరిగా అవసరం. అది సృజనాత్మకంగా చేసే చిత్రకళకు తోడ్పడుతుంది. కళకు జీవితాన్ని అంకితం చేయడం మాత్రమే మనం, చిత్రకారులం చేయగలము కాని, ఎంతో మహోత్తరమైన కళాకారుడిగా అవుతామన్నది మనచేతుల్లో లేదు. ముఖ్యంగా, చిత్రకారుని జీవితం దారంతో ఎవరో పట్టుకొని కంట్రోల్ చేసేలాంటి గాలిపటం కాదు. విచ్చలవిడిగా గాలితో ఎగురుతూ పోతున్న గాలిపటం. అది ఎక్కడ తెగిపోయి పడిపోతుందో దానికే తెలియదు. అలాంటి దారితెన్నులు లేని జీవితమే సృజనాత్మక చిత్రకారులందరి జీవితాలు. ఇది నా జీవితానుభవంతో చెప్పే మాటలు.

రెండు విషయాలలో నా జీవితాన్ని నడుపుకున్నాను. మొదటిది మద్రాసులో ఉండగా చిత్రకళను కూలంకషంగా, విద్యార్థివలె నేర్చుకునేందుకు కృషిచేయడం. లండన్ యూనివర్శిటీలో గూడ అలానే చేశాను. అత్యంత గౌరవమైన "కామన్‌వెల్త్ ఫెలోను" అయిన ఒక సామాన్య చిత్రకళా విద్యార్థిగా, అక్కడ ఉన్న విద్యార్థులతో పాటుగా వారితో కలిసి చిత్రాలను వేశాను. అలా చేయడం వల్ల పాశ్చాత్య చిత్రకళలలోని ఎన్నో శైలులను నేర్చుకోవడానికి అవకాశం కలిగింది. మోడల్స్ ముందు నిలబడి ప్రఖ్యాత చిత్రకారులయిన 'రెంబ్రాంట్' లాంటివారి పద్ధతుల్లో స్కెచెస్ వేసాను. అది ఎంతో బలాన్నిచ్చింది నా డ్రాయింగుకు. "ఆగస్టస్ జాన్" అనే బ్రిటిషు చిత్రకారుని దృష్టిలో పెట్టుకొని లైఫ్ మోడల్స్ ముందు నిలబడి గుడివాడలో, మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో పెయింటింగ్‌లు చేసాను. ఈ విధంగా గుడివాడలో నాకు చిత్రకళ నేర్పిన నా గురువు గారు అమృత హృదయులు కె. వేణుగోపాలరావు మాష్టారి గారికి కూడా ఆగస్టస్ జాన్ చిత్రకారుడంటే చాలా ప్రేమ. ప్యాలెట్ నైఫ్‌తో, పెయింటింగ్‌లు చేసే బ్రష్‌లు అసలే వాడకుండా, చాలా తైలవర్ణ చిత్రాలు వేశాను. అలా ఎన్నో ప్రయోగాలు టెంపేరా రంగుల్లో, నీటి రంగుల్లో, డ్రాయింగుల్లో చేశాను. ఎంత గట్టి పునాది ఉంటే, అంత పెద్ద పెద్ద భవనాలు కట్టుకోవచ్చును. ఈ దృష్టితోనే సృజనాత్మక ఆలోచనలతో నా స్వంత చిత్రాలు వెయ్యడం ప్రారంభించాను. ఈ పద్ధతినే అనుసరించి లండన్‌లో ఉన్నప్పుడు కూడా తైలవర్ణాల్లో, నైరూప్య చిత్రకళలో విస్తృతంగా వినూత్న ప్రయోగాలు చేశాను. ఇక రెండవ విషయం – ఇది నా జీవితంలో అతిముఖ్యమైనది. మైకలాంజెలో తన జీవితాన్ని చాలా

ఇబ్బందుల్లో, మానసిక వ్యథలతో, ఇటలీ దేశంలో ఉన్న "వ్యాటికన్"లోని "పోప్‌లు" అందరూ పెట్టిన ఇబ్బందులలో ఇరుక్కుని గడిపాడు – ఆయన ఉద్దేశ్యం ఎంతో ఎక్కువగా డబ్బు సంపాదిద్దామని కాదు, గొప్ప శిల్పకారుడుగా, చిత్రకారుడుగా జీవించడంలోనే ఆయనకు పరమానందం ఉన్నది. ఆయన జీవితం నాకు ఆదర్శం, ఆరాధ్యం. ఆయన కవి. చక్కగా ఉత్తరాలు కూడా ఎన్నో వ్రాసేవాడు. అంత గొప్పగా ఉత్తరాలు వ్రాసిన మరో చిత్రకారుడు వాన్‌గో. ఇతను కూడ జీవితం అంతా కటిక బీదరికంలోనే గడిపాడు. మన విశ్వనాథ సత్యనారాయణ మహాకవి గారు కూడా జీవితంలో చెప్పుకునేంతగా సంపాదించలేదు. ఆయన డబ్బు మీద మనసు పెట్టలేదు. సాహిత్యం మీదనే ధ్యాస అంతా, కృషి అంతా – అందుకే వీరందరు అజరామరులు.

నేను కూడా ఇలాంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని డబ్బుతో కొలవకుండా, విద్యాసాధనలో గడిపాను. డబ్బు కోసరమైతే నా చిత్రకళ అందరికి అర్థం అయ్యే రీతిలో చేస్తూ, వ్యాపార దృక్పథంలో జరిగేది. కాని నా ధ్యేయం వేరు. నా జీవితాన్ని నా కళకు ఫణంగా పెట్టుకున్నాను – ఇతరుల అభిరుచులకు నచ్చేవిధంగా చిత్రాలు వేసి డబ్బు సంపాదించాలని కాదు.

శ్రీ వేగుంట మోహన్‌ప్రసాద్‌గారు ("మో") నా గేయ సంపుటాల పాఠకులకు నా స్వీయపరిచయం అవసరమని అని తలచారు. అలా భావించడమేకాక "నీ గురించి వ్రాసితీరవల్సిందే. నిన్ను గురించి తెలుసుకోవాలని అనుకొనేవాళ్లు ఎంతమందో, నా స్నేహితుల్లోనే ఉన్నారు – అలాగే ఆంధ్ర దేశమంతటా." అలా గట్టిగా పట్టుపట్టకపోతే నా గురించిన ఇలాంటి ఉపోద్ఘాతాలు వ్రాయడానికి బిడియంతో వ్రాసేవాడిని కాదు.

"మో" గారు ముందుమాట వ్రాసిన "కాలాంచలాలు" అన్న (ఈ పేరు కూడా ఆయనే పెట్టారు.) నా గేయరచనా సంపుటిలో, కొద్దిగా నేను పుట్టి పెరిగిన గుడివాడ నుండి మద్రాసు వచ్చేవరకు, కొద్దిగా మద్రాసులో నా చిత్రకళా జీవితం గురించి వివరాలు వ్రాసాను. "మో" గారు చెప్పిన ఒరవడిలోనే ఇప్పుడు, ఈ "ఆలోలాంతరాలాలలో" అన్న గేయసంపుటిలో కూడా నేను మద్రాసులో చిత్రకారునిగా ఉన్నప్పటి కొన్ని విశేషాలను గురించి, ఎక్కువ వివరాలతో వ్రాస్తున్నాను. గుడివాడలోని, మద్రాసులోని నా చిత్రకళాభ్యాస ప్రయాణంలో ఇంకా ఎన్నో ఎన్నో విశేషాలు ఉన్నాయి. అవి కూడా వ్రాయవలసి ఉన్నది. అలాగే లండన్‌లోని, అమెరికాలోని నా చిత్రకళా ప్రయాణంలోని ఘట్టాల గురించి వ్రాయవలసి ఉన్నది. ఆ అనుభవ విశేషాలన్నిటిని నే వ్రాయబోయే గేయసంపుటాలలో మరింత వివరంగా వ్రాయాలని తలస్తున్నాను.

ఇప్పటికే చాలా వ్రాశాను – అందుకని ఇక ముగిస్తాను.

**ఎస్.వి. రామారావు - చికాగో, అమెరికా**

---

**అలరింపు** – *మనకున్న నృత్యకళా వైవిధ్యం మరెక్కడా లేదోమో. మన దేశం కళల కాణాచి. ఐదువేల ఏండ్లనాటి సింధూ నాగరకత కాలంలోనే మన దేశంలో నృత్యం ఉండేదని అక్కడ లభించిన నాట్యకత్తె ప్రతిమ తెలుపుతుంది. ఆ నాగరకతలోని పశుపతి శివుడైతే, మన తాండవం కూడా అంతే ప్రాచీనమైందని భావించవచ్చు. భరతముని నాట్యశాస్త్ర సంకలనం రెండువేల సంవత్సరాలనాటిదైతే, మన ఆటపాటలు అంతకు ముందువని తెలుస్తుంది. అభినయశైలులను గురించి మన దేశంలోని వివిధ ప్రాంతాలలో గ్రంథాలు వెలువడినాయి. ఆయా ప్రాంతాలలో కథకులు వాచికంతో అభినయాన్ని మేళవించి, వివిధ నాట్యరీతులు ఏర్పడడానికి తోడ్పడ్డారు. ఆలయ నృత్యాలు, ఆస్థాన నృత్యాలు, విలాసినీ నృత్యాలు, ప్రచార నృత్యాలు, ఆలయ-ప్రత్యేక నృత్యాలు, ఇవన్నీ పలు వన్నెల కుసుమ కదంబంలాంటివి. వీటన్నిటిని గురించి తెలుసుకున్నపుడే, మన నృత్య కళాసంపద, దాని వైవిధ్యం తెలుస్తుంది. ఒక సంప్రదాయానికంటే మరొకటి గొప్పదో, కాదో అనే భ్రమలు తొలిగిపోతాయి.*



***నృత్యభారతి*** *యువకళాకారులు, నాట్యాభిలాషులు తప్పక చదువవలసిన పుస్తకం. రచయిత పప్పు వేణుగోపాలరావు గారు సంగీత, సాహిత్య నృత్య కళాకోవిదుడు. ఒక జీవిత కాలపు కృషితో కళామయ ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న రసజ్ఞుడు, వ్యాఖ్యాత. సులభ శైలిలో భారత నృత్య సంప్రదాయాల సాధికారిక పరిచయం కలిగించే రచన ఇంతవరకు తెలుగులో వెలువడలేదు. ఈ ప్రచురణతో ఈ కొరత తీరుతుందని, దీని ప్రేరణతో ఇలాంటి రచనలు మరిన్ని వస్తాయని ఆశిస్తున్నాను. ఇంత చక్కటి రచన చేసిన వేణుగోపాలరావు గారిని, వారిని కోరి రాయించిన* ***మిసిమి*** *సంపాదకుడు, మిత్రుడు అశ్వినీకుమార్ గారిని అభినందిస్తూ, వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.*

– **చెన్నూరు ఆంజనేయరెడ్డి,** *I.P.S.*



రాజారావు

# హాసన రాజారావు - ఒక వ్యక్తి చిత్రం

*- వేలూరి కృష్ణమూర్తి*

అప్పటి మైసూరు సంస్థానంలోని హాసన పట్టణంలో ఒక సుసంస్కృత బ్రాహ్మణ కుటుంబంలో నవంబర్ 8, 1908న రాజారావు జన్మించాడు. అతడి తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవాడు. రాజారావు తన ప్రాథమిక విద్యను హైదరాబాదులోని పాఠశాలల్లో ముగించి, అనంతరం ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం నుండి ఆంగ్ల సాహిత్యం, చరిత్రలను తన ఐచ్ఛిక విషయాలుగా తీసుకొని 1929లో బి.ఎ. పట్టాను పొందాడు. అనంతరం, అప్పటి హైదరాబాదు సంస్థానంవారి విశేష విద్యార్థి వేతనాన్ని పొంది ఫ్రాన్స్ దేశంలోని Montpellier విశ్వవిద్యాలయంలో ఫ్రెంచ్ భాష-సాహిత్యాలను అధ్యయనం చేసిన మీదట, అక్కడి ప్రతి ష్ఠాత్మకమైన సోర్ బాన్ విశ్వవిద్యాలయంలో 'ఐరిష్ సాహిత్యంపై భారతదేశ ప్రభావం' అన్న విషయంపై పరిశోధన చేశాడు. తన పరిశోధన ముగిసినంతనే 1932-1937 మధ్య కాలంలో Mercure de France అన్న ఒక ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ భాషా పత్రిక సంపాదక వర్గంలో సభ్యుడిగా పనిచేశాడు. తరువాతి కాలంలో భారత దేశంతో పాటు ఎన్నో విదేశాలలో వ్యాపకంగా సంచరించి 1966లో అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయంవారి ఆస్టిన్ శాఖలో భారతీయతత్వ శాస్త్రం బోధించడాన్ని ప్రారంభించి అదే విశ్వవిద్యాలయంలో 'ఎమెరిటస్ ప్రొఫెసర్'గా 1980లో నివృత్తి పొందారు. ఎల్లప్పుడూ ధ్యానం-అధ్యయనాలలో నిరతులైన తన తాతగారి ప్రభావం వల్ల, రాజారావుకు బాల్యం నుండే భారతీయ తత్వజ్ఞానం గురించి, ముఖ్యంగా శంకరులవారి అద్వైత దర్శనం గురించి అపారమైన ఆసక్తి పెరిగినది. ఉన్నత విద్యకోసం ఫ్రాన్స్‌కు వెళ్ళినమీదట, భారత దేశానికి మొట్టమొదటిసారి వచ్చినపుడు రాజారావు అనేకమైన ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించారు. ముఖ్యంగా గాంధీగారి సేవాగ్రం ఆశ్రమం, పాండిచ్చేరిలోని అరబిందో ఆశ్రమం, తిరువణ్ణామలైలో ఉన్న రమణ మహర్షివారి ఆశ్రమం. ఈ ఆశ్రమాలలో చాలాకాలం ఆధ్యాత్మిక సాధనను చేశారు. చివరకు ఈ విధమైన ఆధ్యాత్మిక అన్వేషణకు లక్ష్యమైన 'గురువు' రాజారావుగారికి కేరళలోని తిరువళ్ళపురంలో లభించారు. అక్కడున్న శ్రీ ఆత్మానందుల వారిని గురువులని స్వీకరించి, ఆనాటినుండి భారతదేశం వచ్చినప్పుడల్లా సాధ్యమైనంత సమయం ఆ గురువుగారి ఆశ్రమంలో గడిపేవారు.

రాజారావుగారి వైవాహిక జీవితం ముఖ్యంగా క్యామిల్ మోలీతో మొదటి వివాహం, అంత సుఖమయం కాలేదు. రాజారావు సోర్ బాన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నపుడు అక్కడే ఫ్రెంచ్ భాష అధ్యాపకురాలైన క్యామిల్ మోలీ (Camille Mouly) అన్న ఆమెను 1931లో వివాహం చేసుకొన్నారు. కాని, చాలా కొద్ది సమయంలోనే వారిరువురిమధ్య ఉన్న సంస్కృతి-వ్యక్తిత్వాల భిన్నతలవల్ల వారి దాంపత్య జీవితం ముగిసిపోయింది. అనంతర కాలంలో క్యామిల్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించింది. రాజారావుగారి ప్రసిద్ధ నవల The Serpent and The Ropeలో వచ్చే రామస్వామి-మెడలీన్ దాంపత్య జీవితంలో అనివార్యంగా సంభవించే ఘర్షణలు రాజారావు గారి వాస్తవ జీవితం అనుభవాలను ఆధారం చేసుకొని వ్రాసినదే!

రాజారావు భారత దేశానికి వెనుదిరిగినమీదట 1942లో బ్రిటీషువారికి విరుద్ధంగా భూగత (Underground) కార్యక్రమాలలో కొంతకాలం పనిచేశారు. అదే సమయంలో మూడేళ్ళకాలం పాటు TOMORROW అన్న ఒక పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. ఒకటి రెండు దశాబ్దాల అనంతరం అమెరికాకు వెనుదిరిగిన రాజారావు అక్కడే స్థిరనివాసం



కంఠపుర

ఏర్పరచుకొని అక్కడి రంగస్థలానికి చెందిన కాథరీన్ జోన్స్ అన్న కళాకారిణిని 1965లో వివాహం చేసుకొన్నారు. ఆ దాంపత్యం రెండు దశాబ్దాల కాలం, 1986 వరకు కొనసాగింది. 1986లో కాథరీన్‌తో వివాహ విచ్ఛేదన చేసిన రాజారావు 1986లో సూసన్ వాట్ (Susan Vaught) అన్న ఆమెను వివాహమాడారు. ఈ దాంపత్యం, రాజారావు తమ 96 ఏళ్ళ వయసులో అమెరికాలోని టెక్సాస్ ప్రదేశంలోని ఆస్టిన్ నగరంలో 8th జూలై 2006న తన తుది శ్వాస విడిచేవరకు (1986–2006) కొనసాగింది. రాజారావు గారికి మైసూరు నగరంతో మొదటినుండీ చాలా సన్నిహిత అనుబంధం ఉండేది. ముఖ్యంగా మైసూరులోని 'ధ్వన్యాలోక' అన్న సాహిత్య సాంస్కృతిక సంస్థను స్థాపించిన శ్రీ C.D.N (C.D. నరసింహయ్య)గారితో రాజారావుగారికి చాలా గాఢమైన స్నేహం. రాజారావు గారి రచనలను దీర్ఘంగానూ, లోతుగానూ విశ్లేషించి వాటి విశిష్ఠతను చదువరుల, అలాగే విమర్శకుల గమనానికి తెచ్చినవారు C.D.N అన్న హ్రస్వ నామంతో ప్రఖ్యాతిగన్న ప్రొఫెసర్. సి.డి. నరసింహయ్య. ప్రొఫెసర్. C.D.N. మైసూరు మహారాజా కాలేజిలో ఇంగ్లీషు విభాగానికి ప్రధానాచార్యుడుగానూ, విభాగానికి ముఖ్యస్తుడుగానూ చాలాకాలం పనిచేసి చివరకు అదే కాలేజిలో ప్రిన్సిపాలుగా నివృత్తి పొందిన మీదట 'ధ్వన్యాలోక' సంస్థను ప్రారంభించారు. రాజారావు, C.D.N. మధ్య స్నేహం ఎంత గాఢంగా ఉండినదంటే రాజారావు భారతదేశం వచ్చినప్పుడల్లా మైసూరుకు తప్పకుండా వచ్చేవారు. రాజారావు CDN గారి 'ధ్వన్యాలోక'ను దర్శించి అక్కడే ఉంటూ CDNతో కలిసి కొద్ది రోజులపాటు సాహిత్య చర్చల'లో గడిపేవారు. మూడు దశాబ్దాలుగా ప్రొఫెసర్ CDN గారితోనూ, వారు స్థాపించిన 'ధ్వన్యాలోక'తోనూ పరిచయమున్న నాకు రాజారావు మైసూరుకు వచ్చిన ఒక సందర్భంలో వారిని చూచే అవకాశం లభించింది. అలాగే 2006లో రాజారావు టెక్సాస్ పట్టణంలో మరణించినపుడు సూసన్ రాజారావు ధ్వన్యాలోకకు వ్రాసిన లేఖ కూడా చూచే అవకాశం లభించింది. రాజారావు మొదట మాతృభాష కన్నడంతో పాటు ఫ్రెంచ్ భాషలో కథలు, ఇతర రచనలు చేయడానికి ప్రారంభించారు. అనంతర కాలంలో అతను ఆంగ్ల భాషనే పూర్తిగా తన అభివ్యక్తి మాధ్యమంగా ఎన్నుకొని వివిధ విషయాలపై తన రచనలను కొనసాగించారు. భారతదేశ స్వాతంత్రోద్యమ పోరాటం నేపథ్యంలో వారు రచించిన *కంఠపుర* (Kanthapura) అన్న ఆంగ్ల నవల 1938లో ప్రకటించబడి రాజారావుకు అపారమైన పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. ఇదొక చాలా విజయవంతమైన రాజకీయ నేపథ్యమున్న నవల. భారత దేశంలోని లక్షలకొద్దీ పల్లెలలాగే మైసూరు ప్రాంతంలోని ఒక కాల్పనిక గ్రామం *కంఠపుర.* ఈ పల్లెలో వేరువేరు జాతులకు సంబంధించిన జనులు వేరు వేరు భాగాలలో నివసిస్తూ ఉంటారు. ఊరికి మధ్యన గ్రామ దేవత కెంచమ్మ గుడి ఉంటుంది. దానితోపాటు తరతరాల నుండీ పరంపరాగతమైన వృత్తులనే అనుసరిస్తూ జీవితం గడుపుతున్న ఆ పల్లెవారు శతాబ్దాల నుండీ ఎలాంటి మార్పూ లేని ఒకేవిధమైన జీవితలను గడుపుతుంటారు. ఇలాంటి ఆ పల్లెకు సుమారుగా 1920వ దశాబ్దంలో పట్టణం నుండి మూర్తి అన్న ఒక యువకుడు వచ్చినపుడు, అక్కడి సామూహిక జీవితంలో ఒక అద్భుతమైన చలనం ఏర్పడుతుంది. విద్యలేని ఆ పల్లెవారిని ఒకచోట చేర్చిన మూర్తి వారికి గాంధి తత్వాలు, గాంధిగారి నాయకత్వంలో జరుగుతున్న స్వాతంత్ర పోరాటం మొదలైన వాటిని హరికథల రూపంలో పరిచయం చేస్తాడు. మధ్యపాన నిరోధం, అస్పృస్యతా నిర్మూలనం, మొదలైన సంస్కరణా కార్యక్రమాలకు వారిని పురిగొల్పుతాడు. గాంధీ, అలాగే స్వాతంత్ర పోరాటాన్ని తమదైన పౌరాణిక చట్రంలో అర్థంచేసుకొన్న ఆ పల్లెవారు ఒక్కటై బ్రిటీషు వారి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన శిస్తును, పన్నులను నిరాకరించే ఉద్యమాన్ని కొనసాగిస్తారు. కాని, అప్పటి ప్రభుత్వ యాజమాన్యాన్ని ప్రతినిధించే పోలీసువారు అలాగే అక్కడి ఫ్యూడల్ వ్యవస్థ నాయకులు, ముఖ్యస్తులు ఈ మార్పులను వ్యతిరేకిస్తూ ఎందరో పల్లెవారిని కారాగారానికి పంపుతారు. చివరకి జైళ్ళనుండి విడుదలైన పల్లెవారు తమ గ్రామాలను వదలి దూరప్రాంతాలకు తరలిపోతారు. *కంఠపుర* నవల విశిష్ఠత

ఇందులోని నాయకుడు ఒక సామాన్య యువకుడు. ఈ నవలలోని కథను వివరించేది చదువురాని ఒక వృద్ధ మహిళ రంగమ్మ. ఈ విధమైన చిత్రణ ద్వారా ఎలా గాంధీ, అతడి తత్వాలు అజ్ఞాత పల్లె-పల్లెలకూ వ్యాపించింది, దానికి తోడు పేదవారూ, అలాగే చదువురాని సామాన్య జనులు కూడా గాంధీగారి తత్వాల ద్వారా ప్రభావితులై బ్రిటీషువారి విరుద్ధంగా అసమాన్యమైన పోరాటాన్ని చేశారన్నది ఈ నవల అత్యంత మనోజ్ఞంగా తెలుపుతుంది.

Kanthapura (కంఠపుర) నవల తరువాత రాజారావు రచించిన నవలలన్నీ ఆధ్యాత్మిక ప్రపంచాన్ని కేంద్రంగా వుంచుకొని రచించినవని పరిగణించవచ్చు. ఆ నవలలు The Serpent and The Rope (1960), The Cat and Shakespeare (1965), Comrade Kirilov (1976) and The Chess Master and His Moves (1988). ఈ నవలలేకాక వారు రెండు కథా సంకలనాలను, భారతీయ సంస్కృతికి సంబంధించిన The Meaning of India (1996) అన్న కృతితోపాటు, గాంధీ గారి జీవిత చరిత్ర (1998), మరికొన్ని రచనలు కూడా చేశారు.

రాజారావుగారి రెండవ నవల The Serpent and The Rope (1960)కు 1963లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఈ నవల శంకరాచార్యులవారి మాయావాదాన్ని 'సర్పం-రజ్జు' రూపకం ద్వారా దాఖలు చేస్తారు. చీకటిలో మనం పగ్గాన్నే పామని తలచే రీతిలో అజ్ఞానం/అవిద్య కారణంవల్ల మనము మర్త్యలోకపు జీవులు - ఈ మాయాలోకాన్నే సత్యమని గ్రహించి అనేక విధాలైన గందరగోళాలకు లోనౌతారు. ఎపుడైతే ఈ మాయ తెర తొలగిపోతుందో అపుడు మాత్రమే మనం సత్యాన్ని తెలుసుకోవడానికి సమర్థులమౌతామని ఈ నవల నాయకుడు రామస్వామి ద్వారా రచయిత తెలుపుతాడు. ఇపుడు మనకు, ముఖ్యంగా భారతీయులకు రాజారావు ఎందుకు ప్రస్తుతమవుతాడంటే, ఆంగ్ల భాషను సాహిత్య రచనకు మాధ్యమంగా ఎలా ఉపయోగించాలని వారు చేసిన ఆలోచన, అలాగే వారు చూపినమాదిరి. ఈ విషయానికి సంబంధించి రాజారావు తన మొదటి నవల ముందుమాటలో తమ వాదాన్ని ఈ విధంగా స్పష్టం చేస్తారు: 'ఆంగ్ల భాషలో సాహిత్య రచనలు చేసే ఒక భారతీయుడు తనది కాని భాషలో తనదైన ఆలోచనలను అలాగే భావనలను అభివ్యక్తీకరించాల్సి వస్తుంది. విశిష్ఠమైన ఆలోచనాక్రమాన్ని, దాని సూక్ష్మాతి సూక్ష్మమైన విన్యాసాలను, అలాగే ఆ క్రమంలో తనలోనికి చేర్చుకొనే, లేక తిరస్కరించే అంశాలను చేపట్టాల్సి పడుతుంది. బ్రిటీషువారిలాగా మనం ఇంగ్లీషులో వ్రాయలేము. వ్రాయనూ కూడదు.' ఇలాంటి ఖచితమైన సిద్ధాంత దృష్టికోణంలో రాజారావు తమ అన్ని రచనలను కొనసాగించారు. ప్రఖ్యాత ఆఫ్రికా రచయిత చినువ అచిబె విశ్వ సాహిత్య సందర్భంలో తన అసాధారణమైన వ్యక్తిత్వం, రచనా ప్రతిభ ద్వారా ఆఫ్రికా జనుల మనసులపై యూరోపువారి సాంస్కృతిక ప్రభావం, దాని పరిణామం ఎంతటి ఉగ్ర స్వరూపం దాల్చినది, దాని నుండి విడుదల పొందడమెలా? తమ అస్థిత్వాన్ని కనుగోవడమెలా? అన్న సంగతులను ధారాకారంగా తన ప్రఖ్యాత నవలలలో నిరూపించి చూపారు. చినువ అచిబెలాగే రాజారావు గారి సిద్ధాంతమేమంటే 'మనం, మనది కాని భాషలో వ్రాసినా సంవేదనలు మాత్రం మనవై ఉండాలి. అలాగే భాషా -సాంస్కృతిక వివరాలు మన సమాజానికి సంబంధించినవై ఉండాలి. ఈ ధోరణి ద్వారా మన భాషాసాంస్కృతిక అనన్యతను మనం కాపాడుకోవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.



***surpent and the rope ki* కి తెలుగు**

రాజారావుగారి సాహిత్య సేవను గుర్తించి భారత ప్రభుత్వం 1969లో పద్మ భూషణ ప్రశస్తిని సమర్పించింది. 1997లో కేంద్ర సాహిత్య అకాడమీవారి ఫెలోషిప్ వారిని వరించింది. ఇవేకాక రాజారావుగారికి మరెన్నో ఫ్రెంచ్ పురస్కారాలు లభించాయి.

వేలూరి కృష్ణమూర్తి, బెంగుళూరు. ఫోన్: 944 897 7877.

# సహృదయ సంస్కారి ఆలపాటి రవీంద్రనాథ్



ఆలపాటి రవీంద్రనాథ్

*ఒక వ్యక్తి విశిష్ట మానవునిగా రూపొందడానికి, వంశపారంపర్యంగా లభించే లక్షణాలతోపాటు, స్వయంకృషితో సాధించిన విజ్ఞాన సముపార్జనవంటి విజయాలు ముఖ్యపాత్ర వహిస్తాయని వైద్య పరిశోధకులు విశ్వసిస్తారు. గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండలం, గోవాడ (గోపులవాడ) ప్రసిద్ధ శివక్షేత్రం. ప్రతి సంవత్సరం శివరాత్రినాడు పెద్ద ఎత్తున తిరునాళ, ఎడ్లపందాలు జరిగేవి. 2 తరాల క్రిందట ఆలపాటి దేవయ్య పేరు పొందిన గృహస్థు. వీరికి వెంకటక్రిష్ణయ్య, వెంకట్రామయ్య, సూర్యనారాయణ కుమారులు. రవీంద్రనాథ్ తండ్రి వెంకట్రామయ్య ఆరోజుల్లో తాను తెప్పించిన 'కృష్ణా పత్రిక'ను చదివి, తాను, ఇతర పెద్దలు కలిసి స్థాపించిన రాజరాజ నరేంద్ర గ్రంథాలయానికి ఇచ్చేవారు. రవీంద్రనాథ్ పినతండ్రి సూర్యనారాయణ 1950-60 ప్రాంతాల్లో రైతు సమాఖ్య స్థాపించి, పశుపోషణను ప్రోత్సహించి రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలను నిర్వహించేవారు. ఆయన మద్రాస్‌లో ప్రింటింగ్ ప్రెస్ తీసుకుని 'విహారి' అనే పత్రికను కొన్నాళ్లు నడిపారు. పెదనాన్న వెంకటకృష్ణయ్య వేదాలను కొంత భాగం తర్జుమా చేయించి సాహిత్యసేవ చేశారు. వీరి కుమారుడు కృష్ణకుమారన్ అమెరికాలో ప్రొఫెసర్‌గా పనిచేసారు. రవీంధ్రనాథ్ బాల్యం నుంచి పుస్తక పఠనాలతో వివిధ వైజ్ఞానిక, సాహిత్య, అభ్యుదయ భావాల్లో ఆసక్తి చూపుతూ ఎం.ఎన్.రాయ్ వంటి మేధావుల సిద్ధాంతాలను అవగాహన చేసుకున్నారు. పాఠశాలలో ఉండే క్రమశిక్షణ మార్గాన్ని ఇష్టపడక, స్వయంగా ఇంటివద్ద ట్యూటర్‌ను పెట్టుకుని ఇంగ్లీషు, వైజ్ఞానిక విషయాలను నేర్చుకున్నారు. నవంబరు 2021 **మిసిమి** సంచికలో 'చతుర్ముఖ జ్యోతి' అనే శీర్షికలో ప్రొ. రావి నూతల సత్యనారాయణ, ఇతర పెద్దలు రవీంద్ర స్మృతి (2001) పుస్తకంలో వారి ప్రతిభా విశేషాలను గురించి కూలంకషంగా ప్రస్తావించారు. మరి కొన్నిటిని ఈ వ్యాసంలో తెలుపుతున్నాను. 1946లో తెనాలి వచ్చి జ్యోతి ప్రెస్ స్థాపించి, 'జ్యోతి' 'రేరాణి' 'సినిమా' పత్రికలను నడిపారు. 'జాకొబిన్' పబ్లిషర్స్ పేరుతో ప్రైవేట్ రంగంలో పాఠ్యపుస్తకాల ప్రచురణ ప్రారంభించారు. తెనాలిలో ఉన్న 10 సంవత్సరాల్లో జరిగిన సంఘటనలను కొన్ని గుర్తు చేసుకొందాం. ఎలెన్ రాయ్ (ఎమ్.ఎన్. రాయ్ సతీమణి) వ్రాసిన 'కుటుంబ నియంత్రణ'పై వ్యాసం ప్రచురించగా ప్రభుత్వం నేరారోపణ చేసింది. రావూరి భరద్వాజ రచించిన 'అలవాటు లేని ప్రాణం' కథను 'రేరాణి'లో ప్రచురిస్తే కోర్టు విధించిన జరిమానా 500 రూపాయలను రవీంద్రనాథ్ చెల్లించారు. ఆ విధంగా ఆనాటి వర్ధమాన రచయితలకు అండగా ఉండేవారు. 'జ్యోతి'లో ఆనాడే విజయవాడ ఆకాశవాణి కార్యక్రమాలపై సునిశిత విమర్శలను ప్రచురించారు.*

*తరువాత హైదరాబాద్ వెళ్లి అగ్రశేణి ముద్రాపకునిగా ఖ్యాతి పొందారు. **మిసిమి** అనే కళాత్మకమైన పేరును భాషాశాస్త్రవేత్త బూదరాజు రాధాక్రిష్ణ సూచించారు. తెలుగు-తెలుగు నిఘంటువులో **మిసిమి** అంటే 'నూతన కాంతి' 'వెన్న' అనే అర్థాలున్నాయి. 1990లో స్థాపించిన ఈ పత్రిక మేధావులను, జిజ్ఞాసువులను, సౌందర్యా రాధకులను ఆకట్టుకొన్నది. కొన్ని ఇబ్బందులెదురైనా ప్రతికను కొనసాగించిన ధీరుడు. **మిసిమి** పత్రికను మంచి ఆర్టు పేపరు మీద, అందాలు ప్రతిఫలించే రంగుల చిత్రకళ, శిల్పకళా సొయగాలతో రూపొందించారు. 'నూతన జిజ్ఞాసువుగా, నిరంతర పాఠకోత్తమునిగా' ఆయనను సి.నా.రె. ప్రశంసించారు. 'పట్టుదలతో మనిషి ఏదైనా సాధించగలరనడానికి ఆయన ఉదాహరణ' అని జస్టిస్ ఆవుల సాంబశివరావు నివాళులర్పించారు. "దీపం (జ్యోతి), **మిసిమి** (కాంతి) రెండూ ఆయనే అని రచయిత భరాగో శ్రద్ధాంజలి ఘటించారు. 'రవీంద్రనాథ్' గుర్తుకు వస్తే మూర్తి దాల్చిన సౌందర్యం స్మృతిలో మెరుస్తుందని విద్యావేత్త, రచయిత డా. కొలకలూరి ఇనాక్ ఉగ్గడించారు. 'మేధను ప్రతిబింబించే తెలుగు పత్రిక **మిసిమి** అని డా॥ సంజీవదేవ్ అభివర్ణించారు. 'వ్యాసాల ప్రచురణలో పాక్షికదృష్టి లేకపోవటం, పత్రికవలన తనకంటె పాఠకులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంద'ని రచయిత, సినీనటుడు జగ్గయ్య విశ్లేషించారు. ప్రముఖ పుస్తక విమర్శకులు డి. ఆంజనేయులు, రచయిత డి.వి. నరసరాజు పత్రికలోని విలువైన వ్యాసాలు భద్రపరచుకోదగినవన్నారు. సరసవచో సంభాషణలతో ఉదాత్త భావాలతో ఆదర్శాలతో రాజీపడకుండా జీవించిన భావుకునిగా హేతువాది, ఆయన బాల్య స్నేహితుడు పి. అచ్యుతరామ్ శ్లాఘించారు. 1993లో సతీమణి కళావతి ఆకస్మిక కాలధర్మం చెందగా తనలోనే మానసికక్షోభ అనుభవించారు. రవీంద్రనాథ్ 3 సంవత్సరాల తర్వాత స్వల్ప అనారోగ్యంతో మెడిసిటీ హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఆయన అస్తమయం నాటికి **మిసిమి** 79 సంచికలు వెలువడినాయి. తరువాత వారి కుమారులు బాపన్న, దేవేంద్రనాథ్, కుటుంబసభ్యుల నిర్వహణలో ఎ. వెంకటేశ్వరరెడ్డి, ప్రస్తుత సంపాదకులు వి. అశ్వినీకుమార్ ఆధ్వర్యంలో **మిసిమి** ఉన్నత ప్రమాణాలతో తెలుగు పాఠకులను అలరిస్తూనే ఉన్నది. రవీంద్రనాథ్ కోరికననుసరించి తెనాలి శాఖా గ్రంథాలయంలో తన మిత్రుడు గ్రంథాలయ గాంధీ డా. వెలగా వెంకటప్పయ్యను సంప్రదించి 'ఆలపాటి కళావతీ - రవీంద్ర పీఠం 1994లో స్థాపించబడింది. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో తదనంతరం బాపన్న తదితర కుటుంబ సభ్యుల సహకారంతో ఈ పీఠం దిగువ లక్ష్యాలతో కొనసాగుతున్నది. 1. కవి పండితుల, ప్రముఖుల జయంతులు, వర్ధంతులు, విశిష్ట కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలు 2. పోటీ పరీక్షలకు పుస్తకాలు, పాఠ్య గ్రంథాల కొనుగోలు 3. మానవ వనరుల పెంపుదలకు శిక్షణా కార్యక్రమాలు 4. ఉత్తమ గ్రంథాలపై చర్చాగోష్ఠి నేటికీ కొనసాగుతున్నాయి. ఆళ్ల రాఘవయ్య, ఐనాల మల్లేశ్వరరావు, సి. హెచ్. సురేష్, ఎన్.ఆర్. తపస్వి మొదలైన అనేక గ్రంథాలయ కార్యకర్తలు తోడ్పడుతున్నారు. రవీంద్రుని, కిరణాల వెలుగులు ఆయన స్వంత పట్టణమైన తెనాలిలోనేగాక ఆంధ్రదేశమంతటా ప్రసరిస్తూనే ఉంటాయి.*

*- డా. పాటిబండ్ల దక్షిణామూర్తి, తెనాలి. ఫోన్: 790 101 4749*



మల్లంపల్లి శరభేశ్వర శర్మ

# మల్లంపల్లి శరభేశ్వర శర్మ

*- వాడ్రేవు వీరలక్ష్మీదేవి*

మల్లంపల్లి శరభేశ్వర శర్మగారు (1928-2007) సంస్కృతాంధ్ర కవిత్వాలకు మరొక రసగంగాధరుడు.

రామకృష్ణ పరమహంస సూత్రాలకు వివేకానందుడు తన జీవితాన్నే భాష్యంగా చేసినట్టు ఆనందవర్ధన, అభినవ గుప్తులనే సంస్కృతాలంకారికుల రసధ్వని సిద్ధాంతాన్ని మహాకవుల కావ్యాల ద్వారా అనుభూతం చేసుకున్న సహృదయ పాఠకుడు. కావ్యగతమయిన ఆ రసతత్వాన్ని అనుభూతి చెంది, సూత్రాలవంటి తన వాక్కుల ద్వారా విమర్శగా ఆవిష్కరించడానికే జీవితమంతటినీ వెచ్చించినవాడు.

సాహిత్యం యొక్క అవాంతర ప్రయోజనాలుకాక పరమ ప్రయోజనాన్నే గుర్తించి దాన్ని ఆవిష్కరించడమే జీవిత ధ్యేయంగా, ఇంకా చెప్పాలంటే అందుకోసమే శ్వాస తీసుకుంటూ ఎనభయి సంవత్సరాలు జీవించిన సాహితీ విమర్శకుడు శరభయ్య గారు.

వీరు 1928 మార్చి 23న కృష్ణా జిల్లా చిట్టిగూడూరులో జన్మించారు. తండ్రి మల్లంపల్లి మల్లికార్జునారాధ్యులవారు. తల్లిగారు కనకదుర్గాంబ. తండ్రిగారే శరభయ్యగారికి మొదటి గురువు. ఆయన దగ్గర పన్నెండేళ్ళ వయసులోనే కావ్యనాటకాలంకారాలను అధ్యయనం చేశారు. చెళ్ళపిళ్ళవారికి ఏకలవ్య శిష్యుడు. అప్పటికే సంస్కృతాంధ్ర సాహిత్యాలలో ఆయనకు కొన్ని వేల పద్యాలు కంఠస్థం. తల్లిగారి వద్ద కూడా ఎన్నో శైవ కథలు విని ఉన్నారు. ఆమె కుమారస్వామి కవి అని చెప్పారట. కాళిదాసు కూడా కవి అని ఆమె చెప్పారట. పరిణతి చెందిన వయసులో తన మూడు కావ్యాలలోనూ, మూడు నాటకాలలోనూ ఆరు ముఖాలుగా అనేక వర్ణాలతో దేదీప్యమానమై, ఆకాశమంతటా ఆవరించిన భావనాబర్హముతో ప్రతిభా మయూరముపై అధిష్ఠించిన కాళిదాసే మహాసేనుడిగా ఆయనకు సాక్షాత్కరించాడని ఆయన చెప్పారు.

ఆ ఊహకు విత్తనం వేసింది తల్లిగారే.

"ఇది ఏ దేశమో, ఏ కాలమో తెలుగు భాష నాకు తల్లి భాష ఎలా అయిందో ఇది ఏమీ తెలియనినాళ్ళలో నా తెలివికి ఆమే కారణం. ఈ నా బతుకులోని శివకథా విజ్ఞానమంతటికీ ఆమెయే మూలకారణం'' అని శరభయ్యగారు ఆమె గురించి తలుచుకుంటారు.

తరువాత కాలంలో విశ్వనాథ సత్యనారాయణ గారి శిష్యరికం కూడా చేశారు. తర్వాత కాటూరి వెంకటేశ్వరరావు గారి దగ్గర ఆంగ్లభాషను కావ్యానుశీలనం ద్వారా అభ్యసించారు.

చిట్టిగూడూరులోని ప్రాచ్య కళాశాలలోనే విద్యాభ్యాసం చేసి కొంతకాలం అక్కడే అధ్యాపకుడిగా పనిచేసి తర్వాత మద్రాసులోని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో కొన్ని సంవత్సరాలు పరిష్కర్తగా, పరిశోధకులుగా పనిచేశారు. ఆ సమయంలో ఎన్నో ప్రాచీన కావ్యాలు పరిష్కరించారు. రాష్ట్ర విభజనవల్ల రాజమండ్రి వచ్చి చాలా సంవత్సరాలు రాజమండ్రిలోని ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాలలో అధ్యాపకుడిగానూ, ప్రిన్సిపాల్‌గానూ పనిచేసి పదవీ విరమణ చేశారు. తరువాతి కాలంలో తిరుపతిలోని కేంద్రీయ సంస్కృత పీఠం ఆహ్వానంపై తిరుపతి వెళ్ళి చాలా పుస్తకానువాదాలు, వ్యాఖ్యానాలూ చేశారు.

శరభయ్యగారి రచనలను మూడు విభాగాలుగా విభజించవచ్చు. 1. స్వతంత్ర రచనలు 2. అనువాదాలు. 3. వ్యాఖ్యానాలు.

1. స్వతంత్ర రచనలు: *వేణుగోపాల శతకం* అనే తెలుగు శతక కావ్యం, *గౌరీ కల్యాణం* అనే సంస్కృత కావ్యం,

సుప్తదీర్ఘిక పేరుతో వ్రాసిన ఖండ కావ్యాల సంకలనం, సాహిత్య విమర్శకు చెందిన 'సహృదయాభిసరణం' అనే పేరుగల వ్యాస సంకలనం. ఇవికాక మరికొన్ని సాహితీ వ్యాసాలు కావ్య వాక్కు పేరుతో త్వరలో ముద్రణకు రాబోతున్నాయి.

2. అనువాదాలు : ***కాళిదాస మాళవికాగ్నిమిత్ర, విక్రమోర్వశీయ*** నాటకాలను అనువాదం చేశారు. కాళిదాస కుమార సంభవాన్ని గద్యరూపంలో అనువదించారు. వేదాంత దేశికుల దయాశతకాన్ని, అభినవగుప్తుని పరమార్థ సారాన్ని తెలుగు చేశారు. కన్నడంలోని బసవేశ్వర వచనాలను 'బసవేశ్వర వచనాని' పేరుతో సంస్కృతంలోకి అనువదించారు. తాళ్ళపాక పెద తిరుమలాచార్యుని నీతి శతకాన్ని, వేంకటేశ్వర వచనాలను సంస్కృతంలోకి అనువదించారు. కాశ్మీర భాషా కవయిత్రి లల్ల మహాదేవి వచనాలను ముత్యాల సరాలుగా అనుసృజించారు.

3. వ్యాఖ్యానాలు : లీలాశుకుడి కృష్ణకర్ణామృతానికి గొప్ప వ్యాఖ్యానం రాశారు. కాశీఖండానికి కూడా వ్యాఖ్య రాశారు. ఈ రెండూ ముద్రణలో ఉన్నాయి. ముద్రణకు రాని మరికొన్ని వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. భాగవతానికి వ్రాసిన వ్యాఖ్య, భాగవత సుధాలహరి పేరుతో చేసిన వ్యాఖ్య, నీలకంఠ దీక్షితులవారి శివలీలార్ణవ వ్యాఖ్య, విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షంలోని సుందరకాండకు వ్యాఖ్య మొదలయిన పుస్తకాలు అముద్రితంగా ఉండిపోయాయి.

ఇవికాక వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం నుంచి ఆయన ఎంచి కూర్చిన గద్యాల సంకలనం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురణ ఎంతో విశిష్టమైన సంకలనం.

'తన జీవితకాలంపాటు సాహితీ క్షేత్రంలో కవిగా, అనువాదకుడిగా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, సంకలనకర్తగా, ఉపన్యాసకుడిగా ఆయన వివిధ భూమికలు నిర్వహించినప్పటికీ, ఆయన వాటిలో ఏ ఒక్క భూమికనూ తన యదార్థ భూమికగా భావించినట్లు కన్పించదు. ఆయన తన జీవితకాలం పాటు తనను సహృదయుడిగా, రసజ్ఞుడిగా తీర్చిదిద్దుకోడానికే ఎక్కువ ఇష్టపడ్డారు. ఏ సహృదయుడి కోసం వాల్మీకి, కాళిదాసు, భాసుడు, భవభూతివంటి సంస్కృత కవులు, నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, ప్రబంధ కవులూవంటి ప్రాచీన తెలుగు కవులూ, కృష్ణశాస్త్రి, పింగళి, కాటూరివంటి ఆధునిక సాంప్రదాయ కవులూ తపించిపోయి ఎదురు చూశారో ఆ సహృదయుడు శరభయ్యగారు'. అని విమర్శకులు శరభయ్యగారి గురించి చెప్పారు. అందువల్ల శ్రీ శరభయ్యగారిని సహృదయుడయిన సాహితీ విమర్శకుడిగా భావించి, కావ్య విమర్శ దిశగా ఆయన చేసిన సాహితీ విమర్శ ఎటువంటిది అన్నది పరిశీలించవలసిన అంశం.

కవిత్వాన్ని ఆస్వాదించడానికి మొదట పాఠకుడు సహృదయుడు కావాలి. సహృదయుడంటే కవితో సమానమైన హృదయమున్నవాడు. అతనివల్లనే కవుల కావ్యాలలోని రసమయ వాక్కులోని స్పర్శ లోకానికి అందుతుంది. సరస్వతీ భావం కవి సహృదయుల సమ్మేళనంవల్లనే జనిస్తుంది. అందువల్ల సహృదయులు లేకపోతే కావ్యాలన్నీ ఆస్వాద యోగ్యాలు కాకుండా పోతాయి. కాబట్టి సహృదయుడే కావ్య విమర్శకుడు. శరభయ్యగారు అటువంటి విమర్శకుడు.

ఆనంద వర్ధనుడు చెప్పిన రసధ్వని సిద్ధాంతాన్ని ఆలంబనగా కావ్యానుశీలన ఎలా చెయ్యాలో చేసి, చూపించి, చెప్పడం ఆయన మాటల్లో కనిపిస్తుంది. ఆ మాటలు ఇలా ఉన్నాయి.

"కవుల వాక్యాలకు భావస్పర్శ, రసస్పర్శ ఉంటాయి. దానిని మనం చర్వణం చెయ్యడం మొదలుపెట్టేసరికి ఆనందం అనుభూయమానమవుతుంది. అలాంటి శబ్దాన్నే 'వాక్కు' అంటారు. మనం వాడేవి శబ్దాలు. వాటికంటే వైలక్షణ్యంకలది వాక్కు. దాన్ని ఎంతమంది ఎన్ని సంవత్సరాల నుంచి వాడినా అయిపోవడం, తగ్గిపోవడం అనేవి ఉండవు. ఎవరి తాహతునుబట్టి వారికి ఆనందం కలుగుతుంది.

ఆ ఆనందం పొందగలగడానికి ఒక క్రమం ఉంది. ఆ క్రమమే శబ్దము, అర్థము, భావము, రసము. ఇందులో శబ్దార్థాలు భావించగా భావించగా భావం అవుతుంది. ఇంకా తపింపజేస్తే రసం అవుతుంది. అంటే మననం చెయ్యగా చెయ్యగా రసం జ్వలిస్తుంది. పాలు కాచి తోడుపెట్టి పెరుగు చిలికి వెన్న తీసి నెయ్యి చేసినట్టు. ఇంత ప్రాసెస్ జరగాలి. జరిగితేనే రసోదయం జరుగుతుంది. సాహిత్యాన్ని చదవడానికి ముందు ఆ భావస్థితిని పొందడం తెలుసుకోవాలి. కేవలం అలంకార శాస్త్రం చదువుకోవడంవల్ల ఏమీ తెలియదు."

కావ్యానందం పొందడానికి ఆయన సూచించిన దారి ఇది. ఆయన ఏం చెప్పినా మూలాలకు వెళ్ళి చెప్తారు. దిగ్దర్శనం అన్నమాటకు అర్థం ఒక హస్త నిర్దేశంతో

ఆ దిక్కువైపు చూపడం. అదీ సాహిత్య విమర్శకుడుగా ఆయన చేసే మొదటి పని. ఆ హస్త నిర్దేశం వెంట మన చూపు సారించాలి. అలా సారించగల దర్శన జ్ఞానాన్ని కూడా ఆయనే ఇస్తారు. ఆయన మాటల ద్వారా సాహిత్య రసాస్వాదన చెయ్యగల శక్తినివ్వడమే ఆయన ప్రత్యేకత. అదే ఆయన విమర్శనా పద్ధతి. దాన్ని ఆయన మాటలో చూడవచ్చు.

"నోటివెంట వెలువడినది ప్రతీది శబ్దమే. మనము పలుకు శబ్దమునకు అర్థమును ఆవిష్కరించు శక్తి, గ్రహించు శక్తి మాత్రమే ఉండును. నిత్య వ్యవహారములో అభిప్రాయములను, రాగద్వేషములను వెలువరించునది శబ్దమే.

కవి వాక్కు ఇంతకంటే అపరిమితమైన అర్థము కలది. ఏ వాక్కునకు రసనిష్యందశక్తి కలదో, ఏ వాక్కు కవి ప్రతిభను జాగరితము చేయుచున్నదో, ఏ మాటలవలన కవి హృదయము రసముగా కరిగిపోవుచున్నదో అది వాక్కు. శబ్దమునకు మననక్షమత్వముండదు. వాక్కును మననము చేసినకొలది వివృతమై కవి హృదయము కనిపించును. తలచినకొలది రసానుభూతిని కలిగించునదే వాక్కు. అదే కావ్య వాక్కు

సా వాక్ యా రసవృత్తిః అని నన్నయ కవి రసమయ వాక్కు ద్వారా తన మనోధర్మాన్ని సహృదయుని మీద ముద్రిస్తాడు. అప్పుడు ప్రవాహరూపమయిన ఈ జగత్తు ఒక స్థిర ధర్మాన్ని పొందినట్లుగా కొన్ని శబ్దములు రూపములుగా మారి సహృదయుడనే అద్దంలో ప్రతిఫలించి శాశ్వతంగా నిలిచిపోతాయి.

ఆ రూపాలను అలుముకుని మాధుర్యం అనే ఆర్ద్రతా లక్షణం ఉంటుంది. ఆ ఆర్ద్రత వల్ల పూర్వం కవి పొందిన ప్రతి లక్షణాన్ని మళ్ళీ సహృదయుడూ పొందుతాడు. ద్రవీభూతమయిన కవి హృదయాన్ని సరాసరి సహృదయునిలో ప్రసరింపచెయ్యడానికి కావ్యవాక్కు ఒక అమృతసేతువై నిలుస్తుంది. ఈ విధమైన కావ్యవాక్కులో ఒక అనురణన శక్తి ఉంటుంది. దానిలోనే సరస్వతీతత్వం నిహితమై ఉంది. ఈ అనురణన తత్వం కవి సహృదయంలో సమవిభక్తమై నీరసమూ, అశాశ్వతమూ అయిన ఈ సృష్టిని రసోల్లసితంగా, శాశ్వతమైన దానినిగా చేస్తోంది."

శబ్దం నుంచి భిన్నమైన కావ్యవాక్కుని ఎలా గుర్తుపట్టాలో, దాని శక్తి ఏమిటో శరభయ్యగారు ఈ మాటల్లో చెప్పారు. వాక్కు రూపంగా మారి సహృదయుడనే అద్దంలో ప్రతిఫలించడం, ఆ రూపానికి ఉన్న మాధుర్య లక్షణం వల్ల కావ్య సృజన సమయంలో కవి పొందిన ఆర్ద్రతను సహృదయుడు కూడా పొందడం జరగడమే కావ్య రసాస్వాదన అని అర్థమవుతోంది.

దానికి ఇంకా ఏం చెయ్యాలో ఇలా చెప్తున్నారు.

"కావ్యం చదివితే మన మనసు, మన మూడ్స్ కవి యొక్క మనసులోకి చొచ్చుకుపోవాలి. కవి మనసులోని శబ్దమనే సేతువు ద్వారా ప్రవేశించాలి. కాళిదాసు మేఘసందేశంతోనో, శాకుంతలంతోనో శబ్దమయమైన సేతువు కట్టాడు. ఆ సేతువును ఆరోహించి వెళ్తే మధ్యనున్న ఈ రెండువేల సంవత్సరాలూ 'డిజప్పియర్' అయిపోతాయి. కాలం, దేశం, వ్యవధి అంతా మాయమవుతుంది. ఆయనా మనం సమకాలికులం అయిపోతాం. అంత డెప్త్ ఆఫ్ ఫీలింగ్‌తో రాస్తాడు. ఆ శబ్దానికి ఒక అనుభూతి, ఒక స్పర్శ, ఒక మాధుర్యం ఉన్నాయి. అందులోకి ప్రవేశించాలంటే మన మనసును సంస్కరించుకోవాలి".

ఇంతా చెప్పి చివరికి ఇలా అంటారు.

ఈ మాటలన్నీ ఏ పండితుడయినా చెప్పేవే. కానీ అనుభవ జగత్తు వేరుగా ఉంటుంది. కావ్యానుభవం అనే దినుసు ఏ బజారులోనో దొరికేది కాదు. ఎవనికి వాడు తానే అదిగా అయిపోయి తనలో తాను అనుభవించవలసినది అంటూ దారి చెప్తున్నారు.

పై మాటల ద్వారా సాహిత్యానుభూతిని ఎలా పొందాలో వివరించడం కనిపిస్తుంది. నిజమయిన సాహిత్య విమర్శకుడు ఒలిచి చేతిలో పెట్టడు. వలుచుకోవడం నేర్పుతాడు. అదే పని శరభయ్యగారిలోని సాహితీ విమర్శకుడు తన జీవితాంతం చేశాడు. ఒక కావ్యంగానీ, రచనగానీ సహృదయుడయిన పాఠకుడికి ఒక అనుభవాన్నివ్వాలి. ఆ అనుభవాన్ని పొందడానికి సహాయపడేదే విమర్శ. కానీ అనుభవాన్ని పొందుతూనే గుణదోషాలను తెలుసుకోగలగడం కూడా చేతనవ్వాలి. సాహిత్య విమర్శకుడు పాఠకుడికి ఆ శక్తినివ్వలేడు. తన హృదయంతో, బుద్ధితో తెలుసుకున్నదాన్ని విప్పి చెబుతాడుగానీ. శరభయ్యగారు అటువంటి సాహితీ విమర్శకుడి స్థాయిని దాటినవాడు. బంగారాన్ని పరీక్షించే రాయివంటివాడేకాక నికషోపలాలను (బంగారాన్ని పరీక్షించే రాయి) తయారుచేసే

దినుసువంటివాడు, రత్న పరీక్షకులను తయారుచేసే సాహిత్య విమర్శకుడు. రవీంద్రుని గురించి వారు వ్రాసిన వ్యాసం (రవీంద్రుడు - పూర్వ కావ్యానుశీలనము)లో రవీంద్రుడు ఏ విధంగా సహృదయుడై పూర్వ కవుల కావ్యాల అనుశీలనం చేసాడో ఇలా రాస్తారు.

భారత వర్ష సంబంధ సంస్కార సదృస్యావగాహిగా రవీంద్ర కవి చేసిన పూర్వ కావ్యానుశీలనము ఆయన వ్రాసిన కావ్యములకన్న గొప్పదని అంటారు. అంతేకాక నేటి యువసమాజానికి రవీంద్రునివంటి కావ్యజుని శిక్ష ఎంతగానో అవసరమని, మన కావ్యాలను ఎలా సమీపించాలో, మన పద్ధతి ఎటువంటిదో, ఏది సారస్వత పరమ ప్రయోజనమో తెలుస్తుందని అంటారు.

ఇది శరభయ్యగారి విషయంలో కూడా సత్యం.

శరభయ్యగారు ప్రాచీన కవుల గురించి ఒక చిత్రమయిన మాట చెప్తూ ఉండేవారు. ప్రతి కవి తన కావ్యాన్ని ఎలా తెరవాలో చెప్పే తాళం చెవిని తన కావ్యం అవతారికలోనే నిక్షిప్తం చేస్తాడని. కావ్యం అనుశీలన చెయ్యడం అన్నది అన్ని కావ్యాలకూ ఒకేలా కుదరదు. ఒక్కొక్క కావ్యం దాని ఇతివృత్తాన్నిబట్టి కవి స్వభావాన్ని, మనోధర్మాన్నిబట్టి ఒక్కొక్క రకంగా ఉంటుందని ఆ కిటుకు ఆయనే చెప్తాడని అంటారు.

శరభయ్యగారికి ప్రాచీన సంస్కృతాంధ్ర కవులు కావ్యాలలో దాచిన ఆ పరమ రహస్యాలు అన్నీ అందుకే తెలుసు. ఆ తాళం చెవిని ఆ కవి కావ్యం నుంచి ఎలా వెతికి సంపాదించాలో కూడా ఆయన చెప్తారు. అది కవి సృష్టించిన పాత్రలనూ, ఆ పాత్రల యొక్క బాహ్యాంభ్యంతర వృత్తులనూ, సన్నివేశాలనూ ఆశ్రయించుకుని ఉంటుంది. ప్రధానంగా ఇన్నింటికి ఆధారమైన కవి మనోధర్మాన్ని ఆశ్రయించుకుని ఉంటుంది.

'మృతోసృష్ట్వాకనకం కరోతి' మామిడి చెట్టు కాండం ముక్కల నమిలినా, ఆకులు నమిలినా, చిగుళ్ళు కొరికినా, పూలు రుచి చూసినా, పిందెలు, పండ్లు ఏది నోట్లో వేసుకున్నా ఆ మామిడి చెట్టు తనం భాసిస్తుంది. అవాంతర బేధం ఉన్ననూ తత్వం లక్షణం అనుస్యూతమయినట్లే. అలాగే కవి లక్షణంలో internity అంత ఉంటుంది. రావణుడు, శూర్పణఖ, మారీచుడు అన్నీ తానే అవుతాడు. అసలు ఆ జీవ లక్షణం తెలుసుకోవాలి. అదే కావ్యానుశీలనం అంటే. ఇది ఎలా వస్తుందంటే, అనుభవంవల్ల, విచారణవల్ల, మననంవల్ల తెలియాలంటారు. మననం చెయ్యాలని, ఈ తరంవాళ్ళని మననోన్ముఖులను చెయ్యాలని అంటారు.

ఆరు రుచులను తెలిపేది నాలుక. తొమ్మిది రసాలను తెలిపేది మనసు. ఈ రెండింటికి ప్రభవస్థానం జిహ్వ. రసనకు వరుణుడు, వాక్కుకు అగ్ని అధిష్టాన దేవతలు. రసన రుచులను తనచేతే అనుభవింపచేస్తే వాక్కు రసాలను ఎదుటివారిచేత అనుభవింపచేస్తుంది. ఇంద్రియ సుఖం రుచి. అనుభూతి రసం. ఇలాంటి రసానికి కారణమైన వాక్కు అగ్నిలో నుంచి పుడుతుంది. కాబట్టి వాగగ్ని. అందువల్ల తపోలక్షణంగల కవి వాక్కును దేవతవలె అర్చించి శబ్ద బ్రహ్మను సాక్షాత్కరింపచేసుకుంటాడు.

కవికి ఆ విధంగా సాక్షాత్కరించిన శబ్ద బ్రహ్మను సహృదయుడు మననం ద్వారా సాక్షాత్కరింపచేసుకుంటాడు. అలా సాక్షాత్కరింపచేసుకొన్న కవితాత్మల గురించి ఆయన విమర్శను అనుభూతితో కలగలుపుతూ చెప్పడం కనిపిస్తుంది. కాళిదాసు కుమార సంభవాన్ని ఎలా నిర్మించాడో ఇలా చెప్తారు ఆయన. అది కాళిదాసు మాటల్లోనే - కావ్యానికి ఆకృతి - ఆత్మ ఉంటాయి. ఆకృతి స్త్రీత్వం. ఆత్మ పురుషత్వం

*ఉన్మీలితం తూలిక ఏవ చిత్రం*
*సూర్యాంశుభిర్భిన్నమివారవిందం.*

కుమార సంభవము యొక్క నిర్మాణ సౌందర్యమంతా ఈ శ్లోకంలో ఉందట. రేఖలలో దాగిన చిత్రం యొక్క సౌందర్యం సముచితమైన వర్ణ సమ్మేళనంతో తూలికతో తీర్చిదిద్దితే ఎలా ఉంటుందో, దేనికవి పూర్ణంగా వికసించి కూడా కర్ణిక చుట్టూ అంటుని ఉన్న కమలదళాల్లాగ ప్రధాన వస్తువుతో కథాంశాలన్ని సంశ్లిష్టములై ఉండాలి. అదే కావ్యశరీరానికి సౌష్టవాన్ని, సమగ్రతను ఇస్తుంది. సౌందర్యమంటే ఇదే - అని వివరిస్తారు.

రఘువంశ నిర్మాణం వేరొక విధంగా ఉంటుందట. అది ఆకృతినికాక ఆత్మకు ప్రాధాన్యతనిచ్చిన కావ్యము. ఒకటి శృంగార రస వాహిని, రెండవది శాంతరసవాహిని. ఈ రెండు రసముల కలయిక అయిన శివతత్వమే కాళిదాసు తత్వము అంటారు. ఈ మాటలు ఎంతో ఆలోచించవలసినవి. ఒక గొప్ప శిల్ప మందిరంలో ఉంచిన చిరుదివ్వెలలాంటివి. ఆ సన్నని వెలుగులో ఆ మందిరంలోని సౌందర్యాన్నంతటినీ పరికించి అనుభూతి చెందవలసిన పని మనం చెయ్యాలి.

కవుల ఆత్మలు వారు కూర్చిన ప్రతి రెండు శబ్దముల సమ్మిళితనాదంలో ఉంటాయట. కాళిదాసు కవితలో ఈ ఆకృతి ఆత్మ రెండూ కలగలిసి ఉన్నాయి. ఒకదానికి కుమార సంభవం, మరోదానికి రఘువంశం ప్రతీకలు. అలాగే నన్నయగారి గురించి చెప్పేటప్పుడు – ఆయన చంద్రికాఫలకస్థితమైన ఒక రాత్రివంటివాడు. అందులో అందరూ స్వర్గం నుంచి దిగివచ్చిన దేవతల్లాగ ఉంటారు.

తిక్కనగారు డే లైట్‌లాగ ఉంటాడు. రాత్రిలో ఒక చార్మింగ్ ఉంది. పగలు రేడియం, రాత్రి అయిడియలిజం.

అచ్చమైన మనుషులు తిక్కనగారి పాత్రలు. నన్నయ పాత్రలు సెమీగాడ్స్. ఎర్రన వస్తున్న రాత్రికి బ్రేక్ అవుతున్న పగలుకి మధ్య సంధ్యలాగ ఉంటాడు. తిక్కనగారి పాత్రలు భూమి నుంచి స్వర్గాభిముఖంగా వెళ్తున్నట్టు ఉంటుంది.

నన్నయగారి పాత్రలలోని దేవతలను మనుషులుగా మార్చేదశ ఎఱ్ఱనది. వెన్నెల సంగీతం ఈ రెండూ నన్నయ వాక్కుని పరివేష్టించి ఉంటాయి. అది వెన్నెలతో మొదలయి వెన్నెలతో కలిసిపోయినట్టు ఉంటుంది. అది ఒకవిధంగా మెలోడియస్ – తిక్కనగారిలో ఒక డిసిసివ్‌నెస్ కనిపిస్తుంది. ఆయన వర్ణించినట్టు కనపడదు కానీ చాలా వర్ణనలు చేస్తాడు. చాలా నిగ్రహంకల పోయెట్‌లా కనిపిస్తాడు కానీ ఆయనకు చాలా ఆవేశం ఉంది.

ఈ పగటిని రాత్రిని కలగలపినవాడు కనుకనే ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడు అయ్యాడు, ఇద్దరి కవిత్వాన్నీ అతికాడు – అతను కనపడకుండా. కానీ చాలా ఒరిజినల్ పోయెట్. హరివంశంలో ఆ ఒరిజినాలిటీ కనిపిస్తుంది. కానీ భారతంలో నన్నయ తిక్కనలిద్దరిలోకీ ఒదిగి వారిని కలిపాడు.

పోతన ప్రతీ పద్యం చెట్టుకే ఆరమగ్గి తనంతట తాను రాలిన పండులా ఉంటుందట. ఆయనలో కవితావేశం భక్త్యావేశం విడదీయలేనివిగా ఉంటాయి.

పెద్దన కవిత్వం సూర్యోదయంలాంటిది. దానికి ముందు వచ్చే అరుణోదయంలాంటిది శ్రీనాథుడి కవిత్వం. ప్రతి పద్యాన్ని perfectగా ఒక chiselled poemలా చెప్పడం శ్రీనాథునితో మొదలయి పెద్దనతోనే perfectionకి వచ్చింది. సూర్యోదయంలో ఉన్నంత brightgness అరుణోదయంలో ఉండదు. కానీ సూర్యోదయ లక్షణాలు అరుణోదయంలో కూడా ఉంటాయి. పెద్దనగారి కవిత్వంలో లూజ్ కాంపిటిషన్ ఉండదు. పెద్దన గొప్ప శిల్పవేత్త. తిక్కన కవిత్వంలో శిల్పం వేరు. ప్రబంధ శిల్పం వేరు. అది పద్యం దగ్గర్నించి మొత్తం కావ్యంవరకూ వ్యాపించి ఉంటుంది. ప్రతీ పద్యమూ అవసరమే. suitable stepలాంటిది.

ఉత్తమ కవిత్వం యొక్క లక్షణం పెద్దనే చెప్పాడు.

అహోరాత్రులు మరవటానికి వీలు లేని ప్రియురాలి యొక్క విలాసములవలె కవిత్వం haunt చేయాలి.

ఇప్పటివరకూ ఏ భావకవీ ఇలా చెప్పలేదు.

16వ శతాబ్దంలో మనుచరిత్ర రావడం ఒక సంపూర్ణ పూర్ణిమా చంద్రోదయంవంటిది.

కృష్ణదేవరాయలి యొక్క సౌకుమార్యం మనసుకి అందడం కష్టం. ఆ సుకుమారమైన భావాన్ని అర్థం చేసుకోవడంలో ఉండే క్లిష్టతే ఆయన భాషాకాఠిన్యంగా కనిపిస్తుంది. ఆయన మూర్తీభవించిన వర్షర్తువులా తోస్తాడు.

సూరన కళాపూర్ణోదయంకంటే ప్రభావతీ ప్రద్యుమ్నం గొప్ప గ్రంథం. వర్ణనలు మితిమీరి ఉండవు. కథ ప్రపోర్షనేట్‌గా ఉంటుంది. సర్వాంగసుందరమైన ప్రబంధం ప్రభావతీ ప్రద్యుమ్నమే అని చెప్పవచ్చు. కళాపూర్ణోదయంలో ఇంగ్లీష్ మైండ్‌ని ఆకర్షించే లక్షణం ఉంది. ప్రబంధశైలి యొక్క శైలిని తగ్గించి మామూలు జనానికి అందుబాటులోకి పద్యాన్ని తెచ్చినవాడు సూరన. అంత సులువుగా ఉంటాయి పద్యాలు. సూరన శరత్కాలంలాంటివాడు.

నత్కీరుని కథలో ధూర్జటి లక్షణం ఉంది. తాను వ్రాసిన పద్యంలో తప్పు ఉందంటే శివుణ్ణి కూడా లక్ష్యపెట్టడు. అతని లక్షణం నిర్లక్ష్యం. అవతలివాడు ఈశ్వరుడైనా లక్ష్యం లేదు. అంతటి కవితాభిమాని. ఆయన వ్రాసిన పద్యాలు self applicationకి అంటే ధ్యానానికి పనికి వస్తాయి. ప్రతివాడి experienceకి అందుతాయి. మాటల కూర్పు చాలా కొత్తగా ఉంటుంది. ఆయన భవపరాఙ్ముఖుడు.

నంది తిమ్మన సుకుమారమైన కవి. స్త్రీస్వభావంగల కవి. ఆయన యందు ఫిమినైన్ క్వాలిటీ ఎక్కువ. ఆయన కవిత్వంలో మాస్కులైన్ క్వాలిటీ అసలు లేదు.

చెళ్ళపిళ్ళవారు వసంతఋతువు. ఆ ఋతువు వచ్చినప్పుడు ప్రతి చెట్టు, ప్రతి తీగా పుష్పిస్తాయి. వాటి వాటి స్వభావాన్ననుసరించి అలాగే ప్రతి వ్యక్తిలోనూ లేటెంటుగా ఉన్న ఆ సారస్వత ఉద్బోధనం ఆయన వల్ల వికసించింది. నిరంతరం ఆయన పద్యాలు మననం చేస్తూ ఉండడం వల్ల తెలీకుండానే ప్రతివాడూ కవిగా మారే లక్షణం

ఆయన వాక్కులో ఉంది. ఇలా శరభయ్యగారు కవుల మీద చెప్పిన ఇంప్రెషన్లు దిక్సూచిలలాగ ఉంటాయి. కవిత్వాన్ని తూచడం కాదు అనుభవించమంటారు. అందుకని కొంతమంది కవుల కవిత్వాల గురించి ఆయన చెప్పిన విధానం పలవరింతలాగే ఉంటుంది. నంది తిమ్మన అవతారికలో కృష్ణదేవరాయల మీద చెప్పిన ఒక పద్యం ఆధారంగా ఆయన కవిత్వాన్ని విశ్లేషిస్తారు.

కావ్యగోష్టిలో ఉండి అర్ధరాత్రి అంతఃపురానికి వెళితే, అక్కడ కూడా కావ్య స్పృహవల్ల ఆయన శరీరం జలదరిస్తే ఆయన పట్టమహిషి ఆయన్ని అనుమానించింది. అటువంటి ఖండితాలక్షణం ఆ పారిజాతాపహరణంలో ఉందని అంటారు. అలాగే విశ్వనాథవారి కల్పవృక్షాన్ని గురించి చెప్పడానికి వాల్మీకి *సుందరకాండ* లో వ్రాసిన శ్లోకాన్ని ఆధారంగా చేసుకున్నారు.

***మహీకృతా పర్వతరాజిపూర్ణా / శైలాః కృతా వృక్షవితానపూర్ణా / వృక్షాకృతాః పుష్పవితానపూర్ణా / పుష్పం కృతం కేసర పత్రపూర్ణం***

శ్రీ రామాయణం అనే భూమి ఉదగ్రరమణీయం. అది ఒక్కొక్క కాండ ఒక్కొక్క కొండ, ఒక్కొక్క కాండలో ఉండే ఖండాలు ఒక్కొక్క ఖండం ఒక్కొక్క చెట్టు ఆ చెట్టులో ఉన్న ఒక్కొక్క పద్యం ఒక్కొక్క పువ్వు. ప్రతి పద్యమూ పుష్పవితానపూర్ణమే. ఏ పద్యమూ వదలడానికి వీల్లేదు అదీ ఆ శ్లోకం పోలిక. అలాగే కాటూరి వెంకటేశ్వరరావుగారి కవిత్వం ఎలా ఉంటుందో చెప్పాలి. అందుకని ఒక పద్యం రాశారు. ఆ పద్యం ఆ కవిత్వానుభూతి యొక్క పలవరింతే.

ఆరంబోసిన పండు వెన్నెలలు, నీహారంబువుల్, మేల్మిసింగారమ్ముల్, తొవరేకు మెత్తనలు, ముక్తాహారముల్, సాంద్రకర్పూర క్షోదము, గర్భకైతక దళంబుల్, కార్తికీ శాలికేదారశ్రేణులు రూపుగొన్న కవితా తన్వంగికిన్ భద్రమే.

కవిత్వాన్ని గురించి మామూలు మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. కవిత్వాన్ని ఆశ్రయించే చెప్పాలి. ఈ విధంగా ఎందరో కవులు ఆయన భావనను ఆశ్రయించుకుని నివసించారు. అటువంటి సహృదయులవల్ల కావ్యాలు కవిత్వమూ చిరస్థాయిగా నిలుస్తాయని వారి మాటల్లోనే వినవచ్చు.

“ఒక కవి ప్రత్యక్షముగ కావ్యమును నిర్మించుచు పరోక్షముగ భావుకుని సృష్టించుకొనును. లోకములో సహృదయ ధర్మమును ఆవిర్భవింపజేయునది కావ్యమొక్కటే. విశ్వవిద్యాలయాలు, అకాడెమీలు, సమితులు, పరిషత్తులు, సంస్థలు వ్యవహారశీలతను పెంచగలవేకాని, లేశమైననూ సహృదయ ధర్మమును సృష్టించలేవు. సర్వమహాకవులకు, సర్వసాహిత్యమునకు ఉజ్జీవకమయిన ఇట్టి సహృదయ వ్యవస్థ మీదనే – ఏ దేశమందైననూ, ఏ కాలమందైననూ ఉత్తమ సాహిత్య ప్రమాణములన్నియు నిలిచి ఉండును. ఈ వ్యవస్థ ఒక కాలములో ఒక దేశములో ఒకరి చేత సృష్టించబడినది కాదు. ఇది స్వయంప్రభవము. రాగద్వేషము లేని ఈ సహృదయులు కొండలవంటివారు, ఆర్ద్రతాలక్షణముచేత నదులవంటివారు. ఇట్టి కొండలు నదులు ఉన్నంతకాలమూ ఈ భూమిపై మహాకావ్యములకు క్షతి లేదు.”

ఇదీ శరభేశ్వర శర్మగారి సాహిత్య దర్శనము. ఆలోచనాత్మక విమర్శగాని అనుభూత్యాత్మక విమర్శగానీ మనన శీలతవల్ల మాత్రమే లభ్యమవుతుందన్నది ఆయన విశ్లేషణ యొక్క సారాంశం.

**వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, బెంగుళూరు.**

## మన కార్టూనిస్టులు

*పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 1951 డిసెంబర్ 24వ తేదీన మోహన్ జన్మించారు. విశాలాంధ్ర పత్రికలో సబ్ఎడిటర్‌గా, కార్టూనిస్ట్‌గా ప్రవేశించి తనదైన ముద్రతో కార్టూన్లు, కేరికేచర్లు, ముఖచిత్రాలు వేశారు. యానిమేషన్ రంగంలో, తెలుగు కార్టూన్లను ప్రవేశపెట్టిన వీరి రచనారంగంలో కూడా ప్రత్యేకశైలి కనబడుతుంది. 2017 సెప్టెంబర్ 21న వారు జీవితం నుంచి నిష్క్రమించారు.*

***మన కార్టూనిస్టుల రూపు రేఖలు*** *– సత్తిరాజు నారాయణ (శంకర్)*



మోహన్

# ఎయిడెడ్ పోస్టుల విలీనం -

## విద్య వ్యవస్థ పై ప్రభావం

*- బోరుగడ్డ సుబ్బయ్య*

ఆంధ్రప్రదేశ్‌లో మెజారిటీ విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రక్షాళన ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు ఉందా అన్న విధంగా అనిపిస్తుంది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రాథమిక పాఠశాలల నుండి ఉన్నత విద్యా కళాశాలలవరకు మన సమాజంలోని కొంతమంది గొప్ప వ్యక్తులు చాలా సహృదయంతో మానవత్వంతో విద్యను అందరికీ అందించడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చు అని వారి భూములను ధనాన్ని విరాళంగా ఇచ్చి విద్యాధికుల చేత స్థాపించబడినాయి. అందుచేత విద్యకు దూరంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఎయిడెడ్ విద్యాసంస్థలు కనిపిస్తాయి అంతేకాకుండా మహిళల కోసం ప్రత్యేక కాలేజీలు, ప్రభుత్వం ఇప్పటికీ చేరుకోని కొన్ని ప్రాంతాల్లో విద్యను ఎయిడెడ్ విద్యాసంస్థల ద్వారా అందిస్తున్నాయి. మన రాష్ట్రంలో సుమారుగా 1946 పాఠశాలలు మరియు 182 జూనియర్ కళాశాలలు డిగ్రీ కళాశాలలు అయితే నాలుగు జోనులు ఉన్న మన రాష్ట్రంలో అటానమస్ హోదాలో 28 కాలేజీలు నాన్ అటానమస్ కాలేజీ కేటగిరీలో 109 కాలేజీలు మొత్తం 137 కాలేజీలు ఉన్నాయి. ఎయిడెడ్ స్కూల్స్ జూనియర్ కాలేజీలు మరియు డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు సుమారుగా 8,573 మంది పనిచేస్తూ 1,43,701 మంది విద్యార్థులతో గత ఏడాదికంటే 9.27 శాతం మెరుగుగా విద్యార్థులు నమోదయ్యారు. రాష్ట్ర మరియు జాతీయ స్థాయి మేధావులను శాస్త్రవేత్తలను రాజకీయ నాయకులను అడ్మినిస్ట్రేటర్‌వంటి ఎందరినో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతూ ఉన్నది.

**ప్రస్తుతం:** శతాబ్ది చరిత్ర ఉన్న ఎయిడెడ్ విద్యాసంస్థల పనితీరుపై సమీక్షించడానికి వారం రోజుల వ్యవధిలో ప్రొఫెసర్ రత్నకుమారి అధ్యక్షతన ఎనిమిదిమంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన తరువాత ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉంటే పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో లేదా పూర్తిగా ప్రైవేట్ ఆధీనంలో ఉండాలి అని ప్రభుత్వం సూచించడంతో సుమారుగా 80 శాతం ఎయిడెడ్ విద్యాసంస్థలు ఈ నిర్ణయాన్ని తిరస్కరించగా ప్రభుత్వం అందించే సహాయాన్ని ఆపివేస్తూ ప్రభుత్వ సహాయం పొందుతున్న అధ్యాపకులను అధ్యాపకేతర సిబ్బందిని ఆయా ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ మరియు డిగ్రీ కాలేజీలలో నియమించాలని వారికి సమర్పించారు. అదేవిధంగా అర్హులైనవారు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేయుటకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్, కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్‌వారు సర్క్యులర్‌ను విడుదల చేశారు. ఉన్న సమస్యకు పరిష్కారం దొరకకపోగా మరికొన్ని సమస్యలకు మూలం అయినట్లు కొత్త సమస్యలను సృష్టించినది. ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో మరియు యూనివర్సిటీలలో అధ్యాపకుల ఎంపిక విధానాన్ని పరిశీలిస్తే అర్హతలు, అనుభవం, పరిశోధనా పత్రాలు, పరిశోధన పబ్లికేషన్స్, పరిశోధన గైడెన్స్, పరిశోధన ప్రాజెక్ట్, అంటూ చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. అదేవిధంగా ఉద్యోగ విరమణ వయసు కళాశాలలో రాష్ట్ర సర్వీస్ రూల్స్ ప్రకారం 60 సంవత్సరాలుగా, యూనివర్సిటీల్లో యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ సర్వీస్ రూల్స్ ప్రకారం 62 సంవత్సరాలుగానూ ఉన్నది. బోధన విషయానికి వస్తే ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో రాష్ట్రాన్ని యూనిట్ తీసుకుని అడ్మిషన్లు నిర్వహించి డిగ్రీ విద్యార్థులకు బోధిస్తారు. అదే యూనివర్సిటీలో పరిశీలిస్తే జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అడ్మిషన్స్ పొందిన పీజీ విద్యార్థులకు బోధిస్తూ ఎం.ఫిల్., పి.హెచ్‌డి., రీసెర్చ్ స్కాలర్స్‌కు పరిశోధన గైడెన్స్ మరియు పరిశోధన ప్రాజెక్టులను చేస్తారు. పర్యవేక్షణ విషయానికి వస్తే యూనివర్సిటీలు కేంద్ర యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ పరిధిలోని ఎయిడెడ్ డిగ్రీ కళశాలలు రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేస్తాయి. ఇన్ని వ్యత్యాసాలు ఉన్నప్పుడు ఇది సాధ్యమవుతుందా.

**కాంట్రాక్టు ఉద్యోగులు:** అదేవిధంగా ఎయిడెడ్ విద్యాసంస్థల అధ్యాపకులను అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వ విద్యాసంస్థలలో తీసుకొనుట ద్వారా వచ్చే సమస్యలను

గమనిస్తే రెగ్యులర్ అధ్యాపకులకు సీనియారిటీ విషయాల్లో ఎయిడెడ్ అధ్యాపకులు ముందుండి అడ్మినిస్ట్రేటివ్ పదవులు కైవసం చేసుకుంటారెమో అన్న ఆందోళనలో ఉన్నారు, ప్రభుత్వ విద్యాసంస్థలలో బదిలీ నియమావళి ఉంటుంది ఎయిడెడ్ విద్యాసంస్థలలో బధిలీలు ఉండవు. ముఖ్యంగా ఇది బ్రతుకు జీవుడా అంటూ అతి తక్కువ జీతం ఎక్కువ బాధ్యతలతో విద్యార్థులకు విద్యను అందిస్తూ జీవిస్తూన్న కాంట్రాక్ట్ అధ్యాపకుల మెడకు ఉరితాడుగా ఉంది. ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలో మరియు పాఠశాలలో పనిచేసే అధ్యాపకులను ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలలో పోస్టింగ్ ఇవ్వటం ద్వారా అక్కడ భర్తీకి అనుమతి ఉన్న పోస్టుల్లో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారబోతుంది. గెస్ట్ ఫ్యాకల్టీగా పార్ట్ టైం ఫ్యాకల్టీగా పనిచేస్తున్నవారిని చాలా కాలేజీలలో తొలగించారు. ఎయిడెడ్ విద్యాసంస్థలలో అన్ ఎయిడెడ్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులకు అధ్యాపకేతర సిబ్బందికి వారి ఉద్యోగాల మీద ఎటువంటి భరోసా ఇవ్వలేదు. అదేవిధంగా యూనివర్సిటీ విషయానికొస్తే 1091 మంది ఉన్న ఎయిడెడ్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్‌లకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న 240 ఖాళీలు సరిపోకపోవటంతో మిగిలినవారిని యూనివర్సిటీలకు పంపించాలని చూస్తున్నారు. కానీ వర్సిటీల్లో రెండు దశాబ్దాలుగా పీ.హెచ్‌డి., నెట్, సెట్, రీసెర్చ్ అనుభవం ఉండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ భద్రత మరియు రెగ్యులర్ కోసం ఉద్యమిస్తున్నారు. వీరిలో కొంతమంది రెగ్యులర్ అవకుండనే కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా రిటైర్ అవుతున్నారు. మరికొంతమంది కరోనా సమయంలో చనిపోయినవారికి ప్రభుత్వ నుండి కానీ యూనివర్సిటీ యాజమాన్య నుండి ఏటువంటి ఆసర లేకపోవటంతో వారి కుటుంబాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. అలాగే 2018లో వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్ ద్వారా ఏ.పి.పి.యస్.సి. నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించినవారు ఇంటర్వ్యూల కోసం ఉద్యమిస్తున్నారు. ఈ తరుణంలో రెండు పిల్లుల పోరు నక్క తీర్చినట్లు ఈ నోటిఫికేషన్ కోసం ప్రభుత్వ అనుమతి పొందిన పోస్టల ఖాళీలలో ఎయిడెడ్ కాలేజీ అధ్యాపకులకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకం ఎందుకంటే కాంట్రాక్టు ఉద్యోగులను వారివారి ఉద్యోగ అర్హతలు మరియు అనుభవాన్ని ప్రామాణికంగా తీసుకుని రెగ్యులర్ చేయాలని కమిటీలను, సబ్ కమిటీలను ఏర్పాటు చేసి కసరత్తు చేస్తోంది. అదేవిధంగా 2022 జాబ్ క్యాలెండర్ ప్రకారం యూనివర్సిటీస్‌లో 2500 అసిస్టెంట్ ప్రొఫెసర్ రిక్రూట్మెంట్‌కు సిద్ధంగా ఉంది.

**నిరుద్యోగులు:** ఎయిడెడ్ విద్యాసంస్థల అధ్యాపకులను ప్రభుత్వ సంస్థలలో విలీనం చేసినట్లయితే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు మరియు యూనివర్సిటీలో ఉన్న అన్ని అధ్యాపక ఖాళీలు భర్తీ అవటంతో భవిష్యత్తులో కనుచూపుమేర రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశాలే కనుమరుగవుతాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో కరోనావల్ల నిరుద్యోగం రేట్ 6.3 శాతంగా ఉంటే చకోర పక్షుల్లాగా డీ.ఎస్సీ, జే.యల్, డి.యల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తూ నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు భవిష్యత్ అంధకారం అవుతుంది.

**ప్రాతినిధ్యం (రిజర్వేషన్స్):** ప్రవేట్ సంస్థలలో ప్రాతినిధ్యం (రిజర్వేషన్స్) అమలుచేయమని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎయిడెడ్ విద్యాసంస్థలు మెజారిటీగా ప్రవేట్ విద్యా సంస్థలుగా రూపాంతరం చెందితే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఇప్పటివరకు ఉన్న వేల అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగాలన్నీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం అయితే ఏ విధముగా కేంద్ర ప్రభుత్వ రిజర్వ్‌డ్ కేటగిరివారికి ఉద్యోగాలు దూరం అవుతాయో అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు రిజర్వుడు కేటగిరివారికి శాశ్వతంగా ఆవిరైపోతాయి. ఈ విధముగా ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేట్ సంస్థలుగా మార్చుకుంటూపోతే ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు, నిరుద్యోగులకు భవిష్యత్ అంధకారమై సమానత్వం కోసం తీసుకువచ్చిన రిజర్వేషన్లు అమలుకు నోచుకోక సమాజంలో అసమానతలు విపరీతముగా తిరిగి మెజారిటీ సమాజం నిస్సహాయంతో తిరుగుబాటు చేస్తారు.

**విద్యార్థులు:** మరీ ముఖ్యంగా అతి తక్కువ కాలేజీ ట్యూషన్ మరియు హాస్టల్ ఫీజులతో ఎయిడెడ్ విద్యాసంస్థలు ప్రభుత్వ సంస్థలు మాదిరిగా విద్యార్థుల సేవలు నిర్వహిస్తూ ఉండటంతో అట్టడుగు వర్గాల విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ మరియు ఇతర పేద విద్యార్థులు అందరూ ఎక్కువగా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతూ ఉన్నారు అన్నది వాస్తవం. ఈ సమయములో ఎయిడెడ్ విద్యాసంస్థలు ప్రైవేట్

సంస్థలుగా మార్పు చెందితే కొత్తగా వచ్చిన జీవో నెంబర్ 60, 77 & 115 ప్రకారం ప్రవేట్ కాలేజీలకు ఫీజు రియంబర్స్మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవు. అంతేకాకుండా ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఇప్పుడు అందంగా సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లుగా మార్చి ప్రభుత్వ సహాయక పథకాలైన ఫీజు రియంబర్స్మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించకుండా చేశారు. సందట్లో సడేమియా అన్నట్లు కొన్ని ఎయిడెడ్ కాలేజీలు ఫీజులను అమాంతంగా పెంచేశారు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో విద్యార్థులకు విద్య దూరమై నిరక్షరాస్యత శాతం పెరిగి మానవ వనరుల కొరత ఏర్పడుతుంది ప్రజలు వెనుకబాటుతనంలోకి నెట్టివేయబడతారు.

**యాజమాన్యపు నిర్వహణ:** ప్రతి సంస్థ యొక్క పనితీరును సంవత్సరానికి లేదా వివిధ కాలవ్యవధిలో పరిశీలించి మెరుగుపరచుట కోసం పనితీరు మదింపు చేస్తారు. సంస్థ ప్రస్తుత స్థితినిబట్టి గ్లక్ మరియు జౌచ్ అనే నిర్వహణ వ్యూహకర్తలు నాలుగు రకాల వ్యూహాలైన స్థిరత్వం వ్యూహం (స్టెబిలిటీ స్ట్రాటజీ), ఎదుగుదల వ్యూహం (గ్రోత్ స్ట్రాటజీ), ఉపసంహరణ వ్యూహం (రిట్రిచ్‌మెంట్ స్ట్రాటజీ), మిశ్రమ (కాంబినేషన్ స్ట్రాటజీస్) వ్యూహాలను తెలియపరిచారు. ఇందులో ఎయిడెడ్ విద్యాసంస్థల విషయానికి వస్తే ఉపసంహరణ వ్యూహాన్ని అమలు చేసినట్లు అనిపిస్తుంది. బదులుగా కొత్త ఎయిడెడ్ విద్యాసంస్థలకు అనుమతులు మంజూరు చేయకుండా కాలేజీలను సజావుగా నడపటానికి భారమైనవారు ప్రభుత్వానికి అప్పగించి మిగిలివున్నవాటిని బలపర్చే విధంగా స్థిరత్వం వ్యూహాన్ని ఎంచుకున్నట్లుయితే ప్రభుత్వ అజమాయిషీని అధికారాన్ని పెంచుతూ ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యాన్ని నియంత్రిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలలో నియామకాలవలె డీఎస్సీ, ఏ. పీ.పీ.యస్.సి. ద్వారా జూనియర్ కాలేజీ లెక్చరర్స్ మరియు డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ అధ్యాపకుల నియామకాలు చేపట్టే విధముగా పాలసీలను రివైజ్ చేసి సమాజ హితం కోసం మరెన్నో ఎక్కువ ఫలితాలను ఎయిడెడ్ విద్యా సంస్థల నుంచి ఆశించవచ్చు. ప్రభుత్వ సంస్థలు ప్రజా సంక్షేమం కోసం ప్రైవేట్ సంస్థలు లాభార్జన కోసం పనిచేస్తాయి అన్న చారిత్రక సత్యాన్ని మరొక 1969లో బ్యాంకులను జాతీయం చేసినట్లు ఎయిడెడ్ విద్యాసంస్థలను పూర్తిగా జాతీయం చేసినా బాగుంటుంది. ఇన్ని సమస్యలకు మూలకారణమైన ఎయిడెడ్ విద్యాసంస్థల సమస్యకు పరిష్కార మార్గం లేకపోలేదు. మొదటిగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నియామకం, విద్యార్థుల అడ్మిషన్స్, కాలేజీ యాజమాన్యం నిర్వహణ మొదలగు అన్ని విషయాలలో జరుగుతున్న లోపాలను నిష్పక్షపాతంగా గుర్తించి వాటిని పరిష్కరించేలా యాజమాన్యంలో ప్రభుత్వ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచి విద్యార్థుల మరియు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రాతినిధ్యాన్ని యాజమాన్యంలో భాగస్వామ్యులు చేసి పటిష్టమైన పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య వ్యూహాత్మక నిర్వహణతో సమాజ హితం కోసం విద్యాసంస్థలను మరింత బలపర్చవచ్చు. మన రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్య వేలల్లో నుండి లక్షల్లోకి పెరుగుతూ ఉన్నది. దానికనుగుణంగా విద్యార్థులు అధ్యాపకుల నిష్పత్తి 21:1 ఉండే విధముగా ప్రతి మండలానికి ఒక ప్రభుత్వ విద్యాసంస్థల కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీలు మరియు టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ మరియు ఒకేషనల్ కోర్సులతో ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుకునే అవకాశాన్ని కల్పించాలి. ఉద్యోగ అవకాశాలు సృష్టించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రస్తుతం ప్రభుత్వ యూనివర్సిటీలలో, ప్రభుత్వ మరియు ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కాలేజీలలో పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నవారిని అర్హత మరియు అనుభవం ప్రామాణికంగా రెగ్యులర్ చేయాలి. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి చిత్తశుద్ధితో రెగ్యులర్ మరియు బ్యాక్‌లాగ్ అధ్యాపక అధ్యాపకేతర ఉద్యోగాలను చేపట్టినట్టు అయితే మన రాష్ట్రంలోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి ఒక నమూనాగా, ప్రపంచస్థాయి విద్యావేత్తలను తయారు చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక ఉద్యమంలాగా చేస్తున్న విప్లవాత్మకమైన మార్పులైన ఇంగ్లీష్ మీడియం విద్యా విధానం, నాడు-నేడు కార్యక్రమాలవలె అట్టడుగు వర్గాలలో విద్యావ్యాప్తి కోసం సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీలలో ప్రస్తుతం ఉన్న కోర్సులతోపాటు డిగ్రీ, పిజీ ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, లా కోర్సులను ప్రారంభించినట్లయితే ఆంధ్రప్రదేశ్ విద్యాకాంతులతో విద్యా ఆంధ్రప్రదేశ్‌గా మారుతుంది.

---

డా. బోరుగడ్డ సుబ్బయ్య, విశాఖపట్నం. ఫోన్: 949 270 4401.

# చదవండి...

- మిసిమి

**కొసమెరుపు కథలు:** కథలకు కొసమెరుపు ఉండాలా? ముపాసా కథలకు ఉండేది – అదొక నమూనా – పొట్లూరు వారి కథలు అన్ని పత్రికల్లో వార్త పత్రికల్లో ప్రచురింపబడినాయి. దీనికి భువనచంద్రగారు ప్రశంసాపత్రం సమర్పించారు. చాలా విస్తృతమైన 'కాన్వాస్' వీరి కథ చిత్రాన్ని మలిచారు.



*పేజీలు: 176, వెల: ₹ 150/- ప్రతులకు: పొట్లూరు సుబ్రహ్మణ్యం, ఫోన్: 949 112 8052.*

పి.వి. నరసింహారావుగారు కథలు రాశారు. దానిమీద అభిప్రాయం – **గొల్ల రామవ్వ కథ** - తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం – కాకినాడ. ఇది 1949లో కాకతీయ పత్రికలో అచ్చయింది. ఈ కథపై దేవదానం రాజు – డా.పి. చిరంజీవిని సంకలనం చేసిన అభిప్రాయము రచనలు – ఒక పోరాట మనిషిగా గొల్ల రామవ్వ దర్శనమిస్తుంది అంటారు ముందుమాటలో. అప్పటికే స్వాతంత్ర్యోద్యమం పూర్తయినా ఇటువంటి రచనలు వస్తూనే ఉన్నాయి గతాన్ని గుర్తు చేస్తూ – ఇది సమీప చరిత్ర. చదవండి.



*పేజీలు: 104, వెల: ₹ 120/- ప్రతులకు: డా. పి. చిరంజీవిని కుమారి, ప్రధాన కార్యదర్శి, తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, 64-15-11, ప్రతాప్ నగర్, కాకినాడ. ఫోన్: 984 816 0230.*

**(1) కథారామంలో పూలతావులు (వ్యాస సంపుటి):** శీలా వీర్రాజుగారి సతీమణి *మిసిమి* అభిమాని. సుభద్రాదేవిగారి వ్యాస సంపుటి. ఇల్లిందల సరస్వతి – కళ్యాణ సుందరీ జగన్నాథ, ఆచంట శారదాదేవి, కె. రామలక్ష్మి, నిడదవోలు మాలతి ఇలా ఎందరో లబ్ధప్రతిష్టుల కథలను విశ్లేషించి ఈ సంపుటి మనకందించారు సుభద్రా గారు. తప్పక చదవతగిన సుభద్రగారి శ్రమ – ఈ వ్యాస సంపుటి. 'స్త్రీవాద సాహిత్యం సాధించిన ప్రయోజనం ఏమిటి?' ప్రశ్న స్త్రీలకే కాదు – పురుషులకు కొత్త చూపునిచ్చింది – జవాబు!



*పేజీలు: 223, వెల: ₹ 200/-*

**(2) కవిత్వ పరామర్శ:** డా. సిహెచ్. సుశీలమ్మ. మంచి కవిత నీడన – మనసెంతో చల్లన – అదీ విషయం. మంచి కవితలు ఎంచుకుని పాపినేని శివశంకర, డా. సి.నారె., ఆచార్య కొలకలూరి ఇనాక్, డా. ఎన్. గోపి – ఇంకా ఇలాంటి గొప్పవారి కవితలు ఎంచుకొని వాటిని వ్యాఖ్యానం రాసి ఈ కవిత్వ పరామర్శ చేశారు సుశీలమ్మగారు. ఎంతో మంచి ప్రయత్నం ఇంతమంది కవుల్ని ఒక్క పుస్తకంలో పరిచయం చేయటం – వారి కవితలను విశ్లేషిస్తూ..



*పేజీలు: 188, వెల: ₹ 150/- పై రెండు ప్రతులకు: శ్రీమతి శీలా సుభద్రాదేవి, 217, నారాయణాద్రి, ఎస్.వి.ఆర్.ఎస్. బృందావనం, సరూర్‌నగర్, హైదరాబాద్ – 35.*

**చదువు తీర్చిన జీవితం ఒక సామాన్య మహిళ ఆత్మకథ:** కాళ్లకూరి శేషమ్మ. "మహనీయుల కథలు, 1943 సంవత్సరం – స్వాతంత్ర్య సమరం చేసిన దేశభక్తితో అందరూ ఉగ్రూతలూగే కాలంలో – తండ్రి ఖద్దరు బట్టలు – తల్లి – రాట్నం తిప్పినప్పుడు 'ఓంకారం' లాంటి స్వరాల మధ్య ఆమె గర్భంలో శిశువుగా ఉండే అదృష్టం..'' ఇవి సామాన్య మహిళ మాటలా? ''ఇప్పుడు ఆడపిల్లలో లోపిస్తున్న సహనం – పెరుగుతున్న అహం – స్వార్థం – పెళ్లయిన మూణ్ణాళ్లకే పుట్టింటికి వచ్చేస్తున్నారు – "గునపం నేలలో దింపి –కొబ్బరికాయలు వలవడం నేర్చుకున్నాను. బాల్యంలో తల్లిదండ్రులు – ఎంతగా తమ పిల్లల్తో మాట్లాడితే అంత మంచిది – (మనకు అంత తీరిక ఏది?) "జీవిత గాథలు చదవాలి" ఇవన్నీ ఒక సామాన్యురాలి జీవితంలోని సంఘటనలు – ఆలోచనలు – అదే కాళ్లకూరి శేషమ్మ కథ.



*పేజీలు: 148, వెల: ₹ 120/- ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, మెట్రో పిల్లర్ 14 ఎదురుగా, కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ – 20. ఫోన్: 040 – 24652387 & జి. మాల్యాద్రి, ఫోన్: 944 050 3061.*



**క్షంతవ్యులు:** భీమేశ్వర చల్లా (సి.బి. రావు). జీవితంలో ఏమి చేసినా నువ్వు కథలు మాత్రం రాయకు అని స్కూల్లో టీచరు చెప్పిన మాట 'చల్లా'గారికి అలాగే ఉండిపోయింది. ఈ నవల రాసి ఏడేళ్లయినా ప్రచురించలేదు. ఇప్పుడు ఎందుకు వెలుగు చూపించారో తెలుసుకోవాలంటే మీరు చదవాల్సిందే. బహుశా ఇది వీరి జీవితంలోని విశేషాలయి ఉంటాయి.

*పేజీలు: 228, వెల: ₹ 150/- ప్రతులకు: ఆదర్శ గ్రంథ మండలి, విజయవాడ. ఆంధ్రప్రదేశ్. ఈ-బుక్ కోసం: google search for 'Kshantavyulu'*



**అప్రాశ్యులు:** ఇది కూడా చల్లా భీమేశ్వరగారిదే. ఎందుకో నెగెటివ్ టైటిల్స్ పెడుతున్నారు. దిగితేనే కదా లోతు తెలిసేది. అరవైఏళ్లనాటి స్త్రీ కథ – ఇప్పటి అతివకి ప్రతిబింబం? రజని, కమల, విశాల వీరి కథ – ఈ అప్రాశ్యులు – వీరు ఎందుకు అప్రాశ్యులయ్యారు చదివి తెలుసుకోండి.

*పేజీలు: 228, వెల: ₹ 150/- ప్రతులకు: ఆదర్శ గ్రంథ మండలి, విజయవాడ. ఆంధ్రప్రదేశ్. ఈ-బుక్ కోసం: google search for 'Aprasyulu'*



**మూడు ఇరవైలు:** బులుసు వెంకట కామేశ్వరరావు షష్టిపూర్తి సంచిక. వీరు రచయిత – సంపాదకుడు. ఎందరో మహానుభావులు – తమ అభిప్రాయాలను – మంచి మాటలను ఆశీర్వచనాలను, శుభాకాంక్షలను తెలియచేస్తూ రాసిన వ్యాసమంజూరి ఈ మూడు ఇరవైలు.

*పేజీలు: 184, వెల: ₹ 100/- ప్రతులకు: సీత పబ్లికేషన్స్, 101, వసుంధర ఎన్‌క్లేవ్, నారాయణపురం, ఈడెపల్లి, మచిలీపట్నం-521 001. ఫోన్: 988 545 9193, 850 053 8318.*



**సర్వదేవభట్ల రామనాథం జీవితం:** ఆర్. శివలింగం, డా. కె. ముత్యం. తెలంగాణ సాయుధ పోరాట వీరుడు – రామనాథం. అజ్ఞాతశక్తి కార్యకర్త – నాయకుడు – విప్లవకారుడు – మరి వారి జీవితం కష్టాల కొలిమి త్యాగాల శిఖరం కాక ఏమవుతోంది? నిజాం – యూనియన్ దాడులకు వెరవలేదు – కన్నతల్లినీ – కట్టుకున్న భార్యనీ జైల్లో పెట్టినా – తండ్రి రాజ్యానికి బలి అయినా రామనాథం లొంగలేదు. కార్మికులచేత రామనాథంగారు అనే పిలిపించుకున్న గౌరవనీయుడు – వారి జీవితం – తెలుసుకోవలసిందే. చదవండి – రామనాథం జీవితం.

*పేజీలు: 312, వెల: ₹ 200/- ప్రతులకు: వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ, మార్క్స్‌భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ - 44, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్, గుర్రం అచ్చయ్య ట్రస్ట్ చైర్మన్, ఫోన్: 7799558813.*

**చిలుకపలుకులు:** బాలల కవితలు: రచయిత డా. కె.ఎల్.వి. ప్రసాద్. అంటే బాలల కోసం ప్రసాద్ గారు రాసిన కవితలు! అయితే ఇవన్నీ వారి మనుమరాలో మనమడో పలికిన పలుకులే – వీరు రికార్డు చేశారు అన్నమాట. వీరి కవితల్లో – పలుకుల్లో కొబ్బరిచెట్టు నిలువెత్తు సాక్షి!



*పేజీలు: 50, వెల: ₹ 100/- ప్రతులకు: డా. కె.ఎల్.వి. ప్రసాద్, 24-7-322/5, రామకృష్ణ కాలని, హన్మకొండ - 506 004.*



**కురిసి అలసిన ఆకాశం:** పద్మావతి రాంభక్త. ఇవి కథలు. వీరి కథలు అన్నీ దిన-వారపత్రికల్లో 2017 నుంచి ప్రచురింపబడుతున్నాయి. అవన్నీ ఒక సంపుటిగా చేసి మనకిస్తున్నారు. పద్మావతిగారు కవితలు కూడా రాస్తారు. ఇందులో సృజనకంటే సమాజ పరిశీలనే ఎక్కువగా ఉంటుంది. చదవండి – మీరు 'మిస్' అయిన విషయాలు తెలుస్తాయి.

*పేజీలు: 176, వెల: ₹ 150/- ప్రతులకు: పద్మావతీ రాంభక్త, 10-38-4, రామ్‌నగర్, విశాఖపట్నం-530 002. పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 040-2767 8430, 984 878 7284.*



**దృశ్యం విత్తై మొలకెత్తితే..:** ఆకుల మల్లేశ్వరరావు. అర్థం కాలేదు కదూ. అందుకే దృశ్యకవిత్వం అన్నారు. చిత్రానికి భాషనివ్వడం, భావోద్వేగాలకు అక్షరరూపం ఇవ్వటం అదీ కవిత్వం? అయితే ఇప్పుడు అందరి వస్తువు వార్తలే. అందుకే అవి కొత్తగా ఉండవు. స్పందించిన తీరు కొత్తగా ఉండాలని కోరుకోవాలి.

*పేజీలు: 154, వెల: ₹ 100/- ప్రతులకు: ఆకుల మల్లేశ్వరరావు, ఫోన్: 94400 07374, 79818 72655.*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

*మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా ఇ–మెయిల్ (misimi90monthly@gmail.com). ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.*

## చందా వివరాలు:

₹ 360/– (సంవత్సర చందా),
₹ 720/– (రెండు సంవత్సరాలకు),
₹ 1080/– (మూడు సంవత్సరాలకు),
₹ 1440/– (నాలుగు సంవత్సరాలకు).
₹ 1,800/– (అయిదు సంవత్సరాలకు)

**Ph: 939 343 6969**

## మిసిమి ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


చార్లీ చాప్లిన్


**రజ్జుసర్పభ్రాంతి**


**బైరన్**


**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**


పారిజాతం


సిద్ధార్థ

ప్రతులకు:
**మిసిమి**
కార్యాలయాన్ని
సంప్రదించండి.
ఫోన్: 994 951 6567.

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.